మంగళవారం 11-2-2025

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 321
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'


బుమ్రాపై నేడు తుది నిర్ణయం
చాంపియన్స్ ట్రోఫీలో భారత పేసర్ ఆడేదీ లేనిదీ నేడు తేలిపోతుంది. - 14లో


పసిడి.. రూ.88,500
10 గ్రాముల బంగారం ధర రూ.2,430 పెరుగుదల - 15లో


ఢిల్లీకి మహిళా సీఎం?
ఢిల్లీకి మరోసారి మహిళే ముఖ్యమంత్రి కానున్నారా? బీజేపీ అధిష్టానం ఆ దిశగానే ఆలోచిస్తున్నట్టుగా సంకేతాలు వెలువడుతున్నాయి.
- వివరాలు 6లో


గాజాను కొనేస్తాం: ట్రంప్
"గాజాను కొనేస్తాం. దాన్ని అమెరికా సొంతం చేసుకుంటుంది. పాలస్తీనియన్లకు గాజాకు తిరిగొచ్చే హక్కు ఉండదు" అని ట్రంప్ అన్నారు.
- వివరాలు 6లో


ఎంపీ రషీద్‌కు రెండ్రోజుల పెరోల్
జైల్లో ఉన్న ఎంపీ ఇంజనీర్ రషీద్ పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు వీలుగా హైకోర్టు రెండు రోజుల కస్టడీ పెరోల్ ఇచ్చింది.
- వివరాలు 6లో


అమ్మ 'చక్కెర' బిడ్డకూ చేదు
జెస్టేషనల్ డయాబెటిస్ ఉన్నప్పుడు రక్తంలో చక్కెర నియంత్రణలో లేకపోతే ఇటు తల్లికీ, అటు బిడ్డకూ ఆరోగ్య సమస్యలు వస్తాయి.
- వివరాలు సాక్షి ఫ్యామిలీలో

న్యూస్‌రీల్

నిర్ణయాధికారం రాష్ట్రానిదే..

మెడికల్ పీజీ సీట్ల భర్తీకి సంబంధించి జారీ చేసిన నోటిఫికేషన్‌లో రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకునే అధికారం తెలంగాణ ప్రభుత్వానికి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఏపీ సర్కార్ జారీ చేసిన ఎస్సీ కుల ధ్రువీకరణతో తెలంగాణలో రిజర్వేషన్ పొందలేరని తేల్చిచెప్పింది.
- వివరాలు 16లో

రైతుకు యూనిక్ ఐడీ

ఇప్పటికే పలు రాష్ట్రాల్లో 'ఫార్మర్ రిజిస్ట్రీ'పేరుతో వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ మొదలైంది. రాష్ట్రంలో కూడా ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. డిజిటలైజేషన్‌లో భాగంగా 'ఫార్మర్ రిజిస్ట్రీ'పేరుతో ప్రతి రైతుకు యూనిక్ ఐడీ తీసుకొచ్చే ప్రక్రియపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది.
- వివరాలు 12లో

'మద్యం మార్జిన్'లో చీర్స్!


ఏపీలో మద్యం దందా దోపిడీ ఇచ్చే కిక్కు 'ముఖ్య'నేతకు తెలిసినంతగా మరెవరికీ తెలీదు..! అందుకే మద్యం విధానం ముసుగులో భారీ దోపిడీకి ఎప్పటికప్పుడు కొత్త కుతంత్రాలు పన్నుతూనే ఉంటారు..! 40 ఇయర్స్ ఇండస్ట్రీ దోపిడీ అంటే ఏమిటో మరోసారి చేతల్లో చూపించారు! ఇప్పటికే రాష్ట్రంలోని మద్యం దుకాణాలను టీడీపీ సిండికేట్‌కు ఏకపక్షంగా కట్టబెట్టేసి భారీ దోపిడీకి పాల్పడ్డారు.
- వివరాలు 12లో

మేం చూస్తూ ఊరుకోం!



మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం.. రాజకీయ పార్టీల హక్కులకు ఇబ్బంది కలుగుతుంటే ఒప్పుకోం

నిర్ణయం తీసుకోవడానికి ఏదైనా గడువు ఉండాలి కదా!

బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

రీజనబుల్ టైం అంటే ఏమిటి?.. మీరు అడిగే సమయానికి గడువు అనేది ఎంత?

మీరు చెప్పకపోతే మీ సమయానికి గడువు మేమే పెడతాం.. స్పష్టం చేసిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం

స్పందించేందుకు కొంత సమయం కావాలన్న స్పీకర్ కార్యదర్శి తరఫు న్యాయవాది రోహత్గీ

విచారణ ఈనెల 18కి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: "ఎమ్మెల్యేల ఫిరాయింపుల వ్యవహారంలో చర్యలు తీసుకోవడానికి మీకెంత సమయం కావాలో చెప్పండి. ఇంకా తగినంత సమయం కావాలని అడుగుతున్నారు. తగినంత సమయం అంటే ఎంత? ఆ సమయానికి ఏదైనా గడువు అనేది ఉండాలి కదా? ఇలా సమయాన్ని పెంచుకుంటూ వెళితే ఎలా? రాజకీయ పార్టీల హక్కులకు ఇబ్బంది కలుగుతుంటే.. మేం చూస్తూ ఊరుకోబోం" అని సుప్రీంకోర్టు పేర్కొంది. కావాల్సిన సమయం ఎంత అనేది చెప్పకపోతే.. తామే గడువు పెడతామని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తరఫు న్యాయవాదికి స్పష్టం చేసింది.

రెండు పిటిషన్లపై విచారణ..

బీఆర్‌ఎస్ కారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్పీ), మరో ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరెకపూడి గాంధీలపై బీఆర్‌ఎస్ పార్టీ, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు తదితరులు రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ రెండు పిటిషన్లపై సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం విచా రణ చేపట్టింది. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయ వాది ముకుల్ రోహత్గీ వాదనలు విని పించగా.. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యామ సుందరం, దామ శేషాద్రినాయుడు, పి.మోహిత్‌రావు వాదనలు వినిపించారు.

ఇంకా ఎంత సమయం కావాలి?

తొలుత పిటిషనర్ల తరఫు న్యాయవాది శేషాద్రినాయుడు వాదనలు వినిపిస్తూ.. "బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఫిరాయించిన ఓ ఎమ్మెల్యే ఏకంగా కాంగ్రెస్ తరఫున ఎన్నికల్లో పోటీ చేశారు. మరో ఎమ్మెల్యే ఆయన కుమార్తె కోసం ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్
మిగతా 3వ పేజీలో ▶

> "పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేందుకు ఎంత సమయం కావాలి? తగినంత టైం అంటే ఎంత? అసెంబ్లీ గడువు ముగిసేంత సమయం కావాలా? మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల హక్కులకు సంబంధించిన అంశం ఇది. రాజకీయ పార్టీల హక్కులకు ఇబ్బంది కలుగుతుంటే మేం చూస్తూ ఊరుకోం."
> - తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కార్యదర్శి తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీతో సుప్రీంకోర్టు ధర్మాసనం

ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక



సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకే లభించేలా చర్యలు

గనులు, ఖనిజాభివృద్ధి శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి నిర్ణయం

- ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదు
- అందుకు సహకరించే అధికారులపై వేటు తప్పదు
- హైదరాబాద్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణా అరికట్టే బాధ్యత హైడ్రాకు అప్పగింత
- ఇసుక రీచ్‌ల వద్ద వెంటనే తనిఖీలు చేపట్టాలని ఆదేశం
- తాను కూడా ఆకస్మిక తనిఖీలు చేస్తానన్న ముఖ్యమంత్రి



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచిత ఇసుక అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక లభించేలా చర్యలు చేపట్టనుంది. గనులు, ఖనిజాభివృద్ధి శాఖపై సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటు తప్పదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఇసుక మాఫియాపై ఉక్కు పాదం మోపాలని, ఇసుక రీచ్‌ల వద్ద వెంటనే తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే తాను కూడా స్వయంగా ఆకస్మిక తనిఖీలు చేస్తానని తెలిపారు. కాంట్రాక్టు సంస్థలకు పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు
మిగతా 3వ పేజీలో ▶

అక్రమ రవాణాకు 'హైడ్రా'తో అడ్డుకట్ట

ఇసుక రవాణా పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించి.. జిల్లాల వారీగా కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. "హైదరాబాద్ పరిసరాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే బాధ్యతను హైడ్రాకు అప్పగిస్తున్నాం. ఇసుక అక్రమ రవాణాపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా ఏర్పాటు చేయాలి. ప్రతి ఇసుక రీచ్ వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలి. ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్‌తోపాటు ఎంట్రీ, ఎగ్జిట్‌లు ఉండేలా చూడాలి" అని ఆదేశించారు. ఇసుక రవాణాకు సంబంధించిన రిజిస్టర్డ్ లారీలను ఎంప్యానెల్ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.


6 లో

సంగమంలో రాష్ట్రపతి ముర్ము పవిత్ర స్నానం
సోమవారం ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం ఆచరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. ఈ సందర్భంగా రాష్ట్రపతి గంగా నదికి పూజలు చేసి, సూర్యునికి అర్ఘ్యం సమర్పించారు.



అధిక పెన్షన్‌కు 'అదనపు' టెన్షన్!

దరఖాస్తుల పరిశీలనలో కొర్రీలు పెడుతున్న ఈపీఎఫ్‌ఓ

ప్రతి సమాచారానికి ధ్రువపత్రాలు తప్పనిసరి అంటున్న అధికారులు

దరఖాస్తులను వెనక్కి పంపేస్తున్న తీరు

అందులో అత్యధికం ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులవే..

→ రాష్ట్ర సంక్షేమ శాఖకు చెందిన ఓ కార్పొరేషన్‌లో సీనియర్ అధికారి అధిక పెన్షన్ కోసం ఈపీఎఫ్‌ఓకు దరఖాస్తు చేసుకున్నారు. సర్వీసులో చేరింది మొదలు ఇప్పటివరకు అదే శాఖలో ఉన్న ఆ అధికారి.. అధిక పెన్షన్‌కు సంబంధించి అన్ని పత్రాలను సమర్పించారు.ఈపీఎఫ్‌ఓ లేవనెత్తుతున్న ప్రతి సందేహానికి సమాధానమిస్తూనే ఉన్నా.. ఏదో ఒక అదనపు సమాచారం కావాలంటూ దరఖాస్తును తిప్పిపంపుతున్నారని ఆయన వాపోతున్నారు. ఇప్పటికే 4,5 సార్లు వెనక్కి పంపగా.. ఓపికగా బదులిచ్చానని, మళ్లీ మరింత సమాచారం కావాలని, అధిక పెన్షన్‌కు ఆప్షన్ ఇచ్చినప్పటి ధ్రువీకరణ పత్రం సమర్పించాలని కోరారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - 2లో



బ్యాటర్‌కు ఉన్నంత ఏకాగ్రత ఉండాలి

పరీక్షా పే చర్చా కార్యక్రమంలో విద్యార్థులతో మోదీ మాటామంతీ

ఇండోర్ స్టేడియంలోకాకుండా ఈసారి తోటలో కలియతిరుగుతూ చర్చా కార్యక్రమం -6లో

ఆశల ఊసుల నడుమ ఏఐ శిఖరాగ్రం

పారిస్‌లో జరుగుతున్న తొలి సదస్సు నేడు సదస్సునుద్దేశించి మోదీ ప్రసంగం

బీర్ల ధరలు పెంపు



ప్రాథమిక ధర, ఎమ్మార్పీ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు

అన్ని రకాల బ్రాండ్లపై 15% పెంపు!

పెరిగిన ధరలు నేటి నుంచే అమల్లోకి..

180	190
లైట్ బీరు ధర	స్ట్రాంగ్ బీరు ధర

2 లో

మద్యం అమ్మకాలు పెరుగుతూ.. తగ్గుతూ - 2లో

రేవంత్.. దమ్ముంటే రాజీనామా చెయ్..

ఉప ఎన్నికల్లో మా పార్టీకి మెజార్టీ 50 వేలకు ఒక్క ఓటు తగ్గినా రాజకీయ సన్యాసం తీసుకుంటా



- కోస్గి 'రైతు మహాధర్నా'లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
- గత 14 నెలల పాలనలో రైతులు, మహిళల కోసం సీఎం ఒక్క పని కూడా చేయలేదు
- కుటుంబసభ్యులు, అదానీ కోసం దోచుకునే పనిలో పడ్డారు.. కొడంగల్ గిరిజన ఆడ బిడ్డలను తండాల నుంచి ఉరికిచ్చారు

2 లో





ఇదండీ సంగతి



వచ్చే ఎన్నికల్లో మాత్రం బాగా కష్టపడి డిపాజిట్లు సాధించుకుందాం సార్!

మన చదువులు భేష్



దేశ విద్యావ్యవస్థ బాగుందని అధిక శాతం యువత అభిప్రాయం	కానీ టీచర్లు, నాణ్యమైన కోర్సులు, సంస్థలకు కొరత ఉందని వెల్లడి	అంతర్జాతీయ సంస్థ ఈటీఎస్ చేపట్టిన హెచ్‌ఆర్‌డీ సర్వేలో ఆసక్తికర వివరాలు
భవిష్యత్తులో మరింతగా పురోగమిస్తుందని ఆశాభావం	కృత్రిమ మేధ ముప్పు కాదు.. అవకాశమని స్పష్టీకరణ	

సాక్షి, హైదరాబాద్: 'మన విద్యా విధానం మరింత బలపడాలి. స్కూల్ స్థాయి నుంచే ఉన్నత అవకాశాలు కల్పించే విధంగా బోధన సాగాలి. యువతకు కాలేజీ స్థాయిలో విస్తృత బోధన సదుపాయాలు కల్పించాలి'. ఇవీ మన విద్యారంగంపై సాధారణంగా వ్యక్తమయ్యే అభిప్రాయాలు. కానీ ఈ అభిప్రాయాలకు భిన్నంగా దేశ యువత స్పందించింది. ప్రపంచ దేశాలతో పోలిస్తే మన దేశ విద్యా విధానానికే జైకొట్టింది. కెరీర్ అవకాశాల కోణంలోనూ భవిత భేషుగ్గా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేసింది. టోఫెల్, జీఆర్‌ఈ తదితర పరీక్షల నిర్వహణ సంస్థ ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్) నిర్వహించిన సర్వేలో పలు ఆసక్తికర వివరాలు వెల్లడయ్యాయి. మొత్తం 18 దేశాల్లో యువతను సంప్రదించిన ఈ సంస్థ.. వారి అభిప్రాయాల ఆధారంగా మానవాభివృద్ధి నివేదికను విడుదల చేసింది. ఇందులో పలు అంశాలను స్పృశించింది.

మన విద్యావ్యవస్థపై..

మన దేశ విద్యావ్యవస్థ బాగుందని ఈటీఎస్ సర్వేలో పాల్గొన్న 70% మంది అభిప్రాయపడ్డారు. అలాగే భవిష్యత్తులో విద్యావ్యవస్థ మరింత పురోగమిస్తుందని 76% మంది ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో అంతర్జాతీయంగా మాత్రం 30% మందే తమ విద్యావ్యవస్థ బాగుంటుందని.. భవిష్యత్తులో విద్యావ్యవస్థ పుంజుకుంటుందని 64% మంది పేర్కొన్నారు.

నాణ్యమైన విద్య.. కష్టంగానే

మన విద్యా వ్యవస్థ బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేసిన యువత.. నాణ్యమైన విద్యను అందుకోవడం మాత్రం క్లిష్టంగా మారిందని ఆవేదన వెలిబుచ్చారు. కొన్ని వర్గాల వారే ప్రయోజనం పొందేలా విద్యావకాశాలు
మిగతా 2వ పేజీలో ▶

అలరించిన ఏరో ఇండియా


సోమవారం బెంగళూరులోని యెలహంక ఎయిర్‌బేస్‌లో నిర్వహించిన 15వ ఏరో ఇండియా-2025 కార్యక్రమంలో వాయుసేనకు చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ విన్యాసాలు

క్లుప్తంగా...

సీఎంతో సచిన్ పైలట్ భేటీ



సాక్షి, హైదరాబాద్: ఆలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన రాజస్తాన్ మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్‌పైలట్.. సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. సోమవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన ఆయన.. రేవంత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ తదితరులున్నారు.

ఐఐఎం ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టండి

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఎంపీ అనిల్ యాదవ్ లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్ర విద్యా శాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశారు. హైదరాబాద్ స్టార్టప్ హబ్‌గా వేగంగా అభివృద్ధి చెందుతోందని, అనేక బహుళజాతి సంస్థలకు అత్యంత ప్రాధాన్యం కలిగిన గ్లోబల్ కాంపిటెన్స్ సెంటర్ (జీసీసీ)గా కూడా అవతరిస్తోందని లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు, పెరుగుతున్న పరిశ్రమ, ఆర్థిక వ్యవస్థ డిమాండ్‌ను తీర్చేందుకు హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు తప్పనిసరి అని అనిల్‌కుమార్ తెలిపారు.

కమిషన్ నివేదికతో మాదిగల అస్తిత్వం ప్రశ్నార్థకం

- దానిపై చర్చకు సీఎంను సమయం కోరిన మంద కృష్ణ



సాక్షి, హైదరాబాద్: జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ సమర్పించిన నివేదికలో ఉన్న లోపాలపై చర్చించేందుకు తమకు సమయం కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం సీఎంకు రాసిన లేఖను పత్రికలకు విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొంటూనే ఏకసభ్య కమిషన్ నివేదికతో మాదిగలు, మరికొన్ని దళిత కులాల హక్కులు, వాటా, అస్తిత్వం, భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై చర్చించడానికి, విజ్ఞప్తులు, సూచనలు అందించేందుకు తమను కలవాలనుకుంటున్నామని, సాధ్యమైనంత త్వరలో విలువైన సమయాన్ని కేటాయించాలని సీఎంకు విన్నవించారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

- 'ట్యాపింగ్'పై రాధాకిషన్‌రావు పిటిషన్.. విచారణ 24కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. 'ఇప్పటికే ఇదే ఫిర్యాదుపై దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో అరెస్టు చేయొద్దని ఆదేశాలిచ్చాం. ఈ బెయిల్ పిటిషన్‌పై వాదనలకు సిద్ధంగా ఉన్నారా?' అని పీపీ పల్లె నాగేశ్వర్‌రావును ప్రశ్నించారు. ఈనెల 24 వరకు సమయం కావాలని ఆయన పేర్కొనడంతో విచారణ వాయిదా వేశారు. కాగా, ఫోన్ ట్యాపింగ్‌పై మరో కేసులో 2024, మార్చిలో అరెస్టయిన రాధాకిషన్‌రావు ఇటీవలే బెయిల్‌పై బయటికి వచ్చిన సంగతి తెలిసిందే.

రాష్ట్రంలో పర్యటించనున్న నేపాల్ మీడియా బృందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పర్యటన నిమిత్తం 12 మందితో కూడిన నేపాల్ మీడియా బృందం సోమవారం హైదరాబాద్ చేరుకుంది. ఈ బృందం 13 వరకు హైదరాబాద్‌లో పర్యటించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖ ఫార్మా కంపెనీ అయిన భారత్ బయోటెక్, మేనేజ్‌మెంట్ విద్యను అందిస్తున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, రామోజీ ఫిల్మ్ సిటీ, చారిత్రక వైభవ నిలయాలుగా ఉన్న చార్మినార్‌తో పాటు గోల్కొండ కోటను బృందం సభ్యులు సందర్శిస్తారు. సోమవారం సాయంత్రం వారణాసి నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న నేపాల్ మీడియాకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు స్వాగతం పలికారు. ఈ బృందం పర్యటనలో కఠ్మాండులోని భారత ఎంబసీ అధికారి బాసిస్ట్ నందన్, భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు నితిన్‌గౌతం, చంద్రేశ్వర్‌సింగ్‌లు పాల్గొంటున్నారు. విభిన్న రంగాలలో సాధిస్తున్న ప్రగతి, సామాజిక పరిస్థితులు, చారిత్రక, సాంస్కృతిక వైభవంపై అవగాహన కల్పించి, ఆయా దేశాలతో అనుబంధాన్ని పటిష్ఠ పరిచేందుకు భారత విదేశీ వ్యవహారాల శాఖ కృషి చేస్తోంది.

మద్యం అమ్మకాలు పెరుగుతూ.. తగ్గుతూ..

ఈ ఏడాది ఇప్పటివరకు రూ.29,648 కోట్ల అమ్మకాలు	గత ఏడాదితో పోలిస్తే కేవలం రూ.1000 కోట్లు తక్కువ

2023-24లో జనవరినాటికి రూ.30,696 కోట్ల విలువైన అమ్మకాలు


2023 ఆగస్టులో మద్యం దుకాణాల దరఖాస్తుల కింద 2400 కోట్ల ఆదాయం

అది మినహాయిస్తే ఏడాది అమ్మకాలు గతేడాది కంటే రూ.1400 కోట్లు ఎక్కువే	ఈ ఆర్థిక సంవత్సరంలో 36 వేల కోట్ల అమ్మకాలు జరుగుతాయని అంచనా వేస్తున్న ఎక్సైజ్ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మద్యం అమ్మకాలు నెలల వారీగా చూస్తే పెరుగుతూ.. తగ్గుతూ ఉంటున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాదిలో ప్రతి నెలా 10 శాతం మేరకు పడుతూ..లేస్తూ అమ్మకాలు జరుగుతున్నాయని ఎక్సైజ్ గణాంకాలు చెబుతున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత 10 నెలల కాలంలో రూ.29,648 కోట్ల విలువైన మద్యం అమ్ముడైందని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అదే 2023–24 ఆర్థిక సంవత్సరంలో 10 నెలల కాలంలో అమ్ముడైన మద్యం విలువ రూ. 30,696 కోట్లు. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.1000 కోట్ల మేర మద్యం అమ్మకాలు తగ్గాయని అర్థమవుతోంది. కానీ, 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు నెలలో కొత్త మద్యం షాపులకు టెండర్లు పిలిచారు. ఈ టెండర్ దరఖాస్తుల కింద రూ.2,400 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరింది. ఈ ఆదాయాన్ని మినహాయిస్తే 10 నెలల కాలంలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అమ్మకాలు రూ.1400 కోట్ల మేర పెరిగాయని తెలుస్తోంది. ఇక, నెలల వారీగా చూస్తే రూ. 2700 కోట్ల నుంచి రూ.3300 కోట్ల మేరకు అమ్మకాలు జరుగుతుండడం గమనార్హం. కాగా గత ఏడాదిలో మొత్తం 12 నెలలకు రూ. 35,586 కోట్ల మేర మద్యం అమ్మకాలు రాష్ట్రంలో జరిగాయి. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో అమ్మకాలుంటాయని, వాటి విలువ రూ.36 వేల కోట్ల వరకు ఉంటుందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది.

(నోట్: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి, మార్చి నెలల అమ్మకాల విలువను ఈ పట్టికలో లెక్కించలేదు. ఈ రెండు నెలలు కలిపి మొత్తం అమ్మకాల విలువ రూ.36వేల కోట్లకు పెరుగుతుందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది.)





అధిక పెన్షన్‌కు 'అదనపు' టెన్షన్!

దరఖాస్తుల పరిశీలనలో కొర్రీలు పెడుతున్న ఈపీఎఫ్‌ఓ

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ)లో అధిక పెన్షన్ (హయ్యర్ పెన్షన్) కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 'అదనపు'టెన్షన్ పట్టుకుంది. ఈపీఎఫ్‌ఓ అధికారులు అడిగిన వివరాలన్నీ సమర్పిస్తూనే ఉన్నా.. ఏదో ఓ కొత్త సమాచారాన్ని అడుగుతూ, దానిని ధ్రువీకరించే పత్రాలు కావాలంటూ దరఖాస్తులను వెనక్కి పంపుతుండటం ఉద్యోగులలో ఆందోళన రేపుతోంది. ఇలా ఇబ్బందిపడుతున్నవారిలో ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ఉద్యోగులే ఎక్కువగా ఉండటం గమనార్హం. రాష్ట్రం నుంచి అధిక పెన్షన్ కోసం 3.3 లక్షల మంది దరఖాస్తులు సమర్పించారు. అందులో ఇప్పటివరకు పదిశాతం కూడా పరిష్కారం కాని పరిస్థితి. మెజారిటీ దరఖాస్తులు పరిశీలన దశలోనే ఉండిపోయాయి. అడిగిన వివరాలు, సమాచారం అందజేసే వరకు దరఖాస్తుల పరిశీలన ముందుకు సాగదని అధికారులు చెబుతుండటంతో దరఖాస్తుదారులు తలపట్టుకుంటున్నారు.

కేంద్రం ఆదేశించడంతో..

ఈపీఎఫ్‌ఓ అధిక పెన్షన్ కోసం దరఖాస్తులు స్వీకరించి రెండేళ్లు పూర్తయింది. త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేశారు. నోటీసులు జారీ చేస్తూ, పూర్తి వివరాలను సమర్పించాలని కోరుతున్నారు. దాదాపుగా దరఖాస్తు చేసుకున్న వారందరికీ అధికారులు నోటీసులు జారీ చేయడం గమనార్హం. అధిక పెన్షన్‌కు అర్హత ఉన్నట్టు తేలినవారికి ఎంత బకాయిలు ఉన్నాయి? ఎప్పటిలోగా చెల్లించాలనే వివరాలను చెబుతున్నారు.

నోటీసులు ఇస్తూ.. వివరాలు అడుగుతూ..

అధిక పెన్షన్ కోసం దేశవ్యాప్తంగా 17.49 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 3.1 లక్షల దరఖాస్తులకు సంబంధించి పూర్తిస్థాయి సమాచారాన్ని సంస్థల యాజమాన్యాలు సమర్పించలేదు. మరో 4.66 లక్షల దరఖాస్తులకు సంబంధించి అదనపు సమాచారం, స్పష్టత కోరుతూ అధికారులు తిప్పిపంపారు. చాలా వరకు దరఖాస్తుదారులు ఆ వివరాలను సమర్పించారు. ఈ క్రమంలో మరోమారు ఈపీఎఫ్‌ఓ నుంచి నోటీసులు వస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులే ఇందులో అధికంగా ఉన్నారు. అధిక పెన్షన్‌కు సంబంధించి ఆప్షన్ పత్రం, చెల్లింపులకు సంబంధించిన పత్రాలు, వివిధ కేటగిరీల ధ్రువపత్రాలు ఇవ్వాలని ఈపీఎఫ్‌ఓ అధికారులు అడుగుతున్నారు. రెండు, మూడు దశాబ్దాల క్రితం నాటి పత్రాలను అడగటంపై దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అధికారులకే ఇలాంటి అభ్యంతరాలు పెట్టడం ఏమిటని మండిపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న నేపథ్యంలో.. శాఖాపరంగా సమాచారాన్ని అడగవచ్చని, ఉన్నతాధికారులు ధ్రువీకరించి ఇచ్చే పత్రాలనైనా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. కానీ ఉద్యోగులు సరైన ధ్రువపత్రాలు అందజేయాలని, వాటినే ప్రామాణికంగా తీసుకుంటామని ఈపీఎఫ్‌ఓ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్న వారికి అధిక పెన్షన్ ప్రయోజనం కలిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలనే డిమాండ్ వస్తోంది.

బీర్ల ధరలు పెంపు

ప్రాథమిక ధర, ఎమ్మార్పీ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీర్ల ధరలు పెరిగాయి. బీరు కంపెనీలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాథమిక ధర (బేసిక్ ప్రైస్)ను, తదనుగుణంగా బీర్ల గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ)ను పెంచుతూ ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధరల నిర్ణాయక కమిటీ (పీఎఫ్‌సీ) సిఫారసు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ధరలు ఏ మేరకు పెంచాలన్న దానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. విశ్వసనీయ సమాచార ప్రకారం అన్నిరకాల బ్రాండ్లపై 15% మేర ప్రాథమిక ధర పెంపునకు ప్రభుత్వం అనుమతించింది. అంటే ప్రస్తుతం ఉన్న ఎమ్మార్పీపై 15% మేర పెంచి బీర్లను విక్రయిస్తారన్నమాట. దీని ప్రకారం లైట్ బీరు ధర ప్రస్తుతం ఉన్న రూ.150 నుంచి రూ.180కి పెరిగే అవకాశం ఉంది. అదేవిధంగా స్ట్రాంగ్ బీరు రూ.160 నుంచి రూ.190కి పెరగనుంది. మద్యం ధరల పెంపులో ప్రభుత్వం అనుసరించే రౌండింగ్ ఆఫ్ పద్ధతి ప్రకారం ధరలు పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ వర్గాలు వెల్లడించాయి.

పాత స్టాకు పాత రేటుకే: ప్రస్తుతం డిపోల్లో ఉన్న బీర్లు, సోమవారం డిపోల నుంచి వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లకు వెళ్లిన బీర్ల ధరలు మంగళవారం నుంచి పెరుగుతాయి. సోమవారం నాటికే వైన్ షాపులకు చేరుకున్న బీర్లను మాత్రం పాత ధరలకే అమ్మాల్సి ఉంటుంది. వాస్తవానికి ధరల పెంపు సమయంలో ప్రతి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎంత స్టాకు ఉంది అనే వివరాలను తెలుసుకోవడంతో పాటు ధర ఎంత పెరుగుతుంది అనే సమాచారం కూడా క్షేత్రస్థాయి సిబ్బందికి ఎక్సైజ్ శాఖ అందిస్తుంది. కానీ ఈసారి ఉత్తర్వులు అలా రాలేదని, తమను ఎలాంటి స్టాక్ వివరాలు అడగలేదని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బీర్ల ధర సరిగ్గా ఎంత పెరుగుతుంది అన్న దానిపై మంగళవారమే స్పష్టత రానుంది. ఇటీవల బేసిక్ ధరల పెంపు, బకాయిల చెల్లింపు విషయంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా కింగ్‌ఫిషర్ బ్రాండ్ తయారు చేసే మద్యం కంపెనీ సరఫరా నిలిపివేసింది. అయితే కొద్ది కాలం తర్వాత మళ్లీ పునరుద్ధరించింది. ఈ విధంగా బీర్ల కంపెనీలు చాలాకాలంగా చేస్తున్న డిమాండ్‌ను, ధరల నిర్ణాయక కమిటీ సిఫారసును పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, బేసిక్ ధర తదనుగుణంగా ఎమ్మార్పీని కూడా పెంచుతూ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

రెండెకరాల వరకు 'భరోసా' విడుదల

- 13.24 లక్షల మంది రైతులకు రూ.1,092 కోట్లు విడుదల
- ఇప్పటివరకు మూడు విడతల్లో రూ.2,218.49 కోట్లు ఖాతాల్లో జమ



సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా పథకంలో భాగంగా రెండెకరాల లోపు సాగుభూములున్న రైతులకు రూ.1,092 కోట్ల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. 13.24 లక్షల మంది రైతులకు చెందిన 18.19 లక్షల ఎకరాల విస్తీర్ణంలోని భూములకు ఈ మొత్తం నిధులను కేటాయించారు. దీంతో కలిపి ఇప్పటివరకు మూడు విడతల్లో 36.97 లక్షల ఎకరాల విస్తీర్ణానికి సొంతదారులైన 34.69 లక్షల మంది రైతులకు రూ.2,218.49 కోట్లు ప్రభుత్వం విడుదల చేసినట్లయింది.

గణతంత్ర దినోత్సవం నుంచి..

రాష్ట్రంలోని వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా అందజేసే కార్యక్రమాన్ని గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఆ మేరకు ముందుగా ఎంపిక చేసిన 563 గ్రామీణ మండలాల్లోని 563 రెవెన్యూ గ్రామాల (577 గ్రామ పంచాయతీలు)కు చెందిన 4,41,911 మంది రైతులకు చెందిన 9.48 లక్షల ఎకరాలకు జనవరి 27వ తేదీన రూ.569 కోట్లు విడుదల చేశారు. ఈ గ్రామాల్లో ఎకరాలతో సంబంధం లేకుండా మొత్తం వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా డబ్బులను జమ చేశారు. తర్వాత ఈ 577 గ్రామ పంచాయతీలను మినహాయించి ఈ నెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఒక ఎకరం విస్తీర్ణం లోపు గల (9.29 లక్షల ఎకరాలకు) 17.03 లక్షల మంది రైతులకు రూ.557 కోట్లు విడుదల చేశారు. తాజాగా సోమవారం రూ.1,092 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి.

సిద్దిపేటలో అత్యధికంగా..

మూడు దఫాలుగా విడుదలైన రైతు భరోసా కింద సిద్దిపేట జిల్లా రైతులు అత్యధిక సంఖ్యలో లబ్ధి పొందారు. ఈ జిల్లాలోని 1,86,241 మంది రైతుల ఖాతాల్లోకి రూ.116. 26 కోట్లు జమయ్యాయి. ఇక్కడ సుమారు 1.94 లక్షల ఎకరాలకు రైతుభరోసా అందింది. తర్వాత నల్లగొండ జిల్లాకు చెందిన 1.85 లక్షల మంది రైతులకు రూ.113.33 కోట్లు విడుదలయ్యాయి. తర్వాత సంగారెడ్డి జిల్లాలో 1.82 లక్షల మంది రైతులకు రూ.116.26 కోట్లు జమ కాగా, అతి తక్కువగా మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో కేవలం 4,981 మంది రైతులకు 3.82 కోట్లు జమయ్యాయి. అంటే ఈ జిల్లాలో రెండెకరాల లోపు 6,370 ఎకరాలు మాత్రమే సాగుయోగ్యమైన భూములు ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఈ జిల్లాలో సాగు భూములన్నీ చాలావరకు రియల్ వెంచర్లు, విద్యాసంస్థలు, ఇతర వాణిజ్య సంస్థలుగా మారిపోవడంతో వాటిని రైతుభరోసా పోర్టల్ నుంచి తొలగించారు.

రైతుల నోట్లో మట్టి కొట్టినోళ్లు.. మాట్లాడుతున్నారు: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల పాలనలో రైతుల నోట్లో మట్టికొట్టిన బీఆర్ఎస్ నాయకులు అధికారం పోయిన తరువాత రైతాంగ సమస్యల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే రైతు సంక్షేమం కోసం రూ. 55,256 కోట్ల నిధులు వెచ్చించామని అన్నారు. ఇప్పటివరకు ప్రత్యక్షంగా రైతుల ఖాతాలలో జమ చేసిన మొత్తం రూ. 40 వేల కోట్లు అని చెప్పారు. పావలా రుణమాఫీ అని విమర్శిస్తున్న నాయకులు 2018 రుణమాఫీ ఎన్నేళ్లపాటు ఎంత మందికి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో నాలుగేళ్లపాటు చారాణా చొప్పున రుణమాఫీ చేయడంతో 2014లో రుణమాఫీతో రైతులపై రూ. 2,630 కోట్ల వడ్డీభారం పడిందని, 2018 రుణమాఫీ ఆఖరి సంవత్సరంలో చేయడంతో రూ. 8,315 కోట్లు వడ్డీ భారం పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి పంటకాలంలోనే 25,35,964 మంది రైతులకి రూ. 20,616.89 కోట్లు రుణమాఫీ చేసిన విషయం రైతులకు తెలుసని అన్నారు. రైతుబంధు పేరు చెప్పి మిగతా అన్ని పథకాలకు రైతులను దూరం చేసింది బీఆర్ఎస్ అని విమర్శించారు.

దస్తగిరిని 'సాక్షి'గా పేర్కొనడంపై వివరణ ఇవ్వండి

వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తొలి నుంచి నిందితుడి (ఏ–4)గా పేర్కొన్న దస్తగిరిని 'సాక్షి'గా పేర్కొనడంపై వివరణ ఇవ్వాలని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)ను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. విచారణా సంస్థతోపాటు దస్తగిరికి కూడా నోటీసులు జారీ చేసింది. ఈ నెల 27లోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ.. విచారణను వాయిదా వేసింది. తాను అప్రూవర్‌గా మారినందున తనను సాక్షిగా పరిగణించాలంటూ గత ఏడాది సీబీఐ కోర్టులో దస్తగిరి పిటిషన్ వేశారు. సీబీఐ కూడా దీనికి అనుకూలంగా వాదనలు వినిపించడంతో న్యాయస్థానం దస్తగిరిని సాక్షిగా పేర్కొనాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ డి.శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు సీబీఐ, దస్తగిరికి నోటీసులు ఇచ్చింది.

మన చదువులు భేష్

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నాయని 78 శాతం మంది పేర్కొన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల కొరత ఉందని 74 శాతం మంది స్పష్టం చేశారు. దీనివల్ల దేశ విద్యా వ్యవస్థ పురోగతికి అడ్డంకులు ఏర్పడుతున్నాయన్నారు. నాణ్యమైన కోర్సులు, సంస్థల విషయంలో ఇప్పటికీ కొరత ఉందని కూడా పేర్కొన్నారు.

కెరీర్‌లో ముందంజలో నిలిచే అవకాశం

ఇక కెరీర్ కోణంలో ప్రస్తుత అవకాశాలతో ముందంజలో నిలవడానికి ఆస్కారం ఉంటుందని 69% మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ఈ సంఖ్య 59 శాతంగానే ఉండటం గమనార్హం. అదేవిధంగా 2035 నాటికి తమ రంగాల్లో అభివృద్ధి ఉంటుందని 72 శాతం మంది పేర్కొన్నారు.

ఉద్యోగాల కొరత

విద్యావ్యవస్థ, కెరీర్ కోణంలో ఆశాభావం వ్యక్తం చేసిన మన విద్యార్థులు.. నూతన ఉద్యోగాల విషయంలో మాత్రం ఇందుకు భిన్నంగా స్పందించారు. ఉద్యోగాల కొరత ఉంటుందని 40 శాతం మంది పేర్కొనగా.. అంతర్జాతీయంగా ఇది 34 శాతంగా నమోదైంది. అలాగే విద్య ఖరీదైన విషయంగా ఉందని 33 శాతం మంది, నైపుణ్యాల పురోగతిలో కొరత ఉందని చెప్పారు.

నూతన నైపుణ్యాలవైపు..

లైఫ్ లాంగ్ లెర్నింగ్ అనేది కెరీర్ సుస్థిరతకు తోడ్పడుతుందని 91 శాతం మంది పేర్కొనగా యూనివర్సిటీల డిగ్రీల కంటే ఆయా విభాగాల్లో క్రెడెన్షియల్స్, సర్టిఫికేషన్స్ ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంటాయని 88 శాతం మంది పేర్కొన్నారు.

ఏఐ.. అవకాశాల వేదిక

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతుందనే అభిప్రాయాలు వెల్లడవుతున్న పరిస్థితుల్లో తాజా సర్వేలో మాత్రం ఇందుకు భిన్నంగా యువత స్పందించింది. ఏఐను ముప్పుగా భావించట్లేదని, తమకు లభించిన అవకాశంగా భావిస్తున్నామని 88 శాతం మంది స్పష్టం చేయడం విశేషం. అదేవిధంగా అంతర్జాతీయ స్థాయిలో ప్రతి 10 మంది ఉద్యోగుల్లో నలుగురు.. ఏఐ లిటరసీ, మానవ సామర్థ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవడంలో ఆసక్తి చూపుతున్నారు. 53 శాతం యాజమాన్యాలు తమ ఉద్యోగులకు ఏఐ లిటరసీ ఉందని భావిస్తుండగా 43 శాతం మంది ఉద్యోగులే అందులో ఉన్నత స్థానంలో ఉన్నామని పేర్కొంటున్నారు. అంటే ఈ రెండు వర్గాల మధ్య 12 శాతం వ్యత్యాసం కనిపిస్తోంది. అలాగే ఏఐ నైపుణ్యాలను గుర్తించేందుకు దేశంలో 79 శాతం యాజమాన్యాలు ప్రామాణిక విధానాలు పాటిస్తున్నాయని నివేదిక పేర్కొంది.

వాస్తవ పరిస్థితులపై అవగాహన

నేటి యువత వాస్తవ పరిస్థితులపై అవగాహన ఏర్పరచుకుంటున్నారు. అందుకే అప్ స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్ కోసం కాలేజీ స్థాయి నుంచే కృషి చేస్తున్నారు. అయితే దీనికి తగినట్లుగా మౌలిక సదుపాయాలు, బోధన అవకాశాలు మరింత మెరుగుపడాలి. అంతర్జాతీయంగా పోలిస్తే మన విద్యార్థులు ఏ దేశంలోనైనా ఉన్నతవిద్య, ఉద్యోగ రంగాల్లో మెరుగ్గా రాణిస్తున్నారు.

– ప్రొ. రమేశ్ లోగనాథన్ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, కో–ఇన్నోవేషన్స్, ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్

రేవంత్.. దమ్ముంటే రాజీనామా చెయ్

కోస్గిలో 'రైతు మహాధర్నా'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్



కోస్గిలో బీఆర్ఎస్ రైతు ధర్నా సభకు హాజరైన ప్రజలు

సాక్షి, నాగర్‌కర్నూల్/నారాయణపేట: గత 14 నెలల పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులు, మహిళలు, వృద్ధులు, యువత కోసం ఒక్క పని కూడా చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. ఎనుముల అన్నదమ్ముల కోసం, అల్లుడు, అదాని కోసం, బావమరిది, కుటుంబసభ్యుల కోసం దోచుకునే పనిలో పడ్డారని ఆరోపించారు. 'నీ నియోజకవర్గం నుంచి బంపర్ ఆఫర్ ఇస్తున్నా.. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్. ఉప ఎన్నికల్లో ఎవరు గెలుస్తరో చూద్దాం. మేం బయటకు రాము. ఇంట్లోనే కూర్చుంటాం. మా సోదరుడు నరేందర్‌రెడ్డి కూడా బయటకు రాడు. మా పార్టీకి 50 వేల మెజార్టీ కన్నా ఒక్క ఓటు తగ్గినా నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా. రాజకీయాల్లో ఉండను..'అని సవాల్ విసిరారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బొంద పెట్టాలని ప్రజలు చూస్తున్నారని, రాష్ట్రం మొత్తం ఇదే ముఖచిత్రం ఉందని అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కోస్గి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నిర్వహించిన 'రైతు మహాధర్నా'లో కేటీఆర్ మాట్లాడారు.

దుర్యోధనుడి తరహాలో పాలన

'రాష్ట్రంలో గత ఏడాది కాలంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన కౌరవుల రాజు దుర్యోధనుడి తరహాలో సాగుతోంది. ముఖ్యమంత్రి దుర్మార్గపు, అరాచక పాలనతో ఇక్కడి బిడ్డల పోరాటం కురుక్షేత్ర యుద్ధాన్ని తలపిస్తోంది. దుర్యోధనుడు తన రాజ్యం నుంచి పాండవులను బయటకు పంపినట్టుగానే.. రేవంత్ కూడా కొడంగల్‌లోని గిరిజన ఆడబిడ్డలను అవమానిస్తూ తండాల నుంచి జంగిల్‌కు ఉరికిచ్చారు. ఇక్కడి ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్ 70 మందిపై కేసులు పెట్టి 40 మందిని జైలుకు పంపారు. కొడంగల్ ఆడబిడ్డలను గోసపెట్టిన రేవంత్‌ను చిత్తుగా ఓడించి ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారు..' అని కేటీఆర్ చెప్పారు.

రేవంత్ మోసం దేశమంతా తెలిసింది

'సీఎం స్థాయిలో ఉండి కూడా అబద్ధాలు చెబుతారా? టకీ టకీమని డబ్బులు పడ్డాయంటే నిజమని అనుకున్నా కానీ రేవంత్ మోసం దేశమంతా తెలిసింది. రైతుబంధు, రుణమాఫీ, వరికి బోనస్, మహిళలకు రూ.2,500, తులం బంగారం, బాలికలకు స్కూటీలు.. ఎంత మందికి ఇచ్చారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకుండా, తన కాంట్రాక్టర్ మంత్రి కోసం రూ.4,350 కోట్లతో కొత్త ప్రాజెక్టు తెస్తానంటూ మోసం చేస్తున్నారు. అల్లుడికి కట్నం కింద ఇచ్చేందుకు లగచర్ల, హకీంపేట భూములపై కన్నేశారు. ఎన్నికల సందర్భంగా అడ్డగోలు హామీలు ఇచ్చిన రేవంత్ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఇప్పుడు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. చికెన్ దావత్‌లు ఇస్తామని, పైసలు తీసుకోమని కాంగ్రెసోళ్లు వస్తారు..వారి దగ్గర పైసలు తీసుకుని కారు గుర్తుకే ఓటు వేయాలి..'అని కేటీఆర్ అన్నారు. కొడంగల్ భూముల్లో తొండలు కూడా గుడ్లు పెట్టవని మాట్లాడిన రేవంత్‌కు.. ఇక్కడి తాండూరు కందిపప్పునకు జియోలాజికల్ ఇండెక్స్ గుర్తింపు లభించిందని తెలియదా? అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు.

జ్యోతి-ప్రవీణ్ దంపతుల బిడ్డకు 'భూమి'గా నామకరణం

దుద్యాల్: కోస్గి మండల పరిధిలోని హకీంపేట మీదుగా కేటీఆర్ వెళ్తున్న క్రమంలో బీఆర్ఎస్ నాయకులు గ్రామ శివారు నుంచి ప్రధాన చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. లగచర్ల బాధిత రైతులను పరామర్శించిన కేటీఆర్ వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జ్యోతి, ప్రవీణ్ దంపతుల కుమార్తెకు భూమి అని నామకరణం చేశారు. తిరుగు ప్రయాణంలో పారిశ్రామికవాడ ఏర్పాటుతో కోల్పోతున్న భూములను పరిశీలించారు.



క్లుప్తంగా...

బర్డ్‌ఫ్లూ హై అలర్ట్

కేంద్రం సూచన మేరకు జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేసిన పశుసంవర్ధకశాఖ

సాక్షి, హైదరాబాద్: పౌల్ట్రీ పరిశ్రమను అతలాకుతలం చేస్తున్న బర్డ్ ఫ్లూ వైరస్‌ను నియంత్రించే కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఈ వైరస్ సోకి చనిపోతున్న కోళ్ల సంఖ్య విపరీతంగా పెరుగుతుండడం, సంక్రాంతి తర్వాత రాష్ట్రంలో కనిపించిన ఈ వైరస్.. ఇప్పటికీ పౌల్ట్రీ పరిశ్రమపై ప్రభావం చూపుతుండడంతో అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేసింది. ఈ మేరకు ఆ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సవ్యసాచి ఘోష్ కలెక్టర్లకు ఇటీవల ప్రత్యేక సర్క్యులర్ పంపారు. ఇతర రాష్ట్రాల ద్వారా మన రాష్ట్రంలోకి ఈ వైరస్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇందులో సూచించారు. కలెక్టర్లు స్వయంగా బర్డ్ ఫ్లూ పరిస్థితిని సమీక్షించాలని, వైరస్ సోకకుండా నియంత్రణ చేపట్టడంతోపాటు చనిపోయిన కోళ్లను పూడ్చిపెట్టే అంశాన్ని స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు.

కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి? కవిత



జగిత్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ఒకటీ అమలు చేయడంలేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని, కాళేశ్వరం లింక్‌-1 నుంచి పంటలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలన్నారు. రాజకీయ కక్షతోనే ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని, కాంగ్రెస్ తప్పులను ప్రజలు గమనిస్తున్నారని ఆమె తెలిపారు. ప్రభుత్వం బీసీ బిల్లు వెంటనే పాస్ చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారని, సీఎంకు కనీసం సమావేశం నిర్వహించే సమయమే లేదా అని కవిత ప్రశ్నించారు.

కేసీఆర్ ఐఫోన్.. రేవంత్ చైనా ఫోన్

కేసీఆర్ పాలన ఐఫోన్ లాగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి పాలన చైనా ఫోన్‌లాగా మారిందని కవిత ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షలకు పోకుండా కొండగట్టు అంజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేశారని, ఉప ఎన్నిక వస్తే ఆయన అడ్రస్ లేకుండా పోతాడని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని అన్నారు.

ఇంటి నుంచే లెర్నింగ్ లైసెన్స్

- షోరూమ్‌లలోనే వాహనాల రిజిస్ట్రేషన్.. అవినీతికి చెక్ పెడుతూ ఆన్‌లైన్ విధానం
- ఎట్టకేలకు కేంద్ర పోర్టల్ వాహన్, సారథితో అనుసంధానమవుతున్న తెలంగాణ
- ఈనెల 24న సికింద్రాబాద్ రవాణాశాఖ కార్యాలయంతో మొదలు
- ఆ తర్వాత మిగతా కార్యాలయాల్లో ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రవాణాశాఖలో అవినీతికి అడ్డుకట్ట వేస్తూ, పనులు వేగవంతంగా అయ్యేందుకు కేంద్రం రూపొందించిన పోర్టల్‌కు ఎట్టకేలకు తెలంగాణ కూడా అనుసంధానమవుతోంది. ప్రస్తుతం తెలంగాణ మినహా దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు దీనితో అనుసంధానమయ్యాయి. తెలంగాణలోని రవాణా శాఖ కార్యాలయాల్లో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందన్న తీవ్ర ఆరోపణల నేపథ్యంలో, ఇప్పుడు రాష్ట్రం కూడా కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌తో అనుసంధానం కాబోతోంది. ఈనెల 24న సికింద్రాబాద్ రవాణా శాఖ కార్యాలయంతో ఇది మొదలుకాబోతోంది. ఆ తర్వాత రాష్ట్రంలోని అన్ని రవాణా శాఖ కార్యాలయాలకు విస్తరిస్తారు. ఇప్పటివరకూ లెర్నింగ్ లైసెన్స్ కావాలంటే రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లి పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించడం.. చివరకు అనధికార 'ఫీజు'సిబ్బంది చేతిలో పెడితే తప్ప లైసెన్సు చేతికందేది కాదు. ఇప్పుడు దీనికి చెక్ పెడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వాహన్ సారథి పోర్టల్ అందుబాటులోకి రాబోతోంది.

ఏమిటా విధానం...

కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల శాఖ గతంలోనే ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం కాకుండా, దేశంలోని అన్ని వాహనాలకు సంబంధించిన సమాచారాన్ని ఓ పోర్టల్‌తో అనుసంధానించాలని నిర్ణయించింది. తదుపరి నమోదయ్యే వాహనాల వివరాలు కూడా ఆటోమేటిక్‌గా ఇందులో చేరుతాయి. ఇక వాహనదారులు వివిధ అవసరాల కోసం ప్రత్యక్షంగా రవాణా శాఖ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చు. ఇదే విషయాన్ని కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సమాచారం ఇచ్చింది. దీంతో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఆ పోర్టల్‌లో భాగమయ్యాయి, ఒక్క తెలంగాణ మాత్రం అందులో చేరేందుకు ఇష్టపడలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, 2016లో రాష్ట్రంలో రవాణాశాఖను ఆన్‌లైన్‌తో అనుసంధానించింది. కొన్ని రకాల పనులు ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించుకునే వెసులుబాటు తెచ్చింది. టీ-యాప్ ఫోలియో ద్వారా ఆ పనులు జరిగాయి. దీంతో ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌తో అనుసంధానమయ్యే అవసరం లేదని ప్రభుత్వం భావించింది. కానీ, స్థానికంగా ఆన్‌లైన్ సేవలు పేరుకే పరిమితమయ్యాయి. చాలా అంశాల్లో సిబ్బంది కొర్రీలు వేస్తూ వాహనదారులు తిరిగి రవాణాశాఖ కార్యాలయాలకు వచ్చేలా చేస్తూ ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఆన్‌లైన్ విధానం అభాసుపాలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో చేరేందుకు సమ్మతించింది. దీంతో కేంద్ర ప్రభుత్వ వాహన్ సారథి పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా సికింద్రాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో అమలు చేయటం ద్వారా ప్రారంభించాలని నిర్ణయించింది. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ద్వారా వాహన సమాచార బదిలీ ప్రక్రియ జరుగుతోంది. ఆ ప్రక్రియ కొలిక్కి వచ్చిన నేపథ్యంలో ఈనెల 24న అధికారికంగా దాని అమలు ప్రారంభించాలని నిర్ణయించింది.

18 సేవలతో ప్రారంభం.. 40 సేవలకు విస్తరణ

- కేంద్ర ప్రభుత్వ పోర్టల్ వాహన్, సారథి అని రెండు రకాలుగా ఉంటుంది. వాహనాల రిజిస్ట్రేషన్ తదితర ప్రక్రియలు వాహన్ ద్వారా, లైసెన్సుల జారీ లాంటివి సారథి ద్వారా జరుగుతాయి.
- ప్రస్తుతం రాష్ట్రంలో వాహనం కొన్నప్పుడు షోరూమ్‌లలో తాత్కాలిక రిజిస్ట్రేషన్ మాత్రమే జరుగుతోంది. ఫైనల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం మళ్లీ రవాణా శాఖ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కొత్త విధానంతో షోరూమ్‌లలోనే నిర్వహిస్తారు.
- తాత్కాలిక లైసెన్సు పొందటం, గడువు దీరిన తర్వాత నిర్ధారిత సమయానికి పొడిగించుకోవటం లాంటివి ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చు.
- ఎన్‌ఓసీతో సంబంధం లేకుండా రాష్ట్రాల మధ్య వాహనాల బదిలీ చేసుకోవచ్చు. ఇలా తొలుత 18 సేవలతో మొదలుపెట్టి తర్వాత 40 సేవలకు విస్తరిస్తారు.

వాళ్లూ మీలా మనుషులే..!

- ఉద్యోగాల కోసం డీఎస్సీ-2008 అభ్యర్థులు ఇంకెంత కాలం నిరీక్షించాలి?
- ఉద్యోగాలివ్వాలన్న మా ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదు?
- పాఠశాల విద్యాశాఖ అధికారులపై హైకోర్టు ఆగ్రహం... ప్రతికూల ఉత్తర్వులు జారీ చేస్తే కెరీర్‌లో నష్టపోతారని వ్యాఖ్య
- 3 రోజుల్లో ఉత్తర్వులు అమలు చేస్తామని అధికారుల హామీ.. విచారణ వాయిదా



సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ-2008 అభ్యర్థులకు సోమవారం (10వ తేదీ)లోగా ఉద్యోగాలు ఇవ్వాలన్న ఆదేశాలను అమలు చేయని పాఠశాల విద్యాశాఖ అధికారులపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తర్వులు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని నిలదీసింది. షరతుతో కూడిన ఆదేశాలు జారీ చేసినప్పుడు అధికారులు పాటించాలని లేదంటే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. మూడు రోజుల్లో అమలు చేస్తామని అధికారులు కోర్టుకు హామీ ఇవ్వడంతో తదుపరి విచారణ ఈ నెల 17కు వాయిదా వేసింది.

ఉత్తర్వులు ఎందుకు ఇవ్వలేదు?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చిన డీఎస్సీ-2008 నోటిఫికేషన్‌లో తమ కంటే తక్కువ అర్హతగల డీఎడ్ అభ్యర్థులకు 30 శాతం ఎస్‌జీటీ పోస్టులు రిజర్వ్ చేయడాన్ని, దీన్ని సమర్థిస్తూ ట్రిబ్యునల్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ బీఎడ్ అభ్యర్థులు 2009లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు సుప్రీంకోర్టు వరకు వెళ్లి మళ్లీ హైకోర్టుకే వచ్చింది. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ తిరుమలాదేవి ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. డీఎస్సీ-2008 అభ్యర్థులను కాంట్రాక్టు ఉద్యోగులుగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారా లేదా? అని విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రక్రియ కొనసాగుతోందని న్యాయవాది బదులివ్వగా ఆదేశాలు అమలు చేయకుంటే ఉన్నతాధికారులు వివరణ ఇచ్చేందుకు హాజరయ్యారా? అని మరోసారి ప్రశ్నించింది. అధికారులు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరించింది. ఈ దశలో ప్రభుత్వ న్యాయవాది మాట్లాడుతూ మధ్యాహ్నం వరకు సమయం ఇవ్వాలని కోరారు. అందుకు సమ్మతించిన ధర్మాసనం విచారణను వాయిదా వేసింది. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత కమిషనర్ నరసింహారెడ్డి సహా పలువురు అధికారులు విచారణకు హాజరయ్యారు.

ప్రతికూల ఆదేశాలిస్తే నష్టం మీకే..

'మా ఆదేశాలు ఎందుకు అమలు చేయలేదు? హాజరై వివరణ ఇవ్వాలి కదా'అని అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. 'షరతు విధించినా ఉదయం మీరు రాలేదు. ఏదైనా ప్రతికూల ఆదేశాలు మీపై జారీ చేస్తే నష్టపోయేది మీరే. డీఎస్సీ-2008 అభ్యర్థులు ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం మానవత్వంతో ఆలోచించండి. వాళ్లు కూడా మనుషులే అనే విషయం గుర్తుంచుకోవాలి'అని వ్యాఖ్యానించింది. ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో కమిషన్ అనుమతి తీసుకున్నామని.. అందుకే ఆలస్యం జరిగిందని అధికారుల తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి తెలిపారు. మూడు రోజుల్లో నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో విచారణను వాయిదా వేసింది.

మేం చూస్తూ ఊరుకోం!

▶ మొదటి పేజీ తరువాయి

కండువా కప్పుకుని ప్రచారం చేశారు'' అని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తాము విచారణ జరుపుతున్నది ఎన్నికల ప్రచారంపై కాదని, అనర్హత పిటిషన్‌పై మాత్రమేనని, అందువల్ల పిటిషన్‌లో ఉన్న అంశాలను ప్రస్తావించాలని సూచించింది. పిటిషన్‌పై స్పందించేందుకు మీకెంత సమయం కావాలని స్పీకర్ కార్యదర్శి తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని జస్టిస్ బీఆర్ గవాయి ప్రశ్నించారు. తమకు ఇంకా తగినంత సమయం కావాలని రోహత్గీ బదులిచ్చారు. ఈ సమయంలో పిటిషనర్ల తరఫు మరో న్యాయవాది ఆర్యామ సుందరం జోక్యం చేసుకుంటూ.. ''ఇప్పటికే పది నెలలు గడిచింది, మొదట్లోనే దీనిపై స్పీకర్ స్పందించి ఉంటే.. మిగతా ఏడుగురు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించేవారు కాదు'' అని ధర్మాసనం దృష్టికి తెచ్చారు.

హక్కులకు సంబంధించిన అంశం ఇది

అయితే తమకు ఇంకా సమయం కావాలని రోహత్గీ ఈ సందర్భంగా అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ''తగినంత టైం అంటే ఎంత? అసెంబ్లీ గడువు ముగిసేంత సమయం కావాలా? మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల హక్కులకు సంబంధించిన అంశం ఇది. రాజకీయ పార్టీల హక్కులకు ఇబ్బంది కలుగుతుంటే మేం చూస్తూ ఊరుకోం'' అని స్పష్టం చేసింది. సంపత్‌కుమార్, సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ కోరిన 'తగినంత సమయం' అంశంలో సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును రోహత్గీ ప్రస్తావించారు. దీనితో 'తగినంత సమయం' అంటే ఎంత అని రోహత్గీని జస్టిస్ బీఆర్ గవాయి ప్రశ్నించారు. ''తగినంత సమయం అంటే రెండు నెలలు, మూడు నెలలు అని ఏదీ కూడా ఆ తీర్పులో ధర్మాసనం చెప్పలేదని రోహత్గీ బదులిచ్చారు.

డిక్షనరీ ప్రకారం 'తగినంత సమయం' అంటే ఎంత?

రోహత్గీ సమాధానంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ''డిక్షనరీ ప్రకారం 'తగినంత సమయం (రీజనబుల్ టైం) అంటే ఎంత? పది నెలలు రీజనబుల్ టైం కాదా? అయితే మీ దృష్టిలో రీజనబుల్ టైం అంటే ఎంతో చెప్పండి? మీరు చెప్పే రీజనబుల్ టైమ్‌కు గడువు అనేది ఉందా, లేదా? పోనీ మీరు రీజనబుల్ టైం చెప్పకపోతే.. మేమే ఓ గడువు విధిస్తాం. ఆ గడువులోపు దానిని పూర్తి చేయండి'' అని జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం పేర్కొంది. అయితే 'రీజనబుల్ వ్యక్తికి రీజనబుల్ టైం ఇవ్వాల'ని రోహత్గీ తిరిగి అభ్యర్థించారు. ''రీజనబుల్ వ్యక్తి దృష్టిలో రీజనబుల్ టైం అంటే ఏంటీ, అసలు ఎంత సమయం కావాలి?'' అని ధర్మాసనం ఆగ్రహంగా స్పందించింది. దీనికి బదులు ఇచ్చేందుకు రెండు, మూడు రోజులు సమయం కావాలని రోహత్గీ విజ్ఞప్తి చేయగా.. ధర్మాసనం అంగీకరించి తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది.

ధర్మాసనానికి అన్ని ఆధారాలు సమర్పించాం: మోహిత్‌రావు

తెలంగాణలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది పి.మోహిత్‌రావు పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు సంబంధించిన అన్ని ఆధారాలను ధర్మాసనానికి సమర్పించామని చెప్పారు. గతంలోని సుప్రీంకోర్టు తీర్పులు, హైకోర్టు సూచనలను స్పీకర్ పట్టించుకోకపోవడాన్ని వివరించామన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక

▶ మొదటి పేజీ తరువాయి

బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టాలని సూచించారు.

బుక్ చేసిన 48 గంటల్లో ఇసుక

ఇసుక బుక్ చేసిన 48 గంటల్లోగా వినియోగదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏరియాల వారీగా సమీప ఇసుక రీచ్‌ల నుంచి వినియోగదారుడికి ఇసుక చేరేలా వ్యవస్థ ఉండాలన్నారు. ఇసుక వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసి సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని ఆదేశించారు. ''నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఇసుక రవాణా చేసే వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి. ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో అనేక మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఆఫీస్ టైమింగ్స్‌లో బుకింగ్ చేసుకునేలా బుకింగ్ వేళల్లో మార్పు చేయాలి. ఇసుక వెలికితీత, విక్రయాల్లో అక్రమాలకు తావు లేకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ పర్మినెంట్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాలి'' అని సీఎం సూచించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్‌తోపాటు గనులు, ఖనిజాభివృద్ధి శాఖ, హైడ్రా అధికారులు పాల్గొన్నారు.





ముళ్లు లేకుండా గులాబీ ఉండదు.
కానీ గులాబీ లేకుండా చాలా ముళ్లుంటాయి.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 11 ఫిబ్రవరి 2025

మణిపూర్ శాంతిస్తుందా?

ఎట్టకేలకు మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. దాదాపు రెండేళ్లనాడు హత్యలూ, అత్యాచారాలూ, గృహదహనాలతో అట్టుడికి ప్రపంచవ్యాప్తంగా మన దేశ పరువు ప్రతిష్ఠలను మంటగలిపిన ఆ రాష్ట్రం 649 రోజులైనా ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. 2023 మే 3న రాష్ట్రంలో ప్రధాన తెగలైన మెయితీలకూ, కుకీలకూ మధ్య రాజుకున్న ఘర్షణలు చూస్తుండగానే కార్చిచ్చులా వ్యాపించగా అధికారిక లెక్కల ప్రకారమే 260 మంది ప్రాణాలు కోల్పోయారు. 60,000 మంది ఇప్పటికీ తమ స్వస్థలాలకు వెళ్లలేక సహాయ శిబిరాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. భద్రతా బలగాల పహారా కొనసాగుతున్నా మెయితీలు, కుకీలు ఒకరి ప్రాబల్య ప్రాంతాల్లోకి మరొకరు ప్రవేశించే సాహసం చేయటం లేదు. అందువల్ల నిరుపేదల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింది. మణిపూర్ హింసాకాండ సాధారణమైనది కాదు. అనేకచోట్ల మహిళలను వివస్త్రలను చేసి, వారిపై అత్యాచారాలకు పాల్పడిన ఉదంతాలు దిగ్భ్రాంతికి గురిచేశాయి. పోలీసు స్టేషన్లపై, సాయుధ రిజర్వ్ బెటాలియన్ స్థావరాలపై దాడులకు దిగి తుపాకులు, మందుగుండు ఎత్తుకుపోయిన ఉదంతాలు కోకొల్లలు. ఈ మొత్తం హింసాకాండలో బీరేన్ సింగ్‌కు కేవలం నైతిక బాధ్యత మాత్రమే కాదు... నేరుగా ఆయన ఒక వర్గానికి వత్తాసుగా నిలిచారని అనేకులు ఆరోపించారు. ఇటీవల బయటపడి, ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్న సంభాషణల ఆడియో క్లిప్ ఆ ఆరోపణలకు మరింత బలం చేకూర్చింది.

కొందరి మతిమాలిన చర్యలవల్లా, పాలకులకు సరైన అంచనా లేకపోవటంవల్లా శాంతి భద్రతలు చేజారే ప్రమాదం ఉంటుంది. కానీ మణిపూర్‌లో జరిగింది వేరు. ఘర్షణలను కుకీ మిలిటెంట్లకూ, కేంద్ర భద్రతా బలగాలకూ మధ్య సాగుతున్న లడాయిగా మొదట్లో బీరేన్ సింగ్ కొట్టిపారేశారు. కానీ దాన్ని అప్పటి రక్షణ దళాల చీఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ ఖండించారు. అవి రెండు తెగలమధ్య కొనసాగుతున్న ఘర్షణలేనని తేల్చిచెప్పారు. ఆ తర్వాత దశలో ఘర్షణలను ఆపడానికి ప్రయత్నిస్తున్న కేంద్ర భద్రతా బలగాలు ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయంటూ బీరేన్ నిందించారు. విషాదం ఏమంటే 21 నెలలు గడిచినా ఈనాటికీ పరిస్థితి పెద్దగా మారింది లేదు. వాస్తవానికి ఘర్షణలు చెలరేగిన కొన్ని వారాల తర్వాత 2023 జూన్‌లో బీరేన్‌సింగ్ రాజీనామాకు సిద్ధపడ్డారు. కానీ రాజ్‌భవన్‌కెళ్లే దారిలో ఆయన మద్దతుదార్లు పెద్దయెత్తున గుమిగూడి అడ్డంకులు సృష్టించి వెనక్కు తగ్గేలా చేశారు. ఇన్నాళ్లకు తప్పుకున్నారు. ఈ పని మొదట్లోనే జరిగుంటే ఈపాటికి పరిస్థితులు మెరుగుపడేవి. సకాలంలో తీసుకోని నిర్ణయం ఊహించని విష పరిణామాలకు దారితీసే ప్రమాదమున్నదని చెప్పటానికి మణిపూర్ పెద్ద ఉదాహరణ.

ఇంతకూ బీరేన్ రాజీనామాకు కారణం ఏమిటన్నది మిస్టరీయే. సుప్రీంకోర్టు ధర్మాసనం పరిశీలనలో వున్న ఆడియో టేప్ అందుకు దారితీసి వుండొచ్చని కొందరంటున్నా... మణిపూర్ అరాచకంలోకి జారుకున్నప్పటినుంచీ ఆయనకు సొంత పార్టీలో వ్యతిరేకత పెరుగుతూ వచ్చిందన్నది వాస్తవం. కేబినెట్ సైతం రెండుగా చీలింది. ఒక వర్గం మణిపూర్‌ను విభజించి తాముండే ప్రాంతాలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలన్న కుకీల డిమాండ్‌ను సమర్థించగా, మరో వర్గం మణిపూర్ సమగ్రత కాపాడాలంటూ కోరుతూ వచ్చింది. బీజేపీ ఎమ్మెల్యేల్లో కొందరు అసెంబ్లీ స్పీకర్ సత్యబ్రతసింగ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంఫాల్ హోటల్‌లో సమావేశమై బీరేన్‌ను సాగనంపటానికి వ్యూహం రచించగా, సోమవారం నుంచి ప్రారంభం కావాల్సిన అసెంబ్లీ సమావేశాల్లో సర్కారుపై అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ నోటీసులిచ్చింది. బీరేన్ తప్పుకున్నాక అసెంబ్లీ సమావేశాలను గవర్నర్ రద్దుచేశారు. బీజేపీ అధిష్టానం అండదండలుంటే అవిశ్వాస తీర్మానానికి బీరేన్ జడిసేవారు కాదు. ఎందుకంటే తొలి ఏలుబడిలో మూడుసార్లు అవిశ్వాస తీర్మానం వచ్చిపడినప్పుడు అసెంబ్లీలో తగినంత బలం లేకున్నా సునాయాసంగా బయటపడిన చరిత్ర బీరేన్‌ది. దేశానికి బలమైన రాజ్యాంగం ఉన్నా మణిపూర్‌లో కొనసాగుతున్న దారుణ హింసను అన్ని వ్యవస్థలూ చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయాయి. అది మన దేశంలో అంతర్భాగమని, అక్కడి ప్రజలు కూడా ఈ దేశ పౌరులేనని గుర్తించనట్టే ప్రవర్తించాయి. గవర్నర్ మొదలుకొని న్యాయవ్యవస్థ వరకూ అందరికందరూ మౌనంగా మిగిలారు. ఇలాంటి సమయాల్లో జోక్యం చేసుకోవాల్సిన కేంద్రం తన కర్తవ్యాన్ని మరిచింది. పార్లమెంటులో ఈ సమస్య ప్రస్తావనకొచ్చినప్పుడల్లా అధికార, విపక్ష సభ్యులు పరస్పరం ఆరోపణలు చేసుకోవటం మినహా జరిగిందేమీ లేదు. కనీసం ఇప్పుడైనా అందరూ కదిలి క్షతగాత్రగా మిగిలిన మణిపూర్‌లో ఉపశమన చర్యలు తీసుకుంటారా?

మాయమైన మనుషులు, ధ్వంసమైన ఇళ్లు, ఛిద్రమైన బతుకులు, మానప్రాణాలు తీసే మృగాళ్లు, జీవిక కోల్పోయి ఎలా బతకాలో తెలియక కుమిలిపోతున్న కుటుంబాలు – మణిపూర్ వర్తమాన ముఖచిత్రం ఇది. అందుకే ఆయుధాలు సమకూర్చుకుని అధికారంలో ఉన్నవారి అండదండలతో ఇన్నాళ్లనుంచీ రెచ్చిపోతున్న ముఠాల ఆటకట్టించటం తక్షణావసరం. అసెంబ్లీని సస్పెండ్ చేసి తాత్కాలికంగా రాష్ట్రపతి పాలన విధిస్తారో, మరెవరినైనా ముఖ్యమంత్రి పీఠంపై ఎక్కిస్తారో ఇంకా తేలాల్సివుంది. ఏం జరిగినా ముందు చట్టబద్ధ పాలనపై ప్రజలకు విశ్వాసం కలిగించే చర్యలు తీసుకోవటం అధికార యంత్రాంగం కర్తవ్యం. అప్పుడే శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయి. సంక్షుభిత మణిపూర్ మళ్లీ చివురిస్తుంది.

అణు విద్యుత్తు ఆశలు... బారెడు

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది బడ్జెట్‌లో టెక్నాలజీ రంగంలో పెద్ద ప్రతిపాదనలే చేశారు. వాటిల్లో ప్రధానంగా చెప్పుకోవాల్సినవి 'అణుశక్తి' మిషన్, 'కృత్రిమ మేధ' మిషన్. వీటితోపాటు ప్రైవేట్ రంగంలో టెక్నాలజీల అభివృద్ధికి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన మంత్రిత్వ శాఖ కేటాయింపులు పెంచారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో మౌలిక వసతులను, ఎంబీబీఎస్ సీట్లను గణనీయంగా పెంచుతామని కూడా ప్రతిపాదించారు. ఇవన్నీ స్వాగతించదగ్గ ఆలోచనలే. కానీ వీటి అమలుకు నిర్దేశించుకున్న కాలావధులు, ఆర్థిక అంశాల విషయంలో మాత్రం సందేహాలు వ్యక్తమవుతాయి. ఎందుకంటే, ఈ అంశాలేవీ కొత్తవి కావు, నిరుటి బడ్జెట్‌లో ప్రస్తావించినవే.

పేరు మార్చితే కొత్త పథకమా?

అణు శక్తి మిషన్ సంగతి చూద్దాం. స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల (ఎస్ఎంఆర్) అభివృద్ధికి పరిశోధనలు చేపట్టడం ఈ మిషన్ ఉద్దేశం. భారీ అణు విద్యుత్ కేంద్రాల స్థానంలో ఎస్ఎంఆర్‌లను ఎందుకు ఎంచుకున్నారు అన్నదానికి శిలాజ ఇంధనాల మీద ఆధారపడటం తగ్గించుకునేందుకు అన్న సమాధానం వినిపిస్తోంది. ఆర్థిక మంత్రి చెప్పినట్లు, '2047 నాటికి వంద గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తిని' లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. సుమారు రూ. 20,000 కోట్లతో పూర్తి స్వదేశీ టెక్నాలజీ ఆధారంగా ఐదు ఎస్ఎంఆర్‌లు నిర్మిస్తామనీ, 2033 నాటికల్లా వీటితో విద్యుదుత్పత్తి ప్రారంభిస్తామనీ మంత్రి వివరించారు. ఇందుకోసం అణుశక్తి విభాగానికి స్పష్టమైన బడ్జెట్ కేటాయింపులు మాత్రం చేయలేదు. గతేడాది మొత్తమే ఈ ఏడాదీ ఉండనుంది. దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవాల్సింది ఎస్ఎంఆర్‌లపై ఆర్థిక శాఖ మంత్రి కేవలం తన ఉద్దేశాన్ని మాత్రమే వ్యక్తం చేశారూ అని!

వాస్తవానికి ఎస్ఎంఆర్‌ల ఆలోచన కొత్తది కాదు. 2024 బడ్జెట్ ప్రసంగంలోనూ అణుశక్తి విస్తృత వినియోగం కోసం ఎస్ఎంఆర్‌ల నిర్మాణం చేపడతామని ప్రకటించారు. భారత్ స్మాల్ రియాక్టర్స్, భారత్ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్స్ అని నామకరణం కూడా చేశారు. భారత్ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల అభివృద్ధి ప్రక్రియ మొదలైందని 2024 డిసెంబరులో ప్రభుత్వం పార్లమెంటులో ఒక ప్రకటన కూడా చేసింది. 'వీటి తయారీలో భాగస్వాములవుతామని చాలా దేశాలు ఆసక్తి చూపాయి' అని కూడా చెప్పింది. ఈ రియాక్టర్లను అక్కడికక్కడే విద్యుత్తు ఉత్పత్తి చేసుకోగల రంగాల్లో ఉపయోగిస్తారని చెప్పారు. అణుశక్తి విభాగం ఎస్ఎంఆర్‌ల అభివృద్ధి ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించి ఉంటే, వాటికి ఈ ఏడాది బడ్జెట్‌లోనే నిధుల కేటాయింపు జరిగి ఉండాలి. కానీ 2025 బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ ఎస్ఎంఆర్‌కు ముందు జోడించిన భారత్‌ను వదిలేశారు. బీఎస్ఎంఆర్ అని కాకుండా ఎస్ఎంఆర్ అనడం ద్వారా కొత్త అణు రియాక్టర్ల అభివృద్ధికి నాంది పలికినట్లు ధ్వనించారు.

ఎస్ఎంఆర్‌లను 2023లో నీతి ఆయోగ్ ప్రచురించిన ఒక విధాన ప్రకటనలో ప్రతిపాదించారు. సుమారు 220 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగల, అది కూడా ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ టెక్నాలజీతో పనిచేసే వాటిని చిన్నస్థాయి అణు



రియాక్టర్లుగా పరిగణిస్తున్నారు. ఎస్ఎంఆర్‌ల విషయానికి వస్తే అవి 30 మెగావాట్ల సామర్థ్యం, కొత్త డిజైన్ కలిగినవి. ఫ్యాక్టరీల్లో తయారు చేసుకుని అవసరమైన చోట అమర్చుకోగల వీటి వినియోగం వల్ల ఖర్చులు తగ్గుతాయని అంచనా. చిన్న రియాక్టర్లు కావడం వల్ల తరచూ ఇంధనం మార్చాల్సిన అవసరం ఉండదు. నిర్ణీత సమయం తరువాత వీటిని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో వాడుకునే వీలుంటుంది. పెద్ద రియాక్టర్లతో పోలిస్తే వీటి భద్రత, పర్యావరణపరమైన అంశాలు, అనుమతులు భిన్నంగా ఉంటాయి. ఒత్తిడి పెద్దగా ఉండకపోవడం, ఉత్పత్తి కూడా తక్కువగా ఉండటం... ఇందుకు కారణం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కొద్ది సంఖ్యలో మాత్రమే ఎస్ఎంఆర్‌ల అభివృద్ధి జరుగుతోంది.

వ్యయం–కాలయాపన

స్వాతంత్ర్యం అనంతరమే అణువిద్యుత్తు ఉత్పత్తి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. స్వశక్తితో ఎంతో పురోభివృద్ధి సాధించింది కూడా. అణ్వాస్త్రాల తయారీకి అవసరమైన ఇంధనాన్ని సమకూర్చుకునేలా వ్యూహాత్మకంగా అణుశక్తి కార్యక్రమం నడిచింది. అయినా వాణిజ్య స్థాయి అణు విద్యుత్‌లో దేశం వెనుకబడి ఉంది. ప్రస్తుతం భారత్‌లో 24 అణు రియాక్టర్లు ఉమ్మడిగా 8,180 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. ఇంకో 15,300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మరో 21 అణురియాక్టర్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

కేంద్ర అణుశక్తి విభాగం సుదీర్ఘ లక్ష్యాలను నిర్దేశించుకుంటుంది. 1970లలో దేశంలో రెండే అణువిద్యుత్ ప్లాంట్లు ఉన్న సమయంలో 1990 నాటికల్లా 10,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తామని ప్రకటించింది. 1980లలో 2000 నాటికల్లా సామర్థ్యాన్ని 20 వేల మెగావాట్లకు పెంచుతామని చెప్పింది. తరువాత గడువును 2020కి మార్చారు. తాజాగా గతేడాది లక్ష్యాన్ని 2047 నాటికి లక్ష మెగావాట్లు అని ప్రకటించింది. రెండంటే రెండు దశాబ్దాల్లో ఎకా యెకిన 92,000 మెగావాట్ల సామర్థ్యాన్ని జోడించడం అత్యాశే అవుతుంది.

అణువిద్యుత్తు ఉత్పత్తికి మూలధన వ్యయం చాలా ఎక్కువ. ఇంధన సరఫరా సమస్యలున్నాయి. పర్యావరణ, భద్రతలకు సంబంధించిన ఖర్చులూ ఎక్కువే. హరియాణాలోని ఫతేబాద్ జిల్లాలోని గోరఖ్‌పూర్ అణువిద్యుత్ కేంద్రం విషయమే చూద్దాం. 700 మెగావాట్ల సామర్థ్యమున్న నాలుగు రియాక్టర్లు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. 2013లో ఈ కేంద్రానికి సంబంధించి పర్యావరణ అంచనాలు నిర్ధారించారు. తొలి దశకు 2014 ఫిబ్రవరిలో అనుమతులు వచ్చాయి. ఆ తరువాతి ఏడాది అణుశక్తి నియంత్రణ బోర్డు నుంచి అనుమతులు లభించాయి. అదే ఏడాది జూన్‌లో నిర్మాణం ప్రారంభమైంది. 2021 నాటికి తొలి యూనిట్ పని ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ 2020 నాటికి కానీ దీంట్లో భద్రతకు సంబంధించిన కాంక్రీట్ పోయడం మొదలుకాలేదు. 2022లో వేసిన లెక్కల ప్రకారం దీని నిర్మాణం 2028కి పూర్తి కావాలి. కానీ ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే 2032 నాటికి రెండు యూనిట్లు పనిచేయడం ప్రారంభం కావచ్చు. ప్రాజెక్టు ఖర్చు రూ.40 వేల కోట్లు. ఇంధన భద్రతకు అణుశక్తి మేలని అనుకునేవాళ్లు ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి.

బాధ్యత ఎవరిది?

నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో లక్ష మెగావాట్ల అణుశక్తి ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించే లక్ష్యంలో ప్రైవేట్ రంగాన్ని భాగస్వాములను చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం చట్టాలను సవరిస్తున్నట్లు చెప్పారు. అణువిద్యుత్ కేంద్రాల్లో జరిగే ప్రమాదాల బాధ్యత విషయంలో ప్రైవేట్ కంపెనీలు తటపటాయిస్తున్నాయి. 2010లో ఆమోదం పొందిన చట్టం ప్రకారం, ప్రమాదాలకు బాధ్యత ఆ కేంద్రం నిర్వాహకులది అవుతుంది. నష్ట పరిహారం మొత్తం రూ. 1500 కోట్లకు పరిమితం చేశారు. ఒకవేళ ప్రమాదం ప్లాంట్ లోపం కారణంగా జరిగితే (భోపాల్ గ్యాస్ దుర్ఘటనలో మాదిరి) సరఫరాదారు మీద నిర్వాహకులు కోర్టుకు వెళ్లవచ్చు. ఈ అంశాల కారణంగానే అణుశక్తి రంగానికి సంబంధించి విదేశీ కంపెనీలు భారత మార్కెట్‌లో ప్రవేశించేందుకు వెనుకడుగు వేస్తున్నాయి. ఏమైనా బాధ్యత అనేది సీరియస్ వ్యవహారం. ప్రభుత్వం నష్ట పరిహారం విషయంలో పునరాలోచన చేయాలి. కేవలం ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకున్నంత మాత్రాన అణు విద్యుదుత్పత్తి జరిగిపోదు.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

- అణువిద్యుత్తు ఉత్పత్తికి మూలధన వ్యయం చాలా ఎక్కువ. ఇంధన సరఫరా సమస్యలున్నాయి. పర్యావరణ, భద్రతలకు సంబంధించిన ఖర్చులూ ఎక్కువే.
- స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల (ఎస్ఎంఆర్) అభివృద్ధి ప్రక్రియను అణుశక్తి విభాగం ఇప్పటికే ప్రారంభించి ఉంటే, వాటికి ఈ ఏడాది బడ్జెట్‌లోనే నిధుల కేటాయింపు జరిగి ఉండాలి. కానీ అలా జరగలేదు.
- 2047 నాటికి లక్ష మెగావాట్ల అణు విద్యుత్ సామర్థ్య లక్ష్యంలో ప్రైవేట్ రంగాన్ని భాగస్వాములను చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. కానీ ప్రమాదాల బాధ్యత విషయంలో ప్రైవేట్ కంపెనీలు తటపటాయిస్తున్నాయి.

సోషల్ మీడియా

ఇప్పటికైనా...



648 రోజుల సిగ్గులేని మొండితనం తర్వాత విశ్వాస పరీక్షకు ముందు ఎన్.బిరేన్ సింగ్ ముఖ్యమంత్రిగా రాజీనామా చేశారు. మణిపూర్ అస్తిత్వం, జనాల దురవస్థలను పట్టించుకోవడానికి ఇది కేంద్ర ప్రభుత్వానికి తొలి అడుగు కాగలదని ఆశ.

– మహువా మొయిత్రా, తృణమూల్ ఎంపీ

ఇదే జరిగేది!



ఢిల్లీ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ ఓట్లు కలిపి చూసే ప్రక్రియ అర్థరహితం. వాళ్లు కలిసి పోటీచేసివుంటే, రెబెల్స్ సంకీర్ణం ఓట్లు తినేసేవాళ్లు. కాంగ్రెస్–ఆప్ వ్యతిరేక ఓటర్లు ఓటు వేయకుండా ఉండేవారు లేదా బీజేపీకి ఓటేసేవారు. తుది ఫలితం దాదాపు ఒకలానే ఉండేది.

– అనింద్యో చక్రవర్తి, విశ్లేషకుడు

రావాల్సిన మెళకువ



మీ మనసును, శ్వాసను గమనించండి. అది ఎప్పుడు తీవ్రమవుతుందో అప్పుడు గమనించే మనిషంటూ ఉండడు. గమనింపు మాత్రమే ఉంటుంది. నేను ఎప్పుడైతే గమనిస్తున్నానో నా అహం గమనిస్తున్నట్టు. స్థిర గమనింపు వల్ల అది కూడా కరిగిపోతుంది. మెళకువ ఒక్కటే మిగులుతుంది. అదే లక్ష్యం.

– శ్రీ ఎం, ఆధ్యాత్మిక గురువు

మొత్తంగా మారాలి!



చాలా సెల్ఫ్– హెల్ప్ పుస్తకాలు నాకు ఎందుకు నచ్చవంటే, అవి పేదరికాన్ని వ్యక్తిగత వైఫల్యంగా చిత్రిస్తాయి. నిజం కాదు. అది సామాజిక వైఫల్యం. దానికి పరిష్కారం వ్యక్తిగత పోరాటంలో కన్నా వ్యవస్థాగత మార్పులో ఉంది.

– సుదీప్ సుధాకరన్, కంటెంట్ క్రియేటర్

ఆపుతాం!



చాలామంది యూకేకు వచ్చి అక్రమంగా పనిచేయగలుగుతున్నారు. దాన్ని మేము అంతం చేయాలనుకుంటున్నాం.

– కీర్ స్టార్మర్, యూకే ప్రధాని

ఇన్ బాక్స్

భద్రత... బాధ్యత... గౌరవం!

ఫిబ్రవరి 11న ప్రపంచవ్యాప్తంగా 180 దేశాలు 'సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవా'న్ని పాటిస్తున్నాయి. ఈ దినోత్సవం ఈ యేటి నినాదం 'మెరుగైన ఇంటర్నెట్ కోసం కలిసి రండి'. ఈ దిశలో 'డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ నియమాలు– 2025' ముసాయిదాను ప్రజా సంప్రదింపుల కోసం భారత ప్రభుత్వం జనవరిలో విడుదల చేసింది. ఫిబ్రవరి 18 వరకు సూచనలు స్వీకరిస్తారు. వ్యక్తిగత సమాచార గోప్యత పౌరుల ప్రాథమిక హక్కుగా ఈ నియమాలు గుర్తిస్తాయి.

అభ్యంతరకర సమాచారం, చిత్రాలు, వీడియోలను ఇంటర్నెట్, ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్‌ల నుండి తొలిగించమని కోరే హక్కును డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ చట్టం – 2023 సెక్షన్ 12 (3) కల్పిస్తుంది. ఇతర దేశాల్లో, ముఖ్యంగా యూరోపియన్ యూనియన్‌లో గోప్యతా చట్టాల కింద గుర్తించబడిన కీలకమైన హక్కు ఇది. ఉల్లంఘనలపై రూ. 50 కోట్ల జరిమానా విధించే అధికారం 'డేటా పరిరక్షణ బోర్డుకు' ఉంటుంది.

అంతేగాక, బాలల సమాచారాన్ని ఉపయోగించాలంటే తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. బాలల వ్యక్తిగత గోపనీయతకు, భద్రతకు నష్టం కలిగించేట్లు సమాచారాన్ని దుర్వినియోగం చేస్తే రూ. 200 కోట్ల జరిమానా విధించే అధికారం కూడా బోర్డుకు ఉంది. అనేక రూపాలలో బాలలు, మహిళలపై జరిగే హింసలో ఇటీవల అదనంగా చేరింది– సాంకేతిక (డిజిటల్) జెండర్ హింస. అభ్యంతరకర నగ్న చిత్రాలతో వేధింపులు (ఇమేజ్ బేస్డ్ అబ్యూజ్), బాలికలపై నేరాలు కొన్నిసార్లు వారి ఆత్మహత్యకు దారితీస్తున్నాయి.

ఆస్ట్రేలియా, బ్రిటన్, దక్షిణ కొరియా వంటి దేశాలు ఆన్‌లైన్‌లో అభ్యంతరకర ఫోటో, వీడియోల తొలగింపు సులభతరం చేయడానికి ఎన్నో చర్యలు తీసుకున్నాయి. ఇందు కోసం ఆస్ట్రేలియా ప్రపంచంలోనే మొదటిగా 'ఇ–సేఫ్టీ కమిషనర్' అనే వ్యవస్థను చట్టబద్ధంగా నియమించింది. బ్రిటన్ 'రివెంజ్ పోర్న్ హెల్ప్ లైన్' రెండు లక్షల పైచిలుకు అభ్యంతర ఫోటోలను తొలగించింది. కొరియా 'డిజిటల్ సెక్స్ క్రైమ్ విక్టిమ్ సపోర్ట్ సెంటర్' ఫోటోల తొలగింపు గురించి ఫిర్యాదు రాకముందే గుర్తించి ముందస్తు తొలగింపు దిశగా పరిశోధన చేస్తోంది.

భారత ప్రభుత్వం కూడా 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' ఏర్పాటు చేసింది. 'డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ నియమాల' రూపకల్పన సాంకేతికతతో సమాన వేగంతో జరగకపోతే సమాజం నష్టపోతుంది. సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం స్ఫూర్తితో బాలలు, మహిళల గౌరవానికి, భద్రతకు పెద్దపీట వేయడం ద్వారా మాత్రమే భారతదేశం మరింత న్యాయమైన, వికసిత భవిష్యత్తు వైపు పురోగమిస్తుంది.

– శ్రీనివాస్ మాధవ్, సమాచార హక్కు పరిశోధకులు
(నేడు సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం)

కేజ్రీవాల్ క్రేజ్ తగ్గిందా?

సందర్భం



జి. మురళీ కృష్ణ

దేశ రాజధాని ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ కట్టుకున్న కంచుకోట బీటలు బారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 8 సీట్లే గెలిచిన బీజేపీ ఈసారి ఏకంగా 48 సీట్లు సాధించి అధికారంలోకి వస్తే, 62 స్థానాలతో అధికారంలో ఉన్న ఆప్ 22 సీట్లకు పడిపోయి పరాజయం పొందింది. అంతకు మించి ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా కూడా ఎన్నికల్లో ఓడిపోయారు. 'కర్ణుని చావుకు సవా లక్ష కారణాలు' ఉండొచ్చేమోగానీ, కేజ్రీవాల్ ఓటమికి వేళ్ల మీద లెక్కబెట్టదగ్గ కారణాలే ఉన్నాయి.

కేజ్రీవాల్ రెవెన్యూ సర్వీసులో ఉండగానే 1999లో 'పరివర్తన్' అనే సామాజిక సంస్థను ఏర్పాటు చేసి, ఢిల్లీ ప్రజలకు పన్నులతో పాటు ఇతర సామాజిక విషయాల మీద అవగాహన కల్పించేవారు. సమచార హక్కు చట్టాన్ని ఉపయోగించుకుని ఢిల్లీలోని ప్రభుత్వ సంస్థల్లో అవినీతిని వెలికి తీశారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 2006లో 'రామన్ మెగసెసే అవార్డు' లభించడంతో ఆయనకు దేశవ్యాప్తంగా మంచి పేరు వచ్చింది. 2011లో ఢిల్లీలోని 'జంతర్ మంతర్' వద్ద అవినీతికి వ్యతిరేకంగా 'జన్ లోక్ పాల్' బిల్లును తీసుకురావాలని అన్నా హజారేతో కలిసి దీక్ష చేసి దేశం దృష్టిని ఆకర్షించారు. 'జీవితంలో నేను ఎన్నికల్లో పోటీ చేయను. ఏ పదవీ చేపట్టను. యాక్టివిస్టుగానే ఉంటా' అని ప్రకటించుకున్న కేజ్రీవాల్, అనూహ్యంగా 2013లో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. మొత్తానికి ఢిల్లీ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అయితే గడిచిన ఐదేళ్లలో ఆప్ ప్రజల అంచనాలను అందుకోలేకపోయింది. దాని పర్యవసానమే 2025 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు.

సామాన్యుల సీఎంనని, ప్రభుత్వ బంగ్లా తీసుకోనని చెప్పి... ఖరీదైన శీష్ మహల్ నిర్మించుకోవడాన్ని ప్రజలు అంగీకరించలేకపోయారు. ఈ అంశాన్ని బీజేపీ వ్యూహాత్మకంగా 'కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ కాదు, కాఫీ ఆద్మీ' అని ప్రచారం చేసింది. అవినీతికి వ్యతి రేకంగా వ్యవస్థను నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కానీ, దీనికి విరుద్ధంగా ఆయనతో పాటు ఆయన మంత్రులు అవినీతి కేసుల్లో ఇరుక్కోవడంతో విశ్వసనీయత కోల్పోయారు. అవినీతి ఆరోపణలు వస్తే నాయకులు రాజీనామా చేయాలని చెప్పిన కేజ్రీవాల్, తాను జైల్లో ఉన్నా రాజీనామా చేయలేదు. సిసోడి యాని అరెస్టు చేయగానే, రాజీనామా చేయించిన కేజ్రీవాల్, తను జైల్లో ఉండి కూడా చాలాకాలం కుర్చీని వదల్లేదు. దీంతో అవినీతి వ్యతిరేక ఆందోళన



నుంచి పుట్టుకొచ్చిన ఆప్ అవినీతి పార్టీగా మారిందని బీజేపీ ప్రచారం చేసి జనాన్ని తనవైపు తిప్పుకుంది. జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యాక రాజీనామా చేసి, కీలుబొమ్మ లాంటి ఆతిశీని సీఎం చేయడం ఒక నాటకంలా ప్రజలు భావించారు. కేజ్రీ జైల్లో ఉన్నప్పుడు ఆయన భార్య సునీతా కేజ్రీవాల్ సీఎం కుర్చీలో కూర్చొని మీడియాతో మాట్లాడేవారు. అదే కుర్చీని 'కేజ్రీవాల్ పట్ల తనకున్న గౌరవం' పేరుతో ఖాళీగా వదిలేసి ఆతిశి మరో కుర్చీలో కూర్చోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఆప్ నేతలు ఒకవైపు కేసుల్లో ఇరుక్కోవడం, మరోవైపు లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఇబ్బందులు పెట్టడం వల్ల ఆప్ అంతకుముందు ఐదేళ్లలో చేసినట్టుగా ఈసారి పరిపాలించలేకపోయింది. 2020 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి.

ఎన్నికల ముందు ఫిబ్రవరి 1వ తేదీన కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రూ. 12 లక్షల వరకు ఆదాయంపై పన్ను ఉండదని చేసిన కీలక ప్రకటన... మధ్యతరగతిని బీజేపీ వైపు తిప్పింది. ఇది ఉద్యోగులు అధికంగా ఉండే న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్ ఓటమికి కూడా కారణమైంది. 2015, 2020 ఎన్నికల్లో 50 శాతానికి పైగా ఓట్లు సాధించడంతో ఢిల్లీలో తనకు ఎదురేలేదని భావించిన కేజ్రీవాల్ అతి విశ్వాసంతో దేశంలో కాంగ్రెస్ స్థానాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేశారు. పంజాబ్ విజయంతో ఈ అతివిశ్వాసం మరింత మితిమీరింది. గోవా, గుజరాత్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఓట్లు చీల్చి, కాంగ్రెస్ ఓటమికి కారణమయ్యారు. జీవితంలో కాంగ్రెస్ పార్టీతో కలవనని చెప్పిన కేజ్రీవాల్ లోక్‌సభ ఎన్నికల సమయంలో మాటమార్చి 'ఇండియా' కూటమితో కలిశారు. ఆరు నెలలు తిరగకుండానే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో తెగదెంపులు చేసుకోవడంతో రెండు పార్టీలు ఎవరికి వారే పోటీ చేశారు. ఢిల్లీలో ఈసారి దాదాపు 6 శాతం ఓట్లు సాధించిన కాంగ్రెస్, చాలా చోట్ల ఓట్లను చీల్చి ఆప్ విజయవకాశాలను ప్రభావితం చేసింది. ముఖ్యంగా ముస్లిం, ఎస్సీ ఓట్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఎక్కువ ఓట్లు పడటంతో బీజేపీకి కలిసొచ్చింది.

దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఓటమితో పాటు కేజ్రీవాల్ స్వయంగా ఓడిపోవడంతో 'ఆయనకు క్రేజ్ తగ్గిందా' అనే చర్చలు ప్రారంభమయ్యాయి. కేజ్రీవాల్‌కు మళ్లీ క్రేజ్ పెరగడంతోపాటు ఆప్‌కు ఆదరణ పెరగాలంటే ఆయన గతంలోవలే ఢిల్లీలోని కాలనీలు, గల్లీలు, మొహల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలకు చేరువయితే, మరో ఐదేళ్లలో ఆయనకు పూర్వ వైభవం వచ్చే అవకాశాలున్నాయి.

వ్యాసకర్త సీనియర్ రీసెర్చర్,
పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ

గడ్డిపోచ కూడా...

కబీర్ దాస్ ఆధ్యాత్మిక కవి. సాధువు. మధ్యయుగ భక్తి ఉద్యమ కారుల్లో ఆయన ఒకరు. ముస్లిం కుటుంబంలో పుట్టిన ఆయన... రామానంద బోధనలకు ప్రభావితమై ఆయన్ని గురువుగా స్వీకరించారు. కబీర్ అన్ని మతాల అర్థరహిత, అనైతిక పద్ధతులను ప్రధానంగా ప్రశ్నించారు. ఆయన మరణించినప్పుడు హిందువులు– ముస్లింలు ఇరువురూ ఆయనను తమవారంటే తమవారని చెప్పుకున్నారు.

జ్యోతిర్మయం

కబీర్ సత్యాన్ని తెలుసుకోవడానికి, 'అహాన్ని' వదిలివేయమని సూచించారు. ఆయన రాసిన దోహాలు నాటి సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశాయి. అటువంటి కబీర్ జీవితంలో జరిగిన సంఘటనగా చెప్పే ఉదంతం ఇది: ఒకానొకరోజు కబీర్ తన కొడుకుని ఆవులకు మేత కోసం గడ్డి కోసుకురమ్మన్నారు. సరేనని వెళ్లిన కుమారుడు చాలాసేపటి వరకు తిరిగి రాలేదు. దీంతో కబీర్ కొడుకును వెతుక్కుంటూ వెళ్లారు. పచ్చిక బయళ్ల మధ్యలో నిల్చుని ఉన్న కొడుకు కనిపించాడు. చల్లటి గాలి వీస్తోంది. గడ్డి అటూ ఇటూ ఊగుతోంది.

కబీర్ తన కొడుకు కూడా అది చూసి మైమరచిపోయి హుషారుగా ఊగుతూ ఉండడాన్ని చూశారు. దగ్గరకు వెళ్లి ఎందుకు ఊగుతున్నావని అడిగారు. అప్పుడతను 'నాన్నా! నేనిక్కడికి వచ్చేసరికి ఈ గడ్డంతా ఏకాంతంలో గాలికనుగుణంగా కదలాడుతోంది. ఆ దృశ్యం చూడటానికి ఎంతో బాగుంది. నాకు కూడా గడ్డితోపాటు అలా కదలాలనిపిస్తోంది. ఆహా! ఏమానందం? ఏమానందం?' అన్నాడు.

అతని మాటలకు దిగ్భ్రాంతి చెందిన కబీర్, 'నేను నిన్ను గడ్డి కోసుకురమ్మన్నాను కదా? మరచిపోయేవా?' అన్నారు. అందుకు 'ఏమిటీ? పచ్చికను కోయాలా? నేనెప్పటికీ అలా చేయలేను. నాకీ పచ్చిక ఎనలేని ఆనందాన్నిచ్చింది. నేను పచ్చికతో సన్నిహిత సంబంధాన్ని పెంచుకున్నాను. ప్రస్తుతానికి నేను వేరే ప్రపంచంలో ఉన్నాను' అన్నాడతను. 'ఈ భగవంతుని సృష్టిలో ప్రతిదీ విలువైనదే... ఆనందమిచ్చేదే' కదా అంటూ కబీర్ కుమారునితో కలిసి వెనుదిరిగారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.7.02 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** పుష్యమి సా.6.55 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.51 నుండి 9.39 వరకు, తదుపరి రా.11.02 నుండి 11.50 వరకు, **అమృత ఘడియలు:** ప.12.28 నుండి 2.03 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.34, **సూర్యాస్తమయం:** 5.55.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

సింగరేణిలో ఇద్దరు డైరెక్టర్ల నియామకం

- డైరెక్టర్ (ఆపరేషన్స్)గా సూర్యనారాయణ, పీపీగా వెంకటేశ్వరరావు


సూర్యనారాయణ


వెంకటేశ్వరరావు

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పది రోజులుగా ఖాళీగా ఉన్న రెండు డైరెక్టర్ పోస్టులకు సోమవారం నియామక ప్రక్రియ పూర్తయింది. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సూర్యనారాయణను డైరెక్టర్ (ఆపరేషన్స్)గా, ఆండ్రియాల ప్రాజెక్ట్ జీఎం కె.వెంకటేశ్వరరావును ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ (పీపీ) డైరెక్టర్‌గా నియమించారు. సింగరేణి వ్యాప్తంగా పలు ఏరియాల్లో పని చేస్తున్న 10 మంది జీఎంలను ఇంటర్వ్యూకు పిలవగా, వీరిద్దరినీ ఎంపిక చేశారు. సూర్యనారాయణ 1989లో ఇల్లెందు ఏరియాలో జేఎంఈటీగా బాధ్యతలు చేపట్టి.. 2022, జనవరి 7న ఆర్జీ–3 జీఎంగా పదోన్నతి పొందారు. ఆయన 2028, మే 31 వరకు ఉద్యోగ సర్వీసులో ఉంటారు. వెంకటేశ్వరరావు 1987లో మణుగూరు ఏరియాలో జేఎంఈటీగా బాధ్యతలు చేపట్టి.. 2022, ఆగస్టు 22న పదోన్నతి పొంది ఎస్‌ఓ టు డైరెక్టర్‌గా.. 2023, ఫిబ్రవరి 1న ఆండ్రియాల జీఎంగా బాధ్యతలు స్వీకరించారు. కాగా, సూర్యనారాయణ, వెంకటేశ్వరరావును ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ సింగరేణి భవన్‌లో సోమవారం సత్కరించారు.

వ్యవసాయాధారిత పరిశ్రమగా తేనెటీగల పెంపకం

- మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య


సాక్షి, హైదరాబాద్: రైతులు నైపుణ్యంతో వ్యవహరిస్తే తేనెటీగల పెంపకాన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా మార్చుకొనే అవకాశం ఉందని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని ఉద్యాన కళాశాల వేదికగా జిల్లాస్థాయి తేనెటీగల పెంపకంపై ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సైదయ్య మాట్లాడుతూ దేశంలో లభించే తేనెకు అధిక పోషక విలువలతోపాటు ఔషధ గుణాలు ఉండటం వల్ల ఎగుమతికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. తేనెటీగల పెంపకం వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా ఎదిగితే రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షహనాజ్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో తేనెటీగల జాతులు, శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం, తేనెపట్టు నిర్వహణ, తేనె తీసే విధానం, తేనెటీగల పెంపకం ద్వారా లభ్యమయ్యే ఉత్పత్తుల మార్కెటింగ్ మెళకువల గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూరగాయల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ వీర సురేశ్, విస్తరణ అధికారి పోతరాజు యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

'దండకారణ్యం మారణకాండకు చర్చలే పరిష్కారం'

సాక్షి, హైదరాబాద్: దండకారణ్యంలో కొన్ని నెలలుగా సాగుతున్న మారణకాండ ఆగాలంటే చర్చలే పరిష్కారం అని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అభిప్రాయపడ్డారు. ఆయుధాలతో సంచరిస్తున్నారనే నెపంతో ఒక వ్యక్తి ప్రాణాలు తీసేహక్కు పోలీస్ బలగాలకు లేదన్నారు. డ్రోన్లు, శాటిలైట్ గన్, రోబోడేగలను దేశపౌరులపై ప్రయోగించి వారిని మట్టుబెట్టడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు నెలల్లోనే వందల మంది ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం పట్ల క్రాంతి కిరణ్ ఆవేదన వ్యక్తంచేశారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి నక్సలైట్లను నిర్మూలించడానికి బదులు అదే టెక్నాలజీ ఉపయోగించి దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రణాళికలు రూపొందించాలని హితవు పలికారు. టెక్నాలజీ ఉపయోగించి దేశ సంపద దోచుకుంటున్న వారిని, ప్రజలను దోచుకుంటున్న వారిని నిర్మూలించాలన్నారు. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు ముందుకొచ్చి కాల్పుల విరమణకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

రెండు రోజుల పోలీసు కస్టడీకి మస్తాన్‌సాయి

- నార్సింగి పోలీసులకు అనుమతిచ్చిన రాజేంద్రనగర్ కోర్టు



మణికొండ: ట్రాప్ చేసిన యువతులను డ్రగ్స్ మత్తులో ముంచి వారి నగ్న వీడియో లు తీసి బెదిరింపులకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలతో జైలుపాలైన మస్తాన్‌సాయిని సమగ్రంగా ప్రశ్నించేందుకు రాజేంద్రనగర్ కోర్టు పోలీసులకు అనుమతి ఇచ్చింది. నిందితుడిని ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని నార్సింగి పోలీసులు పిటిషన్ వేయగా దీనిపై కోర్టు సోమవారం విచారణ చేపట్టింది. వాదనల అనంతరం మస్తాన్‌సాయిని రెండు రోజుల కస్టడీకి అనుమతించింది. ఈ నెల 13న సాయంత్రం నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు నిందితుడి విచారణ చేపట్టాలని ఆదేశించింది.

మరోసారి తప్పించుకున్న అగ్రనేతలు

మావోయిస్టు కేంద్ర కమిటీలో 20 మందికి పైగా తెలుగువారే ఉన్నారంటున్న పోలీసులు

- వారే టార్గెట్‌గా వరుసగా యాంటీ నక్సల్స్ ఆపరేషన్లు
- ప్రతీసారి చిక్కినట్టే చిక్కి తప్పించుకుంటున్న 'అన్నలు'

బీజాపూర్ నుంచి సాక్షి ప్రతినిధి
తాండ్ర కృష్ణగోవింద్



పెద్దపెద్ద ఎన్‌కౌంటర్లు జరుగుతున్నా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు అగ్రనేతలెవరూ భద్రతాదళాలకు చిక్కలేదు. బస్తర్ అడవుల్లో మావోయిజానికి బీజం వేసింది తెలుగువారే. ఇప్పుడు ఆ మావోయిజాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని భద్రతాదళాలు ప్రయత్నిస్తుంటే..మరోసారి అదే తెలుగు నేతలు అడ్డుగా నిలుస్తున్నారు. 'ఇంద్రావతి'ఎన్‌కౌంటర్ అనంతరం బీజాపూర్ జిల్లాలో పరిస్థితులను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత 'సాక్షి'అందిస్తున్న ప్రత్యేక కథనం.

పదహారేళ్లుగా

మావోయిస్టుల అంతమే లక్ష్యంగా ఛత్తీస్‌గఢ్‌లో దూసుకుపోతున్న సంయుక్త భద్రతాదళాలకు తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు కొరకరాని కొయ్యలా మారారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీతోపాటు వివిధ కీలక స్థానాల్లో 20మందికి పైగా తెలుగు నేతలు ఉన్నారు. 40ఏళ్లుగా బస్తర్ అడవుల్లో మావోయిస్టులు పాగా వేసి ప్రభుత్వానికి సమాంతరంగా జనతన సర్కార్‌ను స్థాపించారు. అయితే మావోయిస్టుల విస్తరణకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను కేంద్రం ప్రారంభించింది. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా ముమ్మరంగా యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్ సాగిస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ అడవులు మాత్రమే మావోయిస్టులకు కంచుకోటగా ఉండగా, ఇక్కడ కూడా మావోయిస్టుల ఉనికి లేకుండా చేసే లక్ష్యంతో గతేడాది జనవరిలో ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించింది. సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీ, డీఆర్‌జీ, సీ 60, ఎస్‌ఓజీ, బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పేరుతో వేలాదిగా భద్రతా దళాలు బస్తర్ అడవులను జల్లెడ పడుతున్నాయి. ఆపరేషన్ కగార్‌లో భాగంగా గతేడాది 217 మంది మావోయిస్టులు చనిపోగా, ఈ ఏడాది తొలి 41రోజుల్లో 81 మంది నక్సల్స్ మరణించారు. భారీ సంఖ్యలో మావోయిస్టులు చనిపోతున్నా.. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్టీ అగ్రనేతలు మాత్రం చిక్కలేదు.

తెలుగు నేతలే టార్గెట్..

మావోయిస్టు ఆర్మీగా పేర్కొనే పీపుల్స్ లిబరేషన్ గెరి ల్లా ఆర్మీ బెటాలియన్ వన్‌కు మోస్ట్ వాంటెడ్ మావో యిస్టు హిడ్మా నేతృత్వం వహిస్తున్నాడు. దక్షిణ బస్తర్ గా పేర్కొనే బీజాపూర్, సుక్మా, దంతేవాడ జిల్లాల్లో ఈ బెటాలియన్ పని చేస్తోంది. ఇదే ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర కమిటీతోపాటు మావోయిస్టు ఆర్మీ వింగ్‌గా పేర్కొనే సెంట్రల్ రీజనల్ కమిటీ కూడా ఉంది. దీంతో దక్షిణ బస్తర్ ప్రాంతం నుంచి తెలుగు నేతల పని పట్టే లక్ష్యంతో జనవరి 16న కర్రిగుట్టలను ముట్టడించగా, అక్కడి నుంచి తెలంగాణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌ను సురక్షితంగా పీఎల్‌జీఏ బెటాలియన్ వన్ కాపాడింది. అంతకు ముందు అక్టోబర్ 4న తుల్‌తులి దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్‌లో 38 మంది మావోలు చనిపోయారు. ఇందులో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు రామకృష్ణ ఆలియాస్ కమలేశ్ (స్వస్థలం విజయవాడ) మరణించినట్టు ప్రచారం జరిగింది. అయితే ఈ ఘటనలో తెలుగు నేతలెవరూ మృతి చెందలేదని నిర్ధారణ అయ్యింది.

'ఇంద్రావతి'లోనూ చిక్కలేదు..

ఇంద్రావతి నేషనల్ పార్కులో తెలంగాణ రాష్ట్ర కమిటీతో పాటు సీఆర్‌సీ(సెంట్రల్ రీజనల్ కమిటీ)కి ప్రాతినిధ్యం వహిస్తున్న బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్ అలియాస్ గంగన్నతోపాటు ఇతర తెలుగు నేతలను ప్రత్యేకంగా టార్గెట్ చేసుకొని జనవరి 9న భద్రతా దళాలు ఆపరేషన్ మొదలెట్టాయి. అయితే ఈసారి కూడా తెలుగు నేతలు ఈ ఎన్‌కౌంటర్ నుంచి చాకచక్యంగా తప్పించుకున్నారు. మృతదేహాల ఫొటోలను పోలీసులు విడుదల చేయగా అందులో బండి ప్రకాశ్‌ను పోలిన వ్యక్తులెవరూ లేరనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలను కాపాడుకోవడంలో మావోయిస్టు పార్టీకి చెందిన దిగువ శ్రేణి కేడర్ తమ ప్రాణాలను అడ్డుపెడుతోంది. ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్‌కౌంటర్లలో ఏరియా కమిటీ, ప్లాటూన్ కమిటీ సభ్యులు, జన మిలీషియాకు చెందిన వారే ఎక్కువగా చనిపోయారు. దాదాపు 300 మంది ఆపరేషన్ కగార్‌లో మరణిస్తే అందులో పెద్ద కేడర్ అంటే డివిజనల్ కమిటీ మెంబర్లే ఉంటున్నారు.

- గతేడాది జరిగిన ఎన్‌కౌంటర్‌లో వరంగల్‌కు చెందిన రమణ అలియాస్ మాచర్ల ఏసోబు ఒక్కరే డీవీసీఎం కేడర్ స్థాయి వ్యక్తి మృతిచెందాడు.
- గత జనవరి 24న ఘరియాబంద్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడి హోదాలో ఉన్న చలపతి మరణించారు.

ఎన్‌కౌంటర్ మృతుల్లో ఐదుగురి పేర్లు వెల్లడి

- వీరందరిపై రూ. 22 లక్షల రివార్డు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతి చెందగా, పోలీసులు వారిలో పలువురిని గుర్తించినట్లు తెలుస్తోంది. కాగా, సోమవారం ఇందులో ఐదుగురి పేర్లను అధికారులు ప్రకటించారు. ఈ ఐదుగురిపై కలిపి రూ.22 లక్షల రివార్డు ఉన్నట్టు ఆ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. గుర్తించిన మావోయిస్టుల్లో వెస్ట్ బస్తర్ డివిజన్‌కు చెందిన డివిజనల్ కమిటీ మెంబర్ హుంగా హేమ్లా, సావనార్‌కు చెందిన పీపీసీఎం ప్లాటూన్ 11కు చెందిన కమాండర్ మంగు హేమ్లా, నేషనల్ పార్క్ ఏరియా కమిటీ మెంబర్ సుభాష్ ఓయం, గంగులూరు ఏరియా కమిటీ మెంబర్ సన్నూ, నేషనల్ ఏరియా పార్టీ మెంబర్ రమేశ్ ఉన్నారు. వీరిలో రమేశ్‌పై రూ.2 లక్షలు, మిగతా నలుగురిపై రూ.5 లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపారు. మిగతా వారి విషయంలో స్పష్టత కోసం మాజీ మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, పార్టీ సానుభూతిపరులను పోలీసులు పిలిపిస్తున్నారు. ఎదురుకాల్పుల అనంతరం పోలీసులు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

వరుస విజయాలు: బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్

ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు బలగాలు వరుస విజయాలు సాధిస్తున్నాయని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజు తెలిపారు. ఈ ఏడాది 40 రోజుల్లో 65 మంది మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో మృతి చెందినట్లు ఆయన వివరించారు.


జవాన్ శవపేటికను మోస్తున్న డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్, బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజు

మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోతే ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తామని చెప్పారు.

అమర జవాన్లకు నివాళులర్పించిన డీజీపీ

ఎదురుకాల్పుల్లో మృతి చెందిన ఇద్దరు జవాన్లకు ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్ నివాళులర్పించారు. సోమవారం బీజాపూర్‌లోని ఎస్పీ కార్యాలయంలో బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్, బీజాపూర్ ఎస్పీ జితేందర్‌కుమార్ యాదవ్‌తో కలసి ఆయన జవాన్ల మృతదేహాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ, అమరుల త్యాగం వృథా కాదని, మృతి చెందిన జవాన్ల కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయ, సహకారాలను అందిస్తుందని చెప్పారు. తర్వాత ఆయన పోలీసు ఉన్నతాధికారులతో కలసి జవాన్ల శవపేటికలను అంబులెన్సుల్లోకి ఎక్కించి స్వగ్రామాలకు పంపించారు.

ఎక్కడైనా చావు పో!

- ఇంట్లోంచి వెళ్లిపొమ్మన్న కొడుకు, కోడలు
- మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్ (పెద్దపల్లి): ఇంటిపెద్దను కడదాకా కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కుటుంబ సభ్యులు అతడిని దూషించడంతో మనస్తాపం చెందాడు. 'ఎక్కడైనా చావుపో' అని కొడుకు, కోడలు తిట్టడంతో ఆ పెద్దాయన ఇంటి నుంచి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. సుల్తానాబాద్ మండలం మియాపూర్‌కు చెందిన గండి వీరేశం (62)కు భార్య సుగుణతో పాటు ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. వీరేశం దంపతులు పెద్ద కొడుకు సదయ్య వద్ద ఉంటున్నారు. ఇటీవల సదయ్య 'మీకు ఇంకా ఇద్దరు కొడుకులున్నారు కదా.. అక్కడికి వెళ్లండి.. మేమే ఉన్నామా'అని తల్లిదండ్రులను తిట్టారు. 'ఇంటి నుంచి వెళ్లి ఎక్కడైనా చావండి'అని కొడుకు, కోడలు 8 రోజుల క్రితం దూషించగా, మరుసటి రోజు వీరేశం భార్య బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి ఈ నెల 6న వీరేశంను కొడుకు, కోడలు తిట్టడంతో మనస్తాపం చెంది ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కొడుకు, కోడలు పనులకు వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా కనిపించకపోవడంతో రెండురోజులు వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో సుల్తానాబాద్ పోలీసుస్టేషన్‌లో వీరేశం రెండో కొడుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమవారం మియాపూర్ గ్రామ శివారులోని తాటివనంలో వీరేశం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త చావుకు పెద్ద కొడుకు, కోడలే కారణమని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


మహా కుంభమేళాలో మంత్రి కోమటిరెడ్డి పుణ్యస్నానం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మహా కుంభమేళాలో పాల్గొన్నారు. సోమవారం ఉదయం ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఘాట్‌లో పవిత్ర స్నానమాచరించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటూ ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి బడే హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి మొక్కులు సమర్పించారు.

స్కిల్ యూనివర్సిటీ ప్రతిపాదన లేదు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు తమ వద్ద ఎలాంటి ప్రతిపాదనా లేదని కేంద్రం స్పష్టం చేసింది. అయితే అర్హత ఉన్న సంస్థలకు సహకారం అందిస్తామని వెల్లడించింది. సోమవారం నైపుణ్యాభివృద్ధికి నిధుల కేటాయింపుపై లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి స్కిల్ ఇండియా పథకంలో భాగంగా తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమకూర్చేందుకు ఏదైనా ప్రతిపాదన ఉందా? అని అగిన ప్రశ్నకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి సమాధానమిచ్చారు.

బ్యాంకుల రుణ బకాయిలు రూ.47,409 కోట్లు

తెలంగాణలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సహా షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు ఇచ్చిన రుణాల బకాయిలు గతేడాది మార్చి 31 నాటికి రూ.47,409 కోట్లు ఉన్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సోమవారం లోక్‌సభలో కేంద్రమంత్రి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఐదుగురి అరెస్టు

- పరారీలో ఉన్న 20 మంది కోసం గాలింపు
- 2022లో రామరాజ్యం సంస్థను స్థాపించిన వీర రాఘవరెడ్డి
- సైన్యంలో చేరినవారికి రూ.20 వేల వేతనం

మొయినాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. ఇప్పటికే ప్రధాన నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు సోమవారం మరో ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. రామరాజ్యం సైన్యం ఏర్పాటు, చేపడుతున్న కార్యాకలాపాలను పూర్తి స్థాయిలో గుర్తించారు. కేసుకు సంబంధించిన విషయాలను రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ సోమవారం మీడియాకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పురుకు చెందిన కొవ్వూరి వీర రాఘవరెడ్డి 2022లో ఫేస్‌బుక్ వేదికగా రామరాజ్యం సంస్థను ప్రారంభించాడు. హిందూ ధర్మాన్ని రక్షించుకోవడానికి రామరాజ్యం సైన్యంలో చేరేలా ప్రజలను ప్రేరేపించాడు. రిజిస్టర్ చేసుకున్నవారికి రూ.20 వేలు వేతనం ఇస్తామని ప్రకటించాడు. ఈ ప్రకటనకు 25 మంది స్పందించి రామరాజ్యం సైన్యంలో చేరారు.

మూడు వాహనాల్లో చిలుకూరుకు వచ్చి..

ఈ నెల 7న మూడు వాహనాల్లో, 25 మంది సభ్యులతో కలిసి వీర రాఘవరెడ్డి చిలుకూరు దేవాలయం వద్దకు వచ్చాడు. అర్చకుడు రంగరాజన్ ఇంట్లోకి వెళ్లి రామరాజ్యం సైన్యానికి వ్యక్తులను పంపాలని, ఆర్థికంగా ఆదుకోవాలని


రామరాజ్యం సైన్యం(ఫైల్)

డిమాండ్ చేశారు. దానికి రంగరాజన్ అంగీకరించకపోవడంతో అతనిపై దాడి చేశారు. దీనిపై రంగరాజన్ ఈ నెల 8న మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతనికి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసులో సోమవారం ఖమ్మం జిల్లాకు చెందిన రామరాజ్యం సైన్యంలోని సభ్యులు శిరీష, రాణి, గోపాల్, శ్రీను, నిజామాబాద్ జిల్లాకు చెందిన సాయినాథ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

రంగరాజన్‌కు మంత్రి కొండా సురేఖ పరామర్శ

రంగరాజన్‌ను సోమవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పరామర్శించారు. దాడిచేసిన వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. కాగా, కొడంగల్‌లో రైతు దీక్షకు వెళ్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. చిలుకూరు బాలాజీ దేవాలయానికి చేరుకుని రంగరాజన్‌ను పరామర్శించారు.

చిలుకూరు ఘటనపై ప్రభుత్వం సీరియస్

- అర్చకుడు రంగరాజన్‌కు సీఎం రేవంత్ ఫోన్
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా సోమవారం రంగరాజన్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. అదే విధంగా ఇలాంటి దాడులను సహించేది లేదని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు.


సీఎం రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతున్న రంగరాజన్

కఠినంగా వ్యవహరిస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

రామరాజ్యం పేరుతో దాడులు చేసే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. అర్చకులు రంగరాజన్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది హేయమైన చర్య అని, రామరాజ్యం పేరుతో రౌడీయిజం చేస్తూ అరాచకాలకు పాల్పడుతున్న వారిని ఉపేక్షించేది లేదని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాముడి పేరును బద్నాంచేస్తూ అరాచక కార్యక్రమాలకు పాల్పడటం దుర్మార్గమని అభిప్రాయపడ్డారు.

రూ. 60 కోట్లు బుగ్గిపాలు!

- పాత్తబస్తీ దివాన్‌దేవిడిలోని మదీనా అండ్ అబ్బాస్ టవర్స్‌లో భారీ అగ్ని ప్రమాదం
- అగ్నికి ఆహుతైన దాదాపు 40 హోల్‌సేల్ వస్త్ర దుకాణాలు
- రూ. 50 నుంచి 60 కోట్ల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా
- ఫైరింజన్ నీటితో కింది అంతస్తులోని దుకాణాల్లోనూ సరుకు నష్టం

సాక్షి, హైదరాబాద్/దూద్‌బౌలి: హోల్‌సేల్ వస్త్ర దుకాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న పాతబస్తీలోని దివాన్ దేవిడిలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మదీనా అండ్ అబ్బాస్ టవర్స్ మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్‌తో తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో మంటలు అంటుకున్నాయి. అనంతరం మంటలు నాలుగో అంతస్తుకు కూడా వ్యాపించాయి. 2 అంతస్తుల్లో కలిపి మొత్తం 48 దుకాణాలు ఉండగా, దాదాపు 40 దుకాణాలు అగ్నికీలలకు ఆహుతయ్యాయి. సమాచారం అందుకుని ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు భవనం పెంట్‌హౌస్‌లో ఉంటున్న వాచ్‌మ్యాన్ కుటుంబీకులు ఐదుగురితో పాటు పక్కభవనంపై ఉన్న 15 మందిని రక్షించారు. 16 అగ్నిమాపక శకటాలు దాదాపు పది గంటలపాటు శ్రమించి మంటల్ని అదుపు చేశాయి.


అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న దుకాణాలు

దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ టవర్‌లో 400 వరకు రెడీమేడ్, టెక్స్‌టైల్ వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఇవన్నీ హోల్‌సేల్ దుకాణాలే కావడం, రంజాన్ నెల సమీపిస్తుండటంతో ప్రతి వ్యాపారి భారీగా స్టాక్ నిల్వ చేసుకున్నారు.

పూర్తిగా దెబ్బతిన్న నాలుగో అంతస్తు..

సోమవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మూడో అంతస్తులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కొద్ది సేపటికే మంటలు నాలుగో ఫ్లోర్‌కు కూడా వ్యాపించాయి. ఈ సమాచారం తెలిసి అగ్నిమాపక, పోలీసు సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. తొలుత మంటలు విస్తరించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అనంతరం జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్న ఆదేశాలతో వివిధ ప్రాంతాల నుంచి 16 ఫైరింజన్లను రప్పించారు. కాంప్లెక్స్ దగ్గర వరకు ఫైరింజన్ వెళ్లే అవకాశం లేకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది చాలా ప్రయాసపడాల్సి వచ్చింది. ఎట్టకేలకు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. మంటల ప్రభావానికి మూడు, నాలుగో అంతస్తులోని దుకాణాల్లో సరుకు పూర్తిగా కాలిపోగా...నాలుగో అంతస్తు స్లాబ్ పూర్తిగా దెబ్బతిన్నది. వేడి కారణంగా రెండో అంతస్తులోని దుకాణాలలోని వస్త్రాలకూ నష్టం వాటిల్లింది. ఫైరింజన్ల నీళ్ల పడి మొదటి అంతస్తులోనూ సరుకు కూడా దెబ్బతింది. ఈ ఘటనలో వ్యాపారులకు రూ.కోట్లలో నష్టం జరిగినట్లు తెలుస్తోంది. రూ.50 నుంచి రూ.60 కోట్ల ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జీవీ నారాయణరావు, డీసీపీ స్నేహ మెహ్రా ఘటనాస్థలిని సందర్శించారు.

ఎలాంటి ఫైర్ సేఫ్టీ లేదు..



తెల్లవారుజామున 2:15 నిమిషాలకు అగ్నిప్రమాదంపై సమాచారం వచ్చింది. వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని ఆపరేషన్ చేపట్టాం. మా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇది పాత భవనం కావడంతో ఎలాంటి భద్రతా ప్రమాణాలు లేవు. గతంలోనే భవనాల యజమానులను అప్రమత్తం చేశాం. షార్ట్ సర్క్యూట్ వల్లనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నాం.

– ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణరావు

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన(పత్రికా ప్రకటన)
ఇ–ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై (a) 33KV & 11KV ఇండోర్ స్విచ్‌గేర్ యూనిట్ (b) 3Cx70+16+50 Sq.mm LT AB XLPE కేబుల్ యొక్క సేకరణ కొరకు టెండర్లను విడుదల చేసేందుకు TGSPDCL వారు ఉద్దేశిస్తున్నారు. పైన తెలిపిన ప్రతి ఐటమ్ యొక్క తదుపరి వివరాల కోసం www.tgsouthernpower.org, www.tender.telangana.gov.in లను దర్శించండి. ఫోన్ : 040–23431360, 1033, 1035, 1026.
సం/–చీఫ్ ఇంజినీర్ (P&MM)
DIPR RO No.10137-PP/CL/Advt/1/2024-25, Dt: 10.02.2025

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ
ఆపరేషన్ బంజారాహిల్స్ సర్కిల్
టెండరు ప్రకటన 14/2024-25 (పత్రికా ప్రకటన)
TGSPDCL వారు 1) CBD (గ్రీన్‌ల్యాండ్స్)లో వివిధ రకాల కేబుల్ జాయింటింగ్ కిట్స్ తయారీ. 2) బోరబండలోని 3 నం.ల DTRs SPR హిల్స్ BJR నగర్ యొక్క షిఫ్టింగ్. 3) CBD Bhills లోని ITC హోటల్ దగ్గర A-Bond 3 Way RMU & 5 Way RMU యొక్క షిఫ్టింగ్. 4) స్టేషనరీ ఐటమ్స్ (జనరల్) సరఫరా కొరకు అనుభవం కలిగిన వివిధ కాంట్రాక్టర్ల నుండి సీల్డు బిడ్లు కోరుచున్నారు మరియు టెండర్లు విడుదల చేసేందుకు ఉద్దేశిస్తున్నారు. తదుపరి వివరాల కోసం www.tgsouthernpower.org దర్శించండి.
సం/– సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్, బంజారాహిల్స్ సర్కిల్
DIPR RO No.10122-PP/CL/Advt/1/2024-25, Dt: 10.02.2025

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం, PR డివిజన్, ఇబ్రహీంపట్నం
టెండరు ప్రకటన నం. TO9/2024-25 టెండరు ప్రకటన తేది : 10.02.2025
మొత్తం (14) పనులు : మొత్తం అంచనా వ్యయం రూ. 129.00 లక్షలతో దిగువ సంతకందారులో SDF, DMFT గ్రాంటుల క్రింద సి రోడ్లు మరియు భవనాల నిర్మాణాల పనులు. టెండరులో పాల్గొనుట కొరకు దరఖాస్తు 17.02.2025 వరకు మరియు టెండరు షెడ్యూళ్ళను 18.02.2025న EE PR ఇబ్రహీంపట్నం వారి నుండి పొందవచ్చు మరియు జారీ తేదీ నుండి 19.02.2025న పాల్గొనవచ్చు. ఇతర వివరాలను EE PR ఇబ్రహీంపట్నం ఆర్.ఆర్.జిల్లా వారి కార్యాలయం నుండి పొందవచ్చు. ఇమెయిల్ ఐడి : eeprlbp@gmail.com
సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, PR డివిజన్, ఇబ్రహీంపట్నం, ఆర్.ఆర్.జిల్లా
DIPR RO No.10127-PP/CL/Advt/1/2024-25, Dt.10.02.2025

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (R&B) కార్యాలయం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా
ఇ–ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT సంక్షిప్త టెండరు ప్రకటన నం. EE/R&B/MDCL/09/2024-25/ తేది: 08.02.2025
దిగువ సంతకందారు ద్వారా మొత్తం ECV రూ.101.61 లక్షల కొరకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ZPHS స్కూల్స్‌కు టాయిలెట్స్ నిర్మాణం మరియు అదనపు సౌకర్యాలు, CC రోడ్ల వెడల్పు, కమ్యూనిటీ హాల్‌లో కాంపౌండ్ వాల్ నిర్మాణం మరియు అదనపు ఫ్లోర్ నిర్మాణం, కీసరగుట్ట వద్ద వసతుల ఏర్పాటు మొదలైనటువంటి పన్నెండు (12) పనుల కొరకు ఇ–ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద అత్యవసర ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ తేది 08.02.2025న సా.5.00 గం.ల నుండి ముగింపు తేది 15.02.2025న సా.5.00 గం.ల వరకు. తదుపరి వివరాలను ఇ–ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in వద్ద చూడవలెను.
సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (R&B), మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా
DIPR RO No.10113-PP/CL/Advt/1/2024-25, Dt. 10.02.2025

తెలంగాణ ప్రభుత్వం
కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం, హైదరాబాద్ సిటీ
టెండరు ప్రకటన
Ref. No. HCP/TL/TL-4/0088/2024-25 తేది : 07.02.2025
హైదరాబాద్ సిటీ పోలీస్ వారికి యాప్లికేషన్ - 800 MHz DMR కన్వెన్షనల్ రిపీటర్స్ మరియు దాని అనుబంధ ఎక్విప్‌మెంట్‌తో కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్ సరఫరా చేయుటకు గాను సంస్థ / ఏజెన్సీని ఎంపిక చేయుటకు బిడ్లు కోరబడుచున్నవి. హైదరాబాద్ సిటీ పోలీస్ వారికి యాప్లికేషన్ - 800 MHz DMR కన్వెన్షనల్ రిపీటర్స్ మరియు దాని అనుబంధ ఎక్విప్‌మెంట్‌తో కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్ సరఫరా చేయుటకు గాను ప్రముఖ, అనుభవం గల సంస్థలు / ఏజెన్సీల నుండి కమిషనర్ ఆఫ్ పోలీస్, హైదరాబాద్ సిటీ, తెలంగాణ ప్రభుత్వం వారు సీల్డు బిడ్లు కోరుచున్నారు. టెండరు డాక్యుమెంట్ మరియు అదనపు సమాచారం పొందుటకు www.hyderabadpolice.gov.in దర్శించండి. టెండరు డాక్యుమెంట్‌ను 12.02.2025 నుండి 21.02.2025న 15.00 గం.వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. బిడ్లు (ఆన్‌లైన్) దాఖలుకు చివరి తేది 21.02.2025న లేదా అలోగా సా. 5.00 గం.వరకు. హార్డ్ కాపీలను 21.02.2025న లేదా అలోగా సా. 5.00 గం.లోగా దాఖలు చేయాలి.
సం/– కమిషనర్ ఆఫ్ పోలీస్, హైదరాబాద్ సిటీ తరఫున
DIPR RO No. 10138-PP/CL/ADVT/1/2024-25, Dt. : 10.02.2025

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి
చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) కార్యాలయం, O&M సర్కిల్ నం.IV, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్–38, తెలంగాణ.
ఇ-టెండరు ప్రకటన

పనిపేరు, ఇ–టెండరు ప్రకటన నం మరియు తేదీ	O&M డివిజన్	పనుల సంఖ్య	విలువ
O&M డివిజన్–XII పరిధిలోని వివిధ ప్రదేశాల వద్ద ఒక సంవత్సర కాలానికి ప్రస్తుతమున్న మురుగునీటి పారుదల వ్యవస్థ వార్షిక నిర్వహణ అనగా పాడైన సీవర్ మ్యాన్‌హోల్స్ పునర్నిర్మాణం, పాడైన పైపుల పునఃస్థాపన మరియు రోడ్ లెవల్ వరకు సీవర్ మ్యాన్‌హోల్ యొక్క రైజింగ్ మరియు బెంచింగ్. EP No. 193 to 202/CGM(E)/O&MC-IV/2024-25, Dt. : 10.02.2025	O&M డివిజన్ -XII	10	రూ. 13.17 నుండి 26.00 లక్షలు

(1) టెండరు డాక్యుమెంట్ ఆన్‌లైన్‌లో తేది 10.02.2025న సా.5.00 గం. నుండి లభిస్తుంది మరియు టెండర్ల స్వీకరణకు చివరి తేది 17.02.2025న ఉ.11.00 గం. వరకు. (2) సంబంధిత చీఫ్ జనరల్ మేనేజర్ (Engg) పేరు మరియు చిరునామా–చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్–IV, HMWSSB, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్–38. (3) కాంట్రాక్టర్లు/ సంస్థలు సమాచారమును ముఖ్యంగా "ZIP" ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయవలసిందిగా కోరబడుచున్నారు. (4) తదుపరి వివరాలను https://www.tender.telangana.gov.inలో చూడవచ్చును.
సం/– చీఫ్ జనరల్ మేనేజర్ (Engg), O&M సర్కిల్ నం.IV, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్–500 038, తెలంగాణ.

బ్యాటర్‌కు ఉన్నంత ఏకాగ్రత ఉండాలి

పరీక్షా పే చర్చా కార్యక్రమంలో విద్యార్థులతో మోదీ మాటామంతీ

తోటలో కలియతిరుగుతూ చర్చా కార్యక్రమం

న్యూఢిల్లీ: విద్యార్థుల్లో పరీక్షలపై ఉండే భయాలను పోగొడుతూ, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తూ ఆద్యంతం స్ఫూర్తివంతంగా సాగే ప్రధాని మోదీ 'పరీక్షా పే చర్చా'కార్యక్రమం సోమవారం ఢిల్లీలో జరిగింది. 8వ ఎడిషన్‌లో భాగంగా ఈసారి కూడా ప్రధాని మోదీతో నేరుగా సంభాషించేందుకు కోట్లాది మంది ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోగా కేవలం 35 మందికి మాత్రమే నేరుగా మాట్లాడే అవకాశం దక్కింది. ఢిల్లీలోని సుందర్ నర్సరీ వనంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన విద్యార్థులనుద్దేశించి మోదీ ప్రసంగించారు. ''పరీక్షల ఒత్తిడిని విద్యార్థులు క్రికెట్ స్టేడియంలో బ్యాటర్‌లాగా ఎదుర్కోవాలి. తర్వాతి బంతికి ఫోర్ కొట్టు, సిక్స్ కొట్టు అంటూ వేలాది మంది ప్రేక్షకులు అరుస్తున్నా, ఈలలు వేస్తున్నా బ్యాటర్‌కు ఇవేం వినిపించవు. ఒక్క బంతి మీద మాత్రమే దృష్టిపెడతాడు. అంతటి ఏకాగ్రతను మీరూ సాధించండి. పరీక్షలు అనే ఒత్తిళ్లకు లొంగకుండా చదువు మీద మాత్రమే మీరు పూర్తిగా ధ్యాస పెట్టాలి. గత పరీక్షల ఫలితాల కంటే మెరుగైన మార్కులు తెచ్చుకుంటానని మీకు మీరే సవాల్ విసురుకోండి. పోషకాహారం తీసుకోండి. ధ్యానంపై దృష్టిపెట్టండి. జ్ఞానం, పరీక్షలు అనేవి భిన్నమైన అంశాలు. పరీక్షలే లోకంగా ఎప్పుడూ బతకొద్దు. సమయాన్ని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవడం నేర్చుకోవాలి. సమయాన్ని ఎంత ఎక్కువగా సద్వినియోగం చేస్తారో జీవితంలో అంతపైకి ఎదుగుతారు. ప్రతి క్షణాన్ని ఆస్వాదించండి. ఆశావహ దృక్పథాన్ని అలవర్చుకోండి. సానుకూలతతో దేనినైనా సాధించవచ్చు''అని మోదీ అన్నారు. ''ఇటీవలికాలంలో సమాజంలో ఒక ఆలోచన బలంగా నాటుకుపోయింది. విద్యార్థులు పది, 12వ తరగతుల్లో సరిగా చదవక మార్కులు తక్కువొస్తే ఆ విద్యార్థి జీవితం నాశనమైనట్లేనని తల్లిదండ్రులు ఒక నిశ్చయానికి వచ్చేస్తున్నారు. విద్యార్థులేమీ రోబోట్లు కాదు. విద్య అనేది కేవలం తదుపరి తరగతికి అర్హత సాధించేందుకు ఉద్దేశించిందికాదు. విద్యార్థి సమగ్రాభివృద్ధికి విద్య ఒక సోపానం. తక్కువ గ్రేడ్‌లు వచ్చినప్పుడు సమాజం నుంచి విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి ఒత్తిళ్లను పక్కనబెట్టి విద్యార్థులు మిమ్మల్ని మీరు సవాల్‌గా తీసుకుని చదవండి. మంచిగా నిద్రపోండి. అత్యధిక స్కోర్ రాలేదంటే తమ పని అయిపోయిందనే ఆలోచనతో లోయలోకి విద్యార్థులు పడిపోవద్దు''అని అన్నారు. ఆన్‌లైన్‌లో కోట్లాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

ఉక్కు, అల్యూమినియంపై 25% సుంకాలు

అన్ని దేశాలపైనా పరస్పర సుంకాలు: ట్రంప్

కెనడా, బ్రెజిల్, మెక్సికోలపై తీవ్ర ప్రభావం

వాషింగ్టన్: ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ''మంగళ, బుధవారాల్లో పరస్పర సుంకాలను ప్రకటిస్తాం. అవి తక్షణం అమల్లోకి వస్తాయి. వాటిని అన్ని దేశాలకూ వర్తింపజేస్తాం. ప్రతి దేశం విధించే టారిఫ్ రేట్లనూ సరిపోల్చుతాం. మాపై ఎంత టారిఫ్ విధిస్తే వారిపైనా అంతే విధిస్తాం''అని స్పష్టం చేశారు. అయితే పరస్పర టారిఫ్‌లను ఏయే దేశాలపై విధించబోయేదీ వెల్లడించలేదు. ఆదివారం ఆయన ఎయిర్‌ఫోర్స్ వన్‌లో మీడియాతో మాట్లాడారు. అమెరికా స్టీల్ దిగ్గజం ఎక్స్‌ఎస్‌లో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్‌ను అనుమతిస్తామని, అయితే మెజారిటీ వాటాకు మాత్రం ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రపంచ వాణిజ్య సంస్థ గణాంకాల ప్రకారం అమెరికా విధిస్తున్న సగటు వాణిజ్య సుంకం 2.2 శాతం. భారత్‌కు 12 శాతం, బ్రెజిల్‌కు 6.7, వియత్నాంకు 5.1, యూరోపియన్ యూనియన్ దేశాలకు 2.7 శాతంగా ఉంది.

కెనడా, మెక్సికోలకు మరిన్ని కష్టాలు?

అమెరికాకు కెనడా, బ్రెజిల్, మెక్సికోల నుంచి అత్యధిక ఉక్కు దిగుమతులు జరుగుతున్నాయి. తర్వాతి స్థానంలో దక్షిణ కొరియా, వియత్నాం ఉన్నాయి. కెనడా అతి పెద్ద అల్యూమినియం సరఫరాదారు. మెక్సికో అల్యూమినియం స్క్రాప్, అల్యూమినియం మిశ్రమం ప్రధాన సరఫరాదారు. ప్రభుత్వ, అమెరికన్ ఐరన్ అండ్ స్టీల్ ఇన్‌స్టిట్యూట్ డేటా ప్రకారం 2024లో తొలి 11 నెలల్లో మొత్తం అల్యూమినియం దిగుమతుల్లో కెనడా వాటాయే 79 శాతం. కెనడా నుంచి వచ్చే స్టీల్, అల్యూమినియం అమెరికా రక్షణ, నౌకా నిర్మాణ, ఆటో, ఇతర కీలక పరిశ్రమలకు ప్రాణావసరం. ట్రంప్ తన తొలి హయాంలో ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకం విధించారు. కానీ తర్వాత కెనడా, మెక్సికో, బ్రెజిల్‌తో సహా పలు వాణిజ్య భాగస్వామ్య దేశాలపై సుంకం ఎత్తివేశారు. తర్వాతి అధ్యక్షుడు జో బైడెన్ ఆ సదుపాయాన్ని బ్రిటన్, జపాన్, యూరోపియన్ యూనియన్‌కు విస్తరించారు. ట్రంప్ ప్రారంభ సుంకాల తరువాత 2019లో అమెరికాలో స్టీల్ మిల్లుల సామర్థ్య వినియోగం 80 శాతం కంటే ఎక్కువ స్థాయికి పెరిగింది. ఉక్కు ధరలను తగ్గించడంతో ఈ రంగంపై అంతర్జాతీయంగా చైనా చలాయించిన ఆధిపత్యానికీ గండిపడింది.


ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మాట్లాడుతున్న ట్రంప్

జనానికి తాగునీరే లేదు.. సైకిల్ ట్రాక్‌లు కావాలా!

పిటిషన్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: ప్రజలందరికీ గృహ వసతి, తాగునీటి వసతి కల్పించడానికి సరిపడా నిధుల్లేక రాష్ట్రాలు ఓ వైపు ఇబ్బందులు పడుతుంటే సైకిల్ ట్రాక్‌లంటూ కొందరు పగటి కలలు కంటున్నారంటూ సుప్రీంకోర్టు మండిపడింది. దేశ వ్యాప్తంగా ప్రత్యేకంగా సైకిల్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలంటూ దాఖలైన పిల్‌ను కొట్టివేసింది. సోమవారం జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ అభయ్ ఎస్.ఓకాల ధర్మాసనం పిల్‌పై విచారణ చేపట్టింది. 'మురికి వాడలకు వెళ్లండి అక్కడ జనం ఏ పరిస్థితిలో ఉంటున్నారో చూడండి. వారికి సరైన గృహ వసతి కల్పించేందుకు రాష్ట్రాల వద్ద నిధుల్లేవు. ప్రజలకు కనీసం వసతులు కల్పించాలి. మనమేమో ఇక్కడ సైకిల్ ట్రాక్‌లు ఉండాల్సిందేనంటూ పగటి కలలు కంటున్నాం'అని వ్యాఖ్యానించింది. 'మనవి తప్పుడు ప్రాధాన్యతలు. మన ప్రాధాన్యతలను సరి చేసుకోవాల్సి ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 అమలు విషయం మనం ఆలోచించాలి. ప్రజలకు తాగేందుకు మంచి నీరు లేదు. ప్రభుత్వ బడులు మూతబడుతున్నాయి. మీరేమో సైకిల్ ట్రాక్‌లు కావాలంటున్నారు'అని పేర్కొంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు సైకిల్ ట్రాక్‌లున్నాయని, దేశవ్యాప్తంగా వీటిని ఏర్పాటు చేయాలంటూ సైక్లింగ్ ప్రోత్సాహకుడు దేవీందర్ సింగ్ నేగి తన పిటిషన్‌లో కోరారు.

ఆశల ఊసుల నడుమ... ఏఐ శిఖరాగ్రం

- పారిస్‌లో జరుగుతున్న తొలి సదస్సు
- దేశాధినేతలు, టెక్ దిగ్గజాల హాజరు
- నేడు సదస్సునుద్దేశించి మోదీ ప్రసంగం
- అమెరికా నుంచి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్
- అంతర్జాతీయ వేదికపై వాన్స్ అరంగేట్రం

పారిస్: 100కు పైగా దేశాల అధినేతలు, అగ్రనేతలు. అంతర్జాతీయ టెక్ దిగ్గజాల సారథులు. అత్యున్నత స్థాయి ప్రభుత్వాధికారులు. కృత్రిమ మేధ రంగానికి సంబంధించిన మేధావులు. నిపుణులు. సోమవారం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో మొదలైన రెండు రోజుల ఏఐ శిఖరాగ్ర సదస్సు వీరందరినీ ఒక్కచోట చేర్చింది. ఇది అంతర్జాతీయ స్థాయిలో ఏఐ రంగానికి సంబంధించి జరుగుతున్న తొలి అధికారిక సదస్సు కావడం విశేషం. నానాటికీ అనూహ్యంగా మారిపోతున్న ఏఐ రంగంలో అపార అవకాశాలను ఒడిసిపట్టుకోవడం, అందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితరాలపై సదస్సులో లోతుగా మథనం జరుగుతోంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆదివారం సదస్సును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ టెలివిజన్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. మానవాళి చరిత్రలోనే అత్యంత అరుదైందిగా చెప్పదగ్గ శాస్త్ర, సాంకేతిక విప్లవం ఏఐ రూపంలో మన కళ్లముందు కనిపిస్తోందని ఆయన చెప్పుకొచ్చారు. 'ఈ అవకాశాన్ని ఫ్రాన్స్, యూరప్ రెండు చేతులా అందిపుచ్చుకోవాల్సి ఉంది. ఎందుకంటే మనం మరింత మెరుగ్గా జీవించేందుకు, ఎంతగానో నేర్చుకునేందుకు, మరింత సమర్థంగా పని చేసేందుకు, మొత్తంగా గొప్పగా జీవించేందుకు అపారమైన అవకాశాలను ఏఐ అందుబాటులోకి తెస్తోంది''అని మాక్రాన్ అభిప్రాయపడ్డారు.


పారిస్‌లోని ఏఐ సదస్సు ప్రాంగణం

ప్రత్యేక ఆకర్షణగా వాన్స్

అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఏఐ శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటున్నారు. ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించిన 40 ఏళ్ల వాన్స్ అగ్ర రాజ్యానికి తొలిసారిగా ఓ అంతర్జాతీయ వేదికపై ప్రాతినిధ్యం వహిస్తుండటం విశేషం. ఉపాధ్యక్షునిగా ఆయనకిదే తొలి విదేశీ పర్యటన కూడా. సదస్సులో భాగంగా పలువురు దేశాధినేతలతో ఆయన తొలిసారి భేటీ అవనున్నారు. అందులో భాగంగా మంగళవారం మాక్రాన్‌తో విందు భేటీలో పాల్గొంటారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా కల్లోలంపై అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దృక్కోణాన్ని మాక్రాన్‌కు వివరించడంతో పాటు ఆయన సందేశాన్ని కూడా వాన్స్ అందజేస్తారని చెబుతున్నారు. తెలుగు మూలాలున్న వాన్స్ సతీమణి ఉష కూడా తన ముగ్గురు పిల్లలతో సహా ఈ అధికారిక పర్యటనలో పాల్గొంటుండటం విశేషం. చైనా తరఫున ఉప ప్రధాని జాంగ్ జువోకింగ్ ఏఐ సదస్సులో పాల్గొంటున్నారు.

మోదీ సహ ఆతిథ్యం

అంతర్జాతీయ ఏఐ రంగం అంతిమంగా అమెరికా, చైనా మధ్య బలప్రదర్శనకు వేదికగా మారకుండా చూడాలని భారత్ కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ఐటీతో పాటు అన్నిరకాల టెక్నాలజీల్లోనూ గ్లోబల్ పవర్‌గా వెలుగొందుతున్న భారత్ ఏఐలోనూ కచ్చితంగా అంతర్జాతీయంగా తనదైన ముద్ర వేసి తీరాలని ప్రధాని మోదీ ఇటీవల పదేపదే చెబుతున్నారు. అందులో భాగంగా టెక్ దిగ్గజాలతో మరింత సన్నిహితంగా కలిసి పని చేసేందుకు పారిస్ ఏఐ శిఖరాగ్రం సదవకాశమని ఆయన భావిస్తున్నారు. అందులో భాగంగా ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు మాక్రాన్‌తో పాటు మోదీ సంయుక్తంగా ఆతిథ్యమిస్తుండటం విశేషం. మంగళవారం సదస్సునుద్దేశించి ప్రధాని ప్రసంగించనున్నారు. ఏఐ వృద్ధిని కొత్త పుంతలు తొక్కించడంపై భారత ఆలోచనలను దేశాధినేతలు, టెక్, ఏఐ దిగ్గజ కంపెనీల సారథులు తదితరులతో ఆయన వివరంగా పంచుకోనున్నారు. అనంతరం ఆయా కంపెనీల సీఈఓలతో విడిగా ముఖాముఖి భేటీ కానున్నారు.

తెరపైకి 'కరెంట్ ఏఐ'

గూగుల్, మైక్రోసాఫ్ట్, ఓపెన్‌ఏఐ వంటి టెక్, ఏఐ దిగ్గజాల సీఈఓలు, అత్యున్నతాధికారులు సదస్సులో పాల్గొంటున్నారు. ఆరోగ్యం, విద్య, పర్యావరణం, సంస్కృతి తదితర రంగాల్లో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించడంలో ఏఐ టెక్నాలజీ పాత్రను మరింత ప్రభావవంతంగా మార్చడం తదితరాలపై వారంతా లోతుగా చర్చించనున్నారు. ఇందులో భాగంగా 'కరెంట్ ఏఐ'పేరిట ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యంలో అంతర్జాతీయ స్థాయిలో భారీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. పారిస్ శిఖరాగ్రం ఏఐకి సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో విస్తృత చర్చ కోసం జరుగుతున్న తొట్ట తొలి ప్రయత్నమని మొజిల్లా పబ్లిక్ పాలసీ విభాగం వైస్ ప్రెసిడెంట్ లిండా గ్రిఫిన్ అన్నారు. ఏఐ అభివృద్ధి ప్రస్థానంలో దీన్ని నిర్ణాయక క్షణంగా అభివర్ణించారు. ''ఏఐపై గుత్తాధిపత్యం రూపంలో కీలక సాంకేతిక పరిజ్ఞానంపై అజమాయిషీ కేవలం కొద్దిమంది చేతుల్లోనే ఉండిపోకూడదు. మానవాళి ప్రయోజనాలను తీర్చడమే ఏకైక ప్రాతిపదికగా ఏఐ ఫలాలు ప్రపంచమంతటికీ అందాలి''అని యురేషియా గ్రూప్ సీనియర్ జియోటెక్నాలజీ అనలిస్టు నిక్ రెయినర్స్ అభిప్రాయపడ్డారు. పారిస్ శిఖరాగ్రాన్ని ఆ దిశగా భారీ ముందడుగుగా అభివర్ణించారు. శిఖరాగ్రం వేదికగా ఏఐ రంగంలో యూరప్‌లో భారీ పెట్టుబడి ప్రకటనలు వెలువడతాయని అక్కడి దేశాలు ఆశిస్తున్నాయి. వచ్చే కొన్నేళ్లలో ఏఐ రంగంలో ఫ్రాన్స్ ఏకంగా 113 బిలియన్ డాలర్ల మేరకు ప్రైవేట్ పెట్టుబడులను ప్రకటించనున్నట్టు మాక్రాన్ స్పష్టం చేశారు.


సంగమ ప్రాంతానికి పడవలో వెళ్తున్న రాష్ట్రపతి ముర్ము, పక్కన యూపీ గవర్నర్ ఆనందీ బెన్

సంగమంలో ముర్ము పవిత్ర స్నానం

మహాకుంభ్ నగర్: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు. గంగా నదికి పూజలు చేసి, సూర్యునికి ఆర్ఘ్యం సమర్పించారు. అనంతరం అక్షయవత్, బడే హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. అంతకు ముందు ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు గవర్నర్ ఆనందీబెన్ పటేల్, సీఎం ఆదిత్యనాథ్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి ముర్ము, సీఎం ఆదిత్యనాథ్ పడవలో త్రివేణీ సంగమానికి వెళ్లారు. డిజిటల్ మహాకుంభ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. అనంతరం రాష్ట్రపతి ముర్ము 'మహా కుంభ్‌కు తరలివస్తున్న జన సమూహం భారత దేశ గొప్ప వారసత్వానికి, నమ్మకానికి, విశ్వాసానికి సజీవ చిహ్నం అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభ్ వేళ గంగ, యమున, అంతర్వాహిని సరస్వతీనదుల పవిత్ర సంగమ్‌లో స్నానమాచరించే భాగ్యం తనకు దక్కిందని తెలిపారు. గంగా మాత ఆశీస్సులు అందరికీ దక్కాలని, అందరి జీవితాల్లోనూ సుఖ శాంతులు నింపాలని ప్రార్థించానన్నారు.

ఎంపీ ఇంజనీర్ రషీద్‌కు రెండు రోజుల పెరోల్

పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ హైకోర్టు అనుమతి

న్యూఢిల్లీ: జైలులో ఉన్న జమ్మూకశ్మీర్ ఎంపీ అబ్దుల్ రషీద్ షేక్ అలియాస్ ఇంజనీర్ రషీద్ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు వీలుగా ఢిల్లీ హైకోర్టు రెండు రోజుల కస్టడీ పెరోల్ మంజూరు చేసింది. బారాముల్లా ఎంపీ రషీద్ ఈ నెల 11, 13వ తేదీల్లో పార్లమెంట్ సెషన్‌లో పాల్గొనవచ్చని జస్టిస్ వికాస్ మహాజన్ చెప్పారు. కస్టడీ పెరోల్ ప్రకారం ఎంపీ రషీద్ పార్లమెంట్‌కు వచ్చేటప్పుడు, తిరిగి వెళ్లేటప్పుడు సాయుధ పోలీసుల ఎస్కార్ట్ ఉంటుంది. పెరోల్ సమయంలో ఆయన సెల్‌ఫోన్ వాడకూడదు, మీడియాతో మాట్లాడరాదు. ఉగ్ర గ్రూపులకు, వేర్పాటువాదులకు నిధులందించారనే ఆరోపణలపై ఆయన విచారణ ఎదుర్కొంటున్నారు. తన బెయిల్ పిటిషన్‌ను ఎన్ఐఏ కోర్టు పెండింగ్‌లో పెట్టినందున, మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయిందని ఆయన హైకోర్టుకు తెలిపారు. కస్టడీ పెరోల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఎన్ఐఏ ఆయనకు కస్టడీ పెరోల్‌కు అర్హుడు కాదంటూ వాదించింది. అయితే, బారాముల్లా నియోజకవర్గానికి పార్లమెంట్‌లో ఆయన ప్రాతినిధ్యం వహించాల్సిన అవసరముందని ఎంపీ రషీద్ తరఫు లాయర్లు వాదించారు. గతంలో, 2009లో ఎంపీ పప్పూ యాదవ్‌కు ఇలాంటి వెసులుబాటు కల్పించారని గుర్తు చేశారు.

ఢిల్లీకి మహిళా సీఎం?

కొత్త ఎమ్మెల్యేల నుంచే ఎంపిక!

- బీజేపీ అధిష్టానం మల్లగుల్లాలు
- నలుగురు మహిళల్లో చాన్స్ ఎవరికో?
- మహిళలు, దళితులకు కేబినెట్లో పెద్దపీట



న్యూఢిల్లీ: ఢిల్లీకి మరోసారి మహిళే ముఖ్యమంత్రి కానున్నారా? బీజేపీ అధిష్టానం ఆ దిశగానే ఆలోచిస్తున్నట్టుగా సంకేతాలు వెలువడుతున్నాయి. అత్యున్నత వర్గాలను ఉటంకిస్తూ పార్టీ వర్గాలు కూడా అదే చెబుతున్నాయి. కాబోయే సీఎం కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల్లోంచే ఎంపికవుతారని కూడా తెలుస్తోంది. పార్టీలో పలువురు నేతల అభిప్రాయం కూడా అదే కావడంతో ఈ విషయంలో అధిష్టానం రెండో ఆలోచన చేయకపోవచ్చంటున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌ను బీజేపీ ఓడించడం తెలిసిందే. తద్వారా ఢిల్లీలో 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. బీజేపీ తరఫున నలుగురు మహిళలు ఎమ్మెల్యేలుగా గెలిచారు. సీఎం పదవికి మహిళనే ఎంచుకోవాలని పార్టీ నిర్ణయిస్తే వారిలో ఎవరికి అదృష్టం దక్కుతుందన్నది ఆసక్తికరంగా మారింది. అంతేగాక వెనకబడ్డ వర్గాల నుంచి ఒకరిని ఉప ముఖ్యమంత్రిని కూడా చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. మహిళలకు, దళితులు, ఇతర వెనకబడ్డ వర్గాలకు మంత్రివర్గ కూర్పులో కూడా అధిక ప్రాధాన్యం దక్కడం ఖాయమంటున్నారు. ముఖ్యమంత్రి ఎంపిక ప్రక్రియపై పార్టీ పెద్దలు ఇప్పటికే దృష్టి పెట్టారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇప్పటికే పలుమార్లు సమావేశమై దీనిపై చర్చించారు. న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానంలో ఆప్ సారథి అరవింద్ కేజ్రీవాల్‌పై సంచలన విజయం సాధించిన బీజేపీ నేత పర్వేశ్ వర్మ సీఎం రేసులో ముందున్నారంటూ రెండు రోజులుగా వార్తలు వస్తుండటం తెలిసిందే. ఆయన మాజీ సీఎం కుమారుడు. పర్వేశ్ తండ్రి సాహిబ్‌సింగ్ వర్మ బీజేపీ తరఫున ఢిల్లీ సీఎంగా పని చేశారు. పర్వేశ్‌తో పాటు వీరేంద్ర గుప్తా, సతీశ్ ఉపాధ్యాయ, ఆశిష్ సూద్, పవన్ వర్మ తదితరుల పేర్లు కూడా చక్కర్లు కొడుతున్న తరుణంలో తాజాగా అనూహ్యంగా మహిళా సీఎం ప్రతిపాదన తెరపైకి వచ్చింది. నాలుగు రోజుల విదేశీ పర్యటన ముగించుకుని ప్రధాని నరేంద్ర మోదీ 13న తిరిగి రానున్నారు. సీఎం అభ్యర్థిపై ఆ తర్వాతే నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. బహుశా 15వ తేదీకల్లా దీనిపై స్పష్టత వస్తుందంటున్నారు.

ఆ నలుగురు వీరే...

బీజేపీ నుంచి నలుగురు మహిళలు ఎమ్మెల్యేలుగా గెలిచారు. షాలిమార్‌బాగ్ స్థానం నుంచి రేఖా గుప్తా, నజఫ్‌గఢ్ నుంచి నీలం పెహల్వాన్ 29 వేల పై చిలుకు మెజారిటీతో నెగ్గారు. గ్రేటర్ కైలాష్ నుంచి శిఖా రాయ్ 3,188 ఓట్ల మెజారిటీతో ప్రముఖ ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్‌పై నెగ్గారు. వాజీపూర్ నుంచి పూనం శర్మ కూడా 11 వేల పై చిలుకు మెజారిటీతో విజయం సాధించారు.

ఇప్పటిదాకా ముగ్గురు

ఢిల్లీకి ఇప్పటిదాకా ముగ్గురు మహిళలు సీఎంలయ్యారు. వారిలో తొలి వ్యక్తిగా బీజేపీ నేత సుష్మా స్వరాజ్ నిలిచారు. 1998లో ఆమె సీఎం పగ్గాలు చేపట్టారు. అయితే కేవలం 52 రోజులు మాత్రమే పదవిలో కొనసాగారు. ఆమె తర్వాత కాంగ్రెస్ నేత షీలా దీక్షిత్ రూపంలో రెండో మహిళ ఢిల్లీ గద్దెనెక్కారు. ఆమె 2013 దాకా ఏకంగా 15 ఏళ్ల పాటు సీఎంగా కొనసాగడం విశేషం. అనంతరం ఆప్ నుంచి తాజాగా ఆతిశీ రూపంలో మూడో మహిళ ఢిల్లీ సీఎం అయ్యారు. ఆమె కేవలం నాలుగున్నర నెలల పాటు పదవిలో కొనసాగారు.

గాజాను కొనేస్తాం: ట్రంప్

సొంతం చేసుకుంటాం

- దాన్నో భారీ రియల్టీ ప్రాజెక్టుగా చూడాలి
- గాజావాసులకు తిరిగొచ్చే హక్కుండబోదు
- అమెరికా అధ్యక్షుడి సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్: గాజాకు సంబంధించి తను ప్రతిపాదించిన పునరావాస పథకంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరింత స్పష్టతనిచ్చారు. ''గాజాను కొనేస్తాం. దాన్ని అమెరికా సొంతం చేసుకుంటుంది. పాలస్తీనియన్లకు ఎప్పటికీ గాజాకు తిరిగొచ్చే హక్కు ఉండబోదు''అని తేల్చేశారు. ఆదివారం ఫాక్స్ న్యూస్ ఇంటర్వ్యూలో, అంతకుముందు ఎయిర్‌ఫోర్స్‌వన్‌లో మీడియా ప్రశ్నలకు బదులుగా ఆయన ఈ మేరకు స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ యుద్ధంతో శ్మశానంగా మారిన గాజాను అమెరికా సొంతం చేసుకుంటుందని ట్రంప్ ఇటీవలే సంచలన ప్రకటన చేయడం తెలిసిందే. ఆ ప్రాంతమంతటినీ చదును చేసి గొప్ప పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానని కూడా ఆయన చెప్పుకొచ్చారు. గాజావాసులకు పరిసర దేశాలు ఆశ్రయం కల్పించాల్సి ఉంటుందన్నారు. దీనిపై అంతర్జాతీయంగా సంచలనం రేగింది. అమెరికా మిత్రపక్షాలతో పాటు దాదాపుగా అన్ని దేశాలూ ట్రంప్ ప్రకటనను తీవ్రంగా తప్పుబట్టాయి. దాంతో ట్రంప్ ప్రకటనపై వైట్‌హౌస్ ఉన్నతాధికారులు హడావుడిగా వివరణ ఇచ్చారు. పాలస్తీనియన్లను గాజా నుంచి తాత్కాలికంగా తరలిస్తామన్నది మాత్రమే అధ్యక్షుని ఉద్దేశమని చెప్పుకొచ్చారు. ట్రంప్ తాజా ప్రకటన అందుకు పూర్తి విరుద్ధంగా ఉండటం విశేషం. ''గాజాను నేను సొంతం చేసేసుకుంటా. అక్కడ ఎలాంటి ప్రమాదానికీ తావులేని రీతిలో సురక్షిత కమ్యూనిటీలను నిర్మిస్తాం. మా ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేందుకు జోర్డాన్, ఈజిప్ట్ వంటి దేశాలతో ఒప్పందాలు చేసుకుంటాం. గాజాను మేం భవిష్యత్తు అవసరాలకు సంబంధించి కారుచౌకగా అభివృద్ధి చేయగల ఒక అద్భుతమైన, అందమైన, భారీ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ వెంచర్‌గా మేం చూస్తున్నాం''అంటూ ఫాక్స్ ఇంటర్వ్యూలో ట్రంప్ కుండబద్దలు కొట్టారు.

గాజా ఎవరి ఆస్తీ కాదు: హమాస్

ట్రంప్ తాజా ప్రకటన మతి లేనిదంటూ హమాస్ తీవ్రంగా తప్పుబట్టింది. ''ఈ వ్యాఖ్యలు పాలస్తీనా, పశ్చిమాసియా పరిస్థితులపై పూర్తి అవగాహన రాహిత్యానికి నిదర్శనం. ఎవరో అమ్మడానికి, ఇంకెవరో కొనుక్కోవడానికి గాజా రియల్ ఎస్టేట్ ప్రాపర్టీ కాదు. మా పాలస్తీనా భూభాగంలో ఎప్పటికీ విడదీయరాని అంతర్భాగం''అని హమాస పొలిటికల్ బ్యూరో సభ్యుడు ఇజ్జత్ అల్ రిషెక్ అన్నారు.

పెన్నీల ముద్రణ ఆపండి

ట్రెజరీ విభాగానికి ట్రంప్ ఆదేశాలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త కొత్త ఆదేశాలతో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తూనే ఉన్నారు. తాజాగా, ట్రెజరీ విభాగంపై దృష్టి పెట్టారు. ఒన్ సెంట్ నాణెం తయారీ ఖర్చు పెరిగినందున కొత్తగా పెన్నీలను ముద్రించవద్దంటూ ఆ విభాగాన్ని ఆదేశించారు. 'అమెరికా ఎన్నో ఏళ్ల నుంచి పెన్నీ నాణేలను ముద్రిస్తోంది. అయితే, వన్ సెంట్ నాణెం తయారీకి రెండు సెంట్ల ఖర్చవుతోంది. ఇదంతా వృథా వ్యవహారం... అందుకే వీటి ముద్రణను ఆపేయాలంటూ ట్రెజరీ సెక్రటరీని ఆదేశించా'అంటూ ఆదివారం రాత్రి తన ట్రూత్ సోషల్ మీడియాలో తెలిపారు.

ఫ్రాన్స్‌లో ప్రధాని

- మూడు రోజులు పర్యటన
- అధ్యక్షుడు మాక్రాన్‌తో విందు
- రేపు అమెరికాకు, ట్రంప్‌తో భేటీ


పారిస్‌లో ప్రవాస భారతీయులకు మోదీ అభివాదం

న్యూఢిల్లీ: ఐదు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఫ్రాన్స్ రాజధాని పారిస్ చేరుకున్నారు. రక్షణ మంత్రి సెబెలెకొర్నూ ఆయనకు విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం దారి పొడవునా, హోటల్ వద్ద బారులు తీరిన భారతీయుల సమూహానికి మోదీ అభివాదం చేశారు. సాయంత్రం మోదీకి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ విందు ఇచ్చారు. పలు దిగ్గజ టెక్ కంపెనీల సీఈఓలు కూడా విందులో పాల్గొన్నారు. పారిస్‌లో జరుగుతున్న ఏఐ కార్యాచరణ శిఖరాగ్ర సదస్సుకు మాక్రాన్‌తో కలిసి మోదీ ఆతిథ్యమిస్తున్నారు. మంగళవారం సదస్సునుద్దేశించి మోదీ ప్రసంగిస్తారు. అనంతరం బుధవారం చారిత్రక నగరం మార్సెయిల్‌లో భారత్ తొలి కాన్సులేట్‌ను మాక్రాన్‌తో కలిసి ప్రారంభిస్తారు. కడారచ్‌లో ఫ్రాన్స్, భారత్, పలు ఇతర దేశాలు నిర్మిస్తున్న అంతర్జాతీయ థర్మోన్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్‌ను సందర్శిస్తారు. తర్వాత ఫ్రాన్స్ గడ్డపై మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల్లో ప్రాణాలర్పించిన భారత సైనికులకు మజార్గ్స్ వార్ సిమెట్రీ వద్ద నేతలిద్దరూ నివాళులర్పిస్తారు. అనంతరం మోదీ అమెరికా బయల్దేరి వెళ్తారు. ప్రధానిగా ఫ్రాన్స్‌లో మోదీకి ఇది ఆరో అధికారిక పర్యటన. గతేడాది భారత్–ఫ్రాన్స్ తమ వ్యూహాత్మక భాగస్వామ్యానికి పాతికేళ్ల వేడుక జరుపుకున్నాయి. ఇరు దేశాల భాగస్వామ్యం ఇన్నోవేషన్లు, టెక్నాలజీ, మారిటైం, రక్షణ సహకారం, ఉగ్రవాదంపై పోరు, ఆరోగ్యం, సంప్రదాయేతర ఇంధన వనరులతో పాటు పలు రంగాలకు విస్తరించిందని విదేశాంగ శాఖ ఈ సందర్భంగా ఒక ప్రకటనలో పేర్కొంది. మాక్రాన్ ఆహ్వానం మేరకు మోదీ ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్నారు.

యూఎస్‌తో బంధం బలోపేతం

తన అమెరికా పర్యటన ఇరుదేశాల బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని మోదీ ఆశాభావం వెలిబుచ్చారు. ''టెక్నాలజీ, వర్తకం, రక్షణ, ఇంధన, సరఫరా తదితర రంగాల్లో అమెరికాలో బంధాన్ని సుదృఢం చేసే అజెండా రూపకల్పనకు నా పర్యటన దోహదం చేయనుంది. ట్రంప్ తొలి హయాంలో పలు అంశాలపై ఆయనతో సన్నిహితంగా కలిసి పని చేశా. ఆయన రెండోసారి బాధ్యతలు చేపట్టాక తొలిసారి భేటీ అవబోతున్నా. నా మిత్రున్ని కలిసేందుకు ఉత్సుకతతో ఎదురు చూస్తున్నా'' అంటూ ఫ్రాన్స్ బయల్దేరే ముందు ఎక్స్‌లో పేర్కొన్నారు.



రంగరాజన్‌పై దాడి అమానుషం

చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి జరగడం దారుణమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. -8లో



నువ్వుంటే.. నా జతగా..

నగరంలో వాలెంటైన్స్ డే హడావుడి షురూ అయింది. వ్యాపార వర్గాలు మొదలుకుని.. పర్యాటక రంగం వరకూ అనేక ప్యాకేజీలు ప్రకటిస్తున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 33.0/20.0

వాతావరణం

నగర పరిధిలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల తేలిక పాటి వర్షం కురిసే అవకాశముంది. రాత్రి వేళ చల్లని వాతావరణం ఉంటుంది.

సరూర్‌నగర్ కాంప్లెక్స్ ఖాళీ చేయాల్సిందే..

సాక్షి, సిటీబ్యూరో: సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులు వెంటనే కాంప్లెక్స్‌ను ఖాళీ చేయాలని హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ హెచ్‌ఎండీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 32 షాపులు (బ్లాకులు) ఉన్నాయి. అవి ఏ క్షణంలోనైనా కూలడానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల ప్రస్తుతం షాపులు నిర్వహిస్తున్న వారికి, చుట్టుపక్కల ప్రజలకు కూడా ముప్పు వాటిల్లవచ్చునని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 11వ తేదీ..మంగళవారం షాపులను ఖాళీ చేయాలని అధికారులు సూచించారు. ఈ భవనసముదాయాన్ని హెచ్‌ఎండీఏ 1981లో నిర్మించింది. అప్పటి నుంచి 2008 వరకు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు లీజుకు ఇచ్చారు. 2008లో లీజు గడువు ముగిసింది. భవనంపునాదుల నుంచి పూర్తిగా బలహీనంగా ఉన్నందువల్ల, నాసిరకం కాంక్రీట్ నిర్మాణం దృష్ట్యా యదాతథంగా కొనసాగించడం సాధ్యం కాదని ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం హెచ్‌ఎండీఏకు నివేదికను అందజేసింది. ఈ మేరకు అధికారులు షాపుల నిర్వాహకులను ఖాళీ చేయాలంటూ నోటీసులు ఇచ్చారు. అయినప్పటికీ కొందరు అందుకు నిరాకరించి హైకోర్టును ఆశ్రయించారు. కానీ వారికి హైకోర్టులో చుక్కెదురైంది. దీంతో సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్‌ను ఖాళీ చేయించేందుకు హెచ్‌ఎండీఏ ఉపక్రమించింది. వ్యాపారులు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రత దృష్ట్యా మంగళవారం ఖాళీ చేయించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

744 ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

సాక్షి, సిటీబ్యూరో: రోడ్లపై ట్రాఫిక్ జామ్ సమస్యలు తగ్గించేందుకు, ఫుట్‌పాత్‌లను పాదచారులు వినియోగించుకునేందుకు వీలుగా అడ్డగోలు పార్కింగ్, ఆక్రమణల తొలగింపు(రోప్) కార్యక్రమాల్లో భాగంగా పోలీసులతో కలిసి నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గతేడాది డిసెంబర్ నుంచి ఈ సంవత్సరం జనవరి వరకు 744 ఆక్రమణలు తొలగించినట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది. ప్రజాసదుపాయం కోసం ఈ స్పెషల్‌డ్రైవ్ ఇంకా కొనసాగనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది.

జోన్	తొలగించిన ఆక్రమణలు
ఎల్‌బీనగర్	11
చార్మినార్	211
ఖైరతాబాద్	156
శేరిలింగంపల్లి	243
కూకట్‌పల్లి	42
సికింద్రాబాద్	81
మొత్తం	744

నిలోఫర్‌లో మల్టీపారామీటర్ ప్రారంభం

నాంపల్లి: నవజాత శిశువుల మరణాల సంఖ్యను అరికట్టడానికి ఎంతగానో దోహదపడే మల్టీపారామీటర్‌ను నిలోఫర్ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పరికరాన్ని సోమవారం నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ ప్రారంభించారు. ఈ పరికరం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో శివుల్లోని హృదయ స్పందన రేటు, శ్వాసకోశ రేటు, రక్తపోటు, ఆక్సిజన్ స్థాయిలు వంటి ముఖ్యమైన సంకేతాలను పర్యవేక్షించడానికి ఉపయోగపడుతుంది. రక్తహీనత ఉన్న పిల్లల్లో హిమోగ్లోబిన్ స్థాయిలను పర్యవేక్షించడానికి దోహదపడుతుంది. తద్వారా పిల్లలకు సోకిని ఇన్‌ఫెక్షన్‌ను పూర్తిగా తగ్గించడమే కాకుండా మెరుగైన వైద్యాన్ని అందించడానికి ఉపకరిస్తుందని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.



జంక్షన్‌లో రాగాల ఝురి..

సిటీలో జంక్షన్లు జిగేల్‌మంటున్నాయి. వినూత్నంగా..ఆలోచనాత్మకంగా ఏర్పాటు చేసిన చిత్రాలు..నిర్మాణాలు ఆకట్టుకుంటున్నాయి. లక్డీకాపూల్ నుంచి ఖైరతాబాద్‌కు వెళ్లే రహదారిలోని జంక్షన్‌లో ఇలా సరికొత్తగా..ముగ్గురు చిన్నారులు చెట్టు మొదలుపై కూర్చొని..పిల్లన గ్రోవిని చేతబూని రాగాలు ఆలపిస్తున్నట్లుగా ఉన్న బొమ్మలు రాత్రివేళ లైటింగ్‌తో ఇలా ఆకర్షణీయంగా కన్పించాయి.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

జంపింగ్ టైమ్!



పార్టీలు మారనున్న కార్పొరేటర్లు?

వలలు విసురుతున్న పార్టీలు

- బల్దియా స్టాండింగ్ కమిటీ ఎన్నికల తరుణంలో కీలక పరిణామాలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు పార్టీలు మారనున్నారా? అంటే కాదనలేమనే సమాధానమే వస్తోంది. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతమిది చర్చనీయాంశంగా మారింది. స్టాండింగ్ కమిటీలో ఉన్న 15 స్థానాలూ ఇప్పటి వరకు బీఆర్‌ఎస్–ఎంఐఎం పొత్తులో భాగంగా ఆ రెండు పార్టీలకే ఏకగ్రీవమవుతూ వచ్చాయి. స్టాండింగ్ కమిటీ ఎన్నికలో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారు స్టాండింగ్‌కమిటీ సభ్యులవుతారు. ఏడాది కాలపరిమితి గల స్టాండింగ్ కమిటీకి గత సంవత్సరం వరకు బీఆర్‌ఎస్–ఎంఐఎం పొత్తు బంధం కొనసాగింది. రెండు పార్టీలూ కలిస్తే.. పోటీలో దిగినా లాభం లేదనే తలంపుతో మిగతా పార్టీల నుంచి ఎవరూ పోటీ చేయలేదు. పొత్తులో భాగంగా ఎంఐఎం తమకు లభించే ఏడు స్థానాల కోసం అధిష్ఠానం ఎవరి పేర్లయితే ఎంపిక చేస్తుందో వారే నామినేషన్లు వేసేవారు. బీఆర్‌ఎస్ నుంచి సైతం ఉపసంహరణ నాటికి దాని వాటా మేరకు ఎనిమిది మంది మిగిలేవారు.

జంపింగ్ సమయం..

రాష్ట్రంలో ప్రభుత్వ మార్పిడి, రాజకీయ పరిణామాలతో కొందరు ఎమ్మెల్యేలతోపాటు పలువురు కార్పొరేటర్లు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. దాంతో మూడు స్థానాల నుంచి కాంగ్రెస్ బలం 24కు పెరగడం తెలిసిందే. ప్రస్తుతం ఎంఐఎం .. కాంగ్రెస్‌తో కలిసి నడుస్తున్నందున ఈసారి అవి రెండూ కలిసి పోటీచేసే అవకాశం ఉన్నప్పటికీ, ఏ క్షణం ఎలాంటి మార్పులైనా జరగవచ్చుననే తలంపుతో ఇతర పార్టీల నుంచి సైతం నామినేషన్లు వేసేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. మరోవైపు, తమ పార్టీకి ఎక్కువ మంది సభ్యులుంటే స్టాండింగ్ కమిటీలో ప్రభావం చూపవచ్చుననే తలంపుతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న 146 మంది కార్పొరేటర్లలో బీఆర్‌ఎస్‌కు అత్యధికంగా 42 మంది కార్పొరేటర్లున్నారు. ఆతర్వాత వరుసగా ఎంఐఎంకు 41 మంది, బీజేపీకి 39 మంది, కాంగ్రెస్‌కు 24 మంది సభ్యులున్నారు. ఈ నేపథ్యంలో ఏపార్టీ పొత్తు పెట్టుకోకుండా ఉంటే బీఆర్‌ఎస్ నెగ్గుతుంది. కానీ, అది సాధ్యం కాదని పలువురు కార్పొరేటర్లు చెబుతున్నారు.

మేయర్ పీఠంపై దృష్టితో..

మరోవైపు, బల్దియాలో తమ బలం పెంచుకొని వచ్చే సంవత్సరం జరగబోయే పాలకమండలి ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ఇప్పటి నుంచే బలాన్ని పెంచుకునే చర్యల్లో భాగంగా ఇతర పార్టీల వారిని చేర్చుకునేందుకు ఇదే సరైన సమయమని మూడు పార్టీలూ భావిస్తున్నందున కూడా ప్రస్తుతం పార్టీ మార్పిడులు జరిగేందుకు అవకాశాలున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆపార్టీలో చేరిన వారి సంఖ్య 24కు పెరిగినప్పటికీ, చేరేవారు ఇంకా ఉన్నారని చెబుతున్నారు. గత సంవత్సరం ఆగిపోయిన చేరికలను కాంగ్రెస్ తిరిగి ప్రారంభించవచ్చునని భావిస్తున్నారు. కార్పొరేటర్లకు మిగిలిన ఏడాది పదవీ కాలంలో ఎక్కువ నిధులు పొందేందుకు, తద్వారా ఎక్కువ పనులు చేసి వచ్చే ఎన్నికల్లో నెగ్గేందుకు ఆపార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్న వారు ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ దీన్ని తనకు అనుకూలంగా మలచుకోవాలని భావిస్తోంది. బీజేపీ సైతం కేంద్రంలో తమ పార్టీ అధికారంలో ఉండటంతోపాటు తాజాగా ఢిల్లీ ఎన్నికల్లోనూ గెలుపు జెండా ఎగురవేయడాన్ని ప్రస్తావిస్తూ, ఇతర పార్టీల వారిని తమ పార్టీలో చేర్చుకోవాలనే వ్యూహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్కువమందిని చేర్చుకోవడం ద్వారా వచ్చే ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ ఇప్పటి నుంచే పావులు కదపనుందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఇందుకు స్టాండింగ్ కమిటీ ఎన్నిక తగిన సమయమని చెబుతున్నారు. కొందరు పార్టీలో చేరినంత మాత్రాన ఏ పార్టీ కూడా సొంతబలంతోనే అన్ని స్థానాలూ గెలవలేదని, అందుకు వివిధ కారణాలున్నాయని కొందరు కార్పొరేటర్లే చెబుతున్నారు. ఏవైనా రెండు పార్టీలు కలిస్తేనే 15 స్థానాలు లభిస్తాయంటున్నారు. అయినప్పటికీ తమ పార్టీకి ఎక్కువ బలం కోసం మూడు పార్టీలు ఎలాంటి కార్యాచరణ అమలు చేయనున్నాయో వేచి చూడాల్సిందే!

మొదటి రోజు నామినేషన్లు నిల్..

స్టాండింగ్ కమిటీకి నామినేషన్ల తొలిరోజైన సోమవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఇద్దరు సభ్యులు నామినేషన్ పత్రాలు తీసుకెళ్లారు. నామినేషన్ల దాఖలుకు 17వ తేదీ వరకు గడువుంది. ఈలోగా ఎవరు ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తారో, ఎవరు ఎవరితో కలుస్తారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. కేవలం స్టాండింగ్ కమిటీ కోసం ఇతర పార్టీలతో పొత్తు అవసరం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బీజేపీ కార్పొరేటర్లకు సూచించినట్లు సమాచారం. పోటీ చేయాలనుకుంటే బీజేపీ కార్పొరేటర్లు పోటీ చేయవచ్చునని అన్నట్లు తెలిసింది.

పగలు అగ్గి రాజుకుంటే మిగిలేది బుగ్గే!

రద్దీ రోడ్లపై ఫైరింజన్లు రావడం కష్టమే

- పాతబస్తీ ట్రాఫిక్‌లో ఇది మరీ ఇబ్బంది
- స్పష్టం చేసిన దివాన్ దేవిడీ ప్రమాదం



సాక్షి, సిటీబ్యూరో: దివాన్ దేవిడీలోని మదీనా అండ్ అబ్బాస్ టవర్స్... దిల్‌సుఖ్‌నగర్‌లోని చందనా బ్రదర్స్... కోఠిలోని పుష్పాంజలి కాంప్లెక్స్... బషీర్‌బాగ్‌లోని మొఘల్ కోర్ట్‌లో ఉన్న నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ... నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా... పంజాగుట్టలోని మీనా జ్యువెలర్స్...

.....ఇలా నగరంలో చోటు చేసుకున్న భారీ అగ్నిప్రమాదాలన్నీ రాత్రి పూటే చోటు చేసుకున్నాయి. ఫలితంగా అగ్నిమాపక శకటాలు హుటాహుటిన ఘటనాస్థలికి వచ్చి మంటలను అదుపు చేయగలిగాయి. ఒకవేళ రోడ్లు రద్దీగా ఉండే పగటి వేళ ఈ ప్రమాదాలు జరిగితే..నష్టం అపారంగా ఉండేది. ఈ స్థాయి ప్రమాదాలు పగలు జరిగితే ట్రాఫిక్ చక్రబంధనాల్ని ఛేదించుకుని ఫైరింజన్లు ఘటనాస్థలికి రావడానికి ఎంత సమయం పడుతుందో చెప్పలేం. ఆలోపు జరగాల్సిన ఆస్తి, ప్రాణ నష్టం జరిగిపోతుంది. పాతబస్తీ లాంటి ప్రాంతాల్లో ఉండే రోడ్లు, నిర్మాణాలు, ట్రాఫిక్ నేపథ్యంలో పరిస్థితి మరింత దారుణంగా మారిపోతుంది. నిబంధనల ప్రకారం ఉండాల్సిన విధంగా ఫైర్ స్టేషన్లు, ఫైర్ ఇంజన్లు లేకపోవడమే దీనికి కారణం.

నిబంధనలు... వాస్తవాలు...

- నిబంధనల ప్రకారం నగరంలో ప్రతి 5 చదరపు కిమీలకు ఒక అగ్నిమాపక శకటం అందుబాటులో ఉండాలి. కానీ ప్రస్తుతం 15 నుంచి 20 చదరపు కిమీకి ఒకటి చొప్పున అందుబాటులో ఉన్నాయి.
- ప్రతి 50 వేల మంది రక్షణకు ఓ అగ్నిమాపకశకటం అవసరం. ఈ రకంగా చూస్తే గ్రేటర్‌లో కనీసం 250 ఫైర్ ఇంజన్లు అవసరం. ఇప్పుడు ఇందులో కనీసం సగం కూడా అందుబాటులో లేవు.
- అగ్నిమాకప శకటం గంటకు 100 కిమీ వేగంతో ప్రయాణించగలగాలి. ఇటీవల విడుదలైన టామ్ టామ్ నివేదిక ప్రకారం చూసినా ప్రస్తుతం నగరంలో వాహనాల సరాసరి వేగం 20 నుంచి 25 కిమీ మించట్లేదు.
- ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినప్పుడు గరిష్టంగా 15 నిమిషాల్లో అగ్నిమాపక శకటం అక్కడకు చేరాలి. అయితే ప్రస్తుతం నగర రోడ్ల పరిస్థితిని బట్టి ఏ వాహనమైనా ఎక్కడ నుంచి ఎక్కడికైనా వెళ్లాలంటే కనీసం 30 నిమిషాల సమయం పడుతుంది.
- మంత్రులు, వీఐపీలు వస్తే ట్రాఫిక్‌ను నిలిపి వేసి వారిని సాగనంపే పోలీసులు ఫైరింజనో, అంబులెన్సో వస్తే దానికి దారి చూపించడానికి అవసరమైన స్థాయిలో స్పందించరు.
- ఇక నగరవాసుల్లోనూ అత్యవసర సర్వీసులకు దారి ఇవ్వాలన్న సివిక్ సెన్స్ సైతం చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు.

ఉజ్వల భవిష్యత్‌కు పునాది ఎన్‌ఈపీ

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



జాతీయ సదస్సులో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వీసీ ప్రొఫెసర్ బీజే రావు, ప్రొఫెసర్లు

రాయదుర్గం: కేంద్రం ప్రవేశ పెట్టిన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) దేశ భవిష్యత్తు కోసం వేసిన ఒక చారిత్రక అడుగు అని గవర్నర్, హెచ్‌సీయూ చీఫ్ రెక్టార్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో సోమవారం స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 'ట్రెండ్స్ అండ్ ఇన్‌సైట్స్ ఇన్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ పోస్ట్–ఎన్‌ఈపీ–2020 ' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ ప్రతిబిడ్డకు సాధికారత కోసం ఎన్‌ఈపీ ఒక రోడ్‌మ్యాప్ అని గుర్తు చేశారు. యువతకు శక్తినివ్వడంలో విద్య ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. గురుశిష్య పరంపర (ఉపాధ్యాయ–విద్యార్థి సంబంధం) ఎంతో ముఖ్యమైందని, సంప్రదాయ భారతీయ విద్యా వ్యవస్థ గురించి చర్చించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా ఉపయోగించాల్సిన అవసరాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు. మానవజాతి ప్రయోజనం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగించాలో విద్య మనకు బోధిస్తుందని, ఇది మంచి అభ్యాస స్ఫూర్తిని కలిగి ఉందన్నారు. సదస్సులో చర్చల ద్వారా కొత్త దృక్కోణాలు తెరుచుకోవాలని, దేశాన్ని ముందుకు తీసుకెళ్ళాలని, వికసిత్ భారత్–2047 దార్శనికతను సాకారం చేయాలని ఆయన సూచించారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడుతూ విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలు, స్వీయ అవగాహనను పెంపొందించడంపై విద్య దృష్టి పెట్టవలసిన అవసరం ఉందన్నారు. విద్య అనేది మనసును నిర్మించే ప్రక్రియ అని, అయితే సాంకేతికత అనేది విద్యను పూర్తి చేసే సాధనం అని ఆయన పేర్కొన్నారు. విద్య అనేది సమాజానికి, దేశానికి ప్రయోజనం కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. బెంగళూరులోని చాణక్య విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ ఉషా సుబ్రమణియన్ మాట్లాడుతూ విద్యలో సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. పలువురు విద్యావేత్తలు మాట్లాడుతూ విద్యాసాంకేతిక పరిజ్ఞానంలో పరిశోధన, విధానాలు, అభ్యాసాల మధ్య అంతరాలను తగ్గించడం ఈ సమావేశం లక్ష్యమన్నారు. అనుభవ పూర్వక అభ్యాసం, తరగతి గది వెలుపల అభ్యాసం, విచారణ ఆధారిత అభ్యాసం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు కో ఆర్డినేటర్లు ప్రొఫెసర్ జీవీ మధుసూదన్, రావుల కృష్ణయ్య, పలువురు విద్యావేత్తలు, పలు సంస్థల ప్రతినిధులు, హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంత.. లేకుంటే ఇక చింతే!

- నీరు ట్యాంకర్ బుక్ చేస్తే ఇక డబుల్ చార్జీ
- చర్యలకు ఉపక్రమిస్తున్న జలమండలి
- ఇప్పటికే గుర్తించిన వాటికి నోటీసులు జారీ

ఇంకుడు గుంతలు లేని భవన సముదాయాల గుర్తింపు

వేసవి కాలం వచ్చిందంటే ఎల్‌బీ నగర్‌లోని రాక్ టవర్ గృహ సముదాయంలో భూ గర్భజలాలు అడుగంటి బోరు ఎండి పోయేది. దీంతో తాగు నీటికే కాదు..గృహ అవసరాలకు సైతం నీటి ఎద్దడి తప్పేది కాదు. ఆ గృహ సముదాయం నుంచి జలమండలి వాటర్ ట్యాంకర్ల బుకింగ్‌లు అత్యధికంగా ఉండేది. జలమండలి అధికారుల సలహాతో 2018లో టవర్ నిర్వాహకులు సముదాయంలోని బోరు బావికి సమీపంలో పెద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షాకాలం నీరు అందులో చేరే విధంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ గృహ సముదాయం నుంచి వాటర్ ట్యాంకర్ బుకింగ్ చేసే అవసరం పడలేదు. టవర్ చుట్టు పక్కల గృహ సముదాయల నుంచి మాత్రం వేసవి వచ్చిదంటే ట్యాంకర్ల బుకింగ్ తాకిడి అధికంగానే ఉంటుంది. ఇది ఇంకుడు గుంతల ప్రాముఖ్యతకు నిదర్శనంగా చెప్పొచ్చు.



సాక్షి, సిటీబ్యూరో:

మీ గృహ సముదాయం 300 చదరపు మీటర్లు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉండి... ఇంకుడు గుంత నిర్మాణం లేదా..? ఇక మీకు నీరు అవసరమై ట్యాంకర్ బుక్ చేస్తే రెట్టింపు చార్జీలు చెల్లించక తప్పదు. ఇంకుడు గుంతలు లేని కారణంగానే ఈ అదనపు భారమని జలమండలి అంటోంది. నాలుగు దిక్కులా అత్యంత వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతూ వాన చినుకు నేలలో ఇంకే పరిస్థితి లేకపోవడంతో ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలను పెంపొందించే దిశగా జలమండలి కఠిన నిర్ణయానికి సిద్ధమైంది. గతేడాది ఏడాది ఫిబ్రవరి నుంచి మే నెల వరకు అత్యధికంగా ట్యాంకర్లు బుక్ చేసిన వినియోగదారులను గుర్తించింది. వరల్డ్ వాటర్ డే సందర్భంగా ఇంకుడు గుంతల సర్వేకోసం ప్రత్యేకంగా ఒక అప్లికేషన్ రూపొందించి అందుబాటులోకి తీసుకొచ్చింది. గుర్తించిన గృహ సముదాయాల క్యాన్ నంబర్ల ఆధారంగా ఇంకుడు గుంతలపై సర్వే నిర్వహించి చర్యలకు ఉపక్రమించింది. ఇంకుడు గుంతలు లేని క్యాన్ నెంబర్ల నుంచి వచ్చిన ట్యాంకర్ల బుకింగ్‌లపై రెట్టింపు ఛార్జీలకు సిద్ధమైంది.

300 చదరపు మీటర్లు ఉంటే తప్పనిసరి

గృహ సముదాయాల్లో భూగర్భజలాల పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు తప్పనిసరి చేశారు. వాల్టా చట్టం ప్రకారం 300 చదరపు మీటర్లు..అంతకంటే ఎక్కువగా విస్తీరణంలో గల గృహ సముదాయాలలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాల్సిందే. జలమండలి నల్లా కనెక్షన్ల అనుమతి పత్రంలో సైతం ఇంకుడు గుంతల ఏర్పాటు షరతు ఉంటుంది. భవన నిర్మాణం సమయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నా.. కాలక్రమేణా దాన్ని పునరుద్ధరించక పోవడం, మరికొందరు అసలు ఇంకుడు గుంతల నిర్మాణమే చేపట్టక పోవడం సర్వసాధారణమైంది. గతేడాది రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పథకంలో భాగంగా 'ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత' అనే పేరుతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. ఇంకుడు గుంతలు లేని గృహ సముదాయాలు గత డిసెంబర్ 31వ తేదీ వరకు నిర్మించుకోవాలంటూ నోటీసులు జారీ చేయగా..అందులో కొందరే స్పందించగా మిగతావారి నుంచి స్పందన లేకుండా పోయింది. నోటీసు అందినా ఇంకుడు గుంతను నిర్మించని భవన యజమానులు ట్యాంకర్ బుకింగ్ చేస్తే రెట్టింపు ఛార్జీలు విధించేందుకు వాటర్ బోర్డు చర్యలు చేపట్టింది.

ఇక్కడి నుంచే డిమాండ్

గతేడాది వేసవిలో సుమారు 42 వేలకు పైనే గృహ సముదాయాల నుంచే అత్యధికంగా ట్యాంకర్ల బుకింగ్ జరిగినట్లు జలమండలి అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం డివిజన్లలో హఫీజ్‌పేట, శేరిలింగంపల్లి, ఎస్‌ఆర్‌నగర్, కూకట్‌పల్లి, మణికొండ, నిజాంపేట్ డివిజన్ పరిధిలోని పలు సెక్షన్లలో అత్యధికంగా ఒక్కో గృహ సముదాయం నుంచి ఐదు వందల నుంచి ఐదువేల వరకు ట్యాంకర్లు బుకింగ్ జరిగాయి. గత వేసవిలో రెండు నెలల కాలంలోనే వంద కుటుంబాలు మాత్రం 31 వేల ట్రిప్పులను బుకింగ్ చేసినట్లు తెలుస్తోంది.

నోటీసులు జారీ

ఇంకుడుగుంతలు లేని గృహ సముదాయాలకు ఇప్పటికే జలమండలి నోటీసులు జారీ చేసింది. తక్షణమే ఆ గృహ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేంత వరకు ట్యాంకర్ల బుకింగ్‌కు డబుల్ చార్జీలు తప్పని స్పష్టం చేసింది.

జలమండలి పరిధిలో ఇంకుడు గుంతల పరిస్థితి ఇలా..

- గతేడాది అత్యధికంగా ట్యాంకర్లు వినియోగించిన భవనాల సంఖ్య : 42,784
- ఇప్పటి వరకు సర్వే చేసిన భవనాల సంఖ్య : 40,206
- ఇంకుడు గుంతలు కలిగిన భవనాల సంఖ్య : 22,813
- ఇంకుడు గుంతలు లేని భవనాల సంఖ్య : 17,393
- ఇప్పటి వరకు నోటీసుల జారీ : 15,066

Lalithaa Jewellery Mart Limited

For our new showroom in SECUNDERABAD on 11th & 12th Feb 2025

STAFF WANTED

Opportunity to work with India's Leading Jewellery Chain!

Graduate / 12th, 23 to 35 years age, should be hardworking with pleasing personality and excellent leadership qualities with strong communication skills, Jewellery experience preferred.

BRANCH MANAGER GRADUATE WITH MINIMUM 3 YEARS AS ASSISTANT MANAGER IN JEWELLERY INDUSTRY	05 VAC.
ASSISTANT MANAGER - MIN. 6 YEARS EXP. IN JEWELLERY	05 VAC.
FLOOR MANAGER (M/F) - MIN. 5 YEARS EXP. IN JEWELLERY	20 VAC.
HR EXECUTIVE (M/F)	10 VAC.
ACCOUNTS EXECUTIVE (M/F)	10 VAC.
SALES EXECUTIVE (M/F) FRESHER/ EXPERIENCE PREFERRED EXP. IN JEWELLERY	150 VAC.
CRE (Customer Relationship Executive) - ONLY FEMALE	10 VAC.
CHIT / BILLING EXECUTIVE	20 VAC.
CASHIER	20 VAC.
APPRAISER & GOLD SMITH - ONLY EXPERIENCED	10 VAC.
NETWORKING & CCTV EXECUTIVE	10 VAC.
STORE ASSISTANT	05 VAC.
ASO & SECURITY GUARD - AGE LIMIT MAX. 50 YEARS	10 VAC.
DRIVER & OFFICE ASSISTANT	10 VAC.
ELECTRICIAN & AC TECHNICIAN	05 VAC.
TELEPHONE OPERATOR - ONLY FEMALE	05 VAC.

Salary - Best in the Industry + PF, ESI & Attractive Incentives

Carry your Resume Latest pay slip Aadhar copy and Passport Size Photo

Walk-in: 11th & 12th February 2025 (Tue & Wed), Time: 10.00 AM to 5.00 PM

Venue for Interview:

Hotel Padmini,

4th Floor, 1-1-147/1, Sarojini Road, Clock Tower 'X' Road, Secunderabad, Telangana - 500003. Ph : 9133323014 / 040-67486677

Regular Walk-ins at:

Lalithaa Jewellery Mart Limited

6-3-883, SBR Souk, Opp.Rajiv Gandhi Statue, Somajiguda, Hyderabad.

careers@lalithaajewellery.com www.lalithaajewellery.com

సాక్షి మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025

ప్రజాస్వామ్యంలో దాడులు మంచివి కావు

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



మొయినాబాద్: ప్రజాస్వామ్యంలో దాడులు చేయడం మంచి పద్ధతి కాదని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఆమె చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించారు. ఆయనపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రంగరాజన్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలను మొదట్లోనే తుంచి వేయకపోతే ప్రమాదమన్నారు. దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ఘటనలో 26 మంది పాల్గొన్నారని గుర్తించామని, ఇప్పటికే ప్రధాన నిందితుడితోపాటు మరో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఒకటి రెండు రోజుల్లో అందరినీ అరెస్టు చేస్తామని తెలిపారు. పోలీసులు ఈ విషయంలో సమర్థంతంగా పని చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



సంస్మరణ
మీ ఆశయాలు, ఆదర్శాలు మాకు చిరస్మరణీయం
20వ వర్ధంతి సందర్భంగా స్మరించుకుంటూ
భార్య: బత్తులపల్లి నరసమ్మ
కుమార్తెలు - అల్లుళ్ళు
రాజశ్రీ - కీ.శే. బి.సి. నరసింహా రెడ్డి Class -1 Contractor
సరిత - డా॥ ఎ. రఘురామి రెడ్డి
అరుణ - డా॥ ఎన్. నరసింహా రెడ్డి
విజయ - టి. మురళీకృష్ణా రెడ్డి Business
మనుమరాండ్రు: మాధవి, స్వప్న, దివ్య, లాస్య, సిరి
మనుమలు: నవీన్, సందీప్, నీహార్, నిఖిల్
స్వర్గీయ బి.వి. సుబ్బా రెడ్డి గారు
క్లాస్-1 కాంట్రాక్టర్, హైదరాబాద్
మరణం : 11-02-2005
RAJASRI INFOTECH
RAJASRI SOFT SOLUTIONS PVT LTD.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE
■ Nagole House for Sale G+1 = 2BHK + 3BHK Car Parking 167yards West Face 30 Feet Road Ph: 9885202404 [SCA25001592]

Services

BUSINESS SERVICE
■ మీ బంగారం మణప్పురం ముత్తూట్ మార్వాడి షాప్ ఏ ఫైనాన్సిలో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001519]
■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 9160077916 స్పాట్ క్యాష్. [SCA25001608]

PERSONAL CARE

CHANGE OF NAME
■ I, Sujata Kaza W/o Devarapalli RajendraBabu, H.No:4-118/9, Swaroopnagar(South)Uppal, Hyd-39, Changed My Name From Devarapalli SujathaToSujata Kaza [SCA25001638]
■ I, Allam Subhash S/o. A Subba Rayudu, R/o. Hno:4-12-1050, Sushma Sai Nagar, Vanasthalipuram, R.R.Dist-500070, Telangana, have changed my son's name from MARUTHI SAI DEEVESH ALLAM to ALLAM MARUTHI SAI DEEVESH for all purposes. [HA-15398]
■ I, Kantipaka Divya D/o, Kantipaka Babji R/o Pream Nagar New Hafeez Pet Sherlingampally Rr Dist Ts have changed my name to Ayisha Tasmiya. [DA-41169]
■ I, Gunji Saritha D/o Late Gunji Krishna R/o: 11-3-416/58/33 Jamisthan Nagar, Parsigutta Sec'Bad Changed My Name GANGI SARITHA D/o Late GANGI KRISHNA to GUNJI SARITHA D/o Late GUNJI KRISHNA & Date of birth 26/08/1989 - 26/08/1987 [SCA25001634]

OLD AGE HOME
■ వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానవున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. 7981467086, 9391039990, 9949520296 [H-783367]

Wanted
■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. Ph:8520980099, 8520874499 [SCA25001603]
■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [SCA25001537]
■ MG కార్ షోరూం శంషాబాద్‌లో పని చేయుటకు సేల్స్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ మేనేజర్, సర్వీస్ సూపర్ వైజర్, మెకానిక్స్ కావలెను. సెల్ : 9492628629, 9491402020. [J-521]
■ ఇంట్లోనే ఉండి ఇంటి, వంట పనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్ల కావలెను. జీ॥ 15-25K హౌస్ కీపింగ్ బాయ్స్ కావలెను. 8019373131/040-45043410 [H-800524]
■ Need Retd. Employees Home Makers and 2yrs Exp Persons in Sales for Reputed Bank. 9391518710. Good Salary + inc [HA-99809]
■ URGENT Required Female Telecallers & Sales Executives Experience OR Freshers Sall:12K-18K+ inc call Ph : 8328341241 [SCA25001619]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-2491, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

> ‘కడప జిల్లాకు చెందిన సుహాసిని ఫిట్స్‌తో బాధపడుతూ అపస్మారక స్థితికి చేరడంతో చికిత్స కోసం జనవరి 12న మదీనాగూడలోని సిద్ధార్థ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి వైద్యులు ఆమెను గత 28 రోజులుగా వెంటిలేటర్‌పైనే ఉంచి చికిత్స అందించారు. ఇప్పటి వరకు రూ.16 లక్షల బిల్లు వేయగా, రూ.11 లక్షలు చెల్లించారు. అయినా ఆరోగ్యం మెరుగుపడక పోగా మరింత క్షీణించి మృతి చెందింది. డబ్బులకు ఆశపడిన ఆస్పత్రి నిర్వాహకులు మృతదేహానికి రెండు రోజుల పాటు వైద్యం చేసినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సోమవారం ఆస్పత్రిలో కేపీట్ సహా రోగి చికిత్సకు సంబంధించిన వివరాలు సేకరించారు. తాత్కాలికంగా ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేశారు’
>
> ‘తుర్కయాంజాల్ మున్సిపాలిటి శ్రీరామ్‌నగర్‌కు చెందిన జి.సత్యంగౌడ్(46)కడుపునొప్పితో బాధపడుతూ శనివారం ఉదయం అదే ప్రాంతంలోని యాంజాల్ ఆస్పత్రిలో చేరాడు. పరీక్షించిన డ్యూటీ డాక్టర్ ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని, రెండు గంటల్లో రికవరీ అవుతాడని చెప్పాడు. తీరా ఆదివారం ఉదయం ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే అతను మృతి చెందాడని ఆరోపిస్తూ బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సదరు ఆస్పత్రి కి షోకాజ్ నోటీసు జారీ చేశారు’
>
> ‘సైదాబాద్ మాదన్నపేట రోడ్‌లోని అరుణ, జనని సహా కొత్తపేటలోని అలకనంద ఆస్పత్రుల్లో గుట్టుగా కిడ్నీ మార్పిడి చికిత్సలు చేస్తున్న విషయం తెలిసిందే. కర్ణాటక, తమిళనాడు నుంచి దాతలు, స్వీకర్తలను ఇక్కడికి రప్పించి గుట్టుగా చికిత్సలు చేస్తున్న విషయం విదితమే. ఒక్కో చికిత్సకు రూ.60 లక్షల చొప్పున వసూలు చేసినట్లు తేలింది. 2023 ఏప్రిల్ నుంచి 2024 జూన్ వరకు కేవలం అరుణ, జనని ఆస్పత్రుల్లో, డిసెంబర్ నుంచి జనవరి 20 వరకు, అకలనంద ఆస్పత్రిలో 20కిపైగా కిడ్నీ మార్పిడి చికిత్సలు చేసినట్లు తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపగా, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రిని సీజ్ చేశారు’

‘కాసు’పత్రులు!

మొన్న కొత్తపేట..నిన్న యాంజాల్ తాజాగా మదీనాగూడలో ఘటన

- అడ్డగోలు చికిత్సలపై మంత్రి సీరియస్
- ఆస్పత్రుల్లో తనిఖీలు.. ఆపరేషన్ థియేటర్లు క్లోజ్
- వరుస ఘటనలు... వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం



యాంజాల్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: ఒకప్పుడు వైద్యులు మాత్రమే ఆస్పత్రులను ఏర్పాటు చేసేవారు. వైద్యాన్ని సేవగా భావించేవారు. కానీ ప్రస్తుత పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నం. వైద్య రంగం పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. కేవలం దేశీయ సంస్థలే కాకుండా విదేశీ కంపెనీలు కూడా ఈ రంగంలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఇప్పటికే హైదరాబాద్, మేడ్చల్ సహా రంగారెడ్డి జిల్లాల్లోని మెజార్టీ ఆస్పత్రులు విదేశీ సంస్థల గుప్పిట్లోకి వెళ్లిపోయాయి. విదేశాల్లో కూర్చొని, పూర్తి సీసీ కెమెరాల నిఘాలో అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ విభాగాలు సహా డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్లను ఆపరేట్ చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఆర్ఎంపీలకు, అంబులెన్స్ డ్రైవర్లకు కమీషన్లు ఆశచూపి, రోగులను చేర్పించుకుంటున్నాయి. చికిత్సల పేరుతో వైద్యులకు టార్గెట్లు ఇచ్చి మరీ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాయి. రోగులు, వారి బంధువుల్లో ఉన్న భయాన్ని క్యాష్ చేసుకుంటున్నాయి. తీరా రోగులు కోలుకోకపోగా, మృత్యువాతపడుతుండటంతో బంధువులు ఆస్పత్రుల ముందు ధర్నాలకు దిగుతున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తూనే ఉన్నాయి. మొన్న కొత్తపేటలోని అలకనంద ఆస్పత్రిలో కిడ్నీ రాకెట్..నిన్న ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్‌లో ఓ ఆర్ఎంపీ అబార్షన్లు చేస్తున్న విషయం బహిర్గతమైంది. తాజాగా మదీనాగూడలో మృతదేహానికి చికిత్స చేసిన ఉదంతం వెలుగు చూసింది.

ఏకకాలంలో దాడులకు యాక్షన్ ప్లాన్...

వరుస ఘటనలతో రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా 2300 వరకు స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, జనరల్ నర్సింగ్‌హోమ్స్, ఐ, డెంటల్, స్కిన్ కేర్ క్లినిక్స్, డయాగ్నోస్టిక్స్ ఉన్నట్లు అంచనా. వీటిలో 350 నుంచి 400 క్లినిక్స్ ఎలాంటి అనుమతులు లేనట్లు సమాచారం. బాలాపూర్, సరూర్ నగర్, హయత్‌నగర్ మండలాల పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రులు/ క్లినిక్‌లలో ఆకస్మిక తనిఖీలకు రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం 30 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఏకకాలంలో అన్ని ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టి, ఆస్పత్రి అనుమతులు, వైద్య సిబ్బంది విద్యార్హతలు, సాంకేతిక పరికరాల పనితీరు, రికార్డుల నిర్వహణ, శానిటేషన్, బయో మెడికల్ వేస్టేజ్ ప్లాంట్లను పరిశీలించనుంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న డయాగ్నోస్టిక్‌లను గుర్తించి చర్యలు తీసుకోనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిని అనుమతి కోరగా, ఆయన ఇందుకు గ్రీన్‌సిగ్నల్ కూడా ఇచ్చినట్లు సమాచారం. వైద్య ఆరోగ్యశాఖ బృందాలు తనిఖీలు చేయనున్నట్లు తెలియడంతో కొందరు తమ క్లినిక్‌లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు సమాచారం.

> **అనుమతులు రద్దు చేయాలి**
>
> చిన్న అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తే వైద్య పరీక్షలు.. చికిత్సల పేరుతో నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. వైద్య సేవలను పూర్తి వ్యాపారంగా మార్చేశారు. అల్లోపతి మెడికల్ కేర్ యాక్ట్ ప్రకారం డీఎంహెచ్‌ఓ ద్వారా అనుమతులు పొందిన ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు చట్టానికి విరుద్ధం గా చికిత్సలు చేస్తున్నాయి. రోగుల మృత్యువాతకు కారణమవుతున్న ఆస్పత్రుల అనుమతులను రద్దు చేయాలి.
>
> – డాక్టర్ జగన్‌గౌడ్, ప్రైవేటు ఆస్పత్రి బాధితుల సంఘం,రాష్ట్ర అధ్యక్షుడు

మద్యం మత్తులో డ్రైవింగ్..

ఫిలింనగర్: మద్యం మత్తులో మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్డు పక్కన ఆగి ఉన్న బైకులను ఢీకొట్టిన ఘటనలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు నిందితుడిని సోమవారం రిమాండుకు తరలించారు. రాజమండ్రికి చెందిన బారు వెంకట సత్య సుధీర్ (22) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ మణికొండలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి తెల్లాపూర్‌లో తన స్నేహితుడి ఇంట్లో విందుకు హాజరై మద్యం సేవించాడు. ఆ మత్తులోనే అర్ధరాత్రి కారులో ఓయూకాలనీ మీదుగా ఇంటికి వెళ్తూ పక్కన ఆపిన యాక్టివా బైక్ పైకి ఎక్కించాడు. బైక్‌పై ఉన్న భారతమ్మ, శ్రీకాంత్‌లకు గాయాలయ్యాయి. అయినా ఆగకుండా ముందుకు దూసుకెళ్లి జొమాటో రైడర్ సాయిని, మరికొంత ముందుకు వెళ్లి మరో బైకును ఢీకొట్టాడు. జొమాటో రైడర్‌తో పాటు తారీఖుద్దీన్‌కు గాయాలయ్యాయి. వరుసగా మూడు బైకులను ఢీకొడుతూ ఫుట్‌పాత్‌ను కూడా ధ్వంసం చేశాడు. జొమాటో రైడర్ ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు సుధీర్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

మహిళ ఆత్మహత్య



దేవి (ఫైల్)

కుత్బుల్లాపూర్ : పిల్లలు పుట్టి చనిపోతుండటం, భర్త మద్యానికి బానిస కావడంతో మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది.. ఎస్సై పరమేశ్వర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దేవి (28) కోదండరామ్ దంపతులు సుభాష్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు పుట్టి పది నెలల వ్యవధిలోనే మృత్యువాత పడ్డారు. అప్పటి నుంచి డిప్రెషన్‌తో బాధపడుతున్న దేవి తరచూ భర్తతో గొడవ పడేది. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన భర్తతో మరోసారి గొడవ పెట్టుకోవడంతో అతను ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి లోనైన దేవి ఇంట్లో ఐరన్ రాడ్డుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తెల్లవారుజామున ఇంటికి వచ్చిన కోదండరామ్ దీనిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రంగరాజన్‌పై దాడి అమానుషం

నిందితులు ఎవరైనా కఠినంగా శిక్షించాలి

- అవసరమైతే భద్రత ఏర్పాటు చేయాలి
- సౌందరరాజన్, రంగరాజన్ కుటుంబానికి అండగా ఉంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



రంగరాజన్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి జరగడం దారుణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు అన్నారు. సోమవారం కొడంగల్‌లో రైతు దీక్షకు వెళుతున్న ఆయన చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి రంగరాజన్‌ను పరామర్శించారు. దాడికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, అందుకు రంగరాజన్‌పై జరిగిన దాడే నిదర్శనమన్నారు. దాడికి పాల్పడిన వారు ఎవరైనా, ఏ పేరుతో చేసినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది అభిమానులను ఉండి, చిలుకూరు బాలాజీ సేవలో నిమగ్నమైన రంగరాజన్, సౌందరరాజన్ కుటుంబ పరిస్థితే ఇలా అంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారు ఏ ముసుగులో ఉన్నా, ఏ జెండా పట్టుకున్నా వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే రంగరాజన్ కుటుంబానికి భద్రత కల్పించాలని కోరారు. సౌందరరాజన్, రంగరాజన్ కుటుంబానికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కార్తీక్ రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.

బస్సు దిగుతూ కిందపడి మహిళకు తీవ్ర గాయాలు

కుషాయిగూడ: ఆర్టీసీ బస్సు దిగుతూ ప్రమాదవశాత్తు కింద పడటంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆలేరుకు చెందిన జయమ్మ ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటూ ఇళ్లల్లో పని చేస్తుంది. సోమవారం ఆమె ఆలేరు వెళ్లేందుకు ఈసీఐఎల్ బస్‌స్టాప్‌కు వచ్చింది. ఘట్‌కేసర్ వైపు వెళుతున్న బస్సు అనుకుని అఫ్జల్‌గంజ్‌కు వెళ్లే కుషాయిగూడ డిపోకు చెందిన బస్సు ఎక్కింది. కండక్టర్ బస్సు ఘట్‌కేసర్ వెళ్లదని చెప్పడంతో ఆమె కదులుతున్న బస్సులోంచి కిందకు దిగింది. దీంతో అదుపుతప్పి కిందపడటంతో ఆమె ఎడమ చేతిపై నుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్రైవర్ రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

సనత్‌నగర్: ఎదురెదురుగా రోడ్డు దాటుతున్న ఇద్దరు మహిళలను కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.రసూల్‌పురా వల్లభాయ్‌పటేల్‌నగర్‌కు చెందిన యాదమ్మ బంజారాహిల్స్‌లో హౌస్ కీపింగ్ పని చేస్తుంది. సోమవారం ఉదయం రసూల్‌పురా మెట్రోస్టేషన్ వద్ద రోడ్డు దాటుతుండగా, అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరో మహిళ లక్ష్మి (37) రోడ్డు దాటబోయింది. ఇద్దరు మహిళలు ఎదురెదురుగా రోడ్డు దాటుతూ మధ్యలోకి చేరుకున్నారు. అదే సమయంలో రోడ్డుపై వస్తున్న వ్యాగనార్ కారు డ్రైవర్ వారిని గుర్తించి వేగాన్ని తగ్గించాడు. అయితే వెనుక నుంచి వేగంగా వచ్చిన బెంజ్ కారు వ్యాగనార్‌ను బలంగా ఢీకొంది. దీంతో వ్యాగనార్ కారు ఇద్దరు మహిళల పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను ఆస్పత్రికి తరలించిన బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేలి ముద్రలు పట్టించాయి

- ఘరానా దొంగ అరెస్ట్
- నిందితుడిపై పలు స్టేషన్ల పరిధిలో 15 కేసులు నమోదు
- ఆరేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నేపాలీ యువకుడు



నిందితుడు గోవిందు బండారి...

బంజారాహిల్స్: ఆరేళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న ఘరానా దొంగను వేలి ముద్రల ఆధారంగా పోలీసులు పట్టుకున్నారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నేపాల్‌కు చెందిన గోవిందు బండారి అలియాస్ పదం బండారి(24) 2019లో జూబ్లీహిల్స్ రోడ్ నెం.18లో నివాసం ఉంటున్న పాయల్ శర్మ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. రూ. 50 వేల నగదు, డైమండ్ రింగ్, ఖరీదైన వాచ్ తదితరాలను చోరీ చేసి నేపాల్‌కు పారిపోయాడు. అతడి కోసం జూబ్లీహిల్స్ పోలీసులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. అదే రోజు అతను రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బ్యాంకులో చోరీకి విఫలయత్నం చేశాడు. ఈ రెండు కేసుల్లోనూ పోలీసులు నిందితుడి వేలి ముద్రలను సేకరించారు. ఇదిలా ఉండగా తనను హైదరాబాద్ పోలీసులు మర్చిపోయి ఉంటారని భావించిన బండారి 2024లో నగరానికి వచ్చి నేరాలకు పాల్పడుతున్నాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 51 సెల్‌ఫోన్లు చోరీ చేసిన అతడిని గత ఏడాది పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ కేసులో అతడి వేలి ముద్రలు సేకరించిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు వెస్ట్‌జోన్ ఫింగర్ ప్రింట్స్ బ్యూరోకు పంపారు. వాటిని పరిశీలించిన నిపుణులు 2019లో జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో జరిగిన చోరీ కేసులో లభ్యమైన వేలిముద్రలతో సరిపోల్చారు. ఆర్‌సీపురం పరిధిలో జరిగిన బ్యాంకు చోరీ యత్నం కేసులోనూ అతడిని నిందితుడిగా గుర్తించారు. ఫింగర్ ప్రింట్స్ బ్యూరో ఇచ్చిన సమాచారం మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఇటీవల ఎస్ఆర్‌నగర్ సెల్‌ఫోన్ల కేసులో బెయిల్‌పై విడుదలైన గోవిందును సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతడిపై కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, జీడిమెట్ల, ఆర్సీపురం, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌తో పాటు ఎస్ఆర్‌నగర్ పరిధిలోనూ కేసులు ఉన్నట్లు గుర్తించారు. 15 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్న అతను ఆరేళ్లుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. ఆయా చోరీల్లో గోవిందుకు సహకరించిన అతడి సహ నిందితుడు డార్జిలింగ్‌కు చెందిన రాజేష్ ఛత్రి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

అడుగడుగునా నిర్లక్ష్యమే!

- మదీనా–అబ్బాస్ టవర్స్‌లో భద్రత డొల్ల
- ఎటు చూసినా అడ్డగోలు ఉల్లంఘనలే
- నగరంలో ఇలాంటి మార్కెట్లు మరెన్నో

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలోని దివాన్ దేవిడీలో ఉన్న హోల్‌సేల్ వస్త్ర వ్యాపారుల సముదాయం మదీన అండ్ అబ్బాస్ టవర్స్ నిబంధనల ఉల్లంఘనకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇందులో అడుగడునా ఫైర్ సేఫ్టీ మెజర్స్ అతిక్రమించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. మరో కీలకాంశం ఏమిటంటే... ఈ వ్యవస్థలు లేని కారణంగా అగ్నిప్రమాదం జరిగిందన్న విషయాన్నీ సకాలంలో గుర్తించలేకపోయారు. పోలీసు సహా పలు శాఖల అధికారులు ఈ మార్కెట్‌ను సందర్శించిన నేపథ్యంలో అనేక కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నగరంలో ఇలాంటి మార్కెట్లు మరెన్ని ఉన్నాయి.. వాటిలో పరిస్థితి ఏంటనే ఆందోళన నెలకొంది.

నిబంధనల ప్రకారం ఇలాంటి వాణిజ్య సముదాయాల్లో ఉండాల్సిన అంశాలు, ఉల్లంఘనలు ఇలా...

- డబుల్ సెల్లార్, గ్రౌండ్ ప్లస్ త్రీ ఫోర్స్‌తో నిర్మితమైంది. ఈ మొత్తం విస్తీర్ణంలో 1/3 వంతు ఖాళీ స్థలం ఉండాలి.
- ఇది మచ్చుకైనా కానరాలేదు.
- భవనం చుట్టూ ఫైరింజన్ స్వేచ్ఛగా తిరిగేలా ఖాళీ స్థలం ఉండాలి.
- ముందు వైపు ఉన్నదీ అరకొర స్థలమే. ఇది తప్ప మరెక్కడికీ ఫైర్ ఇంజన్ వెళ్లలేదు.
- ప్రమాదం జరిగితే బయటపడానికి వెలుపల వైపు స్టెయిర్ కేస్ ఉండాలి.
- ఈ సముదాయానికి ఒకే ఎంట్రీ–ఎగ్జిట్ తప్ప మరో మార్గం లేదు.
- అత్యవసర సమయంలో వెలిగించేందుకు ఎమర్జెన్సీ లైట్లు, ఆటో గ్లో సిస్టమ్ ఉండాలి.
- ఎమర్జెన్సీ లైట్లు తగిన సంఖ్యలో లేవు. గ్లో సిస్టమ్ లేనే లేదు.
- ప్రమాదం జరిగితే అగ్నిమాపక సిబ్బంది కోసం ప్రత్యేక లిఫ్ట్ ఉండాలి.
- దీనికి మెట్లే సరిగ్గా లేవని అధికారులు చెబుతున్నారు.
- మంటలార్పేందుకు ఈ భవనంలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఉండాలి.
- ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లతో పాటు ఎలాంటి ప్రత్యేక వ్యవస్థ లేదు.
- అత్యవసర సమయాల్లో నీటిని సరఫరా చేసేందుకు పెద్ద పైపు ఉండాలి.
- ఎక్కడా కనిపించ లేదు.
- విద్యుత్ ఫైర్ అలారం, మాన్యువల్ ఫైర్ అలారం తప్పనిసరి.
- ఈ రెండూ లేవు.
- ప్రమాదాన్ని పసిగట్టి హెచ్చరించే ఆటోమేటిక్ వ్యవస్థ ఉండాలి.
- అగ్నిమాక అధికారులు ఇలాంటిది ఎక్కడా కనిపించలేదని పేర్కొన్నారు.
- అగ్ని ప్రమాదాల్లో మాత్రమే వినియోగించడానికి ఉపకరించే అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంక్, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ తప్పనిసరి.
- కేవలం సాధారణ వాడకానికి వినియోగించేవి మాత్రమే ఉన్నాయి.
- ప్రమాదాల సందర్భంలో నీటిని సరఫరా చేసేందుకు విద్యుత్, డీజిల్, జాకీ పంప్‌లు ప్రత్యేకంగా ఉండాలి.
- మచ్చుకైనా కనిపించలేదు.

హైడ్రా ప్రజావాణికి 64 ఫిర్యాదులు



సాక్షి,సిటీబ్యూరో: పార్కులను కాపాడండి.. రహదారులకు అడ్డంగా నిర్మించిన ప్రహరీలను తొలగించండి.. చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించండి.. మా ప్లాట్లతో పాటు.. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కొందరు కబ్జా చేస్తున్నారు.. ఇలా హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 64 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులపై అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి.. గూగుల్, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లను సరిపోల్చి.. సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు.

ఫిర్యాదులు ఇలా..

- మల్కాజిగిరి సర్కిల్, ఆర్‌కే పురం ఆఫీసర్ల కాలనీలో 3 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని ఆర్మీ ఆఫీసర్ల కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.
- కూకట్‌పల్లి జేఎన్‌టీయూకు ఎదురుగా ఉన్న సుభోధ, స్వగృహ హౌసింగ్ సొసైటీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురయ్యాయని.. అంబీర్ చెరువు అన్యాక్రాంతమైందని, ఆదిత్యనగర్‌లో ప్రజావసరాలకు ఉద్దేశించిన 2 వేల గజాల స్థలం ఆక్రమించారని ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.
- ఘట్కేసర్, జయపురి కాలనీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని.. వాటిని కాపాడాలని అక్కడి ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. 1968లో దాదాపు 56 ఎకరాల్లో వేసిన గ్రామపంచాయతీ లే ఔట్‌లో స్థలాలను ఆక్రమించుకుని విల్లాలు కట్టుకుంటున్నారని ఆధారాలతో సహా కమిషనర్ ఫిర్యాదు చేశారు.
- పోచారం మున్సిపాలిటీలోని ఏకశిలానగర్ కాలనీలోని పార్కుల స్థలాలు కబ్జా చేస్తున్నారని.. కాలనీకి వెళ్లే 50 ఫీట్ల రహదారిలో 15 అడుగుల మేర అక్కడి ఇంజినీరింగ్ కళాశాల నిర్వాహకులు ఆక్రమించి పార్కింగ్‌గా వాడుకుంటుండటంతో ఇబ్బందులు పడుతున్నామని కమిషనర్ దృష్టికి తెచ్చారు.
- బౌరంపేట గ్రామంలోని డాలర్ మెడోస్ కాలనీకి రహదారి లేకుండా చేశారని నివాసితులు ఫిర్యాదు చేశారు. దారి మూసుకుపోయి.. కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. లే ఔట్ ఆధారంగా తమకు దారి చూపాలని హైడ్రాను కోరారు.

ప్రజావాణి వినతులను సత్వరమే పరిష్కరించాలి

లక్డీకాపూల్: ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, డాక్టర్ ముకుంద రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వారు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 1561 దరఖాస్తులు అందాయని..ఆయా అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల్లో పౌరసరఫరాల శాఖకు సంబంధించిన 743, గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 735, పెన్షన్ 55, డీఈఓ 04 ఇతర శాఖలకు సంబంధించినవి 24 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సాయిరాం, జిల్లా అధికారులు ఆర్. రోహిణి, పవన్‌కుమార్, కోటాజీ, డీఎంహెచ్‌ఓ వెంకటి, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 28న చలో ఢిల్లీ

లిబర్టీ: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని చట్టాలు అమలు చేయాలని కోరుతూ మార్చి 28న చలో ఢిల్లీ చేపట్టనున్నట్లు ఆల్ ఇండియా కార్మ్ ఫెడరేషన్ ఆఫ్ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ జాతీయ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థికంగా చేయూతనివ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడికి గురి చేస్తున్నాయని ఆరోపించారు. చలో ఢిల్లీకి కార్మికులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

లిబర్టీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని లోక్ దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పుల్లూరు వెంకటరాజేశ్వరరావు కోరారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయంగా వెనుకబడిన బీసీలకు స్థానిక సంస్థల్లో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాలు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

చిందు కులాన్ని ఎస్సీ గ్రూపు-1లో చేర్చండి

లక్డీకాపూల్: చిందు సామాజిక వర్గాన్ని ఎస్సీ వర్గీకరణ గ్రూపు-1 జాబితాలో చేర్చాలని చిందు కళాకారుల సంఘం అధ్యక్షుడు, తెలంగాణ 57 ఉపకులాల జేఏసీ కన్వీనర్ పిల్లుట్ల పశుపతి చిందు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. మాదిగ ఉపకులమైన తాము మాదిగ కులంతో పోటీ పడి గ్రూపు-2లో అవకాశం పొందలేమన్నారు. మాదిగ ఉప కులాలను ఒకే గ్రూప్లో చేర్చి రిజర్వేషన్ శాతం పెంచాలన్నారు. జనాభా పరంగా కాకుండా వెనకబాటును గుర్తించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఉప కులాలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చిందు కళలను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో తెలంగాణ జేఏసీ చైర్మన్ కోలా జనార్దన్, సంఘం నాయకులు గడ్డం రాజు చిందు, పి.శేషాద్రి చిందు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



శ్రీనగర్‌కాలనీ: బీజేపీ సీనియర్ నేత, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున గర్‌కాలనీలోని బీజేపీ కార్యాలయంలో సీనియర్ నేతలు బంగారు ప్రశాంత్, కుంబాల గంగరాజు, గారపాటి అనంతలక్ష్మి, సుప్రియ, మోహన్‌రావు, ఉదయ్, ఉమేశ్ సోమవారం ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

చదువు ఒత్తిడి భరించలేక విద్యార్థి ఆత్మహత్య

ఫిలింనగర్: చదువు ఒత్తిడి భరించలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో నివసించే విజయ్‌కుమార్ (17) రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఇటీవల జరిగిన ప్రాక్టికల్స్ సరిగ్గా చేయలేదని మనస్తాపానికి గురయ్యాడు. తల్లి బయటకు వెళ్లిన సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి గతంలోనే మరణించగా తల్లి సైదమ్మకు ఒక్కగానొక్క కొడుకు విజయ్‌కుమార్ విగతజీవిగా కనిపించడంతో ఆమె శోకసంద్రంలో మునిగిపోయింది. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అరెస్టు

వెంగళరావునగర్: గంజాయితో ఉన్న యువకుడిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్‌కు చెందిన ఎం.విజ్ఞాన్ స్థానిక జవహర్‌నగర్‌లో ఉంటూ ప్రైవేట్ కంపెనీలో సేల్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 9న రాత్రి ఎస్‌ఐ బాల్‌రాజ్ పెట్రోలింగ్ చేస్తుండగా జవహర్‌నగర్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్ సమీపంలో విజ్ఞాన్ అనుమానాస్పదంగా కనిపించాడు. అతని వద్దకు వెళ్తుండగా పారిపోయేందుకు యత్నించగా పట్టుకుని రూ.2 గ్రాముల గంజాయి, లైటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓయూకు రూ.1000 కోట్లు కేటాయించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వచ్చే బడ్జెట్‌లో ఓయూకు రూ. 1000 కోట్లు కేటాయించాలని విద్యార్థి నేతలు, అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో సోమవారం విద్యార్థుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, వర్సిటీలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ప్రిన్సిపాల్ ప్రొ.కాశీం, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. కొండ నాగేశ్వర్, ప్రొ.రాహ్ షెఫర్డ్, ప్రొ.వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక బుకింగ్ రోజే ట్యాంకర్..!

- వేసవి దృష్ట్యా జలమండలి అధికారుల ముందస్తు కార్యాచరణ
- వాటర్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాల గుర్తింపు
- ఆరు చోట్ల అదనపు ఫిల్లింగ్ పాయింట్ల ఏర్పాటుకు కసరత్తు



రిజర్వాయర్ల వద్ద వాటర్ ట్యాంకర్లను నింపుతున్న దృశ్యం

బంజారాహిల్స్: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందుల్లేకుండా జలమండలి అధికారులు ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఫిబ్రవరిలోనే ఎండలు పెరిగిపోతుండడంతో క్రమంగా భూగర్భ జలాలు అడుగంటిపోతూ.. తాగునీటి సరఫరాపై ప్రభావం చూపుతోంది. దీంతో ఎక్కడెక్కడ నీటి సరఫరా డిమాండ్ ఎక్కువగా ఉంది.. ఏ ప్రాంతంలో ట్యాంకర్లు ఎక్కువగా బుక్ చేస్తున్నారు.. అనేదానిపై జలమండలి డివిజన్-6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, అమీర్‌పేట్, ఫతేనగర్, ఎస్సార్‌నగర్ ప్రాంతాల్లోని తాగునీటి రిజర్వాయర్ల పరిధిలో ఇటీవలే క్షేత్ర స్థాయిలో అధ్యాయనం చేశారు. ఎల్లారెడ్డిగూడ, జూబ్లీహిల్స్, ఫతేనగర్, బోరబండ, బంజారాహిల్స్, సోమాజీగూడ, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లో ట్యాంకర్ల డిమాండ్‌ను గుర్తించారు. వెంటనే జలమండలి ఉన్నతాధికారులు ఆ ప్రాంతాల జాబితాను స్థానిక అధికారులకు అందించి ఆరు రిజర్వాయర్ల ప్రాంతాల్లో ఆరు అదనపు ఫిల్లింగ్ పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో బంజారాహిల్స్, తట్టిఖానా, ప్రశాసన్‌నగర్, వెంకటగిరి, సోమాజీగూడ, ఎల్లారెడ్డిగూడ, ఎస్సార్‌నగర్, ఫతేనగర్, బోరబండ తదితర రిజర్వాయర్ల పరిధిలో సెక్షన్ మేనేజర్లు అప్రమత్తమయ్యారు. వాస్తవానికి డివిజన్-6 పరిధిలో 11 చోట్ల రిజర్వాయర్లకు అదనపు ఫిల్లింగ్ పాయింట్లు అవసరమని స్థానిక అధికారులు సూచించారు. అయితే ప్రాధాన్యతా క్రమంలో భారీగా డిమాండ్ ఉన్న ప్రాంతాలను గుర్తించిన ఉన్నతాధికారులు ఆ మేరకు మొదటి దశలో ఆరు రిజర్వాయర్లకు అదనపు ఫిల్లింగ్ పాయింట్లను కేటాయిస్తూ ఆదేశించారు. ఈ వేసవిలో బుక్ చేసిన రోజే వాటర్ ట్యాంకర్‌ను పంపించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రిజర్వాయర్లకు సరిపడా నీరు సరఫరా చేయడం ద్వారా సమస్యను అధిగమించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. జలమండలి డివిజన్-6 పరిధిలో ఉన్న 23 రిజర్వాయర్ల పరిధిలో 90 వేల పైచిలుకు కనెక్షన్లు ఉండగా, ప్రతిరోజూ 40 మిలియన్ గ్యాలన్ల మంచినీటిని సరఫరా చేస్తున్నారు.

దళారులను ఆశ్రయించొద్దు..

వాటర్ ట్యాంకర్ల కోసం ఎవరూ కూడా దళారులను ఆశ్రయించవద్దు. ట్యాంకర్ కావాలంటే 155313 నంబర్‌కు కాల్ చేసి బుక్ చేసుకుంటే అదేరోజే పంపిస్తాం. ఇటీవల ట్యాంకర్ల కోసం దళారులను ఆశ్రయిస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయి. ఈ విషయంలో మేము కూడా వాటర్ సెక్షన్ పరిధిలో అవగాహన కల్పిస్తున్నాం.

– హరిశంకర్, జీఎం, జలమండలి డివిజన్-6

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి


జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు జీహెచ్‌ఎంసీ వాక్‌వే పనులు త్వరగా పూర్తి చేయాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. ఇంజినీరింగ్, యూబీడీ శాఖాధికారులతో కలిసి జీహెచ్‌ఎంసీ వాక్‌వేలో జరుగుతున్నఅభివృద్ధి, సుందరీకరణ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 వైపు ఉన్న వాటర్ ఫౌంటెయిన్ పూర్తి కాగా తెలంగాణ భవన్ వైపు వాటర్ ఫౌంటెయిన్ పనులు కొనసాగుతున్నాయన్నారు. అలాగే రంగురంగుల పూల మొక్కలు ఏర్పాటు చేయాలని యూబీడీ అధికారులను ఆదేశించారు. కొన్నిచోట్ల సైన్‌బోర్డులు సరిగ్గా లేవని వాటిని సరి చేయాలని, నిర్మాణ వ్యర్థాలను తరలించాలని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్-18 డీసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, యూబీడీ డీడీ చంద్రశేఖర్, మేనేజర్ బాలయ్య, ఏఎంహెచ్‌వో భార్గవ నారాయణ, డీఈ హరేరామ్ పాల్గొన్నారు.

వైభవంగా నిత్యానంద త్రయోదశి వేడుకలు


పూజలు చేస్తున్న సత్య గౌర చంద్రదాస

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని శ్రీ స్వయంభు లక్ష్మీ నర్సింహాస్వామి హరేకృష్ణ మూవ్‌మెంట్ గోల్డెన్ టెంపుల్‌లో నిత్యానంద త్రయోదశి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్య గౌర చంద్రదాస స్వామివారికి పండ్ల రసాలు, రంగురంగుల పుష్పాలు, పంచామృతం, పంచగవ్యం, సుగంధ ద్రవ్యాలతో కూడిన 108 కలశాలతో నితాయ్ గారాంగ అష్టోత్తర శత కలశ మహాభిషేకాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

గుడ్‌విల్ కాస్తా బ్యాడ్‌విల్!

అటకెక్కిన గుడ్‌విల్ స్టోర్ నిర్వహణ



జూబ్లీహిల్స్ రోడ్డునంబర్-10లోని గుడ్‌విల్ స్టోర్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునంబర్-10 నుంచి వెంకటగిరి, కృష్ణానగర్ వైపు వెళ్లే మలుపు వద్ద 4 నెలల క్రితం ఏర్పాటు చేసిన 'ది గుడ్‌విల్ స్టోర్' నిర్వహణ అటకెక్కింది. ఎవరైనా తమ ఇంట్లో వృథాగా ఉన్న దుస్తులు, సైకిళ్లు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, మంచాలు, కుర్చీలు, పరుపులు, బల్లలు ఈ స్టోర్‌లో పెడితే అవసరమైన వారు తీసుకుని వాడుకోవాలన్నదే గుడ్‌విల్ స్టోర్ ఉద్దేశం. అయితే సర్కిల్-18 అధికారులు మంచి ఆశయంతో ఏర్పాటు చేసిన పారిశుధ్య విభాగం అధికారులు మాత్రం నెలలు గడుస్తున్నా స్టోర్‌ను ఓపెన్ చేయకుండా షట్టర్ మూసివేశారు. దీంతో కొంతమంది రెంట్‌కు తీసుకుంటామని తిరుగుతుండగా సంబంధిత అధికారులతో పాటు కొందరు ఎస్‌ఎఫ్‌ఏలు ఈ డబ్బా కిరాయికి ఇవ్వాలంటే రూ.50 వేల అడ్వాన్స్‌తో పాటు నెలకు రూ.20 వేల కిరాయి ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే విషయమై సర్కిల్-18 అధికారులకు సైతం ఫిర్యాదులు అందాయి. ఇప్పటికైనా జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డీసీ ప్రశాంతి స్పందించి ది గుడ్‌విల్ స్టోర్ర సక్రమంగా తెరిచేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

భారతీయుల బహిష్కరణ తగదు



కాచిగూడ: అమెరికా నుంచి 104 మంది భారతీయులను అక్కడి ప్రభుత్వం బహిష్కరించడం తగదని ఏఐవైఎఫ్ నేతలు పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెల్లకంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో యువత చేతులకు సంకెళ్లు వేసి సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వై జంక్షన్ వద్ద అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని నరేంద్రమోదీ ఫ్లెక్సీని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ.. భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో భారత ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు శ్రీమాన్, షేక్ మహమూద్, మాజీద్ ఆలీఖాన్, కల్యాణ్, అనిల్ కుమార్, మధు, సంజయ్ కుమార్, సుమన్, గణేశ్, భాను ప్రకాశ్, స్వామి, వేణు, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డునంబర్-12లోని శ్రీరామ్‌నగర్ బస్తీకి చెందిన మహ్మద్ సాబేర్ (30) కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. ఆదివారం వెబ్ అప్లికేషన్‌లో గోల్డ్ 365.కామ్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతుండగా సమాచారం అందుకున్న బంజారాహిల్స్ ఎస్‌ఐ ఎండీ.యాసిన్ అలీ నిందితుడిని పట్టుకున్నాడు. నిందితుడి నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్ ఫోన్‌తో పాటు ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం

వెంగళరావునగర్: యువకుడు అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన జి.కార్తీక్ అదే గ్రామంలో కాటన్ మిల్లు మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతని స్నేహితుడు జె.సుమంత్ మధురానగర్ సమీపంలో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈనెల 7న ఇద్దరూ ఒకే గదిలో ఉన్నారు. ఉదయం తన సొంతూరుకు కార్తీక్ వెళ్లాడు. గంట తర్వాత అతని సోదరుడు జి.కిరీటి సుమంత్‌కు ఫోన్ చేశాడు. తన సోదరుడి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుందని, ఇంటికి రాలేదన్నారు. దాంతో కార్తీక్ కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సుమంత్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

వెంగళరావునగర్ : వ్యక్తి అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలో నివసించే ఆర్‌వీఎస్ శివప్రసాద్ వ్యాపారం చేస్తుంటాడు. అతను 35 ఏళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఈనెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కాల్స్ చేసినా ఫలితం లేకపోవడంతో సోదరుడు ఆర్‌వీఎస్ వరప్రసాద్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం చిత్రహింసలు

వెంగళరావునగర్: అదనపు కట్నం తీసుకురావాలంటూ భార్యను భర్త, అత్త, ఆడబిడ్డలు వేధిస్తున్న ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కాలనీలో నివసించే లక్ష్మీదుర్గకు 2021 డిసెంబర్ 30న కమ్మిలి శివరామ్ ప్రసాద్‌తో పెళ్లి నిశ్చయించారు. నిశ్చితార్థం, వివాహ ఖర్చుల కోసం లక్ష్మీదుర్గ తల్లిదండ్రులు రూ.15 కోట్లు వెచ్చించారు. ఈ సమయంలో శివరామ్ ప్రసాద్ మద్యం తాగి దురుసుగా మాట్లాడాడు. అతని సోదరి కూడా కట్నం తక్కువ ఇస్తున్నారని వెళ్లిపోయింది. ఉదయ్‌పూర్‌లో డెస్టినేషన్ పెళ్లి చేయాలని డిమాండ్ చేసి ఖర్చు మొత్తం లక్ష్మీదుర్గ తల్లిదండ్రులు భరిస్తారని చెప్పాడు. రాజస్థాన్‌లో ఘనంగా పెళ్లి చేశారు. తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భర్త, ఆడబిడ్డ, అత్త,మామలు ప్రతిరోజు అవమానపరుస్తూ, హింసిస్తూ వచ్చారు. భోజనం కూడా సరిగ్గా పెట్టలేదు. ఆమె గర్భం దాల్చడంతో కొన్నిరోజులు విశ్రాంతి కోసం పుట్టింటికి పంపారు. తిరిగి అత్తగారింటికి తీసుకెళ్లకుండా నగరంలోని ఓ హోటల్‌కు తీసుకువచ్చి అబార్షన్ చేయించుకోవాలని ఒత్తిడి తెచ్చి తీవ్రంగా కొట్టారు. అందుకు ఆమె ఒప్పుకోకపోవడంతో బలం కోసమని ట్యాబ్లెట్ మింగించారు. దాంతో ఆమెకు కడుపునొప్పి వచ్చి అబార్షన్ అయ్యింది. అప్పటి నుంచి వేధింపులు మరింత ఎక్కువ అయ్యాయి. 2024లో ఆమె అత్తగారింటి నుంచి బయటకు వచ్చింది. తనను శారీరకంగా, మానసికంగా, తమ తల్లిదండ్రులను ఆర్థికంగా తీవ్రంగా నష్టపరిచిన భర్తతో పాటు అత్తమామతో ఆడబిడ్డ, మరిదిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలి

లిబర్టీ: దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి తెలిపారు. దళ్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణను ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా ఏకకాలంలో కుల గణన చేయాలని కోరుతూ ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు కార్డులు పంపుతామన్నారు. దాదాపు 11 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీలపై నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందని ఆరోపించారు. స్వయంగా ప్రధానమంత్రి బీసీగా ఉన్నప్పటికీ బీసీల కోసం ఏ ఒక్క సంక్షేమ ఆర్థిక ప్రగతిశీల పథకాన్ని ప్రవేశపెట్టలేదని ఆరోపించారు. కులగణనతో పాటు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లు కోసం కేంద్రస్థాయిలో బీసీ మంత్రిత్వ శాఖ కోసం బీసీల సమగ్ర అభివృద్ధికి రూ.2 లక్షల కోట్ల నిధుల కేటాయింపు కోసం ఇతర న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

హోలియదాసరి కులస్తులకు న్యాయం చేయాలి



లక్డీకాపూల్: ఎస్సీ వర్గీకరణలో గ్రూపు-3లో ఉన్న తమ కులాన్ని గ్రూప్-1లో చేర్చాలన్న హోలియదాసరి కులస్తుల డిమాండ్ న్యాయమైనదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో తలెత్తిన లోపాల కారణంగా పలు కులాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. అత్యంత వెనుకబడిన హోలియదాసరి కులంతో పాటు మరికొన్ని కులాలను ఒకే గ్రూపులో పెట్టి వారికి ప్రత్యేక రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. ఉమ్మడి రిజర్వేషన్ల వలన ఒక్క మాలలు తప్పా మిగితా 58 కులాలు తీవ్రంగా నష్టపోయాయని ఆరోపించారు. మాదిగలు కేవలం 3 నుంచి 4 శాతం మాత్రమే రిజర్వేషన్లు పొందారని, వాటికి అదనంగా ఒక్క శాతం ఎక్కువ ఉంటే వర్గీకరణ ఉద్యమమే రాకపోయేదనని పేర్కొన్నారు. కార్యక్రమంలో హోలియదాసరి కుల సంఘం నేత జహంగీర్, మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ డా. పృథ్వీరాజ్ యాదవ్, సయ్యద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొట్టిన కారు డ్రైవర్

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడుపుతూ ఓ యువకుడు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నాంపల్లి రెడ్‌హిల్స్‌కు చెందిన షాహజాద్ మాలిక్ (26) నిర్మాణ రంగ సంస్థలో పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో మద్యం మత్తులో కారు నడుపుతూ బంజారాహిల్స్ రోడ్డునంబర్-1 నుంచి వెళ్తుండగా హయత్‌ప్లేస్ హోటల్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో డివైడర్‌తో పాటు ఫుట్‌పాత్ ధ్వంసం కాగా కారు నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకుని మాలిక్‌ను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా మద్యం తాగినట్లు నిర్ధారణ అయ్యింది. కారును స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

వెంగళరావునగర్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లో నివసించే కె.సాయికిరణ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 9న అర్ధరాత్రి తన రూంమేట్ సుధీర్‌కుమార్ అమీర్‌పేట మెట్రో వద్ద ఉన్నానని చెప్పడంతో బైక్‌పై వెళ్లాడు. అతనిని ఎక్కించుకుని వెళ్తుండగా ఎస్‌ఆర్‌నగర్ మెట్రో వద్ద డ్రంకన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. ముందుగా వెళ్తున్న ఓ కారు డ్రైవర్ అది గమనించి ఒక్కసారిగా వెనక్కి తిప్పి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో సాయికిరణ్‌కు గాయలు కాగా వాహనం ముందుభాగం దెబ్బతిన్నది. దీంతో సాయికిరణ్ కారు డ్రైవర్ హనుమంతరావుపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో నగదు చోరీకి యత్నం

బంజారాహిల్స్: ఏటీఎంలో నగదు చోరీకి యత్నించిన నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకృష్ణానగర్‌లోని కెనరా బ్యాంక్ జూబ్లీహిల్స్ బ్రాంచ్ ఏటీఎంలోకి ఆదివారం రాత్రి ఆగంతకుడు ప్రవేశించాడు. సేఫ్ డోర్స్ పగులగొట్టి లోనికి వెళ్లి సీసీ కెమెరాలు ధ్వంసం చేశాడు. అలాగే ఏటీఎంను పగులగొట్టేందుకు విఫలయత్నం చేశాడు. దీంతో లాభం లేదనుకుని అక్కడి నుంచి ఉడాయించాడు. తెల్లవారుజామున కెనరా బ్యాంక్ మేనేజర్ దారావత్ కృష్ణకు సమాచారం రావడంతో ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఏటీఎంను రైటర్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారం దిశగా..

- రద్దీ ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్‌పాసుల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ కసరత్తు
- సర్వే చేస్తున్న సిబ్బంది


బంజారాహిల్స్ రోడ్డునంబర్-3లో సర్వే చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు జీహెచ్‌ఎంసీ చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా వాహనాలు రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఫ్లైఓవర్ల నిర్మాణాలతో పాటు అండర్‌పాస్‌లు నిర్మించేందుకు కసరత్తు చేస్తోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్ వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణానికి ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించిన డిజైన్ల రూపకల్పన పూర్తి చేశారు. వంతెనల నిర్మాణానికి అంచనా వ్యయాన్ని కూడా నిర్ధారించారు. బంజారాహిల్స్ రోడ్డునంబర్-3లోని టీవీ9 చౌరస్తాలో మసీదు మీదుగా సాగర్ సొసైటీ వరకు ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. అలాగే సాగర్ సొసైటీ చౌరస్తాలో ముగ్ధ షోరూం ముందు నుంచి అండర్ పాస్ నిర్మాణం కూడా జరగనుంది. కేబీఆర్ పార్కు వైపు నుంచి ఎస్‌ఎఫ్‌సీఎల్ వైపు టీవీ9 మీదుగా నిర్మించనున్నారు. అలాగే జీవీకే వద్ద కూడా అండర్‌పాస్ నిర్మించనున్నారు. వీటి నిర్మాణానికి రూ. 210 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు రూపొందించారు.

- మెహిదీపట్నం బస్టాప్ రైతుబజార్ నుంచి నానల్‌నగర్ వరకు 2.2 కిలోమీటర్ల దూరంలో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ప్రస్తుతం సరోజినీదేవి కంటి ఆస్పత్రి నుంచి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ ఉండగా తాజాగా నిర్మించనున్న డబుల్‌డెక్కర్ ఫ్లైఓవర్‌ను పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ నుంచి నానల్‌నగర్ చేయి వరకు నిర్మిస్తారు. రోడ్డు నుంచి పీవీఎన్ఆర్ ఫ్లైఓవర్ తొమ్మిదిన్నర అడుగుల ఎత్తులో ఉండగా డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ దీనిపై మరో తొమ్మిదిన్నర అడుగుల ఎత్తులో త్రీలేన్ ఫ్లైఓవర్‌గా నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.398 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించారు.
- లంగర్‌హౌస్ నుంచి నానల్‌నగర్ చేయి వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. నానల్‌నగర్ మీదుగా మెహిదీపట్నం నుంచి వేసే డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు దీనిని అనుసంధానిస్తారు. అలాగే అత్తాపూర్ నుంచి పార్లలల్‌గా మరో ఫ్లైఓవర్‌ను కూడా ఈ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ అనుసంధానించే డిజైన్లు కూడా రూపుదిద్దుకుంటున్నాయి. లంగర్‌హౌస్ నుంచి నానల్‌నగర్ వరకు, అత్తాపూర్ నుంచి పార్లలల్‌గా వేసే ఫ్లైఓవర్ 2.2 కిలోమీటర్ల దూరంలో నిర్మిస్తారు. ఇందుకోసం రూ.398 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపుదిద్దుకున్నాయి.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

సాక్షి మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025

మార్చి 5 నుంచి 'జాతీయ టెన్నిస్' పోటీలు



హోటా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కిలారు రాజేశ్వరరావు

బంజారాహిల్స్: మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు జూబ్లీహిల్స్ క్లబ్‌లో నిర్వహించనున్న హోటా–జూబ్లీ హిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్(జేఐసీ) నేషనల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ బ్రోచర్‌ను క్లబ్‌లో సోమవారం జేఐసీ కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు ఆవిష్కరించారు. హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్(హోటా)– జేఐసీ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించనున్నాయి. రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా సుమారు 500 మంది టెన్నిస్ క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో హోటా అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి, రామకృష్ణ, రాంబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సెట్విన్ 'ఈవీ'ధంగా...

● గ్రేటర్‌లో దశలవారీగా వంద ఎలక్ట్రిక్ బస్సులు

సాక్షి,సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణలో సెట్విన్ కూడా భాగస్వామ్యం పంచుకుంటోంది. డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ వాహనాల(ఈవీ)ను ప్రవేశపెట్టే దిశగా కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు వంద బస్సుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈవీ విధానంలో భాగంగా ఈ బస్సులను సమకూర్చుకోవాలని సెట్విన్ పాలకమండలి నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఇటీవల తీర్మానం చేసి సర్కారు ఆమోదముద్ర కోసం నివేదించింది. ప్రభుత్వ గుర్తింపుతో పరిమిత రూట్‌లలో ఇప్పటికే 60 సెట్విన్ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. కరోనా సమయంలో కొన్ని బస్సులను నిలిపివేయగా, కాలపరిమితి ముగిసిన మరికొన్ని తుక్కు కిందికి వెళ్లాయి. దీంతో ఇప్పుడు కేవలం 60 బస్సులు మాత్రమే నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఈవీ బస్సులను రోడ్డెక్కించాలని సెట్విన్ సంస్థ నిర్ణయించింది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే దశలవారీగా ఈవీ బస్సులను అందుబాటులోకి తెస్తామని సెట్విన్ ఎండీ వేణుగోపాల్ రావు తెలిపారు.

'మళ్లీ కులగణన నిర్వహించాలి'

లక్డీకాపూల్: కులగణనను వెంటనే మళ్లీ నిర్వహించి 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని జాతీయ ఓబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో బిల్లు ఆమోదింపచేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. 'కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పింది ఏమిటి.. మీరు చేస్తున్నదేమిటి'అని ఆ పార్టీ నాయకులను నిలదీశారు. బీసీ సబ్జెక్ట్‌పై రివ్యూ మీటింగ్‌లో కాంగ్రెస్‌లోని బీసీ నాయకులను కాదని జానారెడ్డి అభిప్రాయాలను ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నించారు.

కులగణన లెక్కలు తప్పుల తడక

● మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు దేవయ్య పటేల్

లక్డీకాపూల్: కులగణనలో ప్రభుత్వం చెప్పిన లెక్కలన్నీ తప్పుల తడకగా ఉన్నాయని రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ అన్నారు. ఈ కులగణనలో మున్నూరు కాపులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మున్నూరు కాపు ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రవ్యాప్తంగా మున్నూరు కాపులు 13 లక్షలు మాత్రమే ఉన్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే రీ సర్వే నిర్వహించి తమ సామాజిక వర్గ లెక్కలను పక్కాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను ప్రభుత్వానికి విన్నవించేందుకు ఈ నెల 17న అన్ని జిల్లాల కలెక్టరేట్లలో వినతిపత్రాలు సమర్పిస్తామని చెప్పారు. సమావేశంలో సంఘం నాయకులు విఠల్, మంగళారపు లక్ష్మణ్ పటేల్, పద్మావతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్ శిల్పారామంలో ఒడిశా ఫుడ్ అండ్ క్రాఫ్ట్ మేళా ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- 54వ సౌత్ జోన్ సెంట్రల్ రెవెన్యూ స్పోర్ట్స్ మీట్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఉదయం 7.30 గంటలకు జరుగుతుంది.


గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ప్రతాప సింగారం..
ఇక రియల్ బంగారం

భారీ వెంచర్‌కు ఫైనల్ లేఅవుట్ సిద్ధం చేసిన హెచ్‌ఎండీఏ

"హైదరాబాద్‌కు తూర్పున ఉన్న ప్రతాప సింగారం.. 'రియల్' శోభ సంతరించుకోనుంది. దీనికిగాను హెచ్‌ఎండీఏ నడుంబిగించింది. ఈ మేరకు ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ కూడా ముగిసింది. భారీ వెంచర్‌కు ఫైనల్ లేఅవుట్ సిద్ధం చేసింది. నగరం నలుదిక్కులా శివారు ప్రాంతాలు శరవేగంతో అభివృద్ధి చెందాలన్న ప్రభుత్వ సంకల్పంలో భాగంగా ఇది కార్యరూపం దాల్చబోతోంది. ఉప్పల్ భగాయత్ తరహాలో వెంచర్ రూపుదిద్దుకోనుంది. దాదాపు 150 మంది రైతుల నుంచి ఇప్పటికే 133 ఎకరాల పట్టా భూమితోపాటు మరో 18 ఎకరాల అసైన్డ్ భూమిని అధికారులు ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా సేకరించారు. అసైన్డ్ భూమిని రైతులు ఇచ్చినప్పటికీ కలెక్టర్ ఆమోదముద్ర పడాల్సి ఉంది." –పోచారం

● అందుబాటులోకి 133 ఎకరాల పట్టాభూమి, 18 ఎకరాల అసైన్డ్ భూమి
● ఇటీవల వెంచర్ అభివృద్ధికి రూ.120 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
● ఇప్పటికే ప్లాట్ల మార్కింగ్, రోడ్ల నిర్మాణం పూర్తి
● రైతులకు ప్లాట్ల కేటాయింపు.. త్వరలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



వెంచర్ అభివృద్ధికి రూ.120 కోట్లు

వెంచర్‌ను అన్ని రకాల మౌలిక వసతులతో అభివృద్ధి చేసేందుకు హెచ్‌ఎండీఏకు ప్రభుత్వం రూ.120 కోట్లను ఈ ఏడాది జనవరి 7న విడుదల చేసింది. 60:40 నిష్పత్తిలో ప్లాట్ల విస్తీర్ణాన్ని విభజించి ఎకరాకు 1,741 చదరపు గజాల అభివృద్ధి చేసిన ప్లాట్లను రైతు వాటాగా కేటాయిస్తారు. హెచ్‌ఎండీఏకు మొత్తం 30 ఎకరాల వాటా వస్తుంది. దీని విలువ సుమారు రూ. 270 కోట్లు ఉంటుందని అంచనా. ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తున్నందున ప్రతాపసింగారానికి రూ. 10 కోట్లను ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించి తమ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. అందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. అసైన్డ్ ల్యాండ్ ఇచ్చిన రైతులకు చట్ట ప్రకారం అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఎకరాకు 600 చదరపు గజాలు కేటాయించాలి. కానీ, వెయ్యి చదరపు గజాలు కావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్ల నిర్మాణం, ప్లాట్ల కేటాయింపు..

వెంచర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి మూడేళ్లు అవుతోంది. కొద్ది మంది రైతులు భూములను స్వాధీనం చేయడంలో జాప్యం కారణంగా లేఅవుట్ పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగలేదు. నిర్ణీత గడువులోగా వెంచర్ అభివృద్ధి చేయలేకపోతే రైతులకు భూమి విలువలో ఏటా 5 శాతం పరిహారంగా హెచ్‌ఎండీఏ చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే వెంచర్‌లో రోడ్లు నిర్మించి, మార్కింగ్ చేసిన ప్లాట్లను రైతులకు కేటాయించారు. ఉప్పల్ భగాయత్ నుంచి ఓఆర్‌ఆర్ వరకు 150 అడుగుల వెడల్పుతో వెళ్లే రేడియల్ రోడ్ నెంబర్ 20 మణిహారంలా ఈ వెంచర్‌కు ఆనుకునే ఉంది.

త్వరలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ షురూ..

ఇరిగేషన్ అధికారులు వెంచర్‌ను పరిశీలించి ఎన్‌వోసీ జారీ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ముగియగానే రైతులకు ప్లాట్లను రిజిస్టర్ చేసేందుకు హెచ్‌ఎండీఏ కసరత్తు చేస్తోంది. అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండేవిధంగా 110, 130, 190, 200, 220, 300, 400, 600, 1,200, 1,300, 1,500, 2,000 గజాల చొప్పున, ఒక ఎకరం, 2 ఎకరాలు, 3 ఎకరాలుగా ప్లాటింగ్ చేశారు. ఐటీ, వర్క్ స్టేషన్లు, డేటా సెంటర్ల ఏర్పాటు దిశగా కసరత్తు జరుగుతోంది. వీటి ద్వారా సుమారు 10 వేలకు పైగా మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయి.

డేటా సెంటర్ కోసం కృషి



ప్రతాప సింగారంలోని హెచ్‌ఎండీఏ వెంచర్‌లో డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరాం. రూ.10 కోట్లను ప్రత్యేకంగా కేటాయించి ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశాం. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ల్యాండ్ పూలింగ్‌కు రైతులు సహకరించడాన్ని శుభపరిణామంగా భావిస్తున్నా.

– మలిపెద్ది సుభాష్‌రెడ్డి, ప్రతాపసింగారం

తూర్పు వైపు అభివృద్ధికి దోహదం..



హెచ్‌ఎండీఏ వెంచర్ల వల్ల తూర్పు హైదరాబాద్‌లో ఆస్తులకు డిమాండ్ పెరుగుతోంది. నగరంతో అద్భుతమైన అనుసంధానం ఏర్పడుతోంది. వ్యక్తిగతంగా భూములను అభివృద్ధి చేసుకోవడం అనేక ఖర్చులతో కూడుకున్న పని, కష్టసాధ్యం. అందుకే ల్యాండ్ పూలింగ్‌ను సమ్మతించాం. ఈ వెంచర్‌ను సకాలంలో అభివృద్ధి చేసి, మరో వెంచర్‌కు శ్రీకారం చుట్టాలని కోరుతున్నాం.

– జున్ను నరేష్, భూ యజమాని, ప్రతాపసింగారం

సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి

● జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణికి 155 అర్జీలు
● అధికారులకు దిశానిర్దేశం చేసిన కమిషనర్ ఇలంబర్తి



జీహెచ్‌ఎంసీలో జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

లక్డీకాపూల్: ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల సత్వర పరిష్కారంపై దృష్టి సారించామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వీకరించారు. పలు సమస్యలకు అప్పటికప్పుడు పరిష్కారం దిశగా పలు సూచనలు చేశారు. ఇలంబర్తి మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులన్నింటినీ విభాగాలవారీగా పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్కిల్ వారీగా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ..ఈ కార్యక్రమంలో అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిపై ప్రతి వారం సమీక్షిస్తున్నామని కమిషనర్ తెలిపారు. కాగా, ప్రజావాణి కార్యక్రమంలో 59 విన్నపాలు ఉన్నాయని, ఫోన్ ఇన్ ద్వారా నాలుగు ఫిర్యాదులు, ఆరు జోన్లలో మొత్తం 96 అర్జీలు అందాయని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, గీతా రాధిక, పంకజ, అశోక్ సామ్రాట్, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరిరావు, యు.బి.డి డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అడిషనల్ సి.సి.పి.లు ప్రదీప్, గంగాధర్, (ఎల్.ఏ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, జె.సి రెవెన్యూ మహేష్ కులకర్ణి, డిప్యూటీ సీఈ పనసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఖనిజ సంపద కీలకం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

రాయదుర్గం: దేశాభివృద్ధిలో ఖనిజ సంపద ఎంతో కీలకమైనదని ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కి)లో 'జాతీయ ఇంధన భద్రత–అరుదైన ఖనిజ సంపద అన్వేషణ'అనే అంశంపై ఎస్కి, కోల్ ఇండియా లిమిటెడ్, జాతీయ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఉపరితలంపై ఉండే ఖనిజసంపద కన్నా ఎన్నో రెట్లు విలువైన ఖనిజ సంపద భారీగా సముద్రగర్భంలో దాగి ఉందన్నారు. కోబాల్ట్, కాపర్, లిథియం, నికెల్ తదితర 24 రకాల ముఖ్యమైన ఖనిజాలు దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. హెచ్‌సీయూ విజిటింగ్ ఫ్యాకల్టీ డాక్టర్ యమునాసింగ్ మాట్లాడుతూ పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించడానికి, జీరోకార్బన్ ఎమిషన్ సాధించే దిశగా ఇంజనీరింగ్ యువత ముందుకు రావాలన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పూర్వ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హరి సర్వోత్తమ్ మాట్లాడుతూ భారతదేశం సెమీ కండక్టర్ హబ్‌గా మారే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్కి డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు, మైనింగ్ డివిజన్ హెడ్ కెజెఅమర్‌నాథ్, ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు, ప్రొఫెసర్లు, అధికారులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీలో భూ సర్వే

ఎమ్మెల్యే మల్లారెడ్డిపై భూ కబ్జా ఆరోపణలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిపై మరోసారి భూకబ్జా ఆరోపణలు వెల్లువెత్తాయి. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ కోసం భూమి కబ్జా చేసి నిర్మాణాలు చేశారంటూ పలువురు ఎమ్మెల్యేపై ఇదివరకు కోర్టులో కేసులు వేశారు. ఈ క్రమంలో సోమవారం భూసర్వే చేసేందుకు కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు న్యాయవాది, సర్వేయర్ మల్లారెడ్డి యూనివర్సిటీలో సర్వేకు రావడంతో ఉద్రిక్తత ఏర్పడింది. వివరాల్లోకి వెళితే... మైసమ్మగూడలోని సర్వే నెంబర్ 641, 642, 643, 644 లలో పిట్ల వీరయ్యకు 14 ఎకరాల భూమి ఉండగా అతని ఇద్దరు భార్య(లక్ష్మీ, సత్తమ్మ)లకు సమానంగా భూమిని కేటాయిస్తూ అప్పట్లో వీలునామా రాశాడు. మొదటి భార్యకు చెందిన 7 ఎకరాల్లో ఆమె కుమారులు చంద్రయ్య, నర్సింహ్మా రెండు ఎకరాల భూమిని ఎమ్మెల్యే మల్లారెడ్డికి విక్రయించారు. అయితే మిగతా 12 ఎకరాలను కూడా కబ్జా చేసి కళాశాల నిర్మించారని వీరయ్య రెండో భార్య కుమారుడు పిట్ల యాదగిరి 2012లో కోర్టు (పార్టిషన్ సూట్)ను ఆశ్రయించారు. ఈ మేరకు కోర్టు భూసర్వేకు ఉత్తర్వులు జారీ చేసింది. భూమి పూర్తిగా మల్లారెడ్డి యూనివర్సిటీలో, మల్లారెడ్డి కబ్జాలో ఉందంటూ యాదగిరి అతని న్యాయవాది, మండల సర్వేయర్‌తో కలిసి సోమవారం యూనివర్సిటీకి చేరుకున్నారు.

సర్వేకు వీలు లేదంటూ...

కోర్టు నోటీసులలో తమ పేర్లు లేవని, సర్వే చేసేందుకు వీలు లేదని మల్లారెడ్డి కుమారుడు, మల్లారెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి మహేందర్‌రెడ్డి సర్వేయర్‌ను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని జోక్యం చేసుకోవడంతో న్యాయవాదుల సమక్షంలో సర్వేకు ఒప్పుకున్నాడు. దీంతో యూనివర్సిటీలో అధికారులు సర్వే నిర్వహించారు. ఆయా సర్వే నెంబర్లలో 10 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించి సర్వే చేశామని మండల సర్వేయర్ తెలిపారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులను అందజేయనున్నట్లు చెప్పారు.



మల్లారెడ్డి యూనివర్సిటీలో సర్వే చేస్తున్న అధికారులు

'ఎలక్షన్' బిల్లులను చెల్లించండి

– జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్ల డిమాండ్

లక్డీకాపూల్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల పనులకు సంబంధించిన రూ.27.50 కోట్ల బిల్లులను వెంటనే చెల్లించాలని జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. పనులు పూర్తై 15 నెలలు కావస్తున్నప్పటికీ బిల్లుల చెల్లింపుల్లో అలసత్వం వహించడంతో కాంట్రాక్టర్లు రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రిటర్నింగ్ అధికారులకు నియోజకవర్గానికి రూ.1.80 కోట్ల చొప్పున అడ్వాన్సుగా నిధులు వచ్చినప్పటికీ కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. కొంతమంది రిటర్నింగ్ అధికారులు తమ అనుచరులతో పనులు చేయించారని, వారికి మాత్రం వెంటనే బిల్లులు చెల్లించారని కాంట్రాక్టర్ సాయి కిరణ్ అన్నారు. బిల్లులు వెంటనే చెల్లించని యెడల గ్రేటర్ పరిధిలో జీహెచ్‌ఎంసీ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

18న ఆర్‌ఎంపీ, పీఎంపీల మహాధర్నా



మాట్లాడుతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘాల నాయకులు

సుల్తాన్‌బజార్: అక్రమాలకు పాల్పడే కార్పొరేట్ ఆసుపత్రులను వదిలి పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు చేస్తోందని తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదర్‌గూడ ఎన్‌ఎస్‌ఎస్‌లో వేదిక ప్రతినిధులు పులగం మోహన్, రమేష్ ముదిరాజ్, బాలకృష్ణారెడ్డి, ఉక్కుల అశోక్ విలేకరులతో మాట్లాడారు. దాడులకు నిరసనగా ఈ నెల 18న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వల్లే ఆర్‌ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు దక్కలేదని, ఇప్పుడేమో మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఆరు నెలల శిక్షణతో పాటు గుర్తింపు సర్టిఫికెట్ ఇస్తామని ఆరోగ్యశాఖ మంత్రి తమకు హామీ ఇచ్చారని, ప్రభుత్వం నుంచి సానుకూల ప్రకటన వస్తున్న సమయంలో హరీశ్‌రావు తన అనుకూల వర్గంతో కొత్త డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. సమావేశంలో బాల్‌రాజ్, రమేష్ పాల్గొన్నారు.

హరీశ్‌రావు మద్దతు తగదు: టీజూడా

అర్హత లేని ఆర్‌ఎంపీ, పీఎంపీలకు చట్టబద్ధమైన గుర్తింపు కోరుతూ నిర్వహించే నిరసనలను తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించింది. మాజీ ఆరోగ్యమంత్రి హరీష్‌రావు ఈ నిరసనకు మద్దతు ఇవ్వడం తగదని నాయకులు డాక్టర్ రాహుల్ పేర్కొన్నారు.

లులు మాల్‌ను సందర్శించిన బహ్రెయిన్ ప్రతినిధులు



లులు మాల్‌ను సందర్శించిన బహ్రెయిన్ ప్రతినిధి బృందంతో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మూసాపేట: కూకట్‌పల్లిలోని లులు మాల్‌ను బహ్రెయిన్ వాణిజ్య, పారిశ్రామిక ప్రతినిధి బృందంతోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సోమవారం సందర్శించారు. బెహ్రెయిన్ దేశానికి భారత రాయబారి మొహమ్మద్ అల్కోహేజి, అబ్దుల్ రెహ్మాన్ నాయకత్వంలో లులుమాల్‌ను పరిశీలించారు. భారత్, బహ్రెయిన్ దేశాల మధ్య ఎగుమతులు, దిగుమతుల గల అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్, ప్రొడక్ట్స్‌కు డిమాండ్ ఉందన్నారు. పత్తి, పప్పుదినుసులు, మామిడి, ఇతర పండ్లు, పూలు, కాయగూరలతోపాటు మాంసం, పౌల్ట్రీలలో దేశంలోనే రాష్ట్రం నెంబర్ వన్‌గా ఉందన్నారు. కార్యక్రమంలో లులు గ్రూప్ ఇండియా సీఓఓ రేజిత్ రాధాకృష్ణన్, రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదిర్, రీజినల్ మేనేజర్ మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తాం

జలమండలి జీఎం మహేందర్‌నాయక్



అశోకా లివియానా గేటెడ్ కమ్యూనిటీకి నీటి సరఫరాను ప్రారంభించిన నాయకులు, అధికారి

మణికొండ: గండిపేట మండలంలోని ప్రతి ఇంటికీ తాగునీటిని ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని జలమండలి మణికొండ డివిజన్ జనరల్ మేనేజర్ మహేందర్‌నాయక్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఉన్న అశోకా లివియానా గేటెడ్ కమ్యూనిటీకి సోమవారం మంచినీటి కనెక్షన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో మరిన్ని రిజర్వాయర్లు అందుబాటులోకి వచ్చాయని, రాబోయే వేసవికాలంలో అంతరాయంలేని నీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మరికొన్ని కాలనీలకు అవసరమైన పైప్‌లైన్లు, రిజర్వాయర్ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించారు. మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ గతంలో అశోకా లివియానాకు తాగునీటిని అందిస్తామని ఇచ్చిన మాట ఇప్పుడు నిలుపుకున్నామని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలకు తాగునీటిని అందించేందుకు పైప్‌లైన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఎస్.శ్వేతా కిరణ్ కుమార్, లక్ష్మీనారాయణ, నాయకులు బి.ముత్యాలు, తాజుద్దీన్, అశోకా లివియానా సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్, నాయకులు రఘు, శ్రీలత, శశికళ తదితరులు పాల్గొన్నారు.

'సమతా కుంభ్'లో ధ్వజారోహణం



శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలం ముచ్చింతల్ శివారులో ఉన్న సమతాస్ఫూర్తి కేంద్రంలో నిర్వహిస్తున్న సమతా కుంభ్ మూడో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వైభవంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం సుప్రభాత గోష్ఠితో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. శ్రీత్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగ్నిప్రతిష్ఠ అనంతరం సమతాస్ఫూర్తి ఎదురుగా గరుడ పటాన్ని ఆవిష్కరించారు. సర్పదోషాల నివారణ, సంతానం లేని స్త్రీలకు స్వామి చేత గరుడ ప్రసాదం పంపిణీ చేశారు. సాకేత రామచంద్రుని సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. శ్రీరంగం వాసులు విష్ణుచిత్తన్ స్వామికి చినజీయర్ చేతుల మీదుగా 32వ గోపాలో పాయనం పురస్కారం అందజేశారు. సాయంత్రం గరుడ వాహన సేవలను నిర్వహించారు.

ఇక ఏఐ ఆధారిత ఇంటర్వ్యూలే!

● నియామక ప్రక్రియలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం
● నగర కేంద్రంగా అధునాతన జెడ్ ఇంటర్వ్యూ ఏఐ ఆవిష్కరణ



లక్డీకాపూల్: ఆయా సంస్థల ఉద్యోగ నియామక ప్రక్రియలో ఉన్న సమస్యలను అధిగమించడమే లక్ష్యంగా రిక్తమ్ గ్రూప్ తన అధునాతన జెడ్ 'ఇంటర్వ్యూ ఏఐ'ని ఆవిష్కరించింది. ఈ నూతన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ప్లాట్‌ఫారం ఆటోమేటెడ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ నియామక ప్రక్రియను సరికొత్తగా మార్చనుంది. హెచ్‌ఆర్ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనుంది. సోమవారం హోటల్ తాజ్ దక్కన్‌లో జరిగిన మీడియా సమావేశంలో జెడ్ ఇంటర్వ్యూ ఏఐ వ్యవస్థాపకుడు, సీఈవో (రిక్తం టెక్నాలజీ కన్సల్టింగ్ డైరెక్టర్) సిద్ధరామ్ శింగశెట్టి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సును ఉపయోగించి టాలెంట్ హైరింగ్‌ను సులభతరం చేయనున్నామని పేర్కొన్నారు. దీని ద్వారా సంస్థలు సమయాన్ని, వనరులను ఆదా చేసుకోవచ్చన్నారు. నియామక ప్రక్రియలో వేగం, కచ్చితత్వం, సమానత్వం చాలా అవసరమని, సరైన అభ్యర్థులను ఎంపిక చేయడం ఇప్పటికీ సమస్యగా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమస్యలను 24/7 సదుపాయం గల ఏఐ ఆధారిత ఇంటర్వ్యూల ద్వారా జెడ్ ఇంటర్వ్యూ పరిష్కరిస్తుందన్నారు. ఇంటర్వ్యూల షెడ్యూలింగ్ జాప్యాలను తొలగించడం, పక్షపాత రహిత మూల్యాంకనం, డేటా ఆధారిత విశ్లేషణలతో సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఈ ఏఐ 15 పైగా భాషల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని తెలిపారు. జెడ్‌ఇంటర్వ్యూ ఏఐ సహ వ్యవస్థాపకుడు విజేందర్ జైన్ మాట్లాడుతూ గత జూన్‌లో సాఫ్ట్ లాంచ్ పైలట్‌గా ప్రారంభమైన జెడ్‌ఇంటర్వ్యూఏఐ కొన్ని నెలల్లోనే వేగంగా విస్తరించిందని, ప్రతినెలా వేలాది ఏఐ ఇంటర్వ్యూలను నిర్వహించే స్థాయికి చేరుకుందన్నారు. వ్యవసాయ రంగంలో ప్రొఫెషనల్ పెట్టుబడిదారులను ఆకర్షించి మరింత విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నామని జైన్ పేర్కొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 11, ఫిబ్రవరి, 2025

- నగరంలో వాలంటైన్స్ వీక్ హడావుడి
- వాస్తవ రూపం దాల్చుతున్న ప్రేమికుల వారం
- అధునాతన జీవనశైలికి ప్రతిబింబంగా ఈ తరం
- సోషల్ మీడియా వేదికగా గిఫ్ట్స్ వీడియోలు వైరల్
- పలు మాధ్యమాల్లో ఇన్ఫ్లుయెన్సర్లు, సెలబ్రిటీల సందడి



మిసెస్ ఇండియా పోటీలకు 11మంది ప్రాతినిధ్యం



బంజారాహిల్స్: మిసెస్ ఇండియా తెలంగాణ–2025 గ్రాండ్ ఫినాలేను విజయవంతంగా నిర్వహించిన తర్వాత, ఈ ఏడాది చివర్లో జరగనున్న మిసెస్ ఇండియా– 2025 జాతీయ వేదికపై రాష్ట్రస్థాయి 11 మంది విజేతలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని ప్రాంతీయ డైరెక్టర్ మమతా త్రివేది తెలిపారు. సంస్థ కార్యక్రమంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. డాక్టర్ రష్మి కాండ్లికర్, డాక్టర్ పి. సీత సూపర్ క్లాసిక్ విభాగంలో (60 ఏళ్లు పైబడిన వారు) తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, మైత్రేయీ అమృత, అర్చన కొనకంచి, జే. శృతి క్లాసిక్ విభాగంలో, శ్రీమతి కేటగిరీలో సుదీప్తా దాస్, మితాలీ అగర్వాల్ పాల్గొంటారని ఆమె తెలిపారు.

ఎయిర్‌పోర్ట్‌లో అమృత్ కదంబమ్..



సాక్షి, సిటీబ్యూరో: భిన్న రకాల పానీయాల ఉత్పత్తుల ద్వారా ప్రపంచ ప్రసిద్ధి చెందిన అమృత్ బ్రాండ్.. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో తమ ఉత్పత్తుల్ని అందుబాటులోకి తెస్తూ డ్యూటీ ఫ్రీ స్టోర్‌లో ఓ విభాగాన్ని ఏర్పాటు చేసింది. దీనిని ఎయిర్‌పోర్ట్‌లో మాత్రమే లభించేలా తమ కదంబమ్ పానీయాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ రక్షిత్ ఎస్ జగదాలె మాట్లాడుతూ సంప్రదాయం, ఆధునికతల సమ్మేళనం తమ కదంబమ్ అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని విమాన ప్రయాణికుల కోసం తాము మరింత అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు.

ఏఐ స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్..

ప్రారంభించిన ఎఫ్ఐఎఫ్ఎస్

సాక్షి, సిటీబ్యూరో: స్పోర్ట్స్ టెక్‌లో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చే దిశగా ప్రముఖ స్పోర్ట్స్ ఏఐ ఛాలెంజ్ 'స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్' జరగనుంది. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్ (ఎఫ్ఐఎఫ్ఎస్) ఆధ్వర్యంలో డ్రీమ్ 11 సమర్పణలో ఈ గేమ్‌థాన్ అధునీకరించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతికతను ఇందులో వినియోగించనున్నారు.

ఈ గేమ్‌థాన్‌లో ఐఐటీ బాంబే, ఐఐటీ ఢిల్లీ వంటి ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి విద్యార్థి జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనేవారు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సందర్భంగా రోజువారీ ఫాంటసీ స్పోర్ట్స్ ఫార్మాట్‌లో పోటీపడనున్నారు.




52 జట్లు షార్ట్ లిస్ట్ చేశాం..

ఈ ప్రతిష్టాత్మక పోటీకి 30కి పైగా ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్ డైరెక్టర్ జనరల్ జాయ్ భట్టాచార్య తెలిపారు. వారి వ్యూహాత్మక ప్రణాళికలను సమీక్షించిన తర్వాత ఐఐటీ బాంబే, ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ కాన్పూర్, ట్రిపుల్ ఐటీ ధార్వాడ్ వంటి సంస్థల నుంచి 52 జట్లను షార్ట్‌లిస్ట్ చేసినట్లు వివరించారు. మొదటి మూడు జట్లు వరుసగా రూ.12.5 లక్షలు, 7.5 లక్షలు, 5 లక్షలు మొత్తం 25 లక్షలు బహుమతిగా నిర్ణయించామని, తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో ఏఐ వైస్ డీన్ ప్రొఫెసర్ విశాల్ మిశ్రా దీనికి మార్గదర్శకత్వం అందించనున్నారు.

నువ్వుంటే.. నా జతగా..







వీచే చిరుగాలిని వెలివేస్తా..
పారే నదినావిరి చేస్తా..
నేనున్న నేలంతా మాయం చేశా
లేనేలేదే అవసరమే..
నువ్వే నాకు ప్రియవరమే..
నువ్వుంటే నా జతగా
నేనుంటా ఊపిరిగా
నువ్వైనా నమ్మవుగా
చెలియా నేనెవరంటూ
ఎవరూ గుర్తించరుగా
నా ప్రేమవు నువ్వంటూ
నీకోసం ఈ లోకం బహుమానం చేసేస్తా
నువులేని లోకంలో నన్నే నే బలిచేస్తా

నువ్వుంటే నా జతగా అంటూ రామజోగయ్య శాస్త్రి రచించిన పాటకు ఏ ఆర్ రెహ్మాన్ అందించిన స్వరాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.. ఈ పాట వింటున్నప్పుడు ఎంత ఫీల్ ఉంటుందో.. ప్రేమికుల దినోత్సవానికి ముందు జరుపుకునే వాలంటైన్స్ వారంలో అంతటి ఫీల్ ఉంటుందని తెలుస్తోంది.. నగరంలో హడావుడి చూస్తోంటే.. వ్యాపార వర్గాల మొదలుకుని పర్యాటక రంగం వరకూ వాలంటైన్స్ డే సందర్భంగా అనేక ప్యాకేజీలు ప్రకటిస్తున్నారు.. దీనికితోడు యువత హడావుడీ మామూలుగా లేదనేలా సందడి నెలకొంది. ఈ నేపథ్యంలో దీని గురించి మరిన్ని విశేషాలు.. - సాక్షి, సిటీబ్యూరో

ఫిబ్రవరి నెల మొదటి రెండోవారం మొదలైన దగ్గర నుంచి సోషల్ మీడియాలో వాలంటైన్స్ వీక్ సందడి కనబడుతోంది. గత రెండు మూడు రోజులుగా ఎక్కడ చూసినా ఇదే సందడి అన్నట్లుంది హడావుడి. అయితే ఈ వాలంటైన్ వీక్ కొత్తదేం కాదు.. ఈ సంస్కృతి ఎప్పటి నుంచో ఉంది. కానీ ఈ ప్రేమికుల వారం నగర సంస్కృతిలో మరింత భాగమైన సూచనలు కనిపిస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా వాలంటైన్స్ వీక్ సంబంధించిన పోస్టులు, రీల్స్ తెగ వైరల్ అవుతున్నాయి. యానిమేటెడ్, విఎఫ్ఎక్స్ వీడియోలు కాకుండా చాలమంది యువతరం స్వయంగా వీడియోలు చేసి నెట్టింట పెట్టడంతో వైరల్‌గా మారుతున్నాయి. దీనికి సంబంధించి వాలంటైన్ వీక్‌లో మొదటి రోజైన రోజ్ డే ప్రభావం అధికంగా కనిపించింది. ఈ నేపథ్యంలో సోమాజిగూడలోని ఓ ఫ్లవర్ బొకే షాపు యజమాని జలీల్‌తో ముచ్చటించగా.. ఈ నెల 6న చిన్న సైజు గులాబీ పువ్వుల కోసం చాల ఆర్డర్లు వచ్చాయని, అంతేకాకుండా రోజ్ డే అయిన 7వ తేదీన విడి రోజా పూలను అధిక సంఖ్యలో అమ్మానని చెప్పుకొచ్చాడు. సాధారణంగా బొకేలు తప్ప విడిగా ఒక్కొక్క గులాబీ పువ్వులు అంతగా అమ్ముడుపోవు.. ఈ రోజ్ డే ప్రభావమే దీనికి కారణమని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు.

ప్రేమను పంచుకోవాలి కదా..!

ఏళ్ల తరబడి వాలంటైన్స్ వీక్ అని చెప్పుకోవడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం తప్ప వాస్తవంగా అంతగా జరుపుకోలేదు. కానీ ప్రస్తుతం ఈ సంస్కృతి మెల్లమెల్లగా పెరుగుతోంది. చాక్లెట్ డే రోజు చాక్లెట్ ఇవ్వడం, హగ్ డే రోజు హగ్ చేసుకోవడం, ప్రపోజ్ డే రోజు ఖచ్చితంగా తమ ప్రేమను మళ్లీ ఒకసారి వ్యక్తపరచడం.. ఇలా ఈ తరం 'ప్రేమికుల వారాన్ని' స్వయంగా ఆస్వాదిస్తున్నారు. విదేశాల్లోనో, స్థానికంగానో ఉండి కలవడానికి వీలుకాని ప్రేమికులు.. డెలివరీ యాప్స్‌లో గులాబీ పూలను, చాక్లెట్లను ఆయా ప్రత్యేక రోజుల్లో తమ భాగస్వాములకు డోర్ డెలివరీ చేస్తుండటం విశేషం. ఇందులో భాగంగా వాలంటైన్స్ వీక్‌లో టెడ్డీ డే, రోజ్ డే, చాక్లెట్ డే రోజున వీటి ఆర్డర్ల సంఖ్య నగరంలో భారీగా పెరిగిందని డెలివరీ సంస్థల యాజమాన్యాలు చెబుతున్న మాట. హగ్ డే, ప్రామిస్ డే వంటివి వర్చువల్ వేదికగా సరిపెట్టుకుంటున్నారు. తమ ప్రేమికుడు లేదా ప్రేమికురాలు ఇచ్చిన ఈ గిఫ్టులకు మంచి లవ్ మెలోడీ ట్రాక్‌ని జోడించి వాట్సాప్ స్టేటస్‌లు, ఇన్‌స్టా పోస్టులతో సందడి చేస్తున్నారు. అయితే ఈ సోషల్ వాలంటైన్స్ వీక్‌లో ప్రముఖ ఇన్‌ఫ్లుయెన్సర్లు, సెలిబ్రిటీలు కూడా ఉండటం విశేషం.

ప్రేమికుల దినోత్సవం కోసం ప్యార్ బజార్..

సాక్షి, సిటీబ్యూరో: వాలంటైన్స్ డేని పురస్కరించుకుని ప్రముఖ ఆన్‌లైన్ విపణి.. అమెజాన్ 'ప్యార్ బజార్' పేరిట సరికొత్త ఫ్యాషన్ ఉత్పత్తులు, ఫోన్ యాక్సెసరీలను ప్రత్యేకంగా అందిస్తోంది. ఈ విషయాన్ని అమెజాన్ ఇండియా సెంట్రల్ షాపింగ్ ఎక్స్‌పీరియన్స్ డైరెక్టర్ జహీద్ ఖాన్ తెలిపారు. ఓ చక్కని రొమాంటిక్ డేట్ ఎంజాయ్ చేసేందుకు వీలైన ఉత్పత్తుల, గిఫ్ట్ ఆర్టికల్స్ జ్యువెలరీ మొదలుకుని, మనసును హత్తుకునేలా వాలంటైన్స్ డే కోసం ప్యార్ బజార్ విభాగంలో లభిస్తాయని వివరించారు.



కళ్లున్నోడు ముందు మాత్రమే చూస్తాడు.. దిమాక్ ఉన్నోడు దునియా మొత్తం చూస్తాడు..ఓ సినిమాలో మహేష్ చెప్పిన డైలాగ్ ఇది.. అదే రీతిలో.. కళ్లు కనిపించకపోయినా.. దునియా మొత్తం తనవైపు చూసేలా ఆత్మ సంకల్పంతో వైకల్యాన్ని జయించి 'గోల్'బాల్ కొట్టాడు. మనలో ప్రతిభ ఉంటే సరిపోదు.. అందుకు తగిన లక్ష్యం ఉన్నప్పుడే ఎందులోనైనా రాణించగలం.. సరిగ్గా ఇదే చేసి నిరూపించాడు.. నగరానికి చెందిన లక్కీమిరానీ. జాతీయ స్థాయిలో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఇప్పటికే వరుసగా నాలుగు కాంస్య పతకాలను సాధించాడు.. లక్కీమిరానీ గురించిన మరిన్ని విశేషాలు తెలుసుకుందాం.. - రాయదుర్గం

వైకల్యాన్ని జయించిన గోల్‌బాల్

జాతీయ క్రీడలో రాణిస్తున్న లక్కీమిరానీ

- వరుసగా నాలుగేళ్లు కాంస్యపతక విజేత
- దేశంలో 17 జట్లలో రాష్ట్రం నుంచి మూడో స్థానం
- జాతీయ స్థాయిలో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ
- మరింత మంది దివ్యాంగులను ప్రోత్సహించడమే లక్ష్యం

దృష్టిలోపం ఉన్న అథ్లెట్ల కోసం రూపొందించిన అరుదైన క్రీడ గోల్‌బాల్. ఈ క్రీడలో నగరంలోని గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎం.ఏ రాజనీతిశాస్త్రం చదివే విద్యార్థి లక్కీమిరానీ విజేతగా రాణిస్తున్నాడు. రెండో ప్రపంచ యుద్ధంలో దృష్టిని కోల్పోయిన సైనిక సిబ్బంది కోసం మొదటి సారి దీనిని రూపొందించారు. ఇది వాలీబాల్ కోర్టుకు సమానం. 18 మీటర్ల పొడవు, 9 మీటర్ల వెడల్పు కలిగిన కోర్టులో ఆదేవిధంగా దీనిని రూపొందించారు. స్పర్శ ద్వారా తెలుసుకునే గుర్తులతో కోర్టును వివిధ జోన్లుగా విభజిస్తారు. కోర్టుకు ప్రతి వైపూ ముగ్గురు ఆటగాళ్లు ఉంటారు. బంతిని ఎదురుగా ఉన్న గోల్ పోస్టులోకి విసిరేయడమే ఈ ఆట లక్ష్యం.

ఇలా ఆడతారు..

ఈ ఆట చాలా వేగవంతమైనది. బంతిని ఆటగాళ్లు రక్షించేందుకు, మళ్లీ విసిరేందుకు కేవలం పది సెకన్లు మాత్రమే సమయం ఉంటుంది. ఆటలో ఉపయోగించే బంతి బరువు 1.25 కిలోగ్రాములు ఉంటుంది. క్రీడలో అనేక పెనాల్టీలు ఉన్నందున జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. ఇద్దరు ఆటగాళ్లను కోర్టు నుంచి బయటకు పంపి, ఒక్కరు మాత్రమే బంతిని రక్షించాల్సి ఉంటుంది. బంతిలోపల లోహపు గంటలు ఉంటాయి. దీంతో చలన శబ్దాల ద్వారా శ్రవణ నైపుణ్యాన్ని ఉపయోగించి ఆడాల్సి ఉంటుంది.



మరింత మందిని ప్రోత్సహించడమే లక్ష్యం..

ఇదో అరుదైన క్రీడ. జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించి, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు పొందాలన్నదే నా లక్ష్యం. దీంతో పాటు నాలాంటి మరింత మంది క్రీడాకారులను ఈ ఆటలో రాణించేలా చేయడమే లక్ష్యం. ఇందుకు ప్రభుత్వ సహకారం అవసరం. సరైన శిక్షణా కేంద్రాలు అందుబాటులో ఉన్నప్పుడే అది సాధ్యమవుతుంది. వైకల్యాన్ని జయించే విధంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, స్టేడియాలు నిర్మించాలి. ఆ దిశగా అడుగులు పడాలనేదే నా ఆకాంక్ష.

– లక్కీమిరానీ–గోల్‌బాల్ జాతీయ క్రీడాకారుడు



తెలంగాణలో 30 మంది క్రీడాకారులు..

దేశంలో చాలా తక్కువ మందికే అవగాహన ఉన్న ఈ క్రీడను మూడేళ్ల క్రితమే మిరానీ లక్కీ గుర్తించాడు. అప్పటి నుంచి లక్ష్యం దిశగా ముందుకు సాగాడు. తెలంగాణ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆసక్తి ఉన్న క్రీడాకారులకు మద్దతు ఇస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 30 మంది గోల్‌బాల్ క్రీడాకారులు ఉన్నారు.తరచూ వీరిమధ్య మ్యాచ్‌లు జరుగుతుంటాయి. ఇందులో ఐదుగురు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరిలో లక్కీ మిరానీ ఒకడు. కాగా మహారాష్ట్రలోని గోండియాలో నాల్గో నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలను గోల్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, మహారాష్ట్రకు చెందిన తారా గోల్‌బాల్ స్పోర్ట్స్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించారు. ఇందులో దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి. కాగా తెలంగాణ జట్టు మూడో స్థానం సాధించి కాంస్య పతకం పొందింది.



ఆరోగ్యంగా ఉంటేనే అందం..

సినీ నటి ఐశ్వర్య రాజేష్

బంజారాహిల్స్: అమ్మ చేతి వంట.. కడుపు నిండా తింటా.. ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి వర్కవుట్స్ చేస్తుంటా.. అంటూ చెప్పుకొచ్చారు నటి ఐశ్వర్య రాజేష్. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన కలర్స్ 2.వో యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐశ్వర్య మీడియాతో సరదాగా సంభాషించారు. తాను ఫుడ్ విషయంలో కాంప్రమైజ్ కానని.. నచ్చినవన్నీ తింటుంటానని, 16 గంటల పాటు ఇంటర్మీడియట్ ఫాస్టింగ్, వర్కవుట్స్ చేసి ఆరోగ్యాన్ని, అందాన్ని కాపాడుకుంటానని అన్నారు. అమ్మ చేసే బిర్యానీ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆరోగ్యంగా ఉంటేనే అందంగా ఉంటామని అన్నారు. తనకు చీరలంటేనే ఎక్కువ ఇష్టమని, ఆడవారి అందాన్ని, గౌరవాన్ని చీరకట్టు మరింత పెంచుతుందని అన్నారు. కలర్స్ హెల్త్ కేర్ సీఈవో శివాజీ కూన మాట్లాడుతూ హెల్త్‌కేర్ సేవల్లో మరింత అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని, వినియోగదారులకు అంతర్జాతీయ స్థాయిలో సేవలు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 50 శాఖల్లో తమ సేవలు అందిస్తున్నామని, మరో ఏడాది కాలంలో 250 బ్రాంచీలకు సేవలు విస్తరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, సీబీఐటీ డైరెక్టర్ దివ్యారెడ్డి పాల్గొన్నారు.



క్లుప్తంగా...

ప్రజల ప్లాట్లు కబ్జాచేసిన రామోజీ ఫిలింసిటీ

ప్రజావాణిలో సీపీఐ నేతల ఫిర్యాదు



ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన సీపీఐ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్లాట్లు రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం కబ్జా చేసిందని, వారి నుంచి కాపాడి అదే స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి నాయకుడు ఓరుగంటి యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఆర్డీఓ అనంతరెడ్డికి లబ్ధిదారులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాగన్‌పల్లి సర్వే నంబర్ 189, 203లో 20 ఎకరాల్లో 677 మందికి 2007లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్లాట్లు అందజేశారన్నారు. లబ్ధిదారులు వారి ప్లాట్లలోకి వెళ్లకుండా ఫిలింసిటీ యాజమాన్యం ఇన్నాళ్లూ అడ్డుకుందని ఆరోపించారు. ఈ మేరకు ఈనెల 3న కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని, ఆయన ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌ను రిపోర్టు కోరారని చెప్పారు. పేదలకు వెంటనే పొజిషన్ ఇచ్చి ఆదుకోవాలని యాదయ్య కోరారు.

నా ఇల్లు కూల్చొద్దు

ప్రజావాణిలో అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి వినతి

బంజారాహిల్స్ (హైదరాబాద్): ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ నాయకుడు కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి తన ఇంటి స్థలం విషయమై సోమవారం జీహెచ్‌ఎంసీలో ప్రజావాణికి హాజరై వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా తన ఇంటి స్థలం సేకరణపై పురాలోచన చేయాలని, తనకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేబీఆర్ పార్కు చుట్టూ రోడ్డు విస్తరణలో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-92లోని తన ఇంటి స్థలాన్ని సేకరించే నిమిత్తం ఇటీవల అధికారులు మార్కింగ్‌లు వేశారని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. రోడ్డు విస్తరణలో తన ఇల్లు ఒక వైపు 20 అడుగులు, మరోవైపు 36 అడుగులు సేకరించే అంశంపై వివరణ ఇవ్వాలని కోరారు. పార్కు చుట్టూ రోడ్ల విస్తరణ, అండర్‌పాస్‌ల నిర్మాణం, ఫ్లైఓవర్ల నిర్మాణానికి అధికారులు సమాయత్తమవుతూ ఇటీవలే భూసేకరణ కోసం పలువురి నివాసాలకు మార్కింగ్‌లు వేశారు.

కొట్లాడేందుకు సిద్ధం కావాలని రాహుల్ సంకేతాలిచ్చారు: జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీ ఎన్నికల ద్వారా కొట్లాడేందుకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ కేడర్‌కు రాహుల్ గాంధీ సంకేతాలిచ్చారని చెప్పారు. కేజ్రీవాల్‌కి అహం వచ్చిందని, రాహుల్ గాంధీని డామినేట్ చేసే పర్సనాలిటీ కేజ్రీవాల్‌ది కాదన్న జగ్గారెడ్డి.. జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తి ఆప్‌కి లేదని పేర్కొన్నారు. ఒంటరిగా వెళ్లడం ద్వారా ఢిల్లీ ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసుకోవాలనేది రాహుల్ ఆలోచన అయి ఉంటుందని జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు.

ఎల్పీయూ విద్యార్థికి రూ.కోటి ప్యాకేజీ

సాక్షి, హైదరాబాద్: లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్పీయూ) ప్లేస్‌మెంట్ ప్యాకేజీలో సత్తాచాటింది. తమ క్యాంపస్ 2025 బీటెక్ ఫైనల్ ఇయర్ బ్యాచ్ విద్యార్థి బేతిరెడ్డి నాగవంశీరెడ్డి ఏఐ రోబోటిక్స్ కంపెనీలో రూ.1.03 కోట్ల ప్యాకేజీతో ఉద్యోగం సాధించినట్లు ఎల్పీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు అశోక్‌కుమార్ మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలో ఆల్టో నెట్‌వర్క్స్, న్యూటనిక్స్, మైక్రోసాఫ్ట్, సీఐఎస్‌సీఓ, పాయల్, అమెజాన్ వంటి పలు ప్రముఖ కంపెనీల నుంచి మొత్తం 7,361 జాబ్ ఆఫర్లు వచ్చినట్లు వెల్లడించారు. 1,700 మందికి పైగా విద్యార్థులు ఏడాదికి రూ.10 లక్షల నుంచి రూ.కోటి మధ్య ఉన్న ప్లేస్‌మెంట్స్ పొందినట్లు వెల్లడించారు. ఆదిరెడ్డి వాసుకు ఏకంగా ఏడు జాబ్ ఆఫర్లు వచ్చాయన్నారు. తమ విద్యార్థులు విజయం సాధించేందుకు ఎల్పీయూ కృషి చేస్తుందన్నారు.

2025 కేటీఎం అడ్వెంచర్ రేంజ్ లాంచ్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలోనే ప్రీమియం స్పోర్ట్స్ మోటార్‌సైకిల్ బ్రాండ్ అయిన కేటీఎం .. అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న 2025 కేటీఎం అడ్వెంచర్ రేంజ్‌ను లాంచ్ చేసింది. అత్యాధునిక సాంకేతికతతో అడ్వెంచర్ మోటార్‌సైక్లింగ్‌లో సరికొత్త బెంచ్‌మార్క్‌ను క్రియేట్ చేసింది. ఇది సుదూర రోడ్ ట్రిప్‌లకు అద్భుతమైన రైడింగ్ ఇవ్వనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో కేటీఎం 390 అడ్వెంచర్, కేటీఎం 390 అడ్వెంచర్ ఎక్స్, కేటీఎం 250 అడ్వెంచర్ ఉన్నట్టు పేర్కొంది. కేటీఎం 390 అడ్వెంచర్‌లో ట్యూబ్‌లెస్ స్పోక్ వీల్స్, 3 రైడ్ మోడ్స్, స్ట్రీట్ రెయిన్, ఆఫ్ రోడ్, క్రూయిజ్ కంట్రోల్ వంటి ప్రత్యేకతలున్నాయంది. ఢిల్లీలో ప్రస్తుత షోరూం ధరలు కేటీఎం 390 అడ్వెంచర్‌కు రూ.3,67,699, కేటీఎం 390 అడ్వెంచర్‌కు రూ.2,91,140, కేటీఎం 250 అడ్వెంచర్‌కు రూ.2,59,850 అని వెల్లడించింది.



స్కూళ్లలో ప్రచార హడావుడి కుదరదు

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంపై విద్యాశాఖ కత్తెర

- పాఠశాలల పనివేళల్లో ప్రచారం వద్దని అభ్యర్థులకు సూచన
- పరీక్షల సమయంలో విద్యా బోధనకు ఆటంకం కలిగించవద్దని ఆదేశం
- అభ్యర్థుల ప్రచారం కోసం విధులు ఎగ్గొట్టే టీచర్లపై చర్యలు
- అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారంపై విద్యాశాఖ ఆంక్షలు పెట్టింది. పాఠశాలల పనివేళల్లో ప్రచారం చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసింది. బడుల్లో పనిచేసే టీచర్లపైనా నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించింది. బడి మానేసి అభ్యర్థుల కోసం ప్రచారానికి వెళ్లే వారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించింది. అలాగే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం నిర్వహించినా ఊరుకునేది లేదని తేల్చి చెప్పింది. టెన్త్ పరీక్షలు దగ్గరపడుతున్న వేళ.. విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రచారం పేరుతో అభ్యర్థులు వస్తే స్కూళ్లలో బోధన దెబ్బతింటుందని, ఈ కారణంగా ఎవరినీ అనుమతించవద్దని డీఈవోలను ఆదేశించింది.

స్కూళ్లలో హడావుడి

ఖమ్మం-వరంగల్-నల్లగొండ, ఆదిలాబాద్-కరీంనగర్-నిజామాబాద్-మెదక్ ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న జరగనున్న విషయం తెలిసిందే. ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో అభ్యర్థులు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ రెండు స్థానాల్లో మూడు ప్రధాన సంఘాల నేతలు పోటీ పడుతున్నారు. దీంతో టీచర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రతీ స్కూలుకు వెళ్లి టీచర్లను ఓట్లు అడుగుతున్నారు. ఉదయం పాఠశాల ప్రారంభం నుంచి.. సాయంత్రం ముగిసే వరకూ వివిధ సంఘాల నేతలు రావడంతో బోధనకు ఆటంకం ఏర్పడుతోంది. మరోవైపు ప్రతీ స్కూల్లో మూడు సంఘాలకు మద్దతిస్తున్న టీచర్లు ఉండటంతో, ఆయా అభ్యర్థుల గెలుపోటములపై పాఠశాల సమయంలో చర్చించుకుంటున్నారు. కొన్నిసార్లు ఇవి ఆవేశకావేశాలకు దారి తీస్తున్నాయి. అభ్యర్థుల పక్షాన సామాజిక మాధ్యమాల్లో పోస్టింగుల కోసం టీచర్లు సమయం వెచ్చిస్తున్నారు. కొంతమంది టీచర్లు స్కూలుకు వచ్చి, హాజరువేసుకుని ప్రచారానికి వెళ్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో 48 స్కూళ్లల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించడం లేదని అధికారులకు ఫిర్యాదులొచ్చాయి. అలాగే వరంగల్‌లో 36 పాఠశాలల్లో టీచర్లు ప్రత్యేక బోధనకు అరకొరగా హాజరవుతున్నారనే ఫిర్యాదులు అందాయి. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్‌లోనూ అభ్యర్థుల మద్దతు దారులు ఈ తరహా ఫిర్యాదులు చేసుకోవడం కన్పించింది. దీంతో విద్యార్థుల చదువుకు ఇబ్బంది కలగకుండా ప్రచారంపై ఆంక్షలు విధిస్తున్నట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

రాత్రి బస.. విందులు, వినోదాలు

ప్రధాన సంఘాల నేతలు పట్టణ కేంద్రాల్లో రాత్రిపూట బస చేస్తున్నారు. టీచర్ ఓటర్లను తమ వద్దకు రప్పించుకుని, వారిని ప్రసన్నం చేసుకోవడానికి విందులు, వినోదాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ స్కూల్‌లో ఏజెంట్లను పెట్టుకుని, డబ్బుల పంపిణీ బాధ్యతలు అప్పగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఏ ఉపాధ్యాయుడు ఎవరి పక్షాన ఉన్నాడు? అతడిని ఆకర్షించడం ఎలా? అనే కోణంలో టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వ్యూహాలు రచిస్తున్నారు. ఈ బాధ్యతను ఆయా స్కూళ్లలో తమ అనుచరులైన టీచర్లకు అప్పగిస్తున్నారు. ఇంకో వైపు అనుకూలంగా లేని టీచర్లను నేతల వద్దకు తీసుకెళ్లి మాట్లాడిస్తున్నారు. అయితే ఇవన్నీ బోధనకు ఆటంకాలుగా మారుతున్నాయని అధికారులు అంటున్నారు. దీంతో విధులు మానేసి ఎన్నికల ప్రచారానికి వెళుతున్న టీచర్ల జాబితాను పంపాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్.. డీఈవోలను ఆదేశించింది. టీచర్ల కదలికలపై రహస్య నివేదికలు పంపాలని సూచించింది. సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టే టీచర్లు, వారు విందులకు హాజరయ్యే సమయాలపైనా ఆరా తీస్తున్నారు.

ఆధార్ తరహాలో రైతుకు యూనిక్ ఐడీ

దేశంలో వ్యవసాయరంగాన్ని డిజిటలైజేషన్ చేసే ప్రక్రియకు శ్రీకారం



- ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అమలు... కేంద్రం సూచనలతో త్వరలో రాష్ట్రంలో అమలు... వ్యవసాయ సంచాలకుల నేతృత్వంలో ఫార్మర్ రిజిస్ట్రీ

సాక్షి, హైదరాబాద్: పీఎం కిసాన్ సమ్మాన్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయం కావాలా? పంటల బీమా పథకంలో లబ్ధి పొందాలా? పంటలకు కనీస మద్దతు ధర కావాలా? భవిష్యత్‌లో ఇలాంటి పథకాలు పొందాలంటే రైతులకు ప్రత్యేక యూనిక్ నంబర్ తప్పనిసరి. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో 'ఫార్మర్ రిజిస్ట్రీ'పేరుతో వ్యవసాయరంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ మొదలైంది. రాష్ట్రంలో కూడా ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. డిజిటలైజేషన్‌లో భాగంగా 'ఫార్మర్ రిజిస్ట్రీ'పేరుతో ప్రతి రైతుకు యూనిక్ ఐడీ తీసుకొచ్చే ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. 14 అంకెలతో కూడిన ఈ యూనిక్ ఐడీని 'ఫార్మర్ రిజిస్ట్రీ'ప్రక్రియ ద్వారా త్వరలో రాష్ట్రంలో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రెండు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయశాఖ సంచాలకుడి నేతృత్వంలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ప్రారంభం కాగా, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రారంభించేందుకు ఉన్నతస్థాయిలో చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. ఇక నుంచి ఆధార్ తరహాలో ఈ 14 అంకెల ఫార్మర్ రిజిస్ట్రీ సంఖ్య ప్రామాణికం కానుంది. రాష్ట్రంలో వ్యవసాయ సంచాలకుల నేతృత్వంలో ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్టు సమాచారం.

పట్టాదారులకే...

సొంత వ్యవసాయ భూమి కలిగిన పట్టా రైతులకే ఈ యూనిక్ ఐడీ జారీ చేస్తారు. ఇందుకోసం రైతులు ముందుగా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల (రైతు వేదికలు) వద్ద దరఖాస్తు చేసుకోవాలి. పట్టాదారు పాసు పుస్తకం లేదా 1-బి, ఆధార్ జిరాక్స్, ఆధార్ నంబరుకు లింక్ అయిన ఫోన్‌తోపాటు స్వయంగా రైతు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. తదనుగుణంగా యూనిక్ ఐడీ అందజేస్తారు.

ఉపయోగాలెన్నో...

సొంత వ్యవసాయ భూమి కలిగిన రైతులను త్వరగా గుర్తించడంలో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ ఎంతగానో ఉపయోగపడుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ రాయితీలు, పంటల బీమా అర్హులకు వర్తింపజేయడం, పీఎం కిసాన్ చెల్లింపులు, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీపై వ్యవసాయ పరికరాలు తదితర పథకాలను ఈ యూనిక్ కోడ్‌తో అనుసంధానం చేస్తారు. భవిష్యత్‌లో రైతుభరోసాకు కూడా ఈ యూనిక్ ఐడీనే ఆధారం చేసుకునే అవకాశముంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు చేతికి అందకుంటే పంటల బీమా ద్వారా నష్ట పరిహారం అందించేందుకు దీనిని ఉపయోగిస్తారు. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి సేవలు నేరుగా రైతులకే అందేలా చర్యలు ఉంటాయి.

స్థానిక రిజర్వేషన్లపై అధ్యయనం పూర్తి

ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన డెడికేటెడ్ బీసీ కమిషన్

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ బీసీ కమిషన్ అధ్యయనం పూర్తి చేసింది. ఇందుకు సంబంధించిన నివేదికను డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను ఈ నివేదిక ఆధారంగా ఖరారు చేయనున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీ స్థానాలకు ఈ రిజర్వేషన్లను వర్తింపజేయనున్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలు దాదాపు ఏడాది నుంచి ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. తాజాగా కమిషన్ నివేదిక అందడంతో వీలైనంత త్వరగా ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఈ వారం చివరికల్లా స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

700 పేజీలతో నివేదిక..

డెడికేటెడ్ బీసీ కమిషన్ గత ఏడాది నవంబర్ 4వ తేదీన ఏర్పాటైంది. కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు మూడు నెలల పాటు అధ్యయనం చేసి, నివేదిక అందజేశారు. సుమారు 700 పేజీలతో ఈ నివేదికను సిద్ధం చేసినట్టు తెలిసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాల ప్రకారం, రాజ్యాంగ పరిధికి లోబడి రిజర్వేషన్లను సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినట్టు తెలిసింది. ప్రభుత్వం గ్రామ పంచాయతీ యూనిట్‌గా వార్డులకు, మండలం యూనిట్‌గా ఎంపీటీసీలు, జిల్లా యూనిట్‌గా జెడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్టు సమాచారం. జెడ్పీ చైర్‌పర్సన్లను రాష్ట్ర యూనిట్‌గా నిర్దేశించనున్నట్టు తెలిసింది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ ఒప్పందం

పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ ఆరోపణ

కరీంనగర్ కార్పొరేషన్/గజ్వేల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. కరీంనగర్‌లో సోమవారం జరిగిన కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి నామినేషన్ ప్రక్రియకు ఆయన హాజరయ్యారు. నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి మహేశ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే కమిట్‌మెంట్ పార్టీ అని, తమకు అబద్ధాలు, మోసాలు రావన్నారు. నరేందర్‌రెడ్డిని గెలిపించడం ద్వారా, మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్‌కు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టడమే కాకుండా, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ అర్బన్ నక్సల్స్ పేరిట అణచివేసేందుకు మతతత్వవాదులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నిక కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకమని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ 60 సంవత్సరాల్లో జరగని కులగణన తాము చేసి చూపించామన్నారు. జీవన్‌రెడ్డి పోటీ చేయడానికి ముందుకురాకపోవడంతోనే నరేందర్‌రెడ్డిని అభ్యర్థిగా నిలబెట్టామని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. బీజేపీ కూడా రూ.500కు సిలిండర్ అనేలా చేసింది కాంగ్రెస్ పార్టీ అని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణలోనే 40 శాతం ప్రాధాన్యత ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఉందని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి తెలిపారు.



మాట్లాడుతున్న మహేశ్‌కుమార్‌గౌడ్

కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

నామినేషన్ సందర్భంగా మంత్రుల వాహనాలను కలెక్టరేట్‌లోనికి అనుమతించడంపై స్వతంత్ర అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ అభ్యంతరం వ్యక్తం చేయడం ఉద్రిక్తతకు దారితీసింది.

- ప్రజలు గౌరవించి ప్రతిపక్ష హోదా ను ఇచ్చినప్పుడు... వారి కోసం పనిచేయాల్సిన కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితమవడం దారుణం'అని మహేశ్‌కుమార్‌గౌడ్ మండిపడ్డారు. సోమవారం కరీంనగర్‌కు వెళుతూ మార్గమధ్యలో సిద్దిపేట జిల్లా రిమ్మనగూడ వద్ద విలేకరులతో మాట్లాడారు.

విభజన హామీలు అమలు చేసేవరకు సంఘటిత ఉద్యమం

ప్రజా సంఘాల పోరాట వేదిక ధర్నాలో నేతల పిలుపు



మాట్లాడుతున్న జాన్ వెస్లీ

కవాడిగూడ (హైదరాబాద్): కార్పొరేట్ అనుకూల కేంద్ర బడ్జెట్‌ను సవరించి విభజన హామీలు అమలు చేసేవరకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పలువురు ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ మధ్యతరగతి, పేద ప్రజలకు, కార్మిక, రైతాంగ వర్గానికి అన్యాయం చేసే విధంగా ఉందని వారు ఆరోపించారు. బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మహాధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని వీరభద్రం, తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ ఎస్.వీరయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతుసంఘం నాయకులు సాగర్, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎంపీ బాబూరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అదానీ, అంబానీలకు మేలుచేసే విధంగా, రైతులు, కార్మికులు, దళితులు, గిరిజనులు, మైనార్టీలకు వ్యతిరేకంగా ఉందని ఆరోపించారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. ఉద్యోగులకు పన్ను మినహాయింపు ఇస్తున్నామని కేంద్ర మంత్రులు, కిషన్‌రెడ్డి, సంజయ్‌లు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీజేపీకి 8 మంది ఎంపీలు ఉన్నా బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ సాధించలేకపోయారన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ల పర్వం

- వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 23 మంది
- కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 17 మంది, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 100 మంది



కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, జూపల్లి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/కరీంనగర్: రాష్ట్రంలో ని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల స్వీకరణ సోమవారంతో ముగిసింది. ఈ నామినేషన్ల పరిశీలన ప్రక్రియ మంగళవారం జరగనుంది. ఈనెల 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల లెక్క తేలనుంది. ఈ నెల 27వ తేదీన పోలింగ్, మార్చి 3వ తేదీన కౌంటింగ్ జరుగుతుంది.

- వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 23 మంది అభ్యర్థులు 50 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు వేసిన వారిలో పీఆర్‌టీయూ-టీఎస్ మద్దతుతో పింగిళి శ్రీపాల్‌రెడ్డి, యూటీఎఫ్ మద్దతుతో ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, బీజేపీ మద్దతుతో పులి సరోత్తంరెడ్డి, ఎస్‌టీయూ, బీసీ సంఘం మద్దతుతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, టీచర్స్ జేఏసీ మద్దతుతో టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డితోపాటు ప్రైవేటు విద్యా సంస్థల యజమాని ఎస్.సుందర్‌రాజు, ప్రొఫెసర్ వెంకటరాజయ్య నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఉన్నారు.
- కరీంనగర్- నిజామాబాద్- మెదక్- ఆదిలాబాద్ పట్టభద్రుల స్థానానికి 100 మంది 192 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం ఒక్క రోజే 51 నామినేషన్లు రావడం గమనార్హం. ఈ స్థానానికి వి.నరేందర్‌రెడ్డి (కాంగ్రెస్) అంజిరెడ్డి (బీజేపీ), ప్రసన్న హరికృష్ణ (బీఎస్పీ), మాజీ మేయర్ రవీందర్ సింగ్, ట్రస్మా శేఖర్‌రావు తదితరులు బరిలో ఉన్నారు.
- కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 17 మంది 38 సెట్లనామినేషన్లు వేశారు. కొమురయ్య (బీజేపీ), సిట్టింగ్ ఎమ్మె ల్సీ కూర రఘోత్తంరెడ్డి (ఎస్టీయూ-పీఆర్‌టీయూ), వై.అశోక్‌కుమార్ (టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్) నామినేషన్లు దాఖలు చేసిన వారిలో ఉన్నారు.

'మద్యం మార్జిన్'లో చీర్స్!

ఏపీలో ఇప్పటికే భారీగా కమీషన్లు కొల్లగొట్టి లైసెన్సులు జారీ

- ఆపై మార్జిన్ పెంపు పేరిట కుతంత్రం
- ఏటా రూ.వందల కోట్ల ముడుపులు ముట్టజెప్పేందుకు డీల్
- దాంతో మార్జిన్ 14 శాతానికి పెంచేందుకు 'పచ్చ'జెండా
- 'ఏఆర్‌టీ'ని సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఇక మద్యం ధరలు భారీగా పెంపు

సాక్షి, అమరావతి: మద్యం దందా దోపిడీ ఇచ్చే కిక్కు 'ముఖ్య'నేతకు తెలిసినంతగా మరెవరికీ తెలీదు..! అందుకే మద్యం విధానం ముసుగులో భారీ దోపిడీకి ఎప్పటికప్పుడు కొత్త కుతంత్రాలు పన్నుతూనే ఉంటారు..! 40 ఇయర్స్ ఇండస్ట్రీ దోపిడీ అంటే ఏమిటో మరోసారి చేతల్లో చూపించారు! ఇప్పటికే ఏపీలోని మద్యం దుకాణాలను టీడీపీ సిండికేట్‌కు ఏకపక్షంగా కట్టబెట్టేసి భారీ దోపిడీకి పాల్పడ్డారు. అయినా సరే 'ముఖ్య'నేత అంతటితో సంతృప్తి చెందలేదు. మద్యం సిండికేట్‌తో మరో డీల్ చేసుకుని ఏటా అదనంగా రూ.వందల కోట్లు కమీషన్ వసూలు చేసుకునేందుకు 'ఛీర్స్'చెప్పారు! ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి తన జేబులోకి ఏటా ముడుపుల వరద పారించే చానల్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మార్జిన్ 14 శాతానికి పెంచేందుకు 'పచ్చ'జెండా ఊపారు! ఈమేరకు 'ఏఆర్‌టీ'ని సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో మద్యం ధరలు భారీగా పెరగనున్నాయి.

ముందస్తు పన్నాగం..

కూటమి సర్కారు గతేడాది అక్టోబరు నుంచి రాష్ట్రంలో ప్రైవేట్ మద్యం దుకాణాల వ్యవస్థను మళ్లీ అమలులోకి తెచ్చింది. ఇతరులు ఎవరూ టెండర్లు దాఖలు చేయకుండా పోలీసులతో అడ్డుకుని టీడీపీ సిండికేట్‌కు మద్యం దుకాణాలను ఏకపక్షంగా కట్టబెట్టింది. 2024 అక్టోబరు నుంచి రెండేళ్లపాటు లైసెన్సులు కేటాయించేందుకు భారీ ముడుపులు కొల్లగొట్టారు. మద్యం దుకాణాల్లో విక్రయించే ప్రతి సీసాకు రూ.5 చొప్పున కమీషన్ కింద లెక్కించి ముందుగానే రెండేళ్ల మద్యం అమ్మకాలపై ఏకమొత్తంగా భారీ కమీషన్ల మూటలు కరకట్ట బంగ్లాకు చేరేలా కథ నడిపారు. అనంతరమే మద్యం దుకాణాలకు లైసెన్సులు జారీ చేశారు. 'ముఖ్య'నేత అంతటితో ఆగలేదు. మద్యం దందాలో మరింత పిండుకోవాలని ఎత్తుగడ వేశారు. ఈ క్రమంలో.. మద్యం విక్రయాలపై తమకు మార్జిన్ పెంచాలని సిండికేట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తమకు మద్యం అమ్మకాలపై వస్తున్న 10 శాతం లాభం మార్జిన్ సరిపోవడం లేదనే వాదనను అందుకుంది. తమకు వాస్తవంగా 14 శాతం మార్జిన్ వచ్చేలా చూడాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది.

మూటలు ఇస్తేనే మార్జిన్ పెంచుతాం...

మార్జిన్ పెంచాలని మద్యం సిండికేట్ నుంచి డిమాండ్ మొదలైన తరువాత 'ముఖ్య'నేత అసలు విషయాన్ని చల్లగా బయటపెట్టారు. మరి మార్జిన్ పెంచితే 'నాకేంటి..?'అని ఆయన సూటిగానే అడిగేసినట్లు సమాచారం. ఈ అంశంపై తర్జన భర్జనల తరువాత 'ముఖ్య'నేతతో డీల్ కుదుర్చుకున్నారు. తమ మార్జిన్‌ను వాస్తవంగా 14 శాతానికి పెంచితే అందుకు తగిన కమీషన్ ఇస్తామంటూ మంతనాలు సాగించారు. 'ముఖ్య'నేత కోరుకున్నదీ... సిండికేట్ ఇస్తానన్నది ఒకటే కావడంతో డీల్ కుదిరింది. దాంతో మద్యం అమ్మకాలపై మార్జిన్‌ను వాస్తవంగా 14 శాతం వచ్చేలా చేసేందుకు నిర్ణయించారు.

'ముఖ్య'నేతకు ఏటా మూట..!

మద్యం అమ్మకాలపై పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఏటా దాదాపు రూ.30 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. అయితే మద్యం దుకాణదారులకు మార్జిన్ 14 శాతం వచ్చేటట్లు చేస్తే ప్రభుత్వ ఆదాయం దాదాపు రూ.3 వేల కోట్ల మేర తగ్గుతుందని ఎక్సైజ్ శాఖ వర్గాలు అంచనా వేశాయి. ఆ మేరకు మద్యం దుకాణదారులకు ఏటా రూ.3 వేల కోట్ల ఆదాయం పెరుగుతుంది కాబట్టి అందులో మూడో వంతు తనకు కమీషన్‌గా ఇవ్వాల్సిందేనని 'ముఖ్య'నేత పట్టుబట్టారు. అందుకు మద్యం సిండికేట్ సమ్మతించింది. అంటే మద్యం సిండికేట్ 'ముఖ్య'నేతకు ఏటా రూ.వెయ్యి కోట్ల మూట ముట్టజెప్పనుందన్నది స్పష్టమవుతోంది. ఈ డీల్ ద్వారా 'ముఖ్య'నేత సొంత ఖజానాకు ఏటా రూ.వెయ్యి కోట్లు చేరనుండగా టీడీపీ మద్యం సిండికేట్ రూ.2 వేల కోట్ల వరకు అదనపు లాభం కొల్లగొట్టనుందన్నది తేటతెల్లమవుతోంది. డీల్ కుదరడంతో ఈ పన్నాగానికి ముగింపుగా మద్యం ధరలపై అదనపు రీటైల్ ఎక్సైజ్ పన్ను (ఏఆర్‌టీ) సవరిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. తద్వారా మద్యం దుకాణదారులకు 14 శాతం మార్జిన్ వచ్చేలా చేశారు.



ధరలు భారీగా పెంపు...

రూ.99కి అమ్ముతున్న చీప్ లిక్కర్ బ్రాండ్‌పై మినహా మిగిలిన అన్ని మద్యం బ్రాండ్లపై ధరలను మూడు కేటగిరీల కింద పెంచుతూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తద్వారా అన్ని బ్రాండ్ల మద్యం ధరలు 10 - 20 శాతం వరకు పెరగనున్నాయి. క్వార్టర్ మద్యం బాటిల్ ధర రూ.20 నుంచి రూ.30 వరకు పెరిగే అవకాశం ఉంది.

అన్ని వర్గాల ప్రజలూ రోడ్డున పడుతున్నారు

ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధం: హరీశ్‌రావు



ధర్నా చౌక్‌లో ఆర్‌ఎంపీ, పీఎంపీల నిరసనలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కవాడిగూడ (హైదరాబాద్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలు రోడ్డున పడ్డారని, ఎప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినా ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలపై మెడికల్ కౌన్సిల్ అధికారులు చేస్తున్న దాడులను ఆపాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామీణ వైద్యుల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి హరీశ్‌రావు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్‌ఎంపీ డాక్టర్లకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. అసెంబ్లీలో ఆర్‌ఎంపీల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తానని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ గ్రామీణ వైద్యుల సమాఖ్య అధ్యక్షుడు వంగా మల్లేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి రాజమౌళి, బీఆర్‌ఎస్‌నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 11-2-2025




అవని వీరమనేని

రేసర్ అవని

ఈ తరం భారతీయ సమాజానికి అమ్మాయి చేతిలో స్టీరింగ్ విచిత్రం ఏమీ కాదు. స్టీరింగ్ మగవాళ్లదనే అభిప్రాయాన్ని యాభైఏళ్ల కిందటే తుడిచేశారు మహిళలు. ఇప్పుడు ఫార్ములా ఈ కార్ రేసింగ్‌లోనూ స్టీరింగ్ తిప్పుతున్నారు. కానీ ఈ సంఖ్య చాలా తక్కువ. దేశం మొత్తంమీద చూసినా వేళ్లమీద లెక్కపెట్టేటంత మంది మాత్రమే ఉన్నారు. వీరిలో అత్యంత చిన్నవయసు అమ్మాయి అవని వీరమనేని. మన తెలుగు రాష్ట్రాల్లో తొలి అమ్మాయి కూడా. హైదరాబాద్‌కు చెందిన పదిహేడేళ్ల అవని ఫార్ములా ఈ రేసింగ్‌లో దూసుకుపోతోంది.

మగవాళ్లతో పోటీ

స్టీరింగ్ మీద ఇష్టమే అవనిని ఫార్ములా ఈ రేసింగ్ వైపుకు మళ్లించింది. అన్నయ్య కారు నడుపుతుంటే తనకూ నేర్పించమని మొండిపట్టు పట్టింది. రెండురోజుల్లో స్టీరింగ్ మీద రోడ్



మీద కంట్రోల్ వచ్చేసింది. కానీ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే వయసు మాత్రం రాలేదు. కారిచ్చి రోడ్డు మీదకు పంపించరు. స్టీరింగ్ మీద ప్యాషన్ తీరేదెలా? రేసింగ్ గురించి ఇండియాలో ఉన్న అవకాశాల కోసం గూగుల్‌లో సెర్చ్ చేసింది. ఫార్ములా ఈ రేసింగ్ గురించి తెలియగానే అమ్మానాన్నలను అడిగింది. నిండా పదిహేనేళ్లు లేవు. ఇందులో స్త్రీపురుషులకు పోటీలు విడిగా లేవు. డ్రైవింగ్‌లో పది–ఇరవై ఏళ్ల అనుభవం ఉన్న నలభైఏళ్ల మగవాళ్లు కూడా అదే ట్రాక్ మీద పోటీలో ఉంటారు. కారువేగం గంటకు 160 నుంచి 170 కిలోమీటర్లు ఉంటుంది. అంత పెద్ద వాళ్ల మధ్య కుందేలు పిల్లలాగ ఉంటుందేమో అనుకున్నారు. కానీ అంతటి క్లిష్టమైన టాస్క్‌ని తీసుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నప్పుడు వెనక్కు లాగడం ఎందుకు అనుకున్నారు. అవని కోరుకున్నట్లే ఫార్ములా ఈ రేసింగ్ లో శిక్షణ ఇప్పించారు. అవని ఇప్పుడు అహురా రేసింగ్ గ్రూప్‌తో పోటీల్లో పాల్గొంటోంది. తొలిసారి రేసింగ్ ట్రాక్ మీదకు వెళ్లిన నాటికి ఆమె తొమ్మిదో తరగతి చదువుతోంది. గడచిన మూడేళ్లుగా కోయంబత్తూర్‌లో, చెన్నైలో జరిగిన జేకే టైర్స్, ఎమ్ఆర్ఎఫ్ కంపెనీలు నిర్వహించిన పోటీల్లో పాల్గొంటున్నది. టాప్ టెన్ ర్యాంకింగ్‌లో కొనసాగుతోంది.

టెన్త్ క్లాస్ పరీక్ష పెట్టింది!

లెవెన్త్ క్లాస్ చదువుతున్నాను. నైన్త్‌క్లాస్‌లో ఫార్ములా ఈ కార్ రేసింగ్ మొదలు పెట్టినప్పుడు చదువుకి ఎటువంటి ఇబ్బంది కలగలేదు. టెన్త్‌లో ట్రైనింగ్ సెషన్స్, బోర్డు ఎగ్జామ్స్ ఒకదానితో ఒకటి పోటీ పెడ్డాయి. పగలంతా ట్రైనింగ్, రాత్రి హోటల్ రూమ్‌కి వచ్చి ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ కావడం... నిజంగా క్లిష్టసమయం అనే చెప్పాలి. అలాగే బోర్డ్ ఎగ్జామ్ రాశాను. ఫార్ములా ఈ రేసింగ్ చాలా ఖర్చుతో కూడిన ఆట. నా ఇష్టాన్ని మా పేరెంట్స్ ఒప్పుకోవడం నా అదృష్టం.


– అవని వీరమనేని, ఫార్ములా ఈ రేసర్

ఈ తరం టీన్స్

అవనితోపాటు ఫార్ములా ఈ రేసింగ్‌లో స్టీరింగ్ పట్టుకున్న అమ్మాయిల గురించి చెబుతూ ‘‘దేశం మొత్తం మీద చూసినా పెద్ద నంబర్ ఏమీ లేదు. తెలుగువాళ్లెవరూ కనిపించలేదు. తమిళనాడు, మహారాష్ట్రల నుంచి చూశాను. 2023లో నాతోపాటు ఇద్దరమ్మాయిలు ఉన్నారు. 2024లో కూడా మరో ఇద్దరిని చూశానంతే. వాళ్లు కూడా నాకంటే కొద్దిగా పెద్దవాళ్లే తప్ప ఇరవై దాటిన వాళ్లెవరూ లేరు. ఓన్లీ మెన్ ఉన్న ఈ స్పోర్ట్‌లో ఉమెన్ ఎంట్రీ ఈ జనరేషన్ టీన్స్‌తో మొదలైందని చెప్పవచ్చు’’ అంటోంది అవని. ఈ పోటీల్లో పాల్గొనడానికి మంచి శక్తినిచ్చే ప్రత్యేకమైన ఆహారం గురించి మాట్లాడుతూ ‘‘అమ్మ డాక్టర్. నేను ఏమి తినాలో, ఎంత తినాలో అమ్మ చూసుకుంటుంది. నాకు తెలిసిందల్లా అమ్మ పెట్టింది తినడమే. నాతోపాటు ట్రైనింగ్‌కి, పోటీలకు తోడుగా అమ్మ లేదా నాన్న వస్తారు. నాన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. తనకు కూడా సెలవులు కష్టమే. ఇద్దరికీ వీలుకానప్పుడు అమ్మమ్మ వస్తుంది. నన్ను భద్రంగా చూసుకోవడానికి ఎవరో ఒకరు వస్తారు. కాబట్టి ఇక నా ఫోకస్ అంతా ట్రాక్ మీదనే’’ అని సంతోషంగా నవ్వేసింది అవని.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సంస్కారం



భార్య సంధ్యా గోఖలేతో అమోల్ పాలేకర్

ఆమెపై చెయ్యెత్తడమా?

‘స్త్రీలపై హింస చేయడం తప్పు’ అని భావించేవారు కూడా సినిమాల్లో హీరోయిన్‌ని హీరో లాగిపెట్టి కొడితే క్లాప్స్ కొడతారు. ఇలా కొట్టే సన్నివేశాలు యువత మీద ఎలాంటి ప్రభావం చూపుతాయో హీరోలు పెద్దగా ఆలోచించరు– కథకు అవసరమైనా కాకపోయినా.

కాని అమోల్ పాలేకర్ మాత్రం నలభై ఏళ్ల క్రితం కొట్టిన చెంపదెబ్బకు ఇప్పటికీ పశ్చాత్తాప పడుతున్నాడు. ‘జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్’ లో తన పుస్తకం ‘వ్యూఫైండర్’ ఆవిష్కరణ సందర్భంగా ఆ ఉదంతాన్ని ప్రస్తావించాడు.

‘నేను ప్రధానంగా చిత్రకారుణ్ణి. సినిమాల్లోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదు. కాని నా కాబోయే భార్య చిత్ర ఆ రోజుల్లో నాటకాలు వేస్తుంటే తోడుగా రోజూ వెళ్లేవాణ్ణి. అప్పుడు నాటక గురువు సత్యదేవ్ దూబే నాతో ‘నా తర్వాతి నాటకంలో వేషం ఇస్తాను చెయ్. నీలో ఏదో టాలెంట్ ఉందని ఆఫర్ చేయడం లేదు. బాగా ఖాళీగా ఉంటున్నావని ఇస్తున్నాను’ అన్నారు. అలా నాటకాల్లోకి... తర్వాత సినిమాల్లోకీ వెళ్లాను. నాటకాల్లో చేయడం వల్ల రిహార్సల్స్ చేసి నటించడం నాకలవాటు. అయితే ‘భూమిక’ (1977) సినిమాలో ఒక సన్నివేశంలో తనకు కావలసిన ఎక్స్‌ప్రెషన్ స్మితాపాటిల్ ఇవ్వడం లేదని దర్శకుడు శ్యామ్ బెనగళ్ నన్ను పక్కకు పిలిచి– టేక్‌లో ఆమెను లాగిపెట్టి కొట్టు అన్నారు. అలాగే సార్.. రిహార్సల్‌కు ఆమెను రమ్మన మనండి అన్నాను. ఆమెకు ఈ సంగతి నేను చెప్పలేదు... నువ్వు నిజంగా కొట్టాలి అన్నారు. నేను షాక్ అయ్యాను. లేదు సార్... అలా చేయను. స్త్రీలపై చెయ్యెత్తడమే తప్పు. యాక్టింగ్ కోసం చేయొచ్చు. కాని నిజంగా చేయమంటే చేయను అన్నాను. ఆయన ఊరుకోలేదు. ‘‘ఇది నా ఆర్డర్. చేస్తావా చేయవా’’ అన్నారు. ఇక నేను ధైర్యం కూడగట్టుకున్నాను. టేక్ మొదలైంది. స్మితాపాటిల్ అద్భుతంగా నటిస్తోంది. సరిగ్గా దర్శకుడు కోరిన ఎక్స్‌ప్రెషన్ ఇవ్వాల్సిన సమయంలో ఆమెను లాగిపెట్టి కొట్టాను. స్మిత స్థాణువయ్యింది. ఆ పని నేను చేయగలనని ఆమె ఊహించలేదు. దాంతో ఎక్స్‌ప్రెషన్స్ ఒకదాని వెంట ఒకటి ఆమె మొఖంలో పరిగెత్తాయి. మొదట అపనమ్మకం, తర్వాత కోపం, తర్వాత అవమానం, ఆఖరుకు దుఃఖం... డైరెక్టర్ కట్ అనే వరకు నేనూ ఆమె నటిస్తూనే ఉన్నాం. కట్ అన్నాక ఒక్కసారిగా నేను ఏడ్చేశాను. స్మితాను దగ్గరకు తీసుకుని మనస్ఫూర్తిగా క్షమాపణ కోరాను. ఆ రోజుల్లో నేను కొత్తనటుణ్ణి. అలా చేశాను. పేరు వచ్చాక అలా చేయలేదు. ఎప్పుడూ చేయను. అసలు స్త్రీల మీద చెయ్యెత్తుతారా ఎవరైనా? ఆమె మీద గొంతెత్తడమే తప్పు. నేనైతే పెద్ద గొంతుతో స్త్రీలతో మాట్లాడి కూడా ఎరగను’ అన్నాడు హర్షధ్వానాల మధ్య.

స్త్రీలతో పురుషులు– వారు భర్త/తండ్రి/సోదరుడు స్థానంలో ఉన్నా గాని వ్యవహరించవలసిన తీరు ఏమిటో అమోల్ ఉదంతంతో బేరీజు వేసుకుని పరిశీలించుకోవాలి.



తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఇంటర్‌నెట్ ప్రపంచంలో ఉంటాం.

మనకు అన్నీ తెలిసినట్లుగానే ఉంటుంది. అన్ని రకాలుగా జాగ్రత్తగా ఉన్నట్లుగానే ఉంటుంది. అయినా సరే... ఏ ప్రమాదం ఎటు నుంచి వచ్చిపడుతుందో తెలియదు.

ఇంటర్‌నెట్ వినియోగించడం ఎంత ముఖ్యమో, మనకు ఎలాంటి చేటు, నష్టాలు జరగకుండా ఉపయోగించడం అంతకంటే ముఖ్యం...

‘సేఫర్ ఇంటర్‌నెట్ డే’ ను పురస్కరించుకొని మల్టీ మీడియా ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ ‘స్నాప్‌చాట్’ డిజిటల్ వెల్–బీయింగ్ ఇండెక్స్ (డిడబ్ల్యూబిఐ) మూడవ ఎడిషన్‌ను విడుదల చేసింది. మన దేశంలో డిజిటల్ విషయాలకు సంబంధించి అవగాహన ఉన్నప్పటికీ ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయి అని ఈ నివేదిక తెలియజేసింది.

మన దేశంతో సహా ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, యూకే, యూఎస్‌లో నిర్వహించిన డిజిటల్ సేఫ్టీపై నిర్వహించిన సర్వేలో టీనేజర్‌లు, వారి తల్లిదండ్రులు, యువత... ఇలా ఎంతోమంది పాల్గొన్నారు.

మన దేశం హైయెస్ట్ డిజిటల్ వెల్‌బీయింగ్ స్కోర్‌ను 67తో సాధించింది. ఇంటర్‌నెట్ భద్రతకు సంబంధించి జాగ్రత్తలు తీసుకుంటున్న తల్లిదండ్రుల సంఖ్య పెరిగింది. డిజిటల్ శ్రేయస్సు (డిజిటల్ వెల్–బీయింగ్)కు సంబంధించి సానుకూల సూచికలు ఉన్నప్పటికీ ఆన్‌లైన్ బ్లాక్‌మెయిల్ లాంటివి మన దేశంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. వ్యక్తిగత, సన్నిహిత, ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తామని బెదిరించడం లాంటివి ఎక్కువ అవుతున్నాయి. ఆన్‌లైన్ భద్రతకు సంబంధించి పురోగతి, సవాళ్లను రెండిటినీ నివేదిక నొక్కి చెప్పింది.

డిజిటల్ సేఫ్టీలో మన దేశం మెరుగైన స్థితిలో ఉన్నప్పటికీ, ఆన్‌లైన్ బెదిరింపుల ప్రాబల్యం పెరగడంతో యువ యూజర్‌లు ప్రమాదాల బారిన పడకుండా నిరంతర అవగాహన కలిగించాల్సిన అవసరం గురించి నివేదిక నొక్కి చెప్పింది. ఈ సంవత్సరం సేఫర్ ఇంటర్‌నెట్ డేకి సంబంధించిన థీమ్... ‘టుగెదర్, ఫర్ ఎ బెటర్ ఇంటర్‌నెట్’.

సాగుబడి
ధనిష్ట కార్తె: ఫిబ్రవరి 6 నుంచి

- ఛత్తీస్‌ఘడ్‌లో ఐదేళ్లుగా వ్యవసాయ రసాయనాలు వాడని గ్రామాలకు సేంద్రియ గుర్తింపు
- దంతెవాడ జిల్లాలో ఒకటీ రెండూ కాదు ఏకంగా 110 గ్రామాలకు సేంద్రియ సర్టిఫికేషన్ మంజూరు
- సికింద్రాబాద్ కేంద్రంగా నడిచే సిఎస్ఎ రీజినల్ కౌన్సెల్ ద్వారా సర్టిఫికేషన్ మంజూరు
- తాజాగా సిఎస్ఎ రీజినల్ కౌన్సెల్‌కు దక్కిన ప్రతిష్ఠాత్మక జైవిక్ ఇండియా జాతీయ పురస్కారం
- తెలుగు రాష్ట్రాల్లో 30 వేల మంది రైతులకు సేంద్రియ సర్టిఫికేషన్ ఇచ్చాం: డా. రామాంజనేయులు



దంతెవాడ జిల్లాలో రైతులతో సర్టిఫికేషన్ సిబ్బంది సమావేశం



సేంద్రియ సర్టిఫికేషన్ మంజూరుకు ముందు క్షేత్రస్థాయి తనిఖీలో సిఎస్ఎ ప్రోగ్రామ్ డైరెక్టర్ (సర్టిఫికేషన్) చంద్రకళ

సంపూర్ణ సేంద్రియ గ్రామాలు!

ఛత్తీస్‌ఘడ్‌లోని దంతెవాడ జిల్లాలో 110 గిరిజన గ్రామాలు పిజిఎస్ సేంద్రియ సర్టిఫికేషన్ పొందాయి. సికింద్రాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్రాని(సిఎస్ఎ)కి చెందిన రీజినల్ కౌన్సెల్ ఈ సర్టిఫికేషన్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఇటీవల సిఎస్ఎకు ప్రతిష్ఠాత్మక ‘జైవిక్ ఇండియా’ పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా సిఎస్ఎ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. జీ వీ రామాంజనేయులుతో ‘సాక్షి సాగుబడి’ ముచ్చటించింది.

రసాయనిక ఎరువులు, పురుగుమందులు, కలుపు మందుల వాడకం పూర్తిగా మానుకొని ప్రకృతి /సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ ఆరోగ్యదాయకంగా ఆహారోత్పత్తి చేసే రైతులకు ప్రత్యేక గుర్తింపునిచ్చేదే సేంద్రియ సర్టిఫికేషన్. ఈ సర్టిఫికేషన్ ద్వారా మెరుగైన ధరకు పంట దిగుబడులను అమ్ముకునే అవకాశం కలుగుతుంది. రైతు వ్యక్తిగతంగా సర్టిఫికెట్ పొందొచ్చు. నలుగురితో కలసి సహకార సంఘంగా లేదా రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడి సమష్టిగా సేంద్రియ సర్టిఫికేషన్ పొందవచ్చు. ఒంటరిగా సర్టిఫికేషన్ పొందే కంటే సంఘంగా పొందటం సులభం.



జైవిక్ ఇండియా పురస్కారంతో చంద్రకళ

ఇంకా చెప్పాలంటే, గ్రామంలో రైతులందరూ కలసి సేంద్రియ / ప్రకృతి వ్యవసాయం దిశగా నడిస్తే పరివర్తన దశలో ఎదురయ్యే సమస్యలను సులువుగా ఎదుర్కోవచ్చు. అంతేకాదు, మార్కెటింగ్‌కు అవసరమైన సేంద్రియ సర్టిఫికేషన్‌ను ఒక గ్రామంలో రైతులంతా కలసి ఊరుమ్మడిగా అయితే తొందరగానే పొందవచ్చు. విడిగా అయితే మూడేళ్ల ప్రక్రియ. ఊళ్లో రైతులంతా కలిస్తే ఆర్నెల్లు చాలు. దీన్నే ‘లార్జ్ ఏరియా సర్టిఫికేషన్’ అని పిలుస్తున్నారు. ఈ విషయంలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉంది.

ఛత్తీస్‌ఘడ్‌లోని దంతెవాడ జిల్లాలో గత ఐదేళ్లుగా రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం ఐదేళ్ల క్రితమే మానేసిన 110 గ్రామాలు సేంద్రియ సర్టిఫికేషన్ గుర్తింపు పొందాయి. ఈ గ్రామాల్లోని మొత్తం 10,264 మంది రైతులు 65,279 హెక్టార్లలో సేంద్రియ పంటలు పండిస్తున్నారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం (సిఎస్ఎ) రీజినల్ కౌన్సెల్ ఈ సర్టిఫికేషన్ ఇచ్చింది.

మరో 121 గ్రామాలకు సర్టిఫికేషన్ ప్రాసెస్ వివిధ దశల్లో ఉందని సిఎస్ఎ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. రామాంజనేయులు తెలిపారు. శిక్షణ, తనిఖీలకు హెక్టారుకు రూ. 700ల చొప్పున పిజిఎస్ సర్టిఫికేషన్‌కు ఖర్చవుతుందన్నారు. గ్రామం మొత్తం సేంద్రియ సర్టిఫికేషన్ పొందటం అంత సులువేమీ కాదు. దశలవారీ పరీక్షల్లో రసాయనిక అవశేషాలు లేవని తేలితేనే సర్టిఫికేషన్ ఇస్తారు. లార్జ్ ఏరియా సర్టిఫికేషన్ రావాలంటే మొదట రైతులు గత ఐదేళ్లుగా పూర్తిగా సేంద్రియంగానే పంటలు పండిస్తున్నామని ప్రతిజ్ఞ చేయాలి. సర్పంచ్ కూడా బాధ్యత తీసుకొని డిక్లరేషన్ ఇవ్వాలి. ఆ వూళ్లో రసాయనిక ఎరువులు, పురుగు/కలుపు మందులు అమ్మే దుకాణం లేదని జిల్లా వ్యవసాయ అధికారి సర్టిఫై చెయ్యాలి. ఇవన్నీ అయ్యాక రీజినల్ కౌన్సెల్ పరీక్షలు చేసి సర్టిఫై చేస్తుంది.

ప్రతిష్ఠాత్మక జైవిక్ ఇండియా పురస్కారం

సుస్థిర వ్యవసాయ కేంద్రాని(సిఎస్ఎ)కి ఇటీవల ప్రతిష్ఠాత్మక జైవిక్ ఇండియా రీజినల్ కౌన్సెల్ పురస్కారం లభించింది. ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ (ఐసీసీఓఏ) గత ఐదేళ్లుగా ‘జైవిక్ ఇండియా’ పురస్కారాలను సేంద్రియ రైతులతో పాటు సర్టిఫికేషన్ సేవలందిస్తున్న రీజినల్ కౌన్సెళ్లకు కూడా ఏటేటా పురస్కారాలను ప్రదానం చేస్తోంది. బెంగళూరులో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సేంద్రియ, చిరుధాన్యాల ప్రదర్శనలో జాతీయ స్థాయిలో ఉత్తమ రీజినల్ కౌన్సెల్‌గా సిఎస్ఎ ఎంపికైంది. సిఎస్ఎ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. జీవీ రామాంజనేయులు, సిఎస్ఎ ప్రోగ్రామ్ డైరెక్టర్ (సర్టిఫికేషన్) చంద్రకళ సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

20 ఏళ్ల క్రితం ఐఆర్ఎస్ వద్దనుకొని..



మహిళా రైతుకు సేంద్రియ సర్టిఫికెట్‌ను అందిస్తున్న డా. రామాంజనేయులు

వ్యవసాయ శాస్త్రంలో పిహెచ్‌డి పూర్తిచేసిన డా. రామాంజనేయులు ఐసిఎఆర్‌లోని అగ్రికల్చర్ రీసెర్చ్ సర్వీస్ (ఎఆర్ఎస్)లో 8 ఏళ్లు సీనియర్ శాస్త్రవేత్తగా పని చేశారు. ఆ తర్వాత ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)కు ఎంపికయ్యారు. శిక్షణా కాలంలోనే ఆ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి సేంద్రియ/ ప్రకృతి వ్యవసాయ వ్యాప్తి కోసం సుస్థిర వ్యవసాయ కేంద్రం అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ఈ దిశగా గత 20 ఏళ్లుగా విశేష కృషి చేస్తున్నారు. సేంద్రియ పద్ధతులపై పరిశోధన చేస్తూ శిక్షణ ఇచ్చే కృష్ణసుధ అకాడమీ ఫర్ ఆగ్రోఎకాలజీ (కొండపర్వ)ని స్థాపించటంలో కూడా ఆయన కీలకపాత్ర పోషించారు. ‘ఏపీ, తెలంగాణలో 66 సహకార సంఘాలు, ఎఫ్‌పిఓలకు చెందిన 50 వేల మంది రైతులను సేంద్రియ సాగు వైపు మళ్లించే కృషి చేస్తున్నాం. ఇప్పటికే 30 వేల మందికి సేంద్రియ సర్టిఫికేషన్ ఇచ్చాం. వారి నుంచి సేకరించిన ఉత్పత్తులను టీటీడీకి అందిస్తున్నామ’ని డా.రామాంజనేయులు తెలిపారు.

క్లైమెట్ ఛేంజ్ నేపథ్యంలో సుస్థిర సేద్యం అనివార్యం

ఛత్తీస్‌ఘడ్ దంతెవాడ జిల్లాలో ఐదేళ్లుగా రసాయనాల జోలికి పోని 110 గ్రామాల్లో రైతులందరికీ పిజిఎస్ సేంద్రియ సర్టిఫికేషన్ ఇచ్చాం. వారు ఎక్కువగా వరి ధాన్యమే పండిస్తున్నారు. ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేసి, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తోంది. దేశవ్యాప్తంగా వ్యవసాయంలో రసాయనాల వాడకం విపరీతం కావటం.. భూసారం క్షీణిస్తుండటం, నీటి వనరుల లభ్యత తగ్గిపోవటం, పెచ్చుమీరిన పర్యావరణ సమస్యలు వ్యవసాయాన్ని మరింత జటిలంగా మార్చాయి. క్లైమెట్ ఛేంజ్ నేపథ్యంలో సుస్థిర సేద్యం వైపు మారాల్సిన అనివార్యతను ఇప్పుడు అందరూ గుర్తిస్తున్నారు. అది ఏ పద్ధతిలో అన్నదే ఇప్పుడు జరుగుతున్న చర్చంతా. ఆంధ్రప్రదేశ్‌లో డా. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం(2007–08) నుంచే వ్యవసాయ రసాయనాల వాడకం తగ్గుతుండగా, గత పదేళ్లలో తెలంగాణలో 5 రెట్లు పెరిగింది. లక్ష ఎకరాల్లో సేంద్రియ సేద్యం చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదించాం.

– డా. జీవీ రామాంజనేయులు
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సుస్థిర వ్యవసాయ కేంద్రం, సికింద్రాబాద్
https://csa-india.org/
https://krishnasudhaacademy.org

సేంద్రియ సర్టిఫికేషన్ ఎవరిస్తారు?

సేంద్రియ / ప్రకృతి వ్యవసాయం చేపట్టిన రైతులకు, సహకార సంఘాలకు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు, గ్రామాలకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ గుర్తింపు పొందిన సంస్థలు సేంద్రియ సర్టిఫికేషన్ ఇస్తాయి. ఈ సంస్థలను రీజినల్ కౌన్సెళ్లు అంటారు. ఇలాంటి కౌన్సెళ్లు దేశంలో 76 ఉన్నాయి. రీజినల్ కౌన్సెల్ ఎన్ని రాష్ట్రాల్లో అయినా సర్టిఫికేషన్ సేవలు అందించవచ్చు. చురుగ్గా పనిచేస్తున్న రీజినల్ కౌన్సెళ్లలో సికింద్రాబాద్‌లోని సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజినల్ కౌన్సెల్ ఒకటి. వ్యక్తిగతంగా ఒక రైతు గానీ, 10-15 మంది రైతుల బృందాలు / సహకార సంఘాలు / రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పిఓల)కు పిజిఎస్ సేంద్రియ సర్టిఫికేషన్ ఇస్తారు. అందరి రైతులూ పరస్పరం బాధ్యత తీసుకోవాలి. బృందంలో ఒక్క రైతు దారితప్పినా గ్రూప్ మొత్తానికీ గుర్తింపు రద్దవుతుంది. పూర్తిగా గ్రామంలో రైతులందరికీ కలిపి కూడా సర్టిఫికేషన్ ఇస్తారు. దీన్నే లార్జ్ ఏరియా సర్టిఫికేషన్ అంటారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు అనేక దఫాలు పరీక్షలు నిర్వహించిన తర్వాత సర్టిఫికేషన్ ఏ యేటికాయేడు ప్రదానం చేస్తారు.

PGS-INDIA GREEN — పరివర్తన దశలో ఇచ్చే లోగో..
PGS-INDIA ORGANIC — పిజిఎస్ సేంద్రియ లోగో..

సర్టిఫికేషన్ రెండు రకాలు

ఆరోగ్యదాకమైన ఆహారోత్పత్తులను పండించే రైతులు / సంస్థలు తమ ఉత్పత్తులకు సేంద్రియ సర్టిఫికేషన్ పొందడానికి ప్రధానంగా రెండు సర్టిఫికేషన్లు ఉన్నాయి. మొదటిది.. పిజిఎస్, రెండోది.. ఎన్‌పిఓపి. ఎక్కడ అమ్మాలనుకునే దాన్ని బట్టి ఏ సర్టిఫికేషన్ అవసరమో చూసుకోవాలి. దేశంలోనే విక్రయించాలనుకుంటే పార్టిసిపేటరీ గ్యారంటీ సిస్టం (పిజిఎస్) ఇండియా సర్టిఫికేషన్ తీసుకుంటే సరిపోతుంది. కొందరు రైతులు బృందంగా ఏర్పడి, పరస్పర బాధ్యతతో తీసుకునే సర్టిఫికేషన్ ఇది. దీనికి అయ్యే ఖర్చు కొంచెం తక్కువ. విదేశాలకు ఎగుమతి చేయాలనుకుంటే నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పిఓపి) థర్డ్ పార్టీ సర్టిఫికేషన్ పొందాల్సి ఉంటుంది. వీటిల్లో ఏ సర్టిఫికేషన్ అయినా పూర్తిగా సేంద్రియ సర్టిఫికెట్ పొందటానికి మూడేళ్ల కాలం పడుతుంది. పరివర్తన దశలో తొలి రెండేళ్లకు ‘గ్రీన్’ సర్టిఫికేట్ ఇస్తారు. మూడో ఏడాది అన్ని పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చిన తర్వాత ‘ఆర్గానిక్’ సర్టిఫికేట్ ఇస్తారు. నిపుణులు, అధికారుల సమన్వయంతో రీజినల్ కౌన్సెళ్లే ఈ సర్టిఫికేషన్ సేవలు అందిస్తున్నాయి.

నేరుగా అమ్మితే సర్టిఫికేషన్ అక్కర్లేదు!

రసాయన రహితంగా వ్యవసాయం చేస్తూ, తాము పండించే ఉత్పత్తులను, ఎటువంటి బ్రాండ్ పేరు పెట్టకుండా, నేరుగా వినియోగదారులకు అమ్ముకునే సేంద్రియ రైతులు ఎటువంటి సేంద్రియ సర్టిఫికేషన్ తీసుకోవాల్సిన అవసరం లేదు. అయితే, వారి వ్యాపారం ఏడాదికి రూ. 12 లక్షలు లోపు ఉండాలి. ఆ పరిమితి దాటితే సర్టిఫికేషన్ తీసుకోవాలి. అదేవిధంగా.. రైతు బృందాలు, కోఆపరేటివ్‌లు, ఎఫ్‌పిఓలు, వారి వద్ద నుంచి సేంద్రియ ఆహారోత్పత్తులను సేకరించే ప్రైమరీ అగ్రిగేటర్లు, స్టార్టప్‌లు కూడా వార్షిక వ్యాపారం రూ. 50 లక్షలకు లోపు ఉంటే సేంద్రియ సర్టిఫికేషన్ పొందాల్సిన అవసరం లేదు. ఈ వ్యవహారాలను ఫుడ్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) అధికారులు పర్యవేక్షిస్తుంటారు.

అనంతపురంలో రైతుబడి అగ్రి షో

గత ఏడాది ఆగస్టులో నల్గొండలో అతి పెద్ద అగ్రి షో నిర్వహించిన రైతు బడి సంస్థ నిర్వాహకులు రాజేందర్ రెడ్డి ఈ నెల 22, 23 తేదీల్లో అనంతపురంలో మరో అతిపెద్ద వ్యవసాయ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నారు. రాప్తాడు సమీపాన హైవే వెంబడి ఏర్పాటయ్యే ఈ ప్రదర్శనలో 300 కంపెనీలు అత్యాధునిక వ్యవసాయ యంత్రాలు, పరికరాలను ప్రదర్శించనున్నాయన్నారు. అన్ని రకాల పంటలు, తోటలు, పశువుల పెంపకంపై సమగ్ర సమాచారాన్ని రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. 50 వేల మంది రైతులు ఈ ప్రదర్శనకు వస్తారని అంచనా. ఇతర వివరాలకు... www.rbagrishow.com

23న 5 అంచెల వ్యవసాయంపై శిక్షణ

యుగ తులసి ఫౌండేషన్, సేవ్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 23(ఆదివారం)న బాటసింగారంలోని యుగ తులసి ఫౌండేషన్ ఛైర్మన్ కొలిశెట్టి శివకుమార్ గోశాల గో మహాక్షేత్రంలో 5 అంచెల ప్రకృతి వ్యవసాయ విధానంపై శిక్షణా శిబిరం జరగనుంది. సేవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విజయరామ్ రైతులకు ఉ. 10 గం. నుంచి సా. 5 గం. వరకు అవగాహన కల్పిస్తారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న 100 మందికే పాల్గొనే అవకాశం ఉంది. 5 లేయర్ మోడల్‌లో సాగుకు సంబంధించిన అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తారు. రైతులు ఈ నెల 15లోగా 90522 86688 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని శివకుమార్ తెలిపారు.



ముగిసిన గుకేశ్ పోరాటం

హాంబర్గ్ (జర్మనీ): ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ పోరాటం ముగిసింది. ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో గుకేశ్ 0-2తో ఓడిపోయాడు. తప్పనిసరిగా గెలవాల్సిన క్వార్టర్ ఫైనల్ రెండో గేమ్‌లో నల్ల పావులతో ఆడిన గుకేశ్ కేవలం 18 ఎత్తుల్లో కరువానా చేతిలో ఓటమి పాలయ్యాడు. ఆదివారం జరిగిన తొలి గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన గుకేశ్ 40 ఎత్తుల్లో పరాజయం చవిచూశాడు.

ఆర్యన్ షాకు నిరాశ

ఢిల్లీ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-75 టెన్నిస్ టోర్నమెంట్ క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్‌లో భారత యువ క్రీడాకారుడు ఆర్యన్ షాకు నిరాశ ఎదురైంది. చివరి రౌండ్‌లో ఆర్యన్ షా 2-6, 6-2, 1-6తో ఇమామురా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ఈ మ్యాచ్‌లో ఆర్యన్ గెలిచి ఉంటే మెయిన్ 'డ్రా'కు అర్హత పొందేవాడు. నేటి నుంచి మెయిన్ 'డ్రా' మ్యాచ్‌లు మొదలవుతాయి. భారత ప్లేయర్లు శశికుమార్ ముకుంద్, రామ్‌కుమార్‌లకు నేరుగా మెయిన్ 'డ్రా'లో చోటు కల్పించారు.





బుమ్రాపై నేడు తుది నిర్ణయం

చాంపియన్స్ ట్రోఫీ తుది జట్ల ఖరారుకు నేడు ఆఖరి రోజు

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీలో భారత స్టార్ పేసర్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆడతాడా లేదా అనేది నేడు తేలిపోతుంది. అతని ఫిట్‌నెస్ నివేదికను దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ సెలక్టర్లు మంగళవారం నిర్ణయం తీసుకుంటారు. వెన్ను నొప్పితో బాధపడుతున్న బుమ్రాకు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఇటీవలే స్కానింగ్ జరిగింది. దీనిపై డాక్టర్లు ఇచ్చే నివేదికను పరిశీలించిన అనంతరం సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ కలిసి ఒక నిర్ణయం తీసుకుంటారు. జనవరిలో ఆస్ట్రేలియాతో సిడ్నీతో జరిగిన చివరి టెస్టు తర్వాత బుమ్రా మళ్లీ బరిలోకి దిగలేదు. ఆ మ్యాచ్‌లోనూ నొప్పి కారణంగా రెండో ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయనే లేదు. అతను కనీసం ఐదు వారాల పాటు బౌలింగ్‌కు దూరంగా ఉండాలని వైద్యులు సూచించారు. ప్రకటించిన 15 మంది సభ్యుల భారత జట్టులో బుమ్రా కూడా ఉన్నాడు. అయితే స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగే చివరి వన్డేలో (బుధవారం) ఆడి అతను తన ఫిట్‌నెస్ నిరూపించుకుంటాడని భావించారు. అయితే ప్రస్తుత పరిస్థితి చూస్తే బుమ్రా ఈ మ్యాచ్ కూడా ఆడటం సందేహమే. చాంపియన్స్ ట్రోఫీ కోసం ఇప్పటికే ప్రకటించిన జట్టులో మార్పులు చేసుకునేందుకు 11వ తేదీ వరకు అవకాశం ఉంది. బుమ్రా సిద్ధంగా లేకపోతే ఢిల్లీ పేసర్ హర్షిత్ రాణాకు టీమ్‌లో స్థానం లభించవచ్చు. తాజాగా ఇంగ్లండ్‌తో సిరీస్‌లో రాణా తొలి రెండు వన్డేల్లో బరిలోకి దిగాడు.

గాయంతో బెతెల్ అవుట్

కటక్: ఇంగ్లండ్ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ జాకబ్ బెతెల్ చాంపియన్స్ ట్రోఫీ నుంచి తప్పుకున్నాడు. కండరాల నొప్పితో బాధపడుతున్న అతను భారత్‌తో రెండో వన్డే కూడా ఆడలేదు. జేమీ స్మిత్ కూడా గాయం నుంచి కోలుకోకపోవడంతో ఆదివారం మ్యాచ్‌లో సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ల జాబితాలో ఇంగ్లండ్ తమ అసిస్టెంట్ కోచ్‌లు మార్కస్ ట్రెస్కోథిక్, పాల్ కాలింగ్‌వుడ్ పేర్లను కూడా చేర్చాల్సి వచ్చింది. తొలి వన్డేలో అర్ధ సెంచరీ చేసి ఒక వికెట్ తీసిన బెతెల్ ఆకట్టుకున్నాడు. అతని స్థానంలో టామ్ బాంటన్‌ను ఇంగ్లండ్ ఎంపిక చేసింది. అతను సోమవారం భారత్‌కు చేరుకున్నాడు. చాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లండ్ ఈ నెల 22న ఆస్ట్రేలియాతో తమ తొలి మ్యాచ్ ఆడుతుంది. ఆలోగా స్మిత్ కోలుకుంటాడని జట్టు ఆశిస్తోంది. చాంపియన్స్ ట్రోఫీకు దూరమవుతున్న ఆటగాళ్ల జాబితా రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే ఆస్ట్రేలియా నుంచి కమిన్స్, హాజల్‌వుడ్, మిచెల్ మార్ష్, పాకిస్తాన్ నుంచి సయీమ్ అయూబ్, దక్షిణాఫ్రికా నుంచి అన్రిచ్ నోర్జే, గెరాల్డ్ కొయెట్జీ చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యారు.





నగాల్ ర్యాంక్ 129

న్యూఢిల్లీ: ఈ ఏడాది ఆశించిన విజయాలు అందుకోలేకపోతున్న భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగాల్ ర్యాంక్ మరింత పడిపోయింది. సోమవారం విడుదల చేసిన అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) తాజా ర్యాంకింగ్స్‌లో సుమిత్ నగాల్ 24 స్థానాలు దిగజారి 129వ ర్యాంక్‌లో నిలిచాడు. ఈ ఏడాది నాలుగు టోర్నీలలో ఆడిన నగాల్ రెండో రౌండ్ దాటి ముందుకెళ్లలేకపోయాడు. నగాల్ తర్వాత భారత్ నుంచి రెండో అత్యుత్తమ ర్యాంక్ రామ్‌కుమార్ రామనాథన్‌ది. రామ్‌కుమార్ 403వ ర్యాంక్‌లో ఉండగా... ఇతర ప్లేయర్లు శశికుమార్ ముకుంద్ 429వ ర్యాంక్‌లో, కరణ్ సింగ్ 500వ ర్యాంక్‌లో నిలిచారు. మరోవైపు డబుల్స్ విభాగంలో భారత్ నుంచి ఐదుగురు టాప్-100లో ఉన్నారు. రోహన్ బోపన్న 21వ ర్యాంక్‌లో, యూకీ బాంబ్రీ 46వ ర్యాంక్‌లో ఎలాంటి మార్పు లేదు. శ్రీరామ్ బాలాజీ రెండు స్థానాలు పడిపోయి 67వ ర్యాంక్‌లో, హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ మూడు స్థానాలు పడిపోయి 78వ ర్యాంక్‌లో ఉండగా... అర్జున్ 83వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


విలియమ్సన్ వీరోచితం

అజేయ సెంచరీతో న్యూజిలాండ్‌ను గెలిపించిన స్టార్ బ్యాటర్

- రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 6 వికెట్లతో నెగ్గి ఫైనల్లోకి కివీస్
- మాథ్యూ బ్రీజ్‌కే శతకం వృథా



లాహోర్: ముక్కోణపు వన్డే టోర్నమెంట్‌లో రెండు వరుస విజయాలతో న్యూజిలాండ్ జట్టు ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి పోరులో ఆతిథ్య జట్టు పాకిస్తాన్‌ను చిత్తు చేసిన కివీస్ రెండో లీగ్ మ్యాచ్‌లో సఫారీలను ఓడించింది. సోమవారం జరిగిన ఈ పోరులో న్యూజిలాండ్ 6 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌తోనే వన్డేల్లో అరంగేట్రం చేసిన మాథ్యూ బ్రీజ్‌కే (148 బంతుల్లో 150; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) శతకంతో చెలరేగాడు. కెరీర్ తొలి వన్డేలో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా బ్రీజ్‌కే ఘనత సాధించాడు. వియాన్ ముల్డర్ (60 బంతుల్లో 64; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా, జేసన్ స్మిత్ (51 బంతుల్లో 41; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం న్యూజిలాండ్ 48.4 ఓవర్లలో 4 వికెట్లకు 308 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కేన్ విలియమ్సన్ (113 బంతుల్లో 133 నాటౌట్; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు సెంచరీ సాధించగా... ఓపెనర్ డెవాన్ కాన్వే (107 బంతుల్లో 97; 9 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో చేజార్చుకున్నాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 187 పరుగులు జోడించారు. 2019 వన్డే వరల్డ్ కప్ తర్వాత విలియమ్సన్‌కు ఇదే మొదటి శతకం కావడం విశేషం. దాదాపుగా ద్వితీయ శ్రేణి జట్టుతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికాకు వన్డేల్లో ఇది వరుసగా ఐదో ఓటమి. బ్రీజ్‌కేతో పాటు మరో ముగ్గురు బౌలర్లు ఈథన్ బాష్, సెనురాన్ ముత్తుసామి, మిహ్‌లాలి ఎంపొంగ్‌వానా ఇదే వన్డేతో అరంగేట్రం చేశారు. దాంతో జట్టు బౌలింగ్ బలహీనంగా మారిపోయింది. బుధవారం పాకిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య జరిగే మ్యాచ్ ఫలితం తర్వాత న్యూజిలాండ్‌తో ఫైనల్లో తలపడే జట్టేదో తేలుతుంది.



150 దక్షిణాఫ్రికా క్రికెటర్ మాథ్యూ బ్రీజ్‌కే అరంగేట్రం వన్డేలో చేసిన స్కోరు. ఆడిన తొలి వన్డేలోనే అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ప్లేయర్‌గా బ్రీజ్‌కే నిలిచాడు. 47 ఏళ్లుగా వెస్టిండీస్ ప్లేయర్ డెస్మండ్ హేన్స్ పేరిట ఉన్న రికార్డును బ్రీజ్‌కే బద్దలు కొట్టాడు. 1978లో ఆస్ట్రేలియాతో జరిగిన వన్డేలో హేన్స్ 148 పరుగులు సాధించాడు.

4 బరిలో దిగిన తొలి వన్డేలోనే సెంచరీ చేసిన నాలుగో దక్షిణాఫ్రికా క్రికెటర్‌గా బ్రీజ్‌కే గుర్తింపు పొందాడు. గతంలో కొలిన్ ఇంగ్రామ్ (124: జింబాబ్వేపై 2010లో), తెంబా బవూమా (113: ఐర్లాండ్‌పై 2016లో), రీజా హెన్‌డ్రిక్స్ (102: శ్రీలంకపై 2018లో) ఈ ఘనత సాధించారు.

2 దక్షిణాఫ్రికాపై సెంచరీ చేసిన క్రమంలో న్యూజిలాండ్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ వన్డేల్లో 7000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. తక్కువ ఇన్నింగ్స్‌లలో 7 వేల పరుగులు పూర్తి చేసిన రెండో క్రికెటర్‌గా విలియమ్సన్ (159 ఇన్నింగ్స్) నిలిచాడు. ఈ జాబితాలో హాషిమ్ ఆమ్లా (150 ఇన్నింగ్స్) తొలి స్థానంలో ఉన్నాడు.

తెలంగాణ టీటీ జట్టుకు కాంస్యం

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో పదో పతకం చేరింది. సోమవారం జరిగిన టేబుల్ టెన్నిస్ (టీటీ) టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ పురుషుల జట్టుకు కాంస్య పతకం లభించింది. సూరావజ్జుల స్నేహిత్, అలీ మొహమ్మద్, మొహమ్మద్ అలీ, స్వర్ణేందు చౌధురీ, సంతోష్ రమేశ్ కుమార్‌లతో కూడిన తెలంగాణ జట్టు సెమీఫైనల్లో ఓడిపోయింది. మహారాష్ట్రతో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ 0-3తో పరాజయం పాలైంది. తొలి మ్యాచ్‌లో స్నేహిత్ 6-11, 7-11, 9-11తో జష్ మోదీ చేతిలో... రెండో మ్యాచ్‌లో మొహమ్మద్ అలీ 9-11, 9-11, 6-11తో రీగన్ చేతిలో... మూడో మ్యాచ్‌లో స్వర్ణేందు చౌధురీ 12-10, 1-11, 9-11, 3-11తో చిన్మయ సోమయ్య చేతిలో ఓడిపోయారు. మరో సెమీఫైనల్లో తమిళనాడు 2-3తో పశ్చిమ బెంగాల్ చేతిలో పరాజయం చూవిచూసి కాంస్యంతో సరిపెట్టుకుంది. ఫైనల్లో పశ్చిమ బెంగాల్ 3-0తో మహారాష్ట్రపై నెగ్గి పసిడి పతకం సొంతం చేసుకుంది. మహిళల విభాగంలోనూ పశ్చిమ బెంగాల్ జట్టుకే స్వర్ణ పతకం లభించింది. సుతీర్థ ముఖర్జీ, ఐహిక ముఖర్జీ, పొయ్‌మంతీ బైస్యా, మౌమా దాస్, మౌహిత దత్తాలతో కూడిన పశ్చిమ బెంగాల్ ఫైనల్లో 3-0తో మహారాష్ట్రపై గెలిచింది. సోమవారం క్రీడలు ముగిశాక తెలంగాణ 10 పతకాలతో (1 స్వర్ణం, 2 రజతాలు, 7 కాంస్యాలు) 29వ స్థానంలో ఉంది.



సాక్షి
సినిమా

ఆయన మాటలకు... మాకు ఏం సంబంధం లేదు

• క్షమాపణ చెబుతున్నా!

- హీరో విశ్వక్ సేన్



• విశ్వక్ సేన్, సాహు గారపాటి

'**మా** కంట్రోల్‌లో లేకుండా ఒక వ్యక్తి (నటుడు పృథ్వీరాజ్‌ని ఉద్దేశించి) చేసిన తప్పుకి మా 'లైలా' సినిమాని బలి చేయకండి. ఆ వ్యక్తికి, నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆయన కేవలం సినిమాలో నటించాడు. క్షమాపణలు చెబితేనే కూల్ డౌన్ అవుతారంటే నేను క్షమాపణలు చెబుతున్నాను. దయచేసి సినిమాను సపోర్ట్ చేయండి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. విశ్వక్ సేన్ హీరోగా రామ్ నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన చిత్రం 'లైలా'. ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో థర్టీ ఇయర్స్ పృథ్వీరాజ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఆ తర్వాత 'బాయ్‌కాట్ లైలా' అనే హ్యాష్ ట్యాగ్ 'ఎక్స్' మాధ్యమంలో ట్రెండ్ అయ్యింది. దీంతో సోమవారం చిత్రయూనిట్ నిర్వహించిన సమావేశంలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''ఆ వ్యక్తి మాట్లాడుతున్నప్పుడు నేను, నిర్మాత... చిరంజీవి ('లైలా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు)గారిని ఆహ్వానించడానికి వెళ్లాం. ఆ సమయంలో ఆయన ఏం మాట్లాడాడో ఇంటికి వెళ్లేంతవరకూ మాకు తెలియదు. సినిమాలో ఆయన చెప్పిన సన్నివేశం పెట్టలేదు. ఆయన మాట్లాడిన దానికి, మాకు ఎలాంటి సంబంధం లేదు. సినిమా ఈవెంట్‌లో ఎవరేం మాట్లాడతారో మా కంట్రోల్‌లో ఉండదు. ఒకవేళ ఆయన మాట్లాడుతున్నప్పుడు మేం ఉన్నట్లయితే ఆయన్నుంచి మైకు తీసుకునేవాళ్లం. నా సినిమా రిలీజ్ అయ్యే వరకు సపోర్ట్ చేయమని కోరుతున్నాను. ఇది మా అభ్యర్థన'' అని అన్నారు. ''లైలా' ప్రీ రిలీజ్ ఈవెంట్ తర్వాత 'బాయ్‌కాట్ లైలా' అనే పోస్ట్స్ చూసి షాక్ అయ్యాము. సినిమాను సినిమాగా చూడాలని మేం కోరుతున్నాము'' అని పేర్కొన్నారు సాహు గారపాటి.



• శిరీష్, మీనాక్షీ చౌదరి, 'దిల్' రాజు, వెంకటేశ్, రాఘవేంద్ర రావు, అనిల్ రావిపూడి, ఐశ్వర్యా రాజేశ్

దేవుడా... బ్లాక్ బస్టర్ ఇచ్చావ్

- హీరో వెంకటేశ్

''**నే**ను రికార్డుల గురించి ఆలోచించను. ప్రేక్షకులు సినిమాలను ఆస్వాదించాలి. ఐదు పదేళ్లుగా థియేటర్స్‌లో సినిమాలు చూడనివాళ్లు కూడా థియేటర్స్‌కు వెళ్లి 'సంక్రాంతికి వస్తున్నాం' చూశారు. థియేటర్స్ రీ ఓపెనింగ్ జరిగి, అక్కడ కూడా మా సినిమాను ఆడియన్స్ చూశారంటే... ఇది చాలా మంచి సెలబ్రేషన్. అనిల్ అద్భుతమైన వర్క్ చేశాడు. 2027లో మళ్లీ సంక్రాంతికి వస్తాం'' అని వెంకటేశ్ అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 14న సంక్రాంతి సందర్భంగా విడుదలైంది. ఈ సినిమా రూ. 300 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌తో బ్లాక్ బస్టర్‌గా నిలిచిందని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా సోమవారం 'సంక్రాంతికి వస్తున్నాం విక్టరీ వేడుక' పేరిట నిర్వహించిన వేడుకలో వెంకటేశ్ మాట్లాడుతూ– ''దేవుడా... ఓ మంచి దేవుడా... 1986లో యాక్సిడెంటల్‌గా ఇండస్ట్రీకి వచ్చాను. అడక్కుండానే 'కలియుగ పాండవులు' ఇచ్చావ్. ఆ తర్వాత కూడా చాలా హిట్స్ ఇచ్చావ్. మధ్యలో నేను అడగకుండానే 'చంటి'లాంటి సినిమా ఇచ్చి, అదొక బ్లాక్‌బస్టర్ చేశావ్. దాని తర్వాత అడిగినా అడగకపోయినా.. ప్రేమించుకుందాం రా, ఆడవాళ్ళు..., సీతమ్మ వాకిట్లో.., గణేష్, లక్ష్మీ, తులసీ, రాజా... ఇలా ఎన్నో ఇచ్చావ్. 2000లో 'కలిసుందాం ..రా' వంటి హిట్ ఇచ్చావ్... నేను అడగలేదు... నువ్వు ఇస్తూనే ఉన్నావ్. ఈసారి 2025లో ఏం అడగకుండానే ఇంత పెద్ద బ్లాక్‌బస్టర్ ఇచ్చావ్. నా ఊహకు మించి జరిగిపోయింది. అభిమానులు, ప్రేక్షకులు, ఫ్యామిలీ ఆడియన్స్, ఇండస్ట్రీలో ఉన్న అందరూ ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకున్నారు. ఈ సినిమాతో అసోసియేట్ అయిన అందరికీ, సినిమా లవర్స్‌కు థ్యాంక్స్. వెంకీ... ఓ క్లీన్ ఎంటర్‌టైనర్ చేస్తే పెద్ద విజయం సాధిస్తుందని మా గురువు రాఘవేంద్రరావుగారు చెప్పారు. ఆయన ఊహ నిజమైంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో బాగా పాల్గొన్నాను.. డ్యాన్స్‌లు చేశాను. ఈ ప్రభావం నా కాలుపై పడింది. ఇక ఉంటాను'' అన్నారు. ముఖ్య అతిథి దర్శకుడు కె. రాఘవేంద్రరావు మాట్లాడుతూ– ''ఈ సినిమాతో 'వి' ఫర్ విక్టరీ' వెంకటేశ్ సొంతమైంది. 'సంక్రాంతికి వస్తున్నాం'... ఇండస్ట్రీకి సంక్రాంతినిచ్చింది. 'దిల్' రాజు, అనిల్ కాంబినేషన్‌లోని ప్రతి సినిమా హిట్'' అన్నారు. ''రూ. 300 కోట్ల గ్రాస్. నాకు తెలిసి ఈ సినిమా రిలీజ్‌కు ముందు నేను కానీ, తీసిన రాజుగారు కానీ, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబ్యూటర్స్... ఇలా ఎవరికీ ఈ సినిమా ఇంత స్థాయిలో కలెక్ట్ చేస్తుందన్న విషయం అంతు చిక్కి ఉండదు'' అన్నారు అనిల్ రావిపూడి. ''ఈ సినిమా యూనిట్, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్... ఇలా అందరికీ థ్యాంక్స్'' అని పేర్కొన్నారు శిరీష్.

ఈ వేడుకలో దర్శకులు వంశీ పైడిపల్లి, హరీష్ శంకర్, వశిష్ఠ ముఖ్య అతిథులుగా పాల్గొని, సినిమా విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే 'సంక్రాంతికి వస్తున్నాం' యూనిట్‌కు షీల్డ్స్ ప్రదానం జరిగింది.

అరెస్ట్ చేయిస్తాం... జాగ్రత్త

- నిర్మాత అల్లు అరవింద్



• బన్నీ వాసు, అల్లు అరవింద్

''పైరసీ చేయడం పెద్ద క్రైమ్. ప్రస్తుతం సైబర్ సెల్స్ బాగా పని చేస్తున్నాయి. మిమ్మల్ని (పైరసీదారులను) పట్టుకోవడం తేలిక. వాట్సప్, టెలిగ్రామ్ గ్రూప్ అడ్మిన్‌లకు ఇదే నా హెచ్చరిక... జాగ్రత్తగా ఉండండి. మీరు జైలుకు వెళ్లే అవకాశం ఉంది'' అని నిర్మాత అల్లు అరవింద్ హెచ్చరించారు. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ అయింది. కాగా, 'తండేల్' సినిమాను పైరసీ చేసి, ఆన్‌లైన్లో పెట్టారు. ఈ విషయంపై సోమవారం ప్రెస్‌మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''నిర్మాతలు, ఫిల్మ్ ఛాంబర్, ఓటీటీ చర్యల వల్ల కొన్నేళ్లుగా సినిమా పైరసీ ఆగింది. కానీ రెండు నెలల నుంచి మళ్లీ పెరిగింది. మొన్న 'దిల్' రాజుగారి సినిమాను ఇలానే ఆన్‌లైన్లో విడుదల చేశారు. పైరసీ నియంత్రణకు ఫిల్మ్ ఛాంబర్‌లోని సెల్ రాత్రీ పగలూ పని చేస్తోంది. కానీ కొందరు వాట్సప్ గ్రూపుల్లో లింకులను ఫార్వార్డ్ చేస్తున్నారు. ఇలా చేస్తున్న వాట్సప్, టెలిగ్రామ్ గ్రూప్‌ల అడ్మిన్‌లను గుర్తించి, సైబర్ క్రైమ్ దృష్టికి తీసుకెళ్లాం. వారిని అరెస్ట్ చేయిస్తాం. ఏపీఎస్ఆర్టీసీ బస్సులో సినిమా పైరసీ ప్రింట్‌ను ప్రదర్శించడం డ్రైవర్ అమాయకత్వం. సినిమా సక్సెస్‌ను మేం ఆస్వాదించే క్రమంలో ఈ పైరసీ సమస్య మాకు ప్రతిబంధకం'' అన్నారు. ''క్రిమినల్ కేసులు నమోదు అయితే వెనక్కి తీసుకోలేము. పైరసీ చేసినవాళ్లకి, దాన్ని డౌన్‌లోడ్ చేసుకున్న వాళ్లకీ కేసులు వర్తిస్తాయి. 'తండేల్' సినిమా పైరసీ కాపీ ఓవర్సీస్ నుంచే వచ్చింది. ఇది తమిళ ప్రింట్ నుంచి వచ్చింది. దానికి తెలుగు ఆడియో కలిపారు. పైరసీ కాపీని ప్రదర్శించవద్దని కేబుల్ ఆపరేటర్స్‌ని కూడా హెచ్చరిస్తున్నాం'' అని బన్నీ వాసు అన్నారు.

ఇదిలా ఉంటే... ఈ సమావేశం నిర్వహించిన కొంత సమయానికి బన్నీ వాసు 'ఎక్స్' వేదికగా ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కె. నారాయణరావుని ఉద్దేశించి, ''పైరసీని అడ్డుకునేందుకు కఠినమైన చర్యలు తీసుకోవడానికి నిజాయితీగా మీరు చేసిన ప్రయత్నాన్ని, ఈ విషయంపై త్వరితగతిన స్పందించినందుకు, ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు.

ప్లీజ్... లీవ్ అజ్ బిహైండ్: 'తండేల్' ప్రీ రిలీజ్ వేడుకలో అల్లు అరవింద్ మాట్లాడినప్పుడు... 'గేమ్ ఛేంజర్'ని తక్కువ చేసినట్లుగా ఉందని సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరిగింది. ''ఆ రోజు 'దిల్' రాజుగారిని ఉద్దేశించి, నేను మాట్లాడిన మాటలకు అర్థం... ఆయన ఒక్క వారం రోజుల్లోనే కష్టాలు-నష్టాలు-ఇన్‌కమ్‌ట్యాక్స్‌లు.. ఇవన్నీ అనుభవించారని. ఉద్దేశపూర్వకంగా నేను మాట్లాడిన మాటలు కాదు. మెగా అభిమానులు ఫీలై, నన్ను ట్రోల్ చేశారు. ఫీలైన ఆ అభిమానులకు చెబుతున్నాను... నాకు చరణ్ (రామ్‌చరణ్) కొడుకులాంటి వాడు. నాకున్న ఏకైక మేనల్లుడు. అందుకని ఎమోషనల్‌గా చెబుతున్నాను. ప్లీజ్... లీవ్ అజ్ బిహైండ్'' అన్నారు.

హారర్... సస్పెన్స్



• విరాజ్ రెడ్డి

విరాజ్ రెడ్డి చీలం, మిమి లియోనార్డ్, శిల్పా ప్రధాన పాత్రధారులుగా జగ పెద్ది దర్శకత్వంలో రూపొందిన హారర్, సస్పెన్స్ అండ్ లవ్ మూవీ 'గార్డ్'. 'రివెంజ్ ఫర్ లవ్' అనేది ఉప శీర్షిక. అనసూయ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో విరాజ్ రెడ్డి చీలం మాట్లాడుతూ– ''ఈ సినిమాలోని ఏ ఒక్కరూ కొత్త యాక్టర్ అనే ఫీలింగ్ రాదు. ఆస్ట్రేలియాలోనే మొత్తం చిత్రీకరణ పూర్తి చేశాం. మా డైరెక్టర్, టీమ్ అక్కడే ఉన్నారు. చిన్న చిత్రాలను సపోర్ట్ చేయండి'' అని అన్నారు. ''గార్డ్' కేవలం లవ్‌స్టోరీ మూవీయే కాదు... థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి'' అని తెలిపారు మ్యూజిక్ డైరెక్టర్ ప్రణయ్. ''సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ మూవీ ఇది. ఈ సినిమాకు రీ రికార్డింగ్ చేశాను '' అన్నారు సిద్ధార్థ్.

భ్రమరం వినోదం



• 'వెన్నెల' కిశోర్

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమాలో డాక్టర్ భ్రమరం పాత్రలో 'వెన్నెల' కిశోర్ నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''ఒక కాంటెంపరరీ ఇష్యూను వినోదాత్మకంగా చూపిస్తూ, 'సంతాన ప్రాప్తిరస్తు' మూవీని రూపొందిస్తున్నాం. ఈ సినిమాలో గర్భగుడి వెల్‌నెస్ సెంటర్ నిర్వహించే డాక్టర్ భ్రమరం తన దగ్గరకు సంతాన లేమి సమస్యలతో వచ్చే వారిని ఆయుర్వేద వైద్యాన్ని, మోడ్రన్ మందులతో కలిపి ఎలా ట్రీట్ చేశాడు? అనే అంశాలు హిలేరియస్‌గా ఉంటాయి. భ్రమరం పాత్రలో 'వెన్నెల' కిశోర్ డైలాగ్స్, కామెడీ టైమింగ్ ప్రేక్షకులను నవ్విస్తాయి'' అని యూనిట్ తెలిపింది.

ఒంటరివాడను నేను!



• శ్రీవిష్ణు

ఒకరు కాదు... ఇద్దరు అమ్మాయిలు ప్రేమిస్తారు అతన్ని. కానీ, 'ఒంటరివాడను నేను... ఎవ్వరివాడను కాను...' అనే పాట వింటుంటాడు. పైగా 35 ఏళ్ల వయసులో ఉన్న ఒక వ్యక్తి పెళ్లి కాకుండా మిగిలిపోవడానికి కారకుడు కూడా అవుతాడు. ఈ ఒంటరివాడు ఆ తర్వాత ఒక ఇంటివాడు అవుతాడా? పెళ్లి కాని 35 ఏళ్ల బ్రహ్మచారి కథ ఏంటి? అనేది తెలుసుకోవాలంటే 'హ్యాష్‌ట్యాగ్ సింగిల్' చిత్రం చూడాలి. ఒంటరివాడుగా హీరో శ్రీవిష్ణు, 35 ఏళ్ల యువకుడిగా 'వెన్నెల కిశోర్' నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో కార్తీక్ రాజు దర్శకత్వంలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం టైటిల్ ప్రకటించి, శ్రీవిష్ణు లుక్, గ్లింప్స్ విడుదల చేశారు. కేతికా శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమేరా: ఆర్ వేల్‌రాజ్.

సాక్షి బిజినెస్
మంగళవారం
11-2-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	548	77,312
నిఫ్టీ ▽	178	23,382

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	19,719	△	196
డోజోన్స్	44,361	△	58
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,768	△	67
డాక్స్	21,912	△	125
షాంఘై	3,322	△	19
నికాయ్	38,801	△	14

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	85,665
బంగారం (99.5 స్వచ్ఛత)	85,322
వెండి (కిలో)	95,533

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.05	88.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	108.00	110.88
€	యూరో	ఎస్‌బీఐ	89.60	92.24
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.85	58.28
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.99	56.21
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.55	66.97
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.42	23.96
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.92	24.68
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.12	12.94

● అన్‌స్టాపబుల్...

పసిడి @ 88,500

10 గ్రాములకు రూ.2,430 పెరుగుదల



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా పసిడి ధరలు దూసుకెళ్లాయి. ఔన్స్ 2,900 మార్క్‌ను దాటిపోవడం, దేశీయంగా రూపాయి బలహీనత వెరసి ఢిల్లీ మార్కెట్లో పసిడి ధర నూతన జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసింది. 99.9 స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములకు ఒక్క రోజే రూ.2,430 లాభపడి రూ.88,500కు చేరుకుంది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.2,430 పెరిగి రూ.88,100కు చేరుకుంది. వెండి ధర కిలోకి రూ.1,000 పెరిగి రూ.97,500కు చేరింది. జ్యుయలర్లు, రిటైలర్ల కొనుగోళ్లు సైతం ర్యాలీకి మద్దతునిచ్చినట్టు ట్రేడర్లు తెలిపారు. అలాగే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార టారిఫ్‌ల హెచ్చరికలతో సురక్షిత సాధనమైన బంగారం కొనుగోలుకు మద్దతు లభించినట్టు వెల్లడించారు. ఎంసీఎక్స్ ఫ్యూచర్స్‌లో ఏప్రిల్ నెల బంగారం డెలివరీ కాంట్రాక్టుల ధర 10 గ్రాములకు రూ.940 పెరిగి రూ.85,828కి చేరింది. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్స్‌కు 45 డాలర్లు పెరిగి 2,933 డాలర్లకు చేరడం గమనార్హం. ఇది అంతర్జాతీయంగా పసిడి సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ట స్థాయి కావడం విశేషం!

బంగారం వేలం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలపై ఆర్థిక మంత్రి సీతారామన్

న్యూఢిల్లీ: బంగారం వేలం విషయంలో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు నిబంధనలు ఉల్లంఘిస్తే వాటిపై చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. బంగారం తనఖాపై రుణం తీసుకున్న వారు సకాలంలో చెల్లించకపోతే, బ్యాంక్‌లు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) ఆ బంగారాన్ని వేలంలో విక్రయించి రుణ బకాయిలతో సర్దుబాటు చేసుకుంటుంటాయి. ఇందుకు నిర్దేశిత ప్రక్రియలు, నిబంధనలను బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు అనుసరించాల్సి ఉంటుంది. ఈ విషయమై లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నకు ఆర్థిక మంత్రి బదులిచ్చారు. ఎన్‌బీఎఫ్‌సీలు, షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంక్‌లకు ఈ విషయంలో నిబంధనలు ఒకే విధంగా ఉన్నట్టు చెప్పారు. రుణ చెల్లింపులు సరిగ్గా లేవంటూ ఖాతాదారులకు బ్యాంక్‌లు తగినన్ని సార్లు నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.



అయినప్పటికీ రుణ గ్రహీత చెల్లింపులకు ముందుకు రాకపోతే అప్పుడు బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీ బంగారం వేలానికి వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. నిబంధనలను బ్యాంక్‌లు ఉల్లంఘించినట్టు తేలితే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బంగారానికి డిమాండ్: దేశంలో బంగారానికి డిమాండ్ తగ్గలేదని, పెరుగుతూ వెళుతోందని కాంగ్రెస్ సభ్యుడు మనీష్ తివారీ ప్రశ్నకు సమాధానంగా మంత్రి సీతారామన్ బదులిచ్చారు. ''దేశంలో వ్యక్తులు, చిన్న వర్తకులు సురక్షితమైన, లిక్విడ్ సాధనమన్న ఉద్దేశ్యంతో బంగారంలో ఇన్వెస్ట్ చేస్తుంటారు''అని వివరించారు.

ట్రంప్ 'ఉక్కు' పాదం..!

స్టీల్, అల్యూమినియంపై 25% టారిఫ్‌లు వడ్డించే యోచన

- బిలియన్ డాలర్ల భారత్ ఎగుమతులపై ప్రభావం
- ఆందోళనలో దేశీ పరిశ్రమలు



న్యూఢిల్లీ: అన్ని రకాల ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై పాతిక శాతం టారిఫ్‌లు వడ్డించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యోచన భారత పరిశ్రమలను కలవరపరుస్తోంది. దీనితో బిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం భారత్ ఉక్కు ఎగుమతుల్లో అమెరికా వాటా సుమారు అయిదు శాతం లోపు ఉంటోంది. అయినప్పటికీ భారతీయ ఉక్కు ఎగుమతిదార్లు తమ ఉత్పత్తులను ఎగుమతి చేయడంలో కొంత సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉందని మూడీస్ రేటింగ్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ హుయ్ తింగ్ సిమ్ తెలిపారు. అమెరికా టారిఫ్‌ల దెబ్బతో మిగతా దేశాల్లో సరఫరా పెరిగిపోయి, భారత్ ఎగుమతులకు ప్రతికూలం కావచ్చని పేర్కొన్నారు. గత పన్నెండు నెలలుగా భారీ స్థాయిలో ఉక్కు దిగుమతులతో ధరలు, ఆదాయాలు పడిపోయి దేశీ ఉత్పత్తి సంస్థలు ఇప్పటికే సతమతమవుతున్నట్లు వివరించారు. ఇదే సమయంలో టారిఫ్‌ల వల్ల అమెరికాలోని ఉక్కు ఉత్పత్తి సంస్థలకు ప్రయోజనం చేకూరుతుందని సిమ్ చెప్పారు. అక్కడ దేశీయంగా ఉక్కుకు డిమాండ్ పెరిగి, ధరలూ పెంచుకునే అవకాశం లభిస్తుందన్నారు. సుంకాల విధింపుతో అమెరికాకు ఉక్కు ఎగుమతులు 85 శాతం మేర తగ్గిపోవచ్చని ఇండియన్ స్టీల్ అసోసియేషన్ (ఐఎస్ఏ) ప్రెసిడెంట్ నవీన్ జిందాల్ తెలిపారు. ఇలా మిగిలిపోయేదంతా, ప్రస్తుతం వాణిజ్యపరమైన ఆంక్షలు లేని అతి పెద్ద మార్కెట్లలో ఒకటైన భారత మార్కెట్లోకి వెల్లువెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మరోవైపు, అల్యూమినియం పరిశ్రమపై ప్రభావం గట్టిగా పడొచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఎందుకంటే భారత అల్యూమినియం ఎగుమతుల్లో అమెరికా వాటా దాదాపు 12 శాతం ఉంటుంది. గతేడాది నవంబర్ నాటికి 777 మిలియన్ డాలర్ల అల్యూమినియం ఎగుమతులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఉక్కు పరిశ్రమతో పోలిస్తే అల్యూమినియం రంగంపై టారిఫ్‌ల ఎఫెక్ట్ ఎక్కువగా ఉండనుంది. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ట్రంప్‌తో నిర్వహించబోయే సమావేశంలో టారిఫ్‌ల అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

2018 వ్యూహం..

ట్రంప్ 2018 వ్యూహాన్నే మళ్లీ అమలు చేస్తే వాణిజ్యానికి సంబంధించి బేరసారాలు ఆడేందుకు దీన్ని ఉపయోగించుకునే అవకాశం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ చెప్పారు. 2018లోనూ ట్రంప్ ఇలాంటి నిర్ణయమే తీసుకున్నా, అప్పట్లో మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌పై పెద్దగా ప్రభావం పడలేదు. ప్రతిగా 2019లో 28 అమెరికన్ ఉత్పత్తుల దిగుమతులపై భారత్ కూడా అదనపు సుంకాలు విధించింది. 2023లో భారత్ నుంచి ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా టారిఫ్‌లు తొలగించింది. తాజాగా టారిఫ్‌ల పెంపు అనేది అమెరికాకు అత్యధికంగా ఎగుమతి చేసే జపాన్, యూరప్ దేశాలు, కెనడా, మెక్సికోపై ఎక్కువగా ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ సరఫరా పెరిగిపోయి, ధరలు పడిపోవడం వల్ల భారత్‌కి కూడా కాస్త ప్రతికూలంగానే ఉండొచ్చని విశ్లేషకులు తెలిపారు.

ఆందోళన చెందనక్కర్లేదు: ఉక్కు శాఖ

అమెరికాకు భారత్ ఉక్కు ఎగుమతులు అంతగా లేవు కాబట్టి టారిఫ్‌ల గురించి దేశీ పరిశ్రమ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ తెలిపారు. 'గతేడాది మనం 14.5 కోట్ల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేస్తే అందులో అమెరికాకు ఎగుమతి చేసింది చాలా తక్కువే. కాబట్టి, టారిఫ్‌ల పెంపు పెద్ద సమస్య కాబోదు' అని ఆయన చెప్పారు. దేశీయంగా ఉక్కు వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, రాబోయే రోజుల్లో డిమాండ్‌కి తగ్గట్లుగా పరిశ్రమ సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడవచ్చని వివరించారు.

నాలుగో రోజూ నష్టాలే

- ట్రంప్ తాజా టారిఫ్ విధింపు ఆందోళనలు
- అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు
- 23,400 దిగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ నష్టం 548 పాయింట్లు



ముంబై: అమెరికాకు వచ్చే స్టీల్, అల్యూమినియం దిగుమతులపై 25% టారిఫ్‌లు విధిస్తామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనతో సోమవారం స్టాక్ సూచీలు అరశాతానికి పైగా నష్టపోయాయి. అలాగే తమపై పన్నులు విధించే దేశాలపై తిరిగి పన్నులు విధిస్తామని ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు కొనసాగడం, రూపాయి కొత్త కనిష్టానికి చేరుకోవడమూ మరింత ఒత్తిడి పెంచాయి. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 548 పాయింట్లు క్షీణించి 77,312 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 178 పాయింట్లు కోల్పోయి 23,382 వద్ద నిలిచింది. సూచీలకిది నాలుగో రోజూ నష్టాల ముగింపు. ఒక దశలో సెన్సెక్స్ 753 పాయింట్లు క్షీణించి 77,107 వద్ద, నిఫ్టీ 244 పాయింట్లు కోల్పోయి 23,316 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 2.25%, 2.06 శాతం క్షీణించాయి.

→ ట్రంప్ టారిఫ్ విధింపు ప్రకటనతో దేశీయ మెటల్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. నాల్కో 5%, సెయిల్ 4.50%, వేదాంత, ఎన్ఎండీసీ 4%, టాటా స్టీల్ 3% కుప్పకూలాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో 2%, జిందాల్ స్టెయిన్‌లెస్ 1.50% నష్టపోయాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టెపా డీల్‌తో రూ.43.5 లక్షల కోట్ల పెట్టుబడులు
అపోలో హాస్పిటల్స్ లాభం రూ. 372 కోట్లు

జీఆర్‌టీ 'బ్రైడల్ జ్యువెలరీ' కలెక్షన్



హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలరీ బంగారు, వజ్రాభరణాల 'బ్రైడల్ జ్యువెలరీ' కొత్త కలెక్షన్ తీసుకొచ్చింది. ఈ వివాహ ఆభరణాల శ్రేణిలో హారాలు, కంకణాలు, ఉంగరాలు, వంకీ, ఒడ్డాణం, బాజు బందీ, సూర్యన్-చంద్రన్ వంటివి ఉన్నాయి. అద్భుతమైన హస్తకళా నైపుణ్యం, సరికొత్త డిజైన్లతో వీటిని తీర్చిదిద్దినట్లు కంపెనీ తెలిపింది. 'ఒక ప్రకాశవంతమైన వాగ్దానం' పేరుతో ప్రచారం చేపట్టింది. 'బ్రైడల్ జ్యువెలరీ' ఆభరణాల నాణ్యత 'జ్యువెలరీ బ్రాండ్' అంచంచల నిబద్ధతను ప్రతిబింబిస్తుందని సంస్థ ఎండీ జీఆర్ రాధాకృష్ణన్ తెలిపారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

నాటా-2025 పరీక్ష

కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్(సీఓఏ).. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్(ఎన్ఏటీఏ)-2025 పరీక్షను నిర్వహిస్తుంది. ఈ పరీక్షను ఎన్‌టీఏ లేదా నాటా నిర్వహిస్తుంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** 45 శాతం మార్కులతో ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో 10+2 లేదా 10+3 మ్యాథ్స్ సబ్జెక్టుతో డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
- **పరీక్ష విధానం:** మొత్తం 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా..
- **దరఖాస్తు తేదీలు:** 01.03.2025 నుంచి జూన్ 2025 వరకు
- **వెబ్‌సైట్:** https://www.nata.in/

ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఎనిమిదో తరగతి, ఇంటర్ ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ.. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎనిమిదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన గిరిజన బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య, వసతితోపాటు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలు నీట్, జేఈఈ, ఈఏపీసెట్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఉంటుంది.

- **మొత్తం సీట్ల సంఖ్య:** 780.
- **సీట్ల వివరాలు:** ఎనిమిదో తరగతి-180, ఇంటర్ (ఎంపీసీ)-300, ఇంటర్ (బైపీసీ)-300.
- **అర్హత:** ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎనిమి దో తరగతి ప్రవేశ పరీక్షకు అర్హులు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రవేశ పరీక్షకు అర్హులు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదు.
- **పరీక్ష విధానం:** ఎనిమిదో తరగతికి ఏడో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 100 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. తెలుగు(10 మార్కులు), ఇంగ్లిష్(10 మార్కులు), హిందీ(10 మార్కులు), మ్యాథ్స్(20 మార్కులు), ఫిజికల్ సైన్స్(15 మార్కులు), బయోసైన్స్(15 మార్కులు), సోషల్ స్టడీస్(20 మార్కులు) సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇంటర్‌కి పదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 100 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. ఇంగ్లిష్(20 మార్కులు), మ్యాథ్స్(40 మార్కులు), ఫిజికల్ సైన్స్(20 మార్కులు), బయోసైన్స్(20 మార్కులు) సబ్జెక్టుల నుంచిప్రశ్నలు ఉంటాయి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా..
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.03.2025.
- **ప్రవేశ పరీక్ష తేది:** 09.03.2025.
- **వెబ్‌సైట్:** https://twreiscet.apcfss.in/

ఐఎన్ఏలో 270 ఎస్ఎస్‌సీ ఆఫీసర్ పోస్టులు

కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నావల్ అకాడమి(ఐఎన్ఏ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 270.
- **పోస్టుల వివరాలు:** ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్-60, పైలట్-26, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్-22, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్-18, లాజిస్టిక్స్-28, ఎడ్యుకేషన్-15, ఇంజనీరింగ్ బ్రాంచ్-38, ఎలక్ట్రికల్ బ్రాంచ్-45, నావల్ కన్‌స్ట్రక్టర్-18.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(బీఎస్సీ, బీకాం), పీజీ(ఎంసీఏ, ఎంఎస్సీ), బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.1,10,000.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా..
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.2.2025.
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in/

కరెంట్ అఫైర్స్.. కొలువుకెంతో కీలకం!

- నియామక పరీక్షల్లో కరెంట్ అఫైర్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం
- సివిల్స్ నుంచి గ్రూప్-4 వరకు ఈ విభాగం నుంచి ప్రశ్నలు
- ముఖ్య అంశాల గుర్తింపే ప్రధానం అంటున్న సబ్జెక్ట్ నిపుణులు
- కోర్ అంశాలతో సమన్వయం చేసుకుంటూ చదవాల్సిన ఆవశ్యకత



పోటీ పరీక్షల ప్రత్యేకం

కరెంట్ అఫైర్స్.. నియామక పరీక్షల్లో విజయానికి ఎంతో కీలకం! సివిల్ సర్వీస్ ఎంపిక ప్రక్రియ నుంచి గ్రూప్ 4 పరీక్షల వరకూ.. కరెంట్ అఫైర్స్‌పై పట్టులేకుండా సక్సెస్ సాధించడం కష్టమే! కారణం.. ఆయా పరీక్షల్లో కరెంట్ అఫైర్స్ నుంచి అధిక సంఖ్యలో ప్రశ్నలు అడుగుతుండటమే!! జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సామాజికంగా, ఆర్థికంగా చోటు చేసుకుంటున్న సమకాలీన పరిణామాలపై అభ్యర్థులకున్న అవగాహన తెలుసుకునేందుకే కరెంట్ అఫైర్స్‌పై ప్రశ్నలు అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో.. పోటీ పరీక్షల్లో కరెంట్ అఫైర్స్ ప్రశ్నల తీరు, సమకాలీన పరిణామాలపై పట్టు సాధించడమెలాగో తెలుసుకుందాం..

కనీసం 30 శాతం ప్రశ్నలు

సివిల్స్, గ్రూప్స్, బ్యాంక్స్, రైల్వే జాబ్స్, త్రివిధ దళాలు.. ఇలా ఏ నియామక పరీక్ష పరిశీలించినా.. దాదాపు 30 % మేర కరెంట్ అఫైర్స్ సంబంధిత ప్రశ్నలు అడుగుతున్నారు. కొన్ని పరీక్షల్లో ఈ సంఖ్య 40 శాతంగా ఉంటోంది. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహించాలనుకునే వారికి సమకాలీన సామాజిక అంశాలపై ఉన్న అవగాహనను పరిశీలించాలనే ఉద్దేశంతోనే కరెంట్ అఫైర్స్ విభాగానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొంటున్నారు.

కోర్ + కాంటెంపరరీ

ఇటీవల కాలంలో కరెంట్ అఫైర్స్ విభాగం నుంచి అడిగే ప్రశ్నల తీరు మారుతోంది. నేరుగా కరెంట్ అఫైర్స్ సంబంధిత ప్రశ్నలు మాత్రమే అడగకుండా.. వాటిని కోర్ అంశాలతో సమ్మిళితం చేస్తూ అడుగుతున్న ప్రశ్నల సంఖ్య పెరుగుతోంది. ఉదాహరణకు.. రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ఆమోదం పొందుతున్న కొత్త బిల్లులకు సంబంధించి సమకాలీన పరిణామం, దాని నేపథ్యం, బిల్లు ప్రవేశపెట్టేందుకు దారి తీసిన పరిస్థితులు గురించి అవగాహన ఉంటేనే సమాధానం గుర్తించేలా ప్రశ్నలు అడుగుతున్నారు. అంటే.. అభ్యర్థులు తాజా పరిణామాలే కాకుండా.. వాటికి సంబంధించి కోర్ సబ్జెక్ట్‌లోని మూల భావనలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది.

ముఖ్యమైనవి గుర్తించడం ఎలా

కరెంట్ అఫైర్స్ అనేది ఒక సముద్రం లాంటిదనే అభిప్రాయం నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రతి రోజు కొత్త పరిణామాలు సంభవిస్తున్న నేపథ్యంలో పరీక్షల్లో వేటిని ప్రశ్నలుగా అడుగుతారు అనే సందిగ్ధత అభ్యర్థుల్లో కనిపిస్తోంది. ఆయా పరిణామాలకున్న ప్రాధాన్యతను గుర్తించే పరిజ్ఞానం సొంతం చేసుకుంటే కరెంట్ అఫైర్స్‌లో ముఖ్యమైన అంశాలను తెలుసుకోవడం సులభమేనని చెబుతున్నారు. ఉదాహరణకు.. ప్రస్తుతం ప్రాధాన్యం సంతరించుకుంటున్న అంతరిక్ష పరిశోధనలు, దేశంలో ఇస్రో ఇటీవల కాలంలో చేపట్టిన ప్రయోగాలు, త్వరలో చేపట్టనున్న మిషన్‌లు వంటివాటిపై పలు కోణాల్లో అధ్యయనం చేయాలి.

ప్రశ్నార్హమైన సంఘటనలు

ప్రతి రోజు అనేక సంఘటనలు జరుగుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్ష కోణంలో ప్రశ్నార్హమైనవేంటో తెలుసుకోవడం ముఖ్యం. ప్రతి సంఘటనకు సంబంధించి సమాచారం సేకరించడం, వాటిపై పట్టు సాధించడానికి గంటల కొద్దీ సమయం వెచ్చించే బదులు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. సామాజికంగా, ఆర్థికంగా, శాస్త్రసాంకేతిక పరంగా విస్తృత ప్రాధాన్యం, ఎక్కువ ప్రభావం చూపే సంఘటనలపై దృష్టి కేంద్రీకరించాలి. అదే విధంగా జాతీయ ప్రాధాన్యం కలిగిన ప్రాంతీయ సంఘటనలపైనా ఫోకస్ చేయాలి. ప్రశ్నార్హమైన అంశాలను గుర్తించేందుకు సదరు పరీక్షకు సంబంధించి గత నాలుగైదేళ్ల ప్రశ్న పత్రాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో పరిశీలించాలి. దీని ద్వారా ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్న లేదా ప్రశ్నార్హమైన అంశాలను గుర్తించడం తేలికవుతుంది.

అంతర్జాతీయ అంశాలు

అంతర్జాతీయ పరిణామాలకు సంబంధించి ప్రతి అంశాన్ని చదవాల్సిన అవసరం లేదు. అత్యంత ముఖ్యమైన వాటిపై దృష్టి పెట్టాలి. ఉదాహరణకు.. సదస్సులు, సమావేశాల విషయంలో ప్రతి దానికి తేదీలు గుర్తుంచుకోవాల్సిన అవసరం లేదు. ఆయా సదస్సుల్లో విడుదల చేసిన డిక్లరేషన్లను, 'వాటి థీమ్‌లను, సదస్సు జరిగిన దేశం, పట్టణం వంటి వాటిని నోట్ చేసుకోవాలి. అదే విధంగా ఆయా సదస్సుల నిర్వహణ ఉద్దేశం కూడా తెలుసుకోవాలి.

నివేదికలు, గణాంకాలు

సమకాలీన నివేదికలు, గణాంకాలకు సంబంధించి అధ్యయనం చేసేటప్పుడు ఆయా నివేదికల్లో.. ప్రాంతీయ ప్రాధాన్యం ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలి. సదరు నివేదికలను విడుదల చేసిన సందర్భాన్ని గుర్తించాలి. ఉదాహరణకు.. పేదరికంపై వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదికలను పరిగణనలోకి తీసుకోవచ్చు. అందులో పేర్కొన్న గణాంకాలు, భవిష్యత్తు పరిస్థితులపై నిపుణుల సిఫార్సులను పరిశీలించాలి. సంబంధిత గణాంకాలను నోట్స్‌లో రాసుకుంటే రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది.

ద్వైపాక్షిక ఒప్పందాలు

భారత్, ఇతర దేశాలతో చేసుకుంటున్న ద్వైపాక్షిక ఒప్పందాలు.. వీటి వల్ల మన దేశానికి కలిగే ప్రయోజనాలు, అంతర్జాతీయంగా దేశానికి లభించే గుర్తింపు వంటి అంశాలను తెలుసుకుంటూ అధ్యయనం సాగించాలి. వాస్తవానికి కరెంట్ అఫైర్స్ విభాగంలో 'జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న అంశాలు' అని సిలబస్‌లో పేర్కొన్నారు.

ఏడాది కాలంలోని పరిణామాలు

కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి ఎప్పటి నుంచి ఎప్పటి వరకు జరిగిన పరిణామాలను చదవాలి అనే సందేహం అభ్యర్థులకు ఎదురవుతుంది. సాధారణంగా పరీక్ష తేదీకి నెల రోజుల ముందు నుంచి అంతకుముందు ఏడాది కాలంలోని పరిణామాలపై పట్టు సాధించాలని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు సివిల్ సర్వీసెస్-2025 ప్రిలిమ్స్ పరీక్ష మే 25న నిర్వహించనున్నారు. కాబట్టి 2025 ఏప్రిల్ నుంచి అంతకుముందు ఏడాది కాలంలోని ముఖ్యాంశాలను చదవాలి.

పుస్తకాల ఎంపిక కీలకం

కరెంట్ అఫైర్స్‌లో రాణించే విషయంలో పుస్తకాల ఎంపిక కీలకంగా నిలుస్తోంది. ప్రస్తుతం కరెంట్ అఫైర్స్ కోసం మార్కెట్‌లో విస్తృతమైన మెటీరియల్ అందుబాటులో ఉంది. కాని అభ్యర్థులు ప్రామాణిక పుస్తకాలను, మ్యాగజీన్‌లను, పత్రికలను అనుసరించడం మేలు చేస్తుంది.

పేపర్ రీడింగ్

కరెంట్ అఫైర్స్ అంశాలను నవలగానో లేదా కథగానో చదువుకుంటూ వెళ్లడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. సదరు టాపిక్ ఉద్దేశం, అందులోని ముఖ్యాంశాలను, ఘట్టాలను, ప్రాధాన్యతల గురించి తెలుసుకుంటూ.. సంక్షిప్తంగా సొంత నోట్స్ రూపొందించుకోవాలి. ఇందుకోసం న్యూస్ పేపర్ రీడింగ్ తప్పనిసరి. ప్రతిరోజు ప్రామాణిక దినపత్రికలు చదువుతూ ముఖ్య సంఘటనలపై అవగాహన పెంచుకోవాలి. సమకాలీన అంశాలపై ప్రచురితమయ్యే ఎడిటోరియల్స్, ఇతర ముఖ్యమైన వ్యాసాలను విశ్లేషణాత్మకంగా చదవాలి. వాటి సారాంశాన్ని పాయింట్ల రూపంలో సొంత నోట్స్‌లో రాసుకోవాలి.

సొంత నోట్స్ ఇలా

కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి సొంత నోట్స్ రూపంలో ఆయా సంఘటనలను రాసుకోవాలి. ఈ సొంత నోట్స్ రూపొందించుకునే విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. పుస్తకం లేదా న్యూస్ పేపర్స్‌లో కనిపించే సమాచారం మొత్తాన్ని నోట్స్‌లో పొందు పర్చకుండా.. వాటికున్న ప్రాధాన్యాన్ని పరిగణనలోకి తీసుకుని వాటిని నోట్స్‌లో రాసుకోవాలి. అప్పటికీ ముఖ్యాంశాలను విస్మరిస్తున్నాం అనే భావన కలిగితే పుస్తకంలోనే హైలెట్ చేసుకోవాలి.

మెమొరీ టెక్నిక్స్

కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అభ్యర్థులు అనుసరించాల్సిన మరో వ్యూహం.. మెమొరీ టెక్నిక్స్‌ను పాటించడం. ప్రతి అభ్యర్థికి తనకంటూ సొంత మెమొరీ టెక్నిక్స్ ఉంటాయి. కొందరు విజువలైజేషన్ టెక్నిక్స్, మరికొందరికి మైండ్ మ్యాపింగ్ వంటివి ఉంటాయి. అదే విధంగా ఆయా అంశాలను టేబుల్స్, గ్రాఫ్స్‌లో రూపంలో రాసుకుని సులువుగా రివైజ్ చేసుకోవచ్చు. కాబట్టి అభ్యర్థులు తమకు అనుగుణమైన మెమొరీ టెక్నిక్స్‌ను అనుసరించాలి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్

సౌరకాంతలు

చీకటిని జయించాలంటే సూర్యుడే కానక్కర్లేదు.. ఆ సూర్యుడిని సరిగా వాడుకోవడం తెలిస్తే చాలు. ఈ విషయాన్ని ఆ మహిళలు బాగా అవగతం చేసుకున్నారు. ఆ సూరీడుని ఒడిసి పట్టి కొన్ని వేల ఇళ్లలో కాంతులు ప్రసరింపజేస్తున్నారు. తద్వారా తమ జీవితాల్లోనూ వెలుగులు నింపుకొన్నారు. ఒకప్పుడు ఎలాంటి సౌకర్యాలూ లేని, చివరకు కరెంటు అంటే కూడా ఏమిటో చూడని ఆ గ్రామం.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 5 వేలకు పైగా గ్రామాలకు సౌర విద్యుత్ ద్వారా వెలుగులను అందిస్తోంది. మరి ఆ సౌర విద్యుత్‌ను ఎలా తయారు చేస్తున్నారు? ఇంత గొప్ప విజయం ఆ మహిళలు ఎలా సాధించారు? వారి విజయం వెనుక ఎవరున్నారు? ఆ వివరాలేమిటో చూద్దామా?

- సాక్షి, సెంట్రల్ డెస్క్



వేలాది గ్రామాల్లో విద్యుత్ వెలుగులు నింపుతున్న అతివలు ● చదువు లేకున్నా సోలార్ ఇంజనీర్లుగా గుర్తింపు

అది రాజస్తాన్‌లోని తిలోనియా. ఎలాంటి సౌకర్యాలూ లేని ఓ కుగ్రామం. ఉపాధి దొరకడం కూడా కష్టమే. ఇక మహిళల పరిస్థితి అయితే చెప్పనక్కర్లేదు. ఇంటికే పరిమితం. అలాంటి పరిస్థితుల్లో ఉన్న తిలోనియా అతివలు ఇప్పుడు ప్రపంచానికి తామేంటో చాటిచెప్పారు. కరెంటు లేని ఆ గ్రామం ఇప్పుడు వెలుగులీనడమే కాకుండా.. ఎన్నో వేల ఇళ్ల కాంతివంతం కావడానికి కారణమైంది. తిలోనియా మహిళలు సౌర విద్యుత్ ఫలకాలను తయారు చేస్తూ సోలార్ ఇంజనీర్లుగా పేరు తెచ్చుకున్నారు. వీరిని సోలార్ మామాస్ అని కూడా పిలుస్తారు.

సోలార్ మామాస్..

ఆరు నెలల శిక్షణతో ఇంజనీర్లుగా..

ఈ గ్రామంలోని మహిళల్లో చాలామందికి చదువే రాదు. ఏనాడూ పలకా బలపం కూడా పట్టని ఆ చేతులు.. సౌర విద్యుత్ ఫలకాల తయారీలో నిమగ్నమయ్యేలా చేసిన ఘనత బేర్ ఫుట్ కాలేజీదే. అక్కడివారికే కాకుండా దేశ విదేశాల్లోని ఎందరో గ్రామీణ ప్రాంత మహిళలకు ఈ కాలేజీ ఓ గొప్ప వరం. ఈ కాలేజీ సోలార్ ప్యానెల్స్ తయారీలో శిక్షణ ఇస్తుంది. సోలార్ ప్యానెల్ డిజైన్, ఫ్యాబ్రికేటింగ్, లైట్స్ ఇన్‌స్టాలేషన్ వంటి వాటిపై సమగ్ర అవగాహన కల్పిస్తారు. కలర్ కోడెడ్ పిక్చర్స్, మాన్యువల్ అండ్ విజువల్ లెర్నింగ్ టూల్స్‌తో సోలార్ ప్యానెల్స్ తయారు చేయడం నేర్పిస్తారు. ఆరు నెలలపాటు శిక్షణ ఇచ్చి సోలార్ ఇంజనీర్లుగా తయారు చేస్తారు. చదువు లేని మహిళలకు శిక్షణ ఇవ్వడం అత్యంత సవాలుతో కూడుకున్న అంశమని మాస్టర్ ట్రైనర్ లీలాదేవీ పేర్కొన్నారు. వీరికి కలర్ కోడ్ మాధ్యమం ద్వారా శిక్షణ ఇస్తామని తెలిపారు. 'ముందు కలర్ కోడ్‌ల గురించి వారికి వివరిస్తాం. తర్వాత కంపోనెంట్ పెట్టడం నేర్పిస్తాం. నెల తర్వాత సర్క్యూట్స్ చేయడం నేర్పుతాం. 3 లేదా 4 నెలల తర్వాత టెస్టింగ్ ఎలా చేయాలో చూపిస్తాం. చివరగా ఆర్ వీ కనెక్షన్ చేయడం నేర్పిస్తాం' అని ఆమె వివరించారు.

2000 సంవత్సరంలో శ్రీకారం..



గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కొరతను తీర్చాలంటే సోలార్‌ను ఉపయోగించుకోవడమే ఉత్తమ మార్గం అని భావించి 2000 సంవత్సరంలోనే సోలార్ మామాస్‌కు శ్రీకారం చుట్టినట్టు బేర్ ఫుట్ కాలేజీ వ్యవస్థాపకుడు సంజిత్ బన్‌కర్ రాయ్ తెలిపారు. 'బేర్ ఫుట్ కాలేజీ ప్రపంచంలోనే చూడటం, వినడం ద్వారా దేశ విదేశాల్లోని గ్రామీణ మహిళలకు శిక్షణ ఇస్తున్న మొదటి కాలేజీ. ఇక్కడ 6 నెలల శిక్షణ అనంతరం మహిళలు సోలార్ ఇంజనీర్లుగా గుర్తింపు పొందుతారు. ఈ కార్యక్రమానికి యునైటెడ్ నేషన్స్, యూఎన్‌డీపీ, యునెస్కో, కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపాయి. దీంతో మహిళలు గ్రామాల్లో వెలుగులు నింపడమే కాకుండా జీవనోపాధి కూడా పొందుతున్నారు' అని సంజిత్ చెప్పారు. పురుషులకు శిక్షణ ఇస్తే వేరే ప్రాంతాలకు వెళ్లిపోతారని.. అదే మహిళలకు శిక్షణ ఇస్తే తమ గ్రామాన్నే మార్చేస్తారని.. అందువల్లే అతివలకే తాము ఈ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు దాదాపు 96 దేశాల్లో 1700 మందికి పైగా మహిళలకు శిక్షణ ఇచ్చామని వెల్లడించారు.



సోలార్ లాంతర్ల తయారీ శిక్షణలో తిలోనియా మహిళలు



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి విమాన గోపురానికి బంగారు తాపడంలో భాగంగా అమర్చుతున్న స్వామి రూపాలు

19 నుంచి మహాకుంభ సంప్రోక్షణ

23న హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

- యాదగిరికొండపైన సిద్ధమవుతున్న హోమగుండాలు
- లక్షకుపైగా భక్తులు వస్తారని అంచనా

సాక్షి యాదాద్రి: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపుర స్వర్ణ తాపడ మహాకుంభ సంప్రోక్షణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు మహాక్రతువు జరగనుంది. రెండురోజుల్లో ఆలయ విమాన గోపుర స్వర్ణతాపడం పనులు పూర్తికానున్నాయి. కొండపైన హోమగుండాలు కూడా సిద్ధమవుతున్నాయి. ఈనెల 23న మహా కుంభాభిషేకం జరుగుతుంది. ఉదయం 11.34 గంటలకు నిర్ణయించిన ముహూర్తంలో జరిగే ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దేవస్థాన పీఠాధిపతి వానమామలై రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో మహాకుంభ సంప్రోక్షణ జరుగుతుంది. కొండపైన ఐదు హోమ గుండాలు ఏర్పాటు చేశారు. 19 నుంచి 23వ తేదీ వరకు 108 మంది రుత్వికులతో సుదర్శన హోమం, నారసింహహోమం నిర్వహిస్తారు. మహాకుంభ సంప్రోక్షణ, వార్షిక బ్రహ్మోత్సవాల ప్రచారానికి దేవస్థానం పెద్దపీట వేస్తోంది. రెండు కార్యక్రమాలకు లక్షకు పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక వసతులు, ఏర్పాటు చేస్తున్నారు. వాల్‌పోస్టర్లు, స్వాగత తోరణాలు, భారీ హోర్డింగ్‌లు దేవస్థానం ఏర్పాటు చేస్తోంది. ఈనెల 16 వరకు హైదరాబాద్, వరంగల్, సిద్దిపేట, జనగామ, ఆలేరు, భువనగిరి, శంషాబాద్, మహారాష్ట్రలోని షోలాపూర్‌లో స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తారు. మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమాన్ని యాదగిరిగుట్టలో భక్తులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు ఎల్‌సీడీలను ఏర్పాటు చేయనున్నారు. 68 కిలోల బంగారంతో 10,759 చదరపు అడుగుల మేర స్వర్ణతాపడం పనులు జరుగుతున్నాయని ఈవో భాస్కర్‌రావు చెప్పారు.

ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపులు ప్రారంభం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపు సేవలు సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. వాహనాల ప్రవేశ రుసుము టికెట్ రూ.500 నగదుతోపాటు యూపీఐ, డెబిట్‌కార్డు, క్రెడిట్ కార్డులతో ఆన్‌లైన్‌లో చెల్లించేలా స్వైపింగ్ మిషన్‌లను అందుబాటులో ఉంచారు. కొండపైకి రూ.500 చెల్లించి కారులో వెళ్లే భక్తులకు స్వైపింగ్ మిషన్ ద్వారా టికెట్ అందజేస్తున్నారు.

నిర్ణయాధికారం రాష్ట్రానిదే..

మెడికల్ పీజీ సీట్ల భర్తీలో రిజర్వేషన్లపై హైకోర్టు స్పష్టీకరణ

- ఏపీ ఎస్సీ ధ్రువీకరణ పత్రంతో తెలంగాణలో రిజర్వేషన్ పొందలేరన్న ధర్మాసనం
- నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: మెడికల్ పీజీ సీట్ల భర్తీకి సంబంధించి జారీ చేసిన నోటిఫికేషన్‌లో రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకునే అధికారం తెలంగాణ ప్రభుత్వానికి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఏపీ సర్కార్ జారీ చేసిన ఎస్సీ కుల ధ్రువీకరణతో తెలంగాణలో రిజర్వేషన్ పొందలేరని తేల్చిచెప్పింది. ఒక రాష్ట్రానికి చెందిన వారు మరో రాష్ట్రానికి వెళితే.. అక్కడి నిబంధనలే వర్తిస్తాయని సుప్రీంకోర్టు గతంలో తీర్పు వెల్లడించిన విషయాన్ని గుర్తు చేసింది. నిబంధనల మేరకు తెలంగాణ అధికారులు జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తేనే రిజర్వేషన్‌కు అర్హులని పేర్కొంది. రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. మెడికల్ పీజీ అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. 2024–25 విద్యా సంవత్సరానికి పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశం కోసం గత ఏడాది అక్టోబర్‌లో నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల కింద సీట్లు కోరే అభ్యర్థులు తెలంగాణ ప్రభుత్వ కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలనే నిబంధన ప్రభుత్వం విధించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఏపీలోని నెల్లూరుకు చెందిన సీహెచ్ నిహారికతో పాటు మరికొందరు పిటిషన్లు దాఖలు చేశారు. తెలంగాణ వైద్య కళాశాలల్లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు సంబంధించిన ప్రవేశ నియమాలు–2021కు ఈ నోటిఫికేషన్ విరుద్ధమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్డ్ కుల సర్టిఫికెట్‌ను గుర్తించేలా కాళోజీ నారాయణరావు వర్సిటీకి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్లపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్, కాళోజీ వర్సిటీ తరఫున టి.శరత్, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బి.మయూర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

అలాగైతే విభజనకు అర్థం లేకుండా పోతుంది..

'పునర్విభజన చట్టం ప్రకారం.. 2024 తర్వాత మెడికల్ సీట్ల భర్తీకి ఎలాంటి రిజర్వేషన్లు వర్తించవు. 2014 జూన్ నుంచి 2024 జూన్ వరకు పదేళ్లు మాత్రమే వర్తిస్తాయి. షెడ్యూల్ 5లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎవరనేది స్పష్టంగా ఉంది. ఆ మేరకే కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. అలాంటి వారికి మాత్రమే ఇక్కడ సీట్ల భర్తీలో రిజర్వేషన్ అమలవుతుంది. ఏపీకి చెందిన వారికి ఇక్కడ రిజర్వేషన్లు ఇస్తే రాష్ట్ర ఏర్పాటుకు అర్థం లేకుండా పోతుంది..' అని ఏజీ వాదనలు వినిపించారు. ఈ మేరకు సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులను ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. మరోవైపు 'తాజాగా ఇదే హైకోర్టు జారీ చేసిన ఆదేశాలతో పిటిషనర్లను స్థానికులుగా అనుమతిస్తున్నా.. ఎస్సీ రిజర్వేషన్లను మాత్రం వర్సిటీ ఆమోదించడం లేదు. పలు కారణాలు చూపిస్తూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాలను ఇక్కడ అనుమతించలేమని చెబితే విద్యార్థులు నష్టపోతారు. వాస్తవానికి పీజీ పరీక్ష నోటిఫికేషన్ ఏప్రిల్‌లోనే వచ్చింది. ఆ తర్వాత ఆగస్టులో కొత్త నిబంధనలు జారీ చేయడం చెల్లదు..' అని మయూర్‌రెడ్డి పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం పిటిషన్లను కొట్టివేసింది. ఏపీ ధ్రువీకరణ ఉన్న వారిని కూడా కౌన్సెలింగ్‌కు అనుమతించాలని, ఫలితాలు వెల్లడించవద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసింది.

గరిష్ట విద్యుత్ డిమాండ్‌లో కొత్త రికార్డు

- ఈ నెల 7న 15,920 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదు
- ఎంత డిమాండ్ పెరిగినా సరఫరా: డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్‌లో మరోసారి సరికొత్త రికార్డు నమోదైంది. ఈ నెల 6న గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,752 మెగావాట్లకు పెరిగి కొత్త రికార్డు సృష్టించగా ఆ మర్నాడే 15,920 మెగావాట్లకు పెరిగి ఆ రికార్డును తిరగరాసింది. గతేడాది మార్చి 8న ఏర్పడిన 15,523 మెగావాట్ల గరిష్ట డిమాండ్ గతంలో అత్యధికం కాగా ఈ ఏడాది వేసవి ప్రారంభం ముందే అంతకుమించి విద్యుత్ డిమాండ్ నమోదు కావడం గమనార్హం. మరోవైపు గరిష్ట విద్యుత్ డిమాండ్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్ర విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగిస్తామన్నారు. వేసవి తీవ్రత, యాసంగి పంటల ప్రభావంతో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. అయినా ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా నాణ్యమైన విద్యుత్‌ను విద్యుత్ సంస్థలు సరఫరా చేస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో డిమాండ్ మరింతగా పెరగనున్న నేపథ్యంలో మంగళవారం ఇంధనశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు వివరించారు.



'ప్రేమగా'.. సైబర్ వల

- వాలెంటైన్స్ డే ఆఫర్ల పేరిట మెసేజ్ పంపుతున్న సైబర్ నేరగాళ్లు
- సర్‌ప్రైజ్ గిఫ్టులు, గిఫ్ట్ కూపన్ల పేరిట మోసాలు
- అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని పోలీసుల సూచన

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు ఏ చిన్న అవకాశం దొరికినా సరికొత్త మోసాలకు తెరతీస్తున్నారు. ఈనెల 14న ప్రేమికుల దినోత్సవాన్ని టార్గెట్‌గా చేసుకుని కొత్త.. కొత్త ఆఫర్లు, సర్‌ప్రైజ్ గిఫ్టులు అంటూ మెసేజ్‌లు పంపుతున్నారు. అందులోని లింక్‌లపై క్లిక్ చేయాలని సూచిస్తున్నారు. ఇలాంటి మెసేజ్‌లను నమ్మి ఎవరైనా క్లిక్ చేస్తే చాలు.. వారి వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించడంతోపాటు ఫోన్లలోని సమాచారాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. 'మీకు ఆప్తులైన వ్యక్తులు మీ కోసం సర్‌ప్రైజ్ గిఫ్టులు పంపారు. అవి పొందాలంటే మేము చెప్పిన వెబ్‌లింక్‌లోకి వెళ్లి వివరాలు నమోదు చేయాలి' అని సూచిస్తున్నారు. అయితే ఈ తరహా మెసేజ్‌లను నమ్మవద్దని, సైబర్ నేరగాళ్లు.. పేరు, ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్.. ఇలా ఒక్కొక్కటిగా సేకరిస్తారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా గిఫ్ట్‌కార్డుల పేరిట కూడా ఇలాంటి మెసేజ్‌లు వస్తున్నాయని తెలిపారు. అపరిచితమైన ఫోన్ నంబర్లు, ఈ మెయిల్స్ నుంచి సర్‌ప్రైజ్ గిఫ్టులు, గిఫ్ట్ కూపన్లు.. అని సందేశాలు వస్తే వాటిని ఓపెన్ చేయవద్దని, అందులోని లింక్‌లపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

శిక్షలు పడితేనే నేరస్థులకు భయముంటుంది

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మత్తుపదార్థాల రవాణా, ఇతర నేరాలకు పాల్పడుతున్న నేరస్థులకు చట్ట ప్రకారం శిక్షలు వేయించడం ద్వారానే వారిలో భయం ఏర్పడుతుందని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అన్నారు. శిక్షలు నేరస్థుల్లో కనువిప్పు కలిగిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఎక్సైజ్‌శాఖ నమోదు చేసిన కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా దర్యాప్తులో కృషి చేసిన అధికారులు, సిబ్బందిని కమలాసన్‌రెడ్డి సోమవారం ఆబ్కారీ భవన్‌లోని సమావేశ మందిరంలో క్యాష్ రివార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఎక్సైజ్ కేసుల్లో శిక్షల శాతం పెరుగుతోందన్నారు. 2024లో మొత్తం పది కేసుల్లో ఐదేళ్లు, మూడేళ్లు శిక్షలు పడటం మంచి పరిణామమని పేర్కొన్నారు. 34 కేసుల దర్యాప్తులో ప్రతిభ కనబర్చిన 29 మంది సిబ్బందికి డైరెక్టర్ చేతుల మీదుగా క్యాష్ రివార్డులను అందించడం ఆనందంగా ఉందని ఎక్సైజ్‌శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషీ అన్నారు. క్యాష్ రివార్డులు అందుకున్న వారిలో సంగారెడ్డి, ఖమ్మం, నల్లగొండకు చెందిన ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

చుక్కల వైపు.. విమాన చార్జీలు!

మహా కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు


హైదరాబాద్ టు అయోధ్య రూ.21 వేల నుంచి రూ.30 వేలు

సింగపూర్, మలేసియా కంటే రెట్టింపు రేట్లు

ప్రైవేట్ ట్రావెల్స్‌కు సైతం భారీ డిమాండ్

కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్ విమాన చార్జీలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ముగింపు తేదీ సమీపిస్తుండటంతో పెరుగుతున్న భక్తుల రద్దీకనుగుణంగా చార్జీలు సైతం పెరిగిపోతున్నాయి. ఈ నెల 26న మహా శివరాత్రితో ఈ వేడుకలు ముగియనున్న సంగతి తెలిసిందే. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ (పూర్వపు అలహాబాద్)కు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వారి సంఖ్య కూడా అనూహ్యంగా పెరిగింది. దూరాన్ని దృష్టిలో పెట్టుకుని ఎక్కువమంది విమానయానం వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో పలు ఎయిర్‌లైన్స్ చార్జీలను అమాంతం పెంచేశాయి. సాధారణ రోజుల్లోనూ డిమాండ్‌ను బట్టి ఇష్టారాజ్యంగా చార్జీలు వసూలు చేసే విమానయాన సంస్థలు..ప్రస్తుత పరిస్థితుల్లో మరింత దండుకుంటున్నాయి. అయోధ్య, ప్రయాగ్‌రాజ్ చార్జీలను రెండు రెట్లు పెంచేశాయి. డిమాండ్ మేరకు రైళ్లు అందుబాటులో లేకపోవడం, రోడ్డు మార్గంలో ట్రాఫిక్ రద్దీ, ఈ రెండు రకాల ప్రయాణానికి ఎక్కువ సమయం కేటాయించాల్సి ఉండటం తదితర కారణాలతో చాలామంది విమాన ప్రయాణం వైపు ఆసక్తి చూపిస్తున్నారు. తెల్లవారుజామున ప్రయాగ్‌రాజ్‌కు చేరుకొనే విధంగా ఇక్కడినుంచి రాత్రి వేళల్లో బయలుదేరి వెళుతున్నారు. దీంతో చార్జీలు చుక్కలనంటుతున్నాయి. పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పలు ఎయిర్‌లైన్స్ అప్పటికప్పుడు చార్జీలు పెంచేస్తున్నాయని కూకట్‌పల్లికి చెందిన ఒక ట్రావెల్ ఏజెన్సీ తెలిపింది. సాధారణంగా హైదరాబాద్ నుంచి రూ. 5,000 నుంచి రూ. 7,000 వరకు ఉండే అయోధ్య టికెట్ ప్రస్తుతం రూ.21 వేల నుంచి రూ.30 వేల వరకు పెరిగింది.

- సాక్షి, హైదరాబాద్




బ్యాంకాక్ చార్జీ రూ. 12,500 మాత్రమే..

జనవరి 13వ తేదీన మహా కుంభమేళా వేడుకలు మొదలయ్యాయి. జనవరి 29వ తేదీ మౌని అమావాస్య నాటికి 36 వేల మందికి పైగా భక్తులు హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ వేడుకలు ముగిసేందుకు మరో 16 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. కాగా ఈ నెల 12వ తేదీన మాఘ పూర్ణిమ, 26వ తేదీ చివరి రోజు మహాశివరాత్రి సందర్భంగా కోట్లాదిమంది పుణ్య స్నానాలు ఆచరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే విమాన చార్జీలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. హైదరాబాద్ నుంచి కౌలాలంపూర్‌కు రూ.15 వేల లోపే చార్జీ ఉంది. ఎక్కువమంది పర్యాటకులు వెళ్లే బ్యాంకాక్ చార్జీ రూ.12,500 మాత్రమే ఉంది. అలాగే సింగపూర్, శ్రీలంకలకు సైతం రూ. 15,000 నుంచి రూ. 20,000 వరకు మాత్రమే చార్జీలు ఉన్నాయి. దుబాయ్‌కు కూడా రూ.20 వేల లోపే ఉన్నట్లు ట్రావెల్స్ సంస్థలు చెబుతున్నాయి. కానీ అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లకు మాత్రం చార్జీల మోత మోగుతోంది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిరోజూ 500కు పైగా విమానాలు దేశ విదేశాలకు రాకపోకలు సాగిస్తాయి. ప్రస్తుతం కుంభమేళా రద్దీ దృష్ట్యా అయోధ్య, లక్నో, వారణాసి, ప్రయాగ్‌రాజ్, అయోధ్యలకు సర్వీసులు పెరిగాయి. దీంతో రోజుకు సుమారు 550 ఫ్లైట్‌లు రాకపోకలు సాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు 70 వేల మంది ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగిస్తారు. ప్రస్తుతం ఈ సంఖ్య 85 వేలు దాటింది.

ట్రావెల్స్‌కు భారీ గిరాకీ

ఉత్తరాది యాత్రలను నిర్వహించే ట్రావెల్ ఏజెన్సీలకు కూడా ప్రస్తుతం గిరాకీ బాగా పెరిగింది. మహా కుంభమేళా పుణ్యస్నానంతో పాటు అయోధ్య, వారణాసి, తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు రూ. 30,000 నుంచి రూ. 50,000 వరకు ప్యాకేజీలు ప్రకటించి భక్తుల్ని ఆకర్షిస్తున్నాయి. వసతి, భోజనం, రవాణా, తదితర సదుపాయాలతో ఈ ప్యాకేజీలను రూపొందిస్తున్నారు. మరోవైపు రెండు, మూడు కుటుంబాలు లేదా స్నేహితులు కలిసి వెళ్లేందుకు మినీ బస్సులు, మ్యాక్సీ క్యాబ్‌లను అందజేస్తున్న ట్రావెల్స్ సంస్థలు కూడా భారీగా వసూలు చేస్తున్నాయి. ఐఆర్‌సీటీసీ నడిపే భారత్‌గౌరవ్ రైలు ప్యాకేజీ కూడా రూ. 22,000 నుంచి రూ. 25,000 వరకు ఉంది.

జనవరి 13 నుంచి 29 వరకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన ప్రయాణికుల సంఖ్య ఇలా...



కొండగట్టు అంజన్నకు కోటి విలువైన బంగారం, వెండి ఆభరణాలు



బంగారు కిరీటం, వెండి వస్తువులు అందిస్తున్న ఏఎంఆర్ కంపెనీ దాతలు

జగిత్యాల: జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్న ఆలయానికి రూ.కోటి విలువైన బంగారం, వెండి ఆభరణాలను సోమవారం దాతలు అందించారు. ఏఎంఆర్ ఇండియా కంపెనీ చైర్మన్ మహేశ్‌రెడ్డి, రాధిక దంపతులు స్వామివారి మూలవిరాట్‌కు రాగి రేకుపై బంగారు తాపడంతో చేసిన 325 గ్రాముల కిరీటం, అంతరాలయంలోని గోడలకు 48.500 కిలోల వెండి తాపడాలు, మకరతోరణం తయారు చేయించారు. రెండేళ్ల కిందట కొండగట్టు అంతరాలయంలో దొంగలు పడి గోడలకు ఉన్న వెండి తాపడాలు, విలువైన వస్తువులను దోచుకెళ్లిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆలయ గర్భగుడి కళావిహీనంగా మారింది. ఆలయానికి బంగారు, వెండి నిల్వలు భారీగా ఉన్నా.. అధికారులు మాత్రం కొత్తవి తయారు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు ఏఎంఆర్ సంస్థకు కిరీటం, తాపడాల గురించి వివరించారు. వెంటనే స్పందించిన సంస్థ సుమారు రూ.కోటి విలువచేసే వస్తువులను అందించింది.

ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌కు జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు

- ఈ నెల 24న హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే బయో ఏషియా సదస్సులో ప్రదానం



సాక్షి, హైదరాబాద్: కేన్సర్ జెనోమిక్స్, ప్రెసిషన్ మెడిసిన్‌తోపాటు ఆరోగ్య పరిశోధన రంగంలో కృషి చేస్తున్న ప్రొఫెసర్ పాట్రిక్ టాన్‌కు బయో ఏషియా–2025 'జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్' అవార్డును ప్రకటించారు. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో పాట్రిక్ టాన్ ఎగ్జిక్యూటివ్‌గా డైరెక్టర్‌గా ఉన్నారు. అంతర్జాతీయ బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ వేదిక 'బయో ఆసియా' ఏటా ప్రతిష్టాత్మక 'జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్' అవార్డులను ప్రదానం చేస్తుంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్‌ఐసీసీ)లో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగే 'బయో ఏషియా 22వ సదస్సు'లో ఈ అవార్డును పాట్రిక్‌కు అందజేస్తారు.

కేన్సర్ వ్యాధికి చికిత్స దిశగా.. : కేన్సర్ వ్యాధికి జన్యుస్థాయిలో కారణాల అన్వేషణ, చికిత్సలపై పాట్రిక్ టాన్ పరిశోధనలు వైద్య రంగంలో మార్గదర్శకంగా నిలిచాయి. జీర్ణాశయ కేన్సర్‌పై పరిశోధన, చికిత్స కోసం బయో మార్కర్ల గుర్తింపులో ఆయన కీలకపాత్ర పోషించారు. సింగపూర్ జాతీయ ప్రెసిషన్ మెడిసిన్ ప్రోగ్రామ్‌కు నాయకత్వం వహించారు. 'పాట్రిక్ టాన్‌ను ఎంపిక చేయడంపై మంత్రి డి.శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు.



సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం ఇతరత్రా కారణాలతో ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో పరిమితికి మించి ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో సోమవారం కొందరు ప్రయాణికులు పదుల సంఖ్యలో ఇలా వాహనం పై భాగాన కూర్చుని ప్రయాణిస్తున్న దృశ్యం 'సాక్షి' కెమెరాకు చిక్కింది. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
మంగళవారం : 11-2-2025

కొండగట్టు చారిత్రక ఆలయం. రెండు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రం. భక్తులు కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా ఉమ్మడి జిల్లాలోనే కాదు, రెండు తెలుగు రాష్ట్రాల్లో కొండగట్టు కోవెల ఎంతో ప్రసిద్ధి చెందింది. కొంతకాలంగా ఈ పుణ్యక్షేత్రానికి తెలుగు రాష్ట్రాల సినీతారలు, రాజకీయ నాయకులు వచ్చి మొక్కులు తీర్చుకుంటుండటంతో ఆలయం కీర్తి రోజురోజుకు పెరుగుతోంది. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు గత సీఎం కేసీఆర్ స్వయంగా మాస్టర్‌ప్లాన్ కోసం రూ.600 కోట్లు ప్రకటించినా.. అది కార్యరూపం దాల్చకపోయేసరికి భక్తులు నీరుగారిపోతున్నారు. నేటి కాలానికి అనుగుణంగా కొండపై రవాణా, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించక పోవడంపై ఆగ్రహంగా ఉన్నారు.

- జగిత్యాల రూరల్



కొండగట్టు అంజన్న ఆలయం

కొండగట్టు హామీలకు మోక్షం ఎప్పుడో?

అమలుకు నోచుకోని పుణ్యక్షేత్రం మాస్టర్‌ప్లాన్

ఆలయ అభివృద్ధికి రూ.600 కోట్ల నిధులు ప్రకటించిన మాజీ సీఎం

కొండపై కార్యరూపం దాల్చని ఆస్పత్రి, ఫైర్, పోలీస్‌స్టేషన్‌లు

300 ఏళ్ల నాటి చారిత్రక ఆలయానికి కొరవడిన పరిరక్షణ

చారిత్రక నేపథ్యం..!

ఈ పుణ్యక్షేత్రానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. రామాయణకాలంలో లక్ష్మణుడిని కాపాడేందుకు సంజీవని పర్వతాన్ని హనుమంతుడు తీసుకుపోతున్న క్రమంలో ఆ గుట్ట నుంచి చిన్న రాయి విరిగిపడిందని, అదే ప్రస్తుత కొండగట్టు అన్నది భక్తుల విశ్వాసం. 300 ఏళ్ల కిందట ఓ ఆవులకాపరి స్వామివారికి చిన్న ఆలయాన్ని కట్టగా.. 160 ఏళ్ల కింద కృష్ణారావు దేశ్‌ముఖ్ ప్రస్తుత కోవెలను నిర్మించారని చరిత్ర చెబుతోంది. ఇక్కడ హనుమంతుడికి ద్వారపాలకుడిగా బేతాళుడు ఉండటం విశేషం. గుట్టపై బేతాళ స్వామి ఆలయం, సీతమ్మ కన్నీటిగుంటలు, మునుల గుహ, జలబుగ్గ, శ్రీరాముల ఆలయం, కొండలరాయుడి కోట, మెట్ల దారి తదితరాలను పరిరక్షించి, అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు.

మండు వేసవిలోనూ ఎండని సీతమ్మ కన్నీటిగుంట

బేతాళ ఆలయం చెత్తాచెదారంతో నిండి పారిశుధ్య సమస్య ఎదుర్కొంటోంది. మండువేసవిలోనూ ఎండని సీతమ్మవారి కన్నీటి గుంటలకు ప్రచారం కల్పించాలి. కొండగట్టుపై శ్రీరాముడి ఆలయం ఉన్న విషయం చాలామందికి తెలియదు. దీనికి మరింత ప్రచారం రావాలి. వందల ఏళ్ల కిందట తపస్సు చేసుకున్న మునులగుహకు కాలిబాట కూడా లేదు. దీన్ని అభివృద్ధి చేయాలి. కొండగట్టు ఘాట్ ప్రాంతం నుంచి కిందికి వెళ్లే క్రమంలో జలబుగ్గ అనే నీటిప్రవాహం కనిపించకుండా పోయింది. దీన్ని పునరుద్ధరించాలి. చారిత్రక బల్మూరి వంశానికి చెందిన కొండలరాయుడి కోట, గుట్టకు మరింత ప్రచారం కల్పించాలి. ఇక్కడ ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు, సమీపంలోని రైల్వేస్టేషన్‌తో కనెక్టివిటీ కల్పించాలి. భక్తుల వాహనాలకు పార్కింగ్ సమస్య తీర్చాలి. కొండగట్టులో మానసిక వ్యాధులు నయమవుతాయని భక్తులకు ఏళ్లుగా నమ్మకం. అందుకే రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది మానసిక రోగంతో ఉన్న వారిని, వారి కుటుంబ సభ్యులు తీసుకువచ్చి నయం అయ్యేందుకు పూజలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఒక మానసిక చికిత్సాలయం ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



కానరాని సౌకర్యాలు..

కొండగట్టు పుణ్యక్షేత్రం దర్శనం, గదులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం నేటికీ లేకపోవడం గమనార్హం. భక్తులకు తాగునీటి కొరత తీర్చాలని, హరితతోపాటు ప్రైవేటు హోటళ్ల ఏర్పాటు చేసి ఆతిథ్యరంగాన్ని ప్రోత్సహించాలని కోరుతున్నారు. ఇక్కడ నేరాల నియంత్రణకు పోలీస్‌స్టేషన్, అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ స్టేషన్, భక్తులకు అత్యవసర సేవల కోసం ఆస్పత్రి ఏర్పాటు చేయాలని భక్తులు విన్నవిస్తున్నారు. మెట్లదారి, కోనేరు, డ్రైనేజీలకు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

వ్యక్తిపై కాదు.. సనాతన ధర్మంపై దాడి

రంగరాజన్‌పై దాడిని ఖండించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి వ్యక్తిపై జరిగింది కాదని, ఇది సనాతన ధర్మంపై జరిగిన దాడి అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈ దాడిని ఖండిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికార యంత్రాంగం ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దౌర్జన్య చర్యలకు, బెదిరింపులకు, భౌతిక దాడులకు ఏ మాత్రం స్థానం లేదని కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. రంగరాజన్ ఉన్నతస్థాయి పదవులను త్యజించి సనాతన ధర్మ పరిరక్షణకు అంకితభావంతో సేవలందిస్తున్నారని తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేస్తూ ఉన్నతమైన ధార్మిక విలువలను పాటిస్తున్నారని, గౌరవప్రదమైన అర్చక వృత్తిలో ఉన్న వ్యక్తిపై జరిగిన అమానుష దాడి దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటనను సమాజంలోని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. రంగరాజన్‌కు బీజేపీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయనీయం

సీపీఎం కార్యదర్శి జాన్‌వెస్లీ

సాక్షి, హైదరాబాద్: చిలుకూరు దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ ఇంటిపై రామరాజ్య స్థాపన అనే సంస్థ ముసుగులో 30 మంది దౌర్జన్యంగా పరుష పదజాలంతో దూషించి, భౌతిక దాడి చేయడం హేయమైన చర్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. రంగరాజన్ గతంలో ఓ దళితుడిని ఆధ్యాత్మిక గురువుగా తీర్చిదిద్ది, అదే దేవాలయంలో అర్చకుడిగా నియమించడం, కుల అసమానతలు ఉండకూడదని ఆకాంక్షించడం ఓర్వలేని వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాదులు దాడికి తెగబడటం అత్యంత దుర్మార్గం అని ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఆ దాడికి పాల్పడ్డ వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, సమగ్ర దర్యాప్తు జరిపించాలని జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ కోరినట్లు చెప్పారు.

చిలుకూరు అర్చకుడు రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నాం

బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి కుమార్

సాక్షి, హైదరాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడిని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ఖండించారు. 'హిందూ ధర్మాన్ని కాపాడే వారు హింసకు పాల్పడటం బాధాకరం. ఆలయ అర్చకులపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. హిందూ ధర్మాన్ని కాపాడుతూ దేవాలయ సేవలో ఉన్న వ్యక్తిని హింసించడాన్ని సహించకూడదు'అని ఒక ప్రకటనలో తెలిపారు. రామరాజ్యం పేరుతో వ్యక్తిగత ప్రయోజనాల కోసం హింసను ప్రేరేపించే వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్కరి ప్రాణాలకు ముప్పు లేకుండా ప్రభుత్వం వెంటనే దాడికి బాధ్యులైన వారిని శిక్షించడంతో పాటు భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా అర్చకులకు పూర్తిస్థాయి రక్షణ కల్పించాలన్నారు. హిందుత్వం అనేది సంస్కారం, శాంతి, సహనం, సత్యం, ధర్మంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. బీజేపీ ఎప్పుడూ హిందుత్వ ధర్మాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉందని కుమార్ చెప్పారు. ఈ దాడిని ప్రణాళికాబద్ధమైన చర్యగా పరిగణించి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపించాలన్నారు.

రంగరాజన్‌పై దాడి.. హిందూ సమాజంపై దాడి: ఆరెస్సెస్

సాక్షి, హైదరాబాద్: చిలుకూరు దేవాలయ ప్రధానార్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడి ఘటనపై లోతైన దర్యాప్తుచేసి, దాడికి పాల్పడిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటుందని భావిస్తున్నట్టు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) రాష్ట్ర శాఖ పేర్కొంది. దేవాలయ పరిరక్షణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన రంగరాజన్‌పై దాడి కేవలం ఓ వ్యక్తిపై దాడిగా భావించరాదని పేర్కొంది. సామాజిక విలువలు, సనాతన ధర్మంతో ముడిపడిన అర్చక-దేవాలయ వ్యవస్థపై మొత్తంగా ఇది హిందూ సమాజంపై జరిగిన దాడిగా భావిస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపింది. ధర్మ పరిరక్షణ ముసుగులో వ్యక్తిగత ప్రయోజనం కోసం స్వార్థపూరిత చర్యలకు పాల్పడేవారిని ఉపేక్షించవద్దని ఆరెస్సెస్ తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ కట్ట రాజగోపాల్ కోరారు. ఈ సంఘ వ్యతిరేక శక్తులను చట్ట ప్రకారం విచారించి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వ్యవస్థలను నియంత్రించాలనే నియంతృత్వ పోకడలకు పౌరసమాజంలో చోటులేదని స్పష్టం చేశారు.





భారీ మొక్కజొన్న!

12 అడుగుల చెట్టు.. 18 అంగుళాల కంకి

సాధారణంగా మొక్కజొన్న చెట్లు 10 అడుగుల లోపు, కంకి 10-12 అంగుళాల మధ్య ఉంటాయి. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బోడు గ్రామానికి చెందిన బొడ్డుపల్లి భద్రయ్య ఇంట్లో పెంచిన మొక్కజొన్న చెట్టు భారీగా పెరిగి అందరినీ ఆకట్టుకుంటోంది. చెట్టు 12 అడుగులు ఉండగా, కంకి 18 అంగుళాల మేర ఉండటం విశేషం. దీన్ని పలువురు ఆసక్తిగా చూస్తున్నారు. - టేకులపల్లి



కారును ఇలా కూడా వాడొచ్చు

బాల్కొండ: కారును సాధారణంగా మనుషులు ప్రయాణించడానికి ఉపయోగిస్తారు. కానీ వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతులు కొందరు కారును వ్యవసాయ పనులకు కూడా వినియోగిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం కొత్తపల్లిలో ఓ రైతు తన పశువుల కోసం జొన్న, సొప్ప గ్రాసాన్ని ఇలా కారులో తరలిస్తూ కనిపించారు.

కొడంగల్‌లో ఒక జెడ్పీటీసీ లేదా ఎంపీపీ గెలవండి

కేటీఆర్‌కు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సవాల్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పగటి వేషగాడిలాగా మాట్లాడుతున్నారని, కొడంగల్‌కు వెళ్లి సీఎం రేవంత్‌ను రాజీనామా చేయాలని ఆయన సవాల్ చేయడం విడ్డూరంగా ఉందని పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేటీఆర్‌కు దమ్ముంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గంలోని ఒక్క జెడ్పీటీసీ లేదంటే ఒక్క ఎంపీపీ గెలవాలని, అలా గెలిస్తే రేవంత్‌తో సంబంధం లేదని, రాజీనామా చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని సీఎల్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. రాజీనామాల గురించి తాను అసెంబ్లీలోనే కేటీఆర్, హరీశ్‌రావులను సవాల్ చేశానని, అయినా ఇప్పటివరకూ ఎవరూ స్పందించలేదన్నారు. కేటీఆర్‌కు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే సిరిసిల్ల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, కె.కె. మహేందర్‌రెడ్డిని అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకుంటామని చెప్పారు. జైలుకు పోతాననే భయంతోనే కేటీఆర్ ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్నాడని విమర్శించారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొడంగల్‌ను పట్టించుకోలేదన్నారు.

రెఫరెండం కావాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలి

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

సాక్షి, హైదరాబాద్: రెఫరెండం కావాలంటే బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలు చేసి ప్రజల్లో ఆదరాభిమానాలు పొందుతున్న సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని కేటీఆర్ అనడం హాస్యాస్పదమన్నారు. కొడంగల్ గురించి కేటీఆర్ ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నాడని, గత ఎన్నికల్లో కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని ఓడించడానికి నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. మీడియా కోసమే కేటీఆర్ సవాళ్లు విసురుతున్నాడని, మీకు చేతనైతే కొడంగల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీపీ గెలిపించుకోవాలని శ్రీహరి సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌రెడ్డిని కొడంగల్ ప్రజలు ఏనాడు మరిచిపోరన్నారు.

సెల్‌ఫోన్ వచ్చిందని... సిమ్ వేస్తే అంతే

సరికొత్త ఎత్తుగడలతో సైబర్ నేరగాళ్ల నయా మోసాలు

- లాటరీలో సెల్ గెలుచుకున్నారంటూ పార్శిళ్లు.. ఇది నమ్మి అందులో సిమ్ వేస్తే ఖాతాలు ఖాళీ
- తాజాగా బెంగళూరు ఉదంతంతో వెలుగులోకి.. రాష్ట్రంలోనూ ఈ తరహా మోసాలకు అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్ పోలీసులు

సాక్షి, వరంగల్: సైబర్ నేరగాళ్లు నయా ఆలోచనలతో సరికొత్తగా మోసాలు చేస్తున్నారు. ఇన్నాళ్లు లాటరీలో మీరు కారు గెలిచారు.. రూ.లక్షల్లో నగదు బహుమతి గెలుచుకున్నారు.. బంగారం గెలుచుకున్నారంటూ ఆశ చూపి రూ.లక్షలు కొల్లగొట్టిన నేరగాళ్లు ఇప్పుడు కన్నింగ్ ఆలోచనలతో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఏకంగా మీరు లాటరీలో మొబైల్ ఫోన్ గెలుచుకున్నారంటూ ఇంటికే గిఫ్ట్‌గా పంపి అందులో సిమ్ కార్డు వేయగానే బ్యాంక్ ఖాతా ఖాళీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల బెంగళూరులో ఓ టెకీకి లాటరీలో మొబైల్ గెలిచారంటూ సెల్‌ఫోన్ ఇంటికి పంపారు.అందులో అతను సిమ్ కార్డు వేయగానే గంట తర్వాత అతడి బ్యాంక్ ఖాతానుంచి ఏకంగా రూ.2.8 కోట్లను సైబర్ నేరగాళ్లు ఖాళీ చేయడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు కూడా ఈ తరహా లాటరీ మోసాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, లేకపోతే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సైబర్ బాధిత నగరాల్లో టాప్-5 ఇవే (నేరాల సంఖ్య)	సైబరాబాద్	హైదరాబాద్	రాచకొండ
	25,112	20,299	14,815
	వరంగల్: 3,531	సంగారెడ్డి: 3,132	

మచ్చుకు కొన్ని...

- కేరళ లక్కీ డ్రా పేరిట హైదరాబాద్‌కు చెందిన 67 ఏళ్ల వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. తొలుత ఇన్‌స్టాగ్రామ్‌లో సంప్రదించి కేరళ లక్కీ డ్రాలో రూ.5 లక్షలు గెలుపొందావని నమ్మించారు. వాటిని క్లెయిమ్ చేసుకోవాలంటే కొంత నగదు సెక్యూరిటీ డిపాజిట్ కింద జమ చేయాలని సూచించారు. వాటిని తర్వాత తిరిగి చెల్లిస్తామన్నారు. ఇది నిజమని నమ్మిన బాధితుడు స్కామర్లు సూచించిన అకౌంట్లలో రూ.2,17,426 డిపాజిట్ చేశాడు. అనంతరం వారు ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడంతో మోసపోయానని భావించి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఈ ఏడాది జనవరి 18న ఫిర్యాదు చేశారు.
- కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో కనిపించిన లాటరీ యాడ్ ఉన్న లింక్ క్లిక్ చేశాడు. ఆ తర్వాత రూ.60 లక్షల నగదు, 10 తులాల బంగారం గెలిచారంటూ సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేశారు. ట్యాక్స్‌ల కోసం కొంత నగదు పంపాలంటూ బాధితుడిని నమ్మించడంతో దశలవారీగా రూ.7.20 లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత ఇది మోసమని తెలవడంతో 2024 డిసెంబర్ 12న పోలీసులను సంప్రదించాడు.

2024

సైబర్ నేరాల్లో అత్యధికంగా షేర్ మార్కెట్ మోసాలున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో పార్ట్‌టైం ఉద్యోగాలు, డిజిటల్ అరెస్టు, నకిలీ కస్టమర్ కేర్ సర్వీస్‌లు, క్రెడిట్ కార్డు మోసాలు, మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలు నమోదయ్యాయి. రోజుకు సగటున 316 మంది బాధితులు రూ.5.4 కోట్ల మేర నష్టపోయారు. 2024లో సైబర్ మోసాల రూపంలో రూ.1,866 కోట్ల సొమ్మును బాధితులు కోల్పోయారు. అయితే రూ.176.71 కోట్లను రికవరీ చేయగా, రూ.244.56 కోట్లను సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) అధికారులు ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే.



లాటరీ గిఫ్ట్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే



వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోనూ సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్నాం. పోలీసులు క్షేత్రస్థాయిలో ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. లాటరీ వచ్చిందని చెప్పగానే...ఆధార్ కార్డు, పాన్ కార్డుతో పాటు బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరు అడిగినా ఇవ్వొద్దని చెబుతున్నాం. తాజాగా బెంగళూరులో ఓ టెకీకి లాటరీలో సెల్‌ఫోన్ గెలిచావంటూ పంపించి బ్యాంక్ ఖాతా ఖాళీ చేశారు. ఈ తరహా మోసాలు కూడా ఇక్కడే జరిగే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- అంబర్ కిశోర్ ఝా, వరంగల్ పోలీసు కమిషనర్.

గిట్టలు ఇట్టా.. నడిచేదెట్టా



పట్టణాలు, నగరాల్లో తిరిగే ఆవులను ఆదరించేవారు లేకపోవడంతో కాలిగిట్టలు పెరిగిపోయి నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతుంటాయి. అనంతపురం పట్టణంలో ఓ ఆవు పెరిగిన గిట్టల వల్ల నడవలేక ఇబ్బందిపడుతున్న దృశ్యం – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ఆ'పరేషాన్'



నెల్లూరు నగరంలోని వివిధప్రాంతాల్లో సంచరిస్తున్న వీధి కుక్కల్ని పట్టుకుని సంతాన నియంత్రణ ఆపరేషన్ చేసేందుకు తీసుకొచ్చి నెల్లూరు పాతమున్సిపల్ ఆఫీస్ వద్ద ఉంచారు. అయితే ఆపరేషన్ చేసేందుకు డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో రోజుల తరబడి ఇలా గదుల్లో ఉంచాల్సి వస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

జలకన్యలు



విశాఖ బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన విశాఖ ఎక్స్ పో 2025లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న జల కన్యల విన్యాసాలు చూడటానికి చిన్నారులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు.ఇటలీ, ఫిలిప్పీన్స్ దేశాలకు చెందిన ఐదుగురు యువతులు ప్రత్యేకమైన దుస్తులు ధరించి నీటిలో విన్యాసాలు చేస్తూ అలరిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

ఇమామ్, మౌజన్‌లకు జీతాలివ్వండి

మహమ్మద్ సద్‌రుద్దీన్ ఖురేషీ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇమామ్, మౌజన్‌లకు నెలవారీ ఇచ్చే గౌరవ వేతనం తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మహమ్మద్ సద్‌రుద్దీన్ ఖురేషీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు సోమవారం వాట్సాప్ ద్వారా వినతిపత్రం పంపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల కాలంలో ఇమామ్, మౌజన్‌లకు వేతనాలు ఇవ్వలేదని, ఇప్పటికైనా ఆ మొత్తాన్ని వారికి అందించాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి శంకర్‌నాయక్ కృషి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గిరిజన సమస్యల పరిష్కారంలో ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ విశేష కృషి చేశారని కమిషన్ సెక్రటరీ రామశేషు అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియమితుడైన శంకర్‌నాయక్ మూడేళ్ల పదవీకాలం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ ప్రధాన కార్యాలయంలో ఆయనకు అభినందన సభ నిర్వహించారు. రామశేషు మాట్లాడుతూ మూడేళ్ల పదవీకాలంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోను విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో గిరిజనుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంలో శంకర్‌నాయక్ వారికి అండగా నిలిచారన్నారు. అనంతరం ఎస్టీ కమిషన్ సిబ్బంది, రాష్ట్రంలోని గిరిజన సంఘాల నాయకులు కలిసి శంకర్ నాయక్ దంపతులను ఘనంగా సన్మానించారు. శంకర్ నాయక్ మాట్లాడుతూ తనను ఎస్టీ కమిషన్ సభ్యుడిగా ఎంపిక చేసి రాష్ట్రంలోని గిరిజనులకు సేవ చేసే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, మాదిగాని గురునాథం, హనుమంతు నాయక్, బీమా నాయక్, అంజి నాయక్, సమీర్ నాయక్, పులివెందుల రమేష్ నాయక్, లక్ష్మణ నాయక్, సుబ్బయ్య, సైదా నాయక్, పేరం సత్యం తదితరులు మాట్లాడారు.

కౌలు రైతు ప్రయోజనాలకు కూటమి ఎసరు

రైతు విశిష్ట సంఖ్య నమోదుతో తీవ్ర నష్టమన్న ఏపీ రైతు సంఘం

సాక్షి, అమరావతి: రైతు విశిష్ట సంఖ్య (భూ ఆధార్) నమోదుతో కౌలు రైతుల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ విమర్శించింది. తక్షణమే ఈ నమోదు కార్యక్రమాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేసింది. భూ ఆధార్ నమోదు చేసుకున్న వారికి మాత్రమే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సాయం, పంటల బీమా వంటి రైతు సంక్షేమ పథకాలు వర్తిస్తాయని ప్రచారం చేస్తున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వీ కృష్ణయ్య, కే ప్రభాకరరెడ్డి విమర్శించారు. దీని ప్రకారం భూ ఆధార్ నమోదు ప్రక్రియలో భూమిలేని లక్షలాది మంది కౌలు రైతులకు ఎలాంటి గుర్తింపు ఉండదన్నారు. ఇలా అయితే రాష్ట్రంలో 35 లక్షల మంది కౌలు రైతులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలుకావన్నారు. కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన ఈ భూ ఆధార్ నమోదును తక్షణమే నిలిపి వేయాలన్నారు. ఈ కార్యక్రమం అమలు వల్ల రైతులకు జరిగే లాభ, నష్టాలపై తొలుత అఖిల పక్ష రైతుసంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు.

ప్రతి స్కూల్ కాంప్లెక్స్‌కు 'హైస్కూల్ ప్లస్' ఉండాలి

ప్రభుత్వానికి నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: నూతన జాతీయ విద్యా విధానం సిఫారసుల ప్రకారం ప్రతి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఇంటర్ విద్యను అందుబాటులోకి తేవాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతోపాటు కో–ఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్‌లను కూడా కొనసాగిస్తూ రెగ్యులర్ పదోన్నతులు చేపట్టాలన్నారు.

కుంకీలతో కట్టడి సాధ్యమేనా?



పలమనేరులో కుంకీ ఎలిఫెంట్ క్యాంపు పనులు ప్రారంభం

- ఎలిఫెంట్ ప్రూఫ్ ట్రెంచ్‌లు, సోలార్ ఫెన్సింగ్ వృథానే
- ఫలితమివ్వని ననియాల ఎలిఫెంట్ క్యాంప్
- కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి
- మూడు దశాబ్దాలుగా కౌండిన్యలో తీరని ఏనుగుల సమస్య
- ఇప్పటికే 16 ఏనుగులు మృతి, ఏనుగుల దాడుల్లో 14 మంది మృతి

పలమనేరు: చిత్తూరు జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్య దశాబ్దాలుగా ఉంది. అడవిదాటి వచ్చి ఏనుగులు రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. మరోవైపు ఏనుగుల దాడుల్లో జనాలు మృత్యువాత పడుతున్నారు. ఏనుగులు సైతం వివిధ కారణాలతో మరణిస్తున్నాయి. అడవిలోంచి ఏనుగులు బయటకు రాకుండా కట్టడి చేసేందుకు ఇప్పటివరకు అటవీశాఖ చేపట్టిన సోలార్ ఫెన్సింగ్, కందకాల తవ్వకం వల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. కర్ణాటక టైప్ పేరిట గతంలో చేపట్టిన హ్యాంగింగ్ సోలార్ సిస్టం సైతం ప్రయోగాత్మకంగానే ముగిసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగుల ద్వారా ఇక్కడి ఏనుగులను కట్టడి చేసేందుకు పలమనేరు మండలంలోని ముసలిమొడుగు వద్ద కుంకీ ఎలిఫెంట్ ప్రాజెక్టు పనులు చేపడుతోంది. ఇదే తరహాలో రామకుప్పం మండలంలో ననియాల క్యాంపును గతంలో ఏర్పాటు చేసినా ఈ ఏనుగులు కనీసం అడవిలోని ఓ ఏనుగును సైతం అదుపు చేయలేదు. ఈ నేపథ్యంలో ఇక్కడికి రానున్న కుంకీ ఏనుగులు అడవి ఏనుగులను కట్టడి చేస్తాయా? అనే అనుమానం ఇక్కడి రైతుల్లో నెలకొంది.

కౌండిన్యలో ఏనుగుల పరిస్థితి ఇదీ

పలమనేరు, కుప్పం పరిధిలోని కౌండిన్య అభయారణ్యం 250 కి.మీ మేర మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని అడవులకు ఆనుకొని ఉంది. కౌండిన్య అభయారణ్యంలో స్థిరంగా ఉన్న గుంపులు, వలస వచ్చిన గుంపులు కలిపి మొత్తం 120 వరకు ఏనుగులు సంచరిస్తున్నాయి. 1984లో ప్రభుత్వం ముసలిమొడుగు వద్ద కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీని ఏర్పాటు చేసింది. ఇందులోకి తమిళనాడులోని మోర్ధన ఫారెస్ట్‌నుంచి, ననియాల, కర్ణాటకలోని బన్నేరుగట్ట, బంగారుపేట, కేజీఎఫ్, తమిళనాడులోని క్రిష్ణగిరి, హొసూరు, కావేరిపట్నం తదితర ప్రాంతాల నుంచి ఏనుగులు వస్తున్నాయి. ఏనుగులు అడవిని దాటి బయటకు రాకుండా ఉండేందుకు గతంలో రూ. 2.61 కోట్లతో బంగారుపాళ్యం మండలం నుంచి కుప్పం వరకు 142 కి.మీ మేర సోలార్‌ఫెన్సింగ్‌ను 40 కి.మీ మేర ట్రెంచ్‌లను ఏర్పాటుచేశారు. అయితే సోలార్‌ఫెన్సింగ్‌ను ఏనుగులు తొక్కి అడవిలోంచి బయటకు వస్తున్నాయి. ఫెన్సింగ్ కోసం ఏర్పాటు చేసిన కమ్మీలు నాశిరకంగా ఉండటంతో వీటిని సులభంగా విరిచేస్తున్నాయి. ఇక ఎలిఫెంట్ ట్రెంచ్‌లను సైతం ఏనుగులు మట్టిని తోసి,రాళ్లున్న చోట సులభంగా అడవిని దాటి బయటికొస్తున్నాయి. ఈరెండూ విఫలమవడంతో గతేడాది కర్ణాటక మోడల్ పేరిట హ్యాంగింగ్ సోలార్‌ను పదికిలో మీటర్ల మేర ప్రయోగాత్మకంగా చేపట్టి ఆపై దీన్నీ వదిలేశారు.





కుంకీ ఏనుగుల కోసం నిర్మించిన చెరువు, క్రోల్స్, నివాసస్థలం

కుంకీల కోసం కర్ణాటకతో ఎంవోయూ

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కర్ణాటకతో ఎంవోయూ చేసుకొని అక్కడ శిక్షణపొందిన నాలుగు కుంకీ ఏనుగులను ఇక్కడికి తెప్పిస్తోంది. ఇందుకోసం రేంజి పరిధిలోని 20 మంది ఎలిఫెంట్ ట్రాకర్లను దుభారే ఎలిఫెంట్ క్యాంపునకు పంపి నెలరోజుల పాటు శిక్షణ ఇప్పించారు. దీనికోసం ముసలిమొడుగు వద్ద రూ.12లక్షల వ్యయంతో కుంకీ ఎలిఫెంట్ క్యాంపును 50 ఎకరాల్లో ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా ఏనుగుల కోసం కర్రల కంచెతో విడిది, మేతను సిద్ధం చేసుకునే గదులు, చిన్నపాటి చెరువు, శిక్షణాస్థలం. క్రాల్స్(మదపుటేనుగులను మచ్చిక చేసుకొనే చెక్క గది) పనులు జరుగుతున్నాయి. మరో రూ.27 లక్షలతో హ్యాంగింగ్ సోలార్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇలా ఉండగా గతంతో రామకుప్పం వద్ద ననియాలో ఏర్పాటు చేసిన ఇలాంటి క్యాంపులో రెండు ఏనుగులున్నాయి. వీటిని చూసేందుకు పర్యాటకులు వెళుతున్నారేగానీ ఇవి అడవిలోని ఏనుగును కట్టడి చేసిన దాఖలాలు ఇప్పటిదాకా లేవు. అదే రీతిలో ఇక్కడ కుంకీలతో సమస్య తెగుతుందా? లేదా అనే సందేహం మాత్రం ఇక్కడి రైతులకు పట్టుకుంది. అసలే ఇక్కడున్న మదపుటేనుగులు (రౌడీ ఏనుగులు,పుష్పా) కుంకీ ఏనుగులపై దాడులు చేసే అవకాశం లేకపోలేదు.

గుబులు రేపుతున్న ఒంటరి ఏనుగు....

పలమనేరు కౌండిన్య అభయారణ్యంలో వందకు పైగా ఏనుగులు సంచరిస్తున్నా కేవలం ఓ ఒంటరి ఏనుగు రెండునెలలుగా జనానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కేవలం వ్యవసాయపొలాల వద్ద ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి వాటిని ధ్వంసం చేస్తోంది. ఆ ఇళ్లలోని ధాన్యం, రాగులు హాయిగా ఆరగించి వెళుతోంది. దీంతోపాటు ఆఇళ్ల వద్ద ఉన్న మనుషులపై దాడులు చేస్తోంది. వారు దొరక్కపోతే ఆ ఇళ్ల వద్ద కట్టేసి ఉన్న ఆవులు, దూడలను చంపుతోంది. దీంతో అటవీ సమీప ప్రాంతాల్లో పొలాలవద్ద కాపురాలుంటున్న వారు ఈ ఏనుగు భారినుంచి ఎలా తప్పించుకోవాలో అర్థంగాక హడలిపోతున్నారు. కాగా గత పదేళ్లలో కరెంట్ షాక్‌లు, నీటిదొనల్లో పడి, మదపుటేనుగుల రభస కారణంగా 16 ఏనుగులు చనిపోయాయి. ఏనుగుల కారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14మంది మృతి చెందగా 26 మందివరకు గాయపడ్డారు.



ఇళ్లను ధ్వంసం చేస్తున్న ఏనుగు

అడవిని విడిచి ఎందుకొస్తున్నాయంటే...

కౌండిన్య అభయారణ్యంలో ఏనుగులకు అవసరమైన ఆహారం, నీటిలభ్యత తక్కువ. ఓ ఏనుగుకు రోజుకి 900లీటర్ల నీరు, 10 హెక్టార్లలో ఫీడింగ్ అవసరం. ఆహారం తిన్నాక ఇవి రోజుకు 5మైళ్లదాకా సంచరిస్తుంటాయి. అడవిలోని దట్టమైన మోర్ధనా అభయారణ్యంలోకి ఏనుగులు వెళితే తమిళనాడు అటవీశాఖ తుపాకులతో గాల్లోకి కాల్పులు జరిపి వీటిని మళ్లీ కౌండిన్య వైపుకు మళ్లిస్తోంది. దీంతో ఏనుగులు దట్టమైన అడవిలో ఉండటంలేదు. పొలాల్లోని చెరుకు, కొబ్బరి, మామిడి లాంటి ఆహారం కోసం ఒక్కసారి వచ్చే ఏనుగు తరచూ అదే మార్గంలో వస్తూనే ఉంటుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.



పలమనేరు కౌండిన్య అభయారణ్యం నుంచి బయటకు వస్తున్న ఏనుగుల గుంపు(ఫైల్)

క్యాంప్ పనులు సాగుతున్నాయి



పలమనేరులో కుంకీ ఎలిఫెంట్ క్యాంపుకోసం ఇప్పటికే పనులు సాగుతున్నాయి. మైసూరు సమీపంలోని దుబరే నుంచి నాలుగు కుంకీ ఏనుగులు త్వరలో రానున్నాయి. ఎలిఫెంట్ ట్రాకర్లకు ఇప్పటికే కుంకీ ట్రైనింగ్ ఇప్పించాం. ముఖ్యంగా మదపుటేనుగులు దాడులు చేయకుండా వాటికి శిక్షణనిస్తాం. దీంతో ఏనుగులను కట్టడి చేసే అవకాశం ఉంటుంది. **– భరణి, డీఎఫ్‌వో, చిత్తూరు**

కుంకీలతోనైనా సమస్య తీరితే చాలు..



గతంలో ఏనుగులను కట్టడి చేసేందుకు చేసిన పనులన్నీ లాభం లేకుండా పోయాయి. ఇప్పుడు కుంకీ ఏనుగులంటున్నారు. వీటితోనైనా ఇక్కడ ఏనుగుల సమస్య పరిష్కారమైతే అదే పదివేలు. అయినా జనంపై దాడులు చేస్తూ యథేచ్ఛగా పంటపొలాలపై పడుతున్న మదపుటేనుగులను ఈ కుంకీ ఏనుగులు ఎంత వరకు అదుపు చేస్తాయనే విషయంపై అనుమానంగానే ఉంది.

– ఉమాపతి, రైతుసంఘ నాయకులు, పలమనేరు

రూ.1.30 లక్షల విలువైన గంజాయి పట్టివేత

తాడేపల్లిగూడెం అర్బన్: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ విశ్వనాథ్ సోమవారం తెలిపారు. తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని రైల్వే గూడ్స్ షెడ్డు రోడ్డులో మోటారు సైకిల్ పార్కింగ్ వద్ద కొందరు వ్యక్తులు గంజాయిని తీసుకువెళ్తున్నారని సమాచారం రావడంతో ఆ ప్రాంతానికి వెళ్లి.. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.1.30 లక్షల విలువైన 13.288 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన నల్లి శ్రీనివాస్, కరాటం బాలకృష్ణ, కంకిపాటి నాగరాజు, గుండుగోలు మురళి, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ముసునూరి దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేసినట్టు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

విక్రాంత్‌రెడ్డికి ముందస్తు బెయిలివ్వొద్దు

- వాటాల బదిలీలో ఆయనదే కీలక పాత్ర
- హైకోర్టుకు నివేదించిన సీఐడీ

సాక్షి, అమరావతి: కాకినాడ సీ పోర్ట్ వాటాల బదిలీ వ్యవహారంలో వై.విక్రాంత్‌రెడ్డిదే కీలక పాత్ర అని సీఐడీ హైకోర్టుకు నివేదించింది. వాటాలను అరబిందో రియాలిటీ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు బదిలీ చేయించే వ్యవహారంలో విక్రాంత్ బెదిరింపులకు పాల్పడటంతో పాటు కంపెనీ విలువను తగ్గించి చూపడంలో కూడా కీలక పాత్ర పోషించారని తెలిపింది. 2020లో కాకినాడ సీ పోర్ట్‌తో పాటు కాకినాడ సెజ్‌లకు సంబంధించిన వాటాలపై హక్కులను వదులుకోవాలంటూ పోర్ట్ ప్రమోటర్ కె.వి.రావును తన ఇంటికి పిలిచి విక్రాంత్ ఒత్తిడి చేశారని తెలిపింది. తాము చెప్పినట్లు వాటాల బదిలీకి అంగీకరించకుంటే న్యాయపరమైన చర్యలతో పాటు క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాల్సి వస్తుందంటూ బెదిరించారని సీఐడీ పేర్కొంది. ఈ బెదిరింపుల వల్ల కేవీ రావుకు చెందిన కాకినాడ సీ పోర్ట్‌కు రూ.3666 కోట్లు, కాకినాడ సెజ్‌కు రూ.109 కోట్ల మేర నష్టం వాటిల్లిందని వివరించింది. దర్యాప్తులో ఇంకా పలు కీలక విషయాలను విక్రాంత్ నుంచి రాబట్టాల్సి ఉందని, అందువల్ల ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని హైకోర్టును అభ్యర్థించింది. తనను బెదిరించి కాకినాడ డీప్ వాటర్ పోర్టులో వాటాలను అరబిందో సంస్థ కొనుగోలు చేసిందంటూ సీఎం చంద్రబాబు సన్నిహితుడు, పోర్టు ప్రమోటర్ కేవీరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ నమోదు చేసింది. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వై.విక్రాంత్‌రెడ్డి గత ఏడాది డిసెంబర్‌లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 27 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,536 మంది స్వామివారిని దర్శించుకోగా 25,890 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.67 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.



మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు.

అష్టదళ పద్మారాధన నేడు


డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు.

విశేషంగా పండిత సదస్సు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న భీష్మ ఏకాదశి కల్యాణమహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పండిత సదస్సు విశేషంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, వెంకన్న ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. అర్చకులు, పండితులు స్వామివారి వైభవాన్ని కీర్తించారు. విశేష హారతులిచ్చి, భక్తులకు ప్రసాదం అందించారు. దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు భార్గవ్, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేదిక్ వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా భాస్కరుడు

తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల గణితశాస్త్ర విభాగానికి చెందిన అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరుడు నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి సోమవారం ఉత్తర్వులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో రిజిస్ట్రార్‌గా నియమించిన టీటీడీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు ఆయనను అభినందించారు.



ప్రారంభం.. గురుపూజోత్సవం



రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు వ్యాసాశ్రమంలో సోమవారం ఘనంగా గురుపూజోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద గిరి స్వామి మాట్లాడుతూ గురువులే సమాజ నిర్మాణానికి దిక్సూచి అని వెల్లడించారు. అనంతరం అధిష్టాన మందిరంలో భక్తిశ్రద్ధలతో పాదుకుల పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆశ్రమంలోని కుటీరం నుంచి పాదుకులను భక్తులు, విద్యార్థినుల కోలాట, భజనల నడుమ అధిష్టాన మందిరానికి వేంచేపు చేశారు.

జాతీయ సదస్సు ప్రారంభం

తిరుపతి సిటీ: హైదరాబాద్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎంఎస్ఎంఈ సహకారంతో మహిళా విశ్వవిద్యాలయంలో ఐదు రోజుల జాతీయ సదుస్సు సోమవారం ప్రారంభమైంది. అడ్వాన్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ×పేటెంట్ అప్లికేషన్ డ్రాఫ్టింగ్, ఫైలింగ్₹ విధానాలపై జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిలుగా వీసీ ప్రొఫెసర్ ఉమ, ఎంఎస్ఎంఈ ప్రొగ్రాం డైరెక్టర్ స్వప్న హాజరయ్యారు. భారతదేశంలోని ఎంట్రపెన్యూర్స్ విషయంలో పేటెంట్ చట్టాలు, నిబంధనలు, ఫైలింగ్ ప్రొసెస్ వంటి అంశాలతో పాటు ఎంఎస్ఎంఈ పథకాలుపై అవగాహన కల్పించారు. సదస్సులో రిజిస్ట్రార్ రజిని, పలు రాష్ట్రాల నుంచి విచ్చేసి రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు.

అమ్మ 'చక్కెర' బిడ్డకూ చేదు

హెల్త్

ఈ రోజుల్లో మధుమేహం (డయాబెటిస్) చాలా సాధారణం. మామూలుగానే నియంత్రణ లేని డయాబెటిస్ ఆరోగ్యపరంగా ఎన్నో అనర్థాలు తెచ్చిపెడుతుంది. అదే ఒకవేళ గర్భిణిలో ఆ సమస్య ఉండి, వాళ్లకు చక్కెర నియంత్రణలో లేకపోతే అది కాబోయే తల్లికీ, కడుపులోని బిడ్డకూ చేటు తెచ్చిపెట్టే అవకాశాలెక్కువ. మామూలుగా కొందరు మహిళలకు గర్భధారణకు ముందునుంచే డయాబెటిస్ ఉండి ఉండవచ్చు. మరికొందరికి గర్భం వచ్చాక కనిపించవచ్చు. దీన్నే జెస్టేషనల్ డయాబెటిస్ అంటారు. ఈ సమస్య ఉన్నప్పుడు రక్తంలో చక్కెర నియంత్రణలో లేకపోతే ఇటు తల్లికీ, అటు బిడ్డకూ... అలాగే ఇటు కాన్పు సమయంలో, అటు కాన్పు తర్వాతా... ఇలా ఎవరిలోనైనా, ఏ దశలోనైనా ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలుంటాయి. ఆ సమస్యలేమిటీ, వాటి పరిష్కారాలేమిటి వంటి అనేక అంశాలను విపులంగా తెలుసుకుందాం.

మహిళకు... తనకు గర్భం రాకముందునుంచే డయాబెటిస్ ఉండి, గర్భం వచ్చాక రక్తంలోని చక్కెర నియంత్రణలో లేకుండా తీవ్రత ఎక్కువైతే దాన్ని 'ప్రీ–జెస్టేషనల్ డయాబెటిస్' అంటారు. మళ్లీ ఇందులోనూ ఆమెకు 'టైప్–1 డయాబెటిస్', 'టైప్–2 డయాబెటిస్' అనే రెండు రకాల డయాబెటిస్‌లలో ఏదో ఒకటి ఉండే అవకాశముంది. 'టైప్–1 డయాబెటిస్' చిన్నవయసులోనే వస్తుంది. ఇందులో సొంత వ్యాధి నిరోధక వ్యవస్థ ప్యాంక్రియాస్ గ్రంథిలోని కణాలపై దాడి చేయడం వల్ల, ఆ గ్రంథిలోంచి రక్తంలోని చక్కెర శాతాన్ని నియంత్రించే ఇన్సులిన్ హార్మోన్ స్రవించడం ఆగిపోవడం వల్ల వచ్చేదే టైప్–1 డయాబెటిస్. దీని ప్రభావం ఇతర అవయవాలపైనా ఉంటుంది.

ఇక 'టైప్–2 డయాబెటిస్' అనేది పెద్దయ్యాక వచ్చే మధుమేహం. మామూలుగా ఉండాల్సిన దానికంటే ఎక్కువ బరువు ఉన్నవారిలో; సాధారణంగా 35 ఏళ్ల పైబడిన వారిలో ఇది వచ్చే అవకాశం ఎక్కువ. ఇందులో ఇన్సులిన్ ప్రభావానికిలోనై శరీరంలోని కణాలు స్పందించకపోవడంతో రక్తంలో చక్కెర నియంత్రణ జరగదు. దాంతో ఈ రకమైన డయాబెటిస్ కనిపిస్తుంది. ఇది చాలామందిలో వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు ఎక్కువ. **ఇక జెస్టేషనల్ డయాబెటిస్ అంటే...** ఈ కండిషన్ మహిళ గర్భవతిగా ఉన్నప్పుడే కనిపించి, కాన్పు తర్వాత డయాబెటిస్ కనిపించకుండా పోతుంది. (అయితే ఇలాంటి కొందరిలో ఆ తర్వాత కొంతకాలానికి డయాబెటిస్ కనిపించే అవకాశాలుంటాయి.)

డయాబెటిస్‌కు కారణాలు

పాంక్రియాస్ గ్రంథి నుంచి విడుదలయ్యే ఇన్సులిన్ హార్మోను... రక్తంలోని చక్కెరను నియంత్రిస్తూ అవసరమైనప్పుడు శక్తి కోసం చక్కెర విడుదలయ్యేలా, అవసరం లేనప్పుడు తగ్గిపోయేలా... ఎప్పుడూ ఓ నార్మల్ విలువ మెయింటైన్ అయ్యేలా చూస్తుంది. ఇలా జరగనప్పుడు డయాబెటిస్ కనిపిస్తుంది. ఆ కారణాలేమిటంటే... • గర్భిణుల్లో విడుదలయ్యే కార్టిసాల్ ప్రొజెస్టరాన్, ప్రోలాక్టిన్, హ్యూమన్ ప్లాసెంటల్ లాక్టోజెన్ లాంటి హార్మోన్లు ఇన్సులిన్ సామర్థ్యాన్ని తగ్గిస్తాయి • కొందరు గర్భిణుల్లో బరువు ఎక్కువగా పెరిగేవారు ఆహారాన్ని తీసుకునేటప్పుడు, శరీర తత్వాన్ని బట్టి నెలలు నిండే కొద్దీ ఒక్కోసారి ఇన్సులిన్ పని తీరు క్రమంగా తగ్గుతుండటం వల్ల, రక్తంలోని చక్కెర మోతాదులు నియంత్రణలో లేకపోవడంతో డయాబెటిస్ కనిపిస్తుంది. కాన్పు తర్వాత మళ్లీ హార్మోన్లు సాధారణ స్థాయికి రావడంతో ఇన్సులిన్ పనితీరు మళ్లీ మునుపటిలాగానే ఉండి, చక్కెరను నియంత్రిస్తుండటం వల్ల కాన్పు తర్వాత చాలామంది మహిళల్లో జెస్టేషనల్ డయాబెటిస్ తగ్గుతుంది. గర్భవతి కాకముందునుంచే డయాబెటిస్ ఉండేవారిలో గర్భంతో ఉన్నప్పుడు చక్కెర మోతాదులు పెరుగుతాయి. కాన్పు తర్వాత ఆ చక్కెర మోతాదులు మళ్లీ గర్భం రాకముందు ఉన్న స్థాయికి పడిపోతాయి.

గర్భిణుల్లో డయాబెటిస్ ముప్పు ఎవరిలో ఎక్కువంటే...

• గర్భధారణ 30 ఏళ్లు పైబడిన తర్వాత జరిగిన వారిలో • తమ ఎత్తుకంటే ఎక్కువ బరువు ఉన్నవారిలో • కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా డయాబెటిస్ ఉన్న చరిత్ర ఉన్నవారిలో. • ఎక్కువసార్లు అబార్షన్లు అయినవారిలో • క్రితం కాన్పులో బిడ్డ కడుపులో చనిపోవడం లేదా పుట్టాక చనిపోవడం, బిడ్డ సైజు పెద్దగా ఉన్నవారిలో • ముందు పుట్టిన బిడ్డకు అంగవైకల్యాలు ఉన్న సందర్భాల్లో.

నిర్ధారణ...

ఇక్కడ చెప్పిన రిస్క్ ఫ్యాక్టర్ ఉన్నవారు మొదటిసారి చెకప్‌కు వచ్చినప్పుడే డాక్టర్‌కు తమకు సంబంధించిన ఆరోగ్య చరిత్ర, ఇతరత్రా విషయాలను దాపరికం లేకుండా చెప్పి, రక్తంలో చక్కెర మోతాదు తెలిపే పరీక్షలు చేయించుకోవాలి. తర్వాత ఆరో నెలలో మళ్లీ షుగర్ పరీక్షలు చేయించుకోవాలి.

మొదట రాండమ్ బ్లడ్ షుగర్ చేయించుకోవాలి. అందులో విలువలు 150 ఎంజీ/డీఎల్ కంటే ఎక్కువ ఉన్నా లేదా ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ 110 కంటే ఎక్కువగా ఉన్నా లేదా తిన్న రెండు గంటల తర్వాత షుగర్ విలువలు 140 కంటే ఎక్కువగా ఉన్నా, రిస్క్ ఫ్యాక్టర్స్ ఒకటి కంటే ఎక్కువగా ఉన్నా గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్ (జీటీటీ) చేయించాలి. ఇందులో తిండితో సంబంధం లేకుండా 50 గ్రా. గ్లూకోజ్ తాగిస్తారు. ఒక గంట తర్వాత రక్తంలో షుగర్ మోతాదులు ఎంత ఉన్నాయో పరీక్షిస్తారు. ఒకవేళ ఇది 140 మి.గ్రా. కంటే ఎక్కువగా ఉంటే వారిలో డయాబెటిస్ అవకాశాలు ఎక్కువ అని అర్థం. వ్యాధి పూర్తి నిర్ధారణ కోసం ఓరల్ గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్ (ఓజీటీటీ) చేయించాలి. ఇందులో ఏమీ తినకుండా ఒకసారి, మొదట 100 గ్రా. గ్లూకోజ్ తాగించి గంట తర్వాత ఒకసారీ, రెండు గంటల తర్వాత మరోసారీ, మూడు గంటల తర్వాత ఇంకోసారీ... ఇలా నాలుగుసార్లు రక్తపరీక్ష చేస్తారు. ఈ కొలతలు 95, 180, 155, 140 కంటే ఎక్కువగా ఉంటే షుగర్ ఉన్నట్లుగా నిర్ధారణ చేస్తారు.

పుట్టిన బిడ్డకు

గర్భంలో ఉన్న శిశువుకి, తల్లి మాయ (ప్లాసెంటా) నుంచి గ్లూకోజ్ ఎక్కువగా అందుతుంటుంది. బిడ్డ పుట్టగానే తల్లి నుంచి వచ్చే చక్కెర అకస్మాత్తుగా ఆగిపోవడంతో బిడ్డలో చక్కెర మోతాదులు హఠాత్తుగా పడిపోతాయి. ఫలితంగా బిడ్డ కండరాలలో శక్తి అకస్మాత్తుగా తగ్గిపోవడం, చిన్నారి చల్లబడిపోవడం, ఊపిరితీసుకోవడంలో ఇబ్బందులు, ఫిట్స్ రావడం, సకాలంలో గమనించకపోతే బిడ్డ మృతిచెందే అవకాశాలెక్కువ. • కొన్నిసార్లు నెలలు నిండకుండా అయ్యే కాన్పు వల్ల బిడ్డకి ఊపిరితిత్తులు సరిగా అభివృద్ధి చెందకపోవడం, దాంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురుకావచ్చు. ఇలాంటి పిల్లల్లో క్యాల్షియమ్, మెగ్నీషియం వంటివి తక్కువ మోతాదులో ఉండటం వల్ల కండరాలు బలహీనత రావచ్చు • ఇలాంటి పిల్లలకు కామెర్లు వచ్చే అవకాశాలెక్కువ • బిడ్డ గుండె గోడలు అవసరమైనదానికంటే ఎక్కువగా పెరగవచ్చు. (కార్డియోమయోపతి) • బిడ్డ పెద్దయ్యాక స్థూలకాయం, టైప్–2 డయాబెటిస్ వచ్చే అవకాశాలెక్కువ. డయాబెటిస్ లేని గర్భవతితో పోలిస్తే... ఈ సమస్య ఉన్న గర్భిణికి రకరకాల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం 2–5 శాతం ఎక్కువ.

డయాబెటిస్ ఉన్నప్పుడు వచ్చే సమస్యలివి...

తల్లిలో...

• **గర్భస్రావాలు :** ముందునుంచే డయాబెటిస్ ఉన్నవారిలో, చక్కెర అదుపులో లేనివాళ్లలో అబార్షన్లు అయ్యే అవకాశాలెక్కువ.

• **హైబీపీ :** డయాబెటిస్ ఉన్న గర్భిణుల్లో సాధారణ గర్భిణుల కంటే హైబీపీకి అవకాశాలు ఎక్కువ. ఒక్కోసారి నెలలు నిండక ముందే కాన్పు చేయాల్సి రావచ్చు.

• గర్భిణుల్లో చక్కెర ఎక్కువగా ఉండటం వల్ల, ఉమ్మనీరు ఎక్కువగా ఊరుతుంది. ఉమ్మనీరు అధికంగా ఉండటం వల్ల పొట్ట పెద్దగా కనిపిస్తూ, తల్లికి ఆయాసంగా ఉండటం, నెలలు నిండకముందే ఉమ్మనీరు పోవడం, నెలలు నిండకముందే కాన్పు అయ్యే ప్రమాదాలు ఉండవచ్చు • వీళ్లలో మూత్రాశయ ఇన్ఫెక్షన్స్, యోనిలో ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలెక్కువ • గర్భిణులూ ఎక్కువ బరువుండటం, అలాగే కడుపులో బిడ్డకూడా అధిక బరువు ఉండటం వల్ల ఆపరేషన్ ద్వారా కాన్పు చేయాల్సి రావచ్చు • ప్రీ–జెస్టేషనల్ డయాబెటిస్ ఉన్నవారిలో కొన్నిసార్లు చక్కెర మరీ అధికం అయిపోయి కీటో ఎసిడోసిస్ అనే కండిషన్‌కు వెళ్లవచ్చు • కొంతమందిలో డయాబెటిస్ కోసం తీసుకునే మందుల మోతాదు ఎక్కువై, చక్కెర మరీ తగ్గడం వల్ల కళ్లు తిరిగి పడిపోవచ్చు • రక్తంలో చక్కెర ఎక్కువగా ఉండటం వల్ల రక్తనాళాల్లో రక్తసరఫరా సరిగా జరగకపోవడంతో కళ్లు, మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉండవచ్చు.

గర్భంలోని శిశువుకి...

• **అవయవ లోపాలు :** గర్భధారణలోని మొదటి మూడు నెలల్లో (ఫస్ట్ ట్రైమిస్టర్‌లో) తల్లిలో చక్కెర ఎక్కువగా ఉండటం, చక్కెర మోతాదులు అదుపులో లేనప్పుడు అవి గర్భంలోని పిండంలోకి ప్రవేశించి, శిశువులో అవయవలోపాలు (ముఖ్యంగా వెన్నుపూస, గుండెకు సంబంధించినవి) కలిగించే ముప్పు.

• **బిడ్డ సైజు విషయంలో అనర్థాలు...** తల్లిలో ఎక్కువగా ఉండే ఆ గ్లూకోజ్ మోతాదులు మాయ (ప్లాసెంటా) ద్వారా బిడ్డకు చేరుతాయి. దాంతో బిడ్డలో ఇన్సులిన్ ఉత్పత్తి పెరుగుతుంది. బిడ్డ రక్తంలో గ్లూకోజ్ మోతాదులు పెరగడం వల్ల బిడ్డ నార్మల్ కంటే పెద్దగా పెరుగుతుంది. దీనివల్ల పుట్టబోయే చిన్నారులు నార్మల్ కంటే పెద్దగా, ఎక్కువ బరువుతో నీరుపట్టినట్లుగా, ఉబ్బినట్లుగా కనిపిస్తాయి. తల్లికీ ప్రసవం కష్టమయ్యే అవకాశాలెక్కువ.

• **గర్భంలో చనిపోవడం :** బిడ్డ మరీ పెద్దగా ఉండటం వల్ల కొన్నిసార్లు ఎనిమిది, తొమ్మిది నెలల్లో బిడ్డకు సరిపడ ఆక్సిజన్ అందక కడుపులోనే చనిపోయే అవకాశం.

జాగ్రత్తలు / చికిత్సలు

• డయాబెటిస్ ఉందని నిర్ధారణ అయిన తర్వాత గర్భిణులు తమ గైనకాలజిస్ట్, ఫిజీషియన్ లేదా డయాబెటాలజిస్ట్, న్యూట్రిషనిస్ట్ వంటి నిపుణుల పర్యవేక్షణలో వారు చెబుతున్న జాగ్రత్తలు పాటిస్తూ, తగిన చికిత్సలు తీసుకుంటూ ఉండాలి.

• తల్లి రక్తంలో చక్కెరను తరచూ గమనించుకుంటూ / పరీక్షిస్తూ ఉండాలి.

• శిశువు ఎదుగుదలను నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలి.

• డాక్టర్లు సూచించిన విధంగా సరైన సమయంలో ప్రసవం చేయించాలి.

• బిడ్డ పుట్టాక... చిన్నారిని కొద్ది రోజులపాటు పిల్లల డాక్టర్ (పీడియాట్రీషన్) పర్యవేక్షణలో జాగ్రత్తగా సంరక్షిస్తూ ఉండాలి.

మరికొన్ని వైద్య పరీక్షలు

గర్భిణికి వ్యాధి నిర్ధారణ జరిగాక, షుగర్ మోతాదులను బట్టి వారానికోసారి లేదా రెండు వారాలకొకసారి, తినకుండా ఒకసారి, భోజనం చేశాక, రెండు గంటల తర్వాత మరోసారి రక్తపరీక్ష చేయిస్తూ ఉండాలి. ఇందులో మొదటిది 105 ఎండీడీఎల్. కంటే తక్కువగానూ, రెండోది 120 ఎంజీడీఎల్ కంటే తక్కువగానూ ఉందేమో చూసుకుంటూ ఉండాలి. అలా ఉండేలా డాక్టర్లు ప్లాన్ చేస్తారు.

• **మూత్రపరీక్ష :** గర్భిణుల్లో సాధారణంగా కిడ్నీ పనితీరులో మార్పు వల్ల మూత్రంలో చక్కెర పోతూ ఉంటుంది. దీన్నిబట్టి డయాబెటిస్ ఉందని నిర్ధారణకు రావడం సరికాదు. ఇది చాలా సాధారణం. ఇంకా ఈ పరీక్షలో ఇన్ఫెక్షన్ ఏమైనా ఉన్నా, ప్రోటీన్లు ఏమైనా పోతున్నాయేమో తెలుసుకొని, ఆ సమస్యలకు చికిత్స అందించాల్సి రావచ్చు.

• హెచ్‌బీఏ1సీ: ఈ పరీక్ష ద్వారా మూడు నెలల సగటు చక్కెర మోతాదులు తెలుస్తాయి. దీంతో గత మూడు నెలల వ్యవధిలో చక్కెర నియంత్రణలో ఉన్నదీ, లేనిదీ తెలుస్తుంది.

డాక్టర్ శ్రీనిత్య పున్నంరాజు
సీనియర్ కన్సల్టెంట్ ఆబ్‌స్టెట్రీషియన్ అండ్ గైనకాలజిస్ట్







గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం

గర్భిణుల రక్తంలో చక్కెర మోతాదులు కొద్దిగానే ఎక్కువ ఉంటే, డాక్టర్ సూచనలకు అనుగుణంగా ఆహారంలో మార్పులు చేసుకుని షుగర్ నియంత్రణలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహార నియమాలతో చక్కెర మోతాదులు నియంత్రణలోకి రాకపోయినా లేదా షుగర్ మరీ ఎక్కువగా ఉన్నా... మందులు, లేదా ఇన్సులిన్ ద్వారా చికిత్స అందించాలి. డయాబెటిస్ ఉన్నప్పుడు... గర్భిణుల బరువును బట్టి, వారు చేసే పనిని బట్టి, వారి రక్తంలోని షుగర్ మోతాదులను బట్టి ఎన్ని క్యాలరీల ఆహారం, ఎలా తీసుకోవాలనే విషయాలను వారి ఫిజీషియన్ లేదా న్యూట్రిషనిస్ట్ నిర్ణయిస్తారు. వీరు ఆహారాన్ని తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి.

చక్కెర మోతాదులు తక్కువగానూ, కొవ్వు తక్కువగానూ, పీచు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకుంటూ ఉండాలి. అంటే అన్నం తక్కువగా తింటూ కూరలు ఎక్కువగా తీసుకోవాలి. వీలైనంతవరకు చక్కెర, తేనె, బెల్లం, స్వీట్స్, బేకరీ ఫుడ్, అరటిపండు, సపోటా, సీతాఫలం, మామిడిపండు, పనస, నెయ్యి, డ్రైఫ్రూట్స్, నూనె వస్తువులు వంటి వాటికి దూరంగా ఉండటం మంచిది. మిగతా పండ్లను కూడా జ్యూస్‌గా కంటే పండ్ల రూపంలోనే కొరికి తింటుండటం మంచిది. ఒకవేళ జ్యూస్ రూపంలో తీసుకున్నా, అందులో చక్కెర కలుపుకోకుండా తాగడం మేలు.

వ్యాయామాలు : గర్భిణులు అంతగా శ్రమ కలిగించని, నడక వంటి చిన్న చిన్న వ్యాయామాలు చేస్తుండటం వల్ల కండరాలు గ్లూకోజ్‌ను ఉపయోగించుకొని రక్తంలో చక్కెరను తగ్గిస్తాయి. దాంతో చక్కెర కారణంగా కనిపించే దుష్పరిణామాలు తగ్గుతాయి.

ఇన్సులిన్ ఉపయోగం ఎప్పుడంటే... ఆహార నియమాలు, వ్యాయామాలతో రక్తంలో చక్కెర మోతాదులు నియంత్రణలోకి రాకపోతే ఇన్సులిన్ ద్వారా చికిత్స ఇవ్వాల్సి రావచ్చు. ఇది ఇంజెక్షన్ ద్వారా చర్మం కిందనుండే కొవ్వు పొరల్లో ఇవ్వాల్సి ఉంటుంది. ఇందువల్ల ఇన్సులిన్ నేరుగా రక్తంలో కలిసి వృథా అయిపోకుండా, మెల్లమెల్లగా రక్తంలో కలుస్తూ, అందులోని చక్కెర మోతాదులను ఓ క్రమపద్ధతిలో నియంత్రిస్తుంది. ఈ ఇన్సులిన్ ఎంత మోతాదులో, ఎన్నిసార్లు ఇవ్వాలన్నది వైద్యనిపుణులు నిర్ధారణ చేస్తారు.

మెట్‌ఫార్మిన్ మాత్రలు : ఇటీవలి కొన్ని పరిశోధనలలో ఇన్సులిన్ ఇంజెక్షన్స్ బదులు మెట్‌ఫార్మిన్ మాత్రలు గర్భిణుల్లో సురక్షితంగా వాడవచ్చని తేలింది.





కాన్పు సమయం

కాన్పు ఎప్పుడు, ఎలా చేయాలి అనే అంశాలను... డయాబెటిస్ ఎంత నియంత్రణలో ఉంది, తల్లిలో, బిడ్డలో ఏవైనా అనర్థాలు కనిపిస్తున్నాయా లాంటి అనేక అంశాల ఆధారంగా డాక్టర్లు నిర్ణయిస్తారు. చక్కెర నియంత్రణలోకి రాకపోయినా, గర్భధారణను కొనసాగించడం వల్ల తల్లికీ, బిడ్డకూ ఏమైనా సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నప్పుడు ముందుగానే కాన్పు చేయాల్సి రావచ్చు

• సాధారణ కాన్పుకి ప్రయత్నం చేసేటప్పుడు, నొప్పుల వల్ల తల్లిలోని షుగర్ మోతాదులో హెచ్చుతగ్గులు వస్తుంటాయి. వీటిని జాగ్రత్తగా గమనించుకుంటూ, అవసరాన్ని బట్టి ఇన్సులిన్ మోతాదును సెలైన్లలో వేసి ఎక్కిస్తూ కాన్పును జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ చేయాల్సి ఉంటుంది. లేకపోతే గర్భంలోని శిశువుకు అపాయం కలిగే అవకాశాలక్కువ.

సిజేరియన్ : సాధారణ కాన్పు ప్రయత్నం విఫలమైనా, కడుపులోని బిడ్డ సైజు 3.5 కేజీల నుంచి 4 కేజీల కంటే ఎక్కువ బరువున్నా, డయాబెటిస్ నియంత్రణలో లేకపోయినా, బీపీ బాగా పెరుగుతూ ఉన్నా, మునుపు గర్భధారణలో శిశువు చనిపోయిన సందర్భాలున్నా... తల్లికి సిజేరియన్ చేయాల్సి రావచ్చు.

కాన్పు తర్వాత

• పుట్టిన వెంటనే బిడ్డ పరిస్థితిని బట్టి తల్లి పాలను పట్టించాలి. కడుపులో ఉన్నంత కాలం బిడ్డకు చక్కెర ఎక్కువగా అందుతూ, కాన్పు అయిన వెంటనే షుగర్ లెవెల్స్ అకస్మాత్తుగా తగ్గే అవకాశం ఉంటుంది కాబట్టి అది పరీక్ష చేసి, అవసరమైతే బయటి పాలు లేదా సెలైన్ ద్వారా గ్లూకోజ్ ఎక్కించాలి • కాన్పు తర్వాత నాలుగు గంటలకు ఒకసారి చొప్పున 48 గంటల పాటు షుగర్ మోతాదులను పరీక్షిస్తూ ఉండాలి • తల్లికి జెస్టేషనల్ డయాబెటిస్ ఉన్నప్పుడు కాన్పు తర్వాత చక్కెర మోతాదులు మామూలు స్థాయికి వస్తాయి. కాబట్టి తల్లికి ఇన్సులిన్ ఇవ్వాల్సిన అవసరం లేదు. అయితే తల్లికి ప్రీ–జెస్టేషనల్ డయాబెటిస్ ఉంటే కాన్పుకు ముందు తల్లికి ఉన్న స్థాయికి చక్కెరపాళ్లు వస్తాయి. ఈ అంశాలను బట్టి ఇన్సులిన్‌ను గర్భం రాకముందు ఇస్తున్న మోతాదుల్లో ఇవ్వాల్సి ఉంటుంది • గర్భిణిగా ఉన్నప్పుడు మధుమేహం (జెస్టేషనల్ డయాబెటిస్) వచ్చిన మహిళలు... ఆ టైమ్‌లో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం లేదా బరువు ఎక్కువగా పెరగడం వంటివి జరిగితే... వాళ్లకు 15–20 ఏళ్ల తర్వాత మళ్లీ డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది. మిగతా మహిళలతో పోలిస్తే వాళ్లలో ఈ ముప్పు ఎక్కువ.

గర్భం రాకముందే తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

డయాబెటిస్ ఉన్నవాళ్లు తమకు గర్భం రాకముందే... అంటే ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకునే సమయంలోనే తాము వాడే మందుల్ని డాక్టర్ సలహా మేరకు మార్చుకోవాల్సి ఉంటుంది. ముందునుంచే తమ రక్తనాళాలు, కళ్లు, మూత్రపిండాల పరిస్థితి ఎలా ఉందో వైద్యపరీక్షల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. ఉండాల్సిన దానికంటే తాము ఎక్కువ బరువు ఉంటే... తమ ఎత్తుకు తగినట్లుగా బరువు తగ్గడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైతే బరువు తగ్గాకే ప్రెగ్నెన్సీ కోసం ప్రయత్నించడం మంచిది. ఒకసారి ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్న తర్వాత గర్భధారణకు మూడు నెలల ముందునుంచే ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడటం వల్ల బిడ్డలో స్పైనా బైఫిడా వంటి వెన్నెముక సరిగా పెరగకపోవడం లాంటి చాలా రకాల వైకల్యాలను నివారించవచ్చు.

బిడ్డ కోసం స్కానింగ్ పరీక్షలు...

• గర్భం దాల్చిన రెండు మూడు నెలల్లో స్కానింగ్ చేయించడం వల్ల గర్భంలో ఒకే శిశువు ఉందా, లేదా రెండు ఉన్నాయా, పిండానికి ఎన్ని వారాల వయసు, గుండె స్పందనలు సరిగా ఉన్నాయా వంటి విషయాలు తెలుస్తాయి • ఐదు, ఆరు నెలల మధ్యన టిఫా స్కానింగ్, అవసరముంటే ఫీటల్ టూ–డీ ఎకో పరీక్ష చేయించడం వల్ల బిడ్డలో అవయవలోపాలు ఉన్నదీ, లేనిదీ తెలుస్తుంది • ఏడో నెల తర్వాత అవసరాన్ని బట్టి నెలనెలా చేయిస్తే, బిడ్డ సైజు మరీ ఎక్కువగా ఉందా, ఉమ్మనీరు మరీ ఎక్కువగా ఉందా... వంటి విషయాలు తెలుస్తాయి • ప్రీ–జెస్టేషనల్ డయాబెటిస్ ఉండే వాళ్లు మధ్యమధ్య కంటి రెటీనా పరీక్ష, కిడ్నీ పనితీరు (క్రియాటినిన్) పరీక్ష చేయించుకోవాలి.

బిజినెస్ రీల్

462 మోసపూరిత కంపెనీలు!

కార్పొరేట్ శాఖ, ఎస్ఎఫ్ఐవో దర్యాప్తు



న్యూఢిల్లీ: అనుమానాస్పద మోసపూరిత లావాదేవీల విషయమై కార్పొరేట్ శాఖ రీజినల్ డైరెక్టర్లు 462 కంపెనీలపై దర్యాప్తు చేపట్టినట్టు ఆ శాఖ మంత్రి హర్ష్ మల్హోత్రా తెలిపారు. గత ఐదు ఆర్థిక సంవత్సరాల కాలంలో కార్పొరేట్ మోసాలు పెరిగాయనడానికి ఎలాంటి ఆధారాల్లేవన్నారు. కార్పొరేట్ శాఖ రీజినల్ డైరెక్టర్లు (ఆర్‌డీలు), సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐవో) అధికారులు సాధారణంగా మోసపూరిత లావాదేవీలపై దర్యాప్తు నిర్వహిస్తుంటారు. ఆర్‌డీలు, ఎస్ఎఫ్ఐవో అధికారులు దర్యాప్తు నిర్వహిస్తున్న కేసుల వివరాలను కార్పొరేట్ శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా లోక్‌సభకు లిఖిత పూర్వకంగా అందించారు. 2019-2020 మధ్య ఐదు ఆర్థిక సంవత్సరాల్లో కార్పొరేట్ శాఖ ఆర్‌డీలు 462 కంపెనీలపై దర్యాప్తు నిర్వహించగా, ఎస్ఎఫ్ఐవో 72 కేసుల దర్యాప్తును చేపట్టినట్టు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ శాఖ ఆర్‌డీలు 51 కంపెనీలపై దర్యాప్తు నిర్వహించినట్టు చెప్పారు.

బీఎస్ఈ నుంచి కొత్త ఇండెక్సులు

బీఎస్ఈ 1000సహా మరో 4 సూచీలు



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్చేంజీ దిగ్గజం బీఎస్ఈ అనుబంధ సంస్థ ఏషియా ఇండెక్స్ తాజాగా ఐదు ఇండెక్సులను ప్రవేశపెట్టింది. విస్తారిత మార్కెట్ నుంచి బీఎస్ఈ 1000సహా మరో 4 ఇండెక్సులను రూపొందించింది. తద్వారా మార్కెట్‌లో పెట్టుబడులకు మరిన్ని అవకాశాలకు తెరతీసింది. దీంతో దేశీయంగా తదుపరి తరం వర్ధమాన కంపెనీల వృద్ధి అవకాశాలను అంది పుచ్చుకునేందుకు మార్కెట్ పార్టిసిపెంట్లకు వీలు కల్పించనుంది. బీఎస్ఈ 1000తోపాటు బీఎస్ఈ నెక్ట్స్ 500, బీఎస్ఈ 250 మైక్రోక్యాప్, బీఎస్ఈ నెక్ట్స్ 250 మైక్రోక్యాప్, బీఎస్ఈ 1000 మల్టీక్యాప్‌తో కొత్త ఇండెక్సులకు తెరతీసింది. మొత్తం దేశీ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)లో 93 శాతాన్ని బీఎస్ఈ 1000 ఇండెక్స్ ప్రతిఫలించనున్నట్లు ఏషియా ఇండెక్స్ ఎండీ, సీఈవో అశుతోష్ సింగ్ పేర్కొన్నారు. వెరసి మొత్తం స్టాక్ మార్కెట్‌కు ప్రామాణిక ఇండెక్స్‌గా ఇది నిలవనున్నట్లు తెలియజేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-2-2025

విశాఖ	465-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	440-00
వరంగల్	442-00
రిటైల్ ధర	5.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
KOTAKBANK	1,962.85	1.74
BHARTIARTL	1,694.50	1.06
BRITANNIA	4,915.00	0.91
TATACONSUM	1,027.00	0.57
HCLTECH	1,734.00	0.48

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,210.00	-4.48
POWERGRID	269.05	-3.27
TATASTEEL	133.91	-3.18
TITAN	3,325.00	-2.91
ONGC	242.85	-2.43

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,323
ఎన్ఎస్ఈ	74,020
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,26,317
ఎఫ్ఐఐ	- 2,464
డీఐఐ	+ 1,516

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	72.53 (రాత్రి 11.30కు)	$ 71.00 (క్రితం ముగింపు)
బ్రెంట్	75.91 (రాత్రి 11.30కు)	$ 74.66 (క్రితం ముగింపు)

● యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య కూటమితో డీల్

రూ.43.5 లక్షల కోట్ల పెట్టుబడులు

- గణనీయ సంఖ్యలో ఉపాధి అవకాశాలు
- ఏడాది చివరికి అమల్లోకి ఒప్పందం
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య కూటమి (ఈఎఫ్‌టీఏ)తో చేసుకున్న వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టిపా)తో.. భారత్ 400-500 బిలియన్ డాలర్ల (సుమారు రూ.43.5 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించగలదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈఎఫ్‌టీఏ సభ్య దేశాల నుంచి 15 ఏళ్ల కాలంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు హామీ ఇచ్చినప్పటికీ, వాస్తవంగా నాలుగైదు రెట్లు అధికంగా ఎఫ్‌డీఐ దేశంలోకి వస్తుందని తాను భావిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఒప్పందం ఈ ఏడాది చివరి నాటికి అమల్లోకి వస్తుందని చెప్పారు. ఈఎఫ్‌టీఏలో ఐస్‌ల్యాండ్, లీచెన్‌స్టెయిన్, నార్వే, స్విట్జర్లాండ్ సభ్య దేశాలుగా ఉండడం గమనార్హం. ఈఎఫ్‌టీఏ కోసం ఉద్దేశించిన ప్రత్యేకమైన డెస్క్‌ను ప్రారంభించిన సందర్భంగా మంత్రి గోయల్ మాట్లాడారు. ఈ ఒప్పందం కింద స్విస్ వాచీలు, చాక్లెట్లు, కట్, పాలిష్డ్ వజ్రాల దిగుమతులను చాలా తక్కువ రేటుపై లేదా సున్నా రేటుపై భారత్ అనుమతించాల్సి ఉంటుంది. ఇందుకు ప్రతిఫలంగా సభ్య దేశాలు హామీ ఇచ్చినట్టుగా చేసే 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో 10 లక్షల మందికి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నది అంచనా. నాలుగు సభ్య దేశాలు ఒప్పందం ఆమోదం దిశగా కీలకమైన చర్యలు తీసుకున్నాయంటూ, ఈ ఏడాది చివరికి అమల్లోకి రావచ్చని మంత్రి గోయల్ చెప్పారు.

పారిశ్రామిక స్మార్ట్ సిటీల్లో కేటాయింపులు

ఎన్ఐసీడీసీ అభివృద్ధి చేస్తున్న 20 పారిశ్రామిక స్మార్ట్ పట్టణాల్లో ప్రత్యేకంగా కొంత భాగాన్ని ఈఎఫ్‌టీఏ సభ్య దేశాలకు ఆఫర్ చేయనున్నట్టు మంత్రి గోయల్ చెప్పారు. లేదా బడ్జెట్‌లో ప్రకటించినట్టు 100 హబ్ అండ్ స్పోక్ పారిశ్రామిక కేంద్రాలను కేటాయించనున్నట్టు తెలిపారు. ఈ దిశగా ఆయా దేశాలతో చర్చలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈఎఫ్‌టీఏ-భారత్ మధ్య 2023-24లో 24 బిలియన్ డాలర్ల (రూ.2.08 లక్షల కోట్లు) ద్వైపాక్షిక వాణిజ్యం నమోదైనట్టు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా స్విట్జర్లాండ్ మొదటి స్థానంలో ఉంటే, ఆ తర్వాతి స్థానంలో నార్వే ఉంది. 2000-2004 మధ్య స్విట్జర్లాండ్ నుంచి భారత్‌కు 10.72 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐ వచ్చింది.

హెక్సావేర్ టెక్ @ రూ. 674-708


- ఈ నెల 12-14 మధ్య ఐపీవో
- రూ. 8,750 కోట్లు సమీకరణ



జైపూర్: ఐటీ సర్వీసుల కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 674-708 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ రేపు(12న) ప్రారంభమై 14న ముగియనుంది. దీనిలో భాగంగా ప్రమోటర్ సంస్థ సీఏ మ్యాగ్నమ్ హోల్డింగ్స్ రూ. 8,750 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. పీఈ దిగ్గజం కార్లయిల్ గ్రూప్ సంస్థ ఇది. కాగా.. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 21 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు నేడు(11న) షేర్లను ఆఫర్ చేయనుంది. ఏఐసహా.. డిజిటల్, టెక్నాలజీ సేవలందిస్తున్న హెక్సావేర్ విభిన్న కస్టమర్లను కలిగి ఉంది. ప్రధానంగా ఫైనాన్షియల్ సర్వీసులు, హెల్త్‌కేర్ అండ్ ఇన్సూరెన్స్, మ్యాన్యుఫాక్చరింగ్, బ్యాంకింగ్ అండ్ ట్రావెల్ తదితర విభాగాలలో సర్వీసులు అందిస్తోంది.

క్వాలిటీ పవర్ @ రూ. 401-425

- ఈ నెల 14-18 మధ్య ఐపీవో
- రూ. 859 కోట్లు సమీకరణ



జైపూర్: విద్యుత్ ప్రసార పరికరాలు, సంబంధిత టెక్నాలజీ కంపెనీ క్వాలిటీ పవర్ పబ్లిక్ ఇష్యూకి రూ. 401-425 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 14న ప్రారంభమై 18న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 225 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 634 కోట్ల విలువైన(1.5 కోట్ల షేర్లు) ప్రమోటర్ చిత్రా పాండ్యన్ విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా కంపెనీ రూ. 859 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. కంపెనీలో ప్రస్తుతం పాండ్యన్ కుటుంబం 100 శాతం వాటా కలిగి ఉంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 13న షేర్లను ఆఫర్ చేయనుంది. ఈక్విటీ జారీ నిధులతో మెహ్రు ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ ఇంజినీర్స్‌ను సొంతం చేసుకోనుంది. అంతేకాకుండా ప్లాంటు, మెషీనరీ కొనుగోలుకి సైతం నిధులను వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా అధిక వోల్టేజీ(హెచ్‌వీడీసీ) పరికరాల తయారీ, ఫ్లెక్సిబుల్ ఏసీ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్ నెట్‌వర్క్స్ అందిస్తోంది. గతేడాది(2023-24) రూ. 300 కోట్ల ఆదాయం, రూ. 55 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది.

రిలయన్స్ స్పోర్ట్స్ డ్రింక్ 'స్పిన్నర్'

రూ. 10కే అందుబాటులోకి


ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పోర్ట్స్ డ్రింక్స్ మార్కెట్‌లో అందుబాటులోకొచ్చింది. మాజీ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్‌తో కలిసి 'స్పిన్నర్' పేరిట కొత్త బ్రాండ్‌ను ఆవిష్కరించింది. లెమన్, ఆరెంజ్, నైట్రో బ్లూ ఫ్లేవర్లలో లభించే ఈ స్పోర్ట్స్ డ్రింక్‌ను రూ.10లకే అందించనున్నట్లు రిలయన్స్ తెలిపింది. దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందేందుకు ప్రధాన ఐపీఎల్ జట్లు లక్నో సూపర్ జెయింట్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్ లతో కలిసి ఒప్పందం



కుదుర్చుకుంది. ముత్తయ్య మురళీధరన్ మాట్లాడుతూ ''స్పిన్నర్ డ్రింక్‌ను తీసుకురావడం కోసం రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్‌తో జట్టు కట్టడం ఆనందం ఉంది. ఒక అథ్లెట్‌గా నాకు హైడ్రేషన్ విలువ తెలుసు. ఆడేటప్పుడు, ప్రయాణాల్లోనూ శక్తి కోల్పోతుంటాము. అలాంటి సమయాల్లో 'స్పిన్నర్ స్పోర్ట్స్ డ్రింక్' ఉపయోగకరంగా ఉంటుంది'' అన్నారు.

ఐఐహెచ్‌ఎల్-రిలయన్స్ క్యాపిటల్ డీల్‌కు 26 వరకు వ్యవధి

ముంబై: రుణ సంక్షోభంలో చిక్కుకున్న రిలయన్స్ క్యాపిటల్ కొనుగోలు డీల్‌ను ఫిబ్రవరి 26 నాటికి పూర్తి చేసేందుకు ఇండస్ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్‌ఎల్)కు అవకాశం లభించింది. ఇందుకు సంబంధించి కం



పెనీ దాఖలు చేసిన అభ్యర్థనకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోద ముద్ర వేసింది. తదుపరి పరిష్కార ప్రణాళిక అమలు, రిలయన్స్ క్యాపిటల్ పగ్గాలను ఐఐహెచ్‌ఎల్‌కు బదలాయించే ప్రక్రియపై విచారణను 26కి వాయిదా వేసింది. అప్పటికల్లా వనరులను సమీకరణ పూర్తవుతుందని ఎన్‌సీఎల్‌టీకి ఐఐహెచ్‌ఎల్ నివేదించింది. నిధుల సమీకరణలో భాగంగా కంపెనీ ఇప్పటికే దాదాపు 20 పత్రాల సెట్‌ను అడ్మినిస్ట్రేటర్‌కు అందించింది. గవర్నెన్స్ లోపాలు, రుణాల చెల్లింపుల్లో డిఫాల్ట్ కావడంతో రిలయన్స్ క్యాపిటల్ బోర్డును 2021 నవంబర్‌లో రిజర్వ్ బ్యాంక్ రద్దు చేసింది. కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ కింద కంపెనీని దక్కించుకునేందుకు రూ. 9,650 కోట్లతో ఐఐహెచ్‌ఎల్ సమర్పించిన బిడ్‌కు 2023 ఏప్రిల్‌లో ఆమోదం లభించింది.

కాలాహరిధాన్ ట్రెండ్జ్‌పై సెబీ కొరడా

- ప్రమోటర్లు, కంపెనీపై నిషేధం
- షోకాజ్ నోటీసులు జారీ



న్యూఢిల్లీ: ఇటీవలే ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫాం ఎమర్జ్‌లో లిస్టయిన కాలాహరిధాన్ ట్రెండ్జ్‌పై (కేటీఎల్) నిబంధనల ఉల్లంఘనకు గాను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ కొరడా ఝుళిపించింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు స్టాక్ మార్కెట్ కార్యకలాపాల్లో పాల్గొనరాదంటూ కంపెనీతో పాటు ప్రమోటర్లు - నిరంజన్ డి అగర్వాల్, ఆదిత్య ఎన్ అగర్వాల్, సునీత నిరంజన్ అగర్వాల్‌ను ఆదేశించింది. అలాగే వారిని పూర్తిగా నిషేధిస్తూ ఎందుకు ఉత్తర్వులు ఇవ్వరాదో వివరణ ఇవ్వాలంటూ షోకాజ్ నోటీసు జారీ చేసింది. క్రెడిట్ కార్డు బకాయిలను చెల్లించడంలో విఫలమైందంటూ కేటీఎల్‌పై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి ఫిర్యాదు రావడంతో సెబీ ఈ వ్యవహారంపై విచారణ జరిపింది. 2024 ఫిబ్రవరి నుంచి డిసెంబర్ 15 వరకు సాగిన విచారణలో.. ఈ డిఫాల్ట్ వివరాలను కంపెనీ వెల్లడించకుండా డిస్‌క్లోజర్ నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించింది. పైగా బంగ్లాదేశ్‌లోని ఒక కల్పిత సంస్థ నుంచి భారీ ఆర్డరు వచ్చిందని, పెద్ద ఎత్తున కార్యకలాపాలు విస్తరిస్తున్నామని తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసిందని మధ్యంతర ఉత్తర్వుల్లో సెబీ పేర్కొంది. దీన్ని కప్పి పుచ్చేందుకు ఈమెయిల్స్ సృష్టించినట్లు వివరించింది. మొత్తం మీద కంపెనీపై సానుకూల అభిప్రాయాన్ని ఏర్పరచి, షేర్లలో ట్రేడ్ చేసేలా ఇన్వెస్టర్లను పురిగొల్పి, షేర్లను అమ్ముకుని లబ్ధి పొందేందుకే కేటీఎల్ నిర్దిష్ట కార్పొరేట్ ప్రకటనలను చేసినట్లు సెబీ పేర్కొంది. పైపెచ్చు రైట్స్ ఇష్యూ ద్వారా మరో విడత నిధుల సమీకరణ కూడా కంపెనీ తలపెట్టింది. ఈ నేపథ్యంలోనే సెబీ తాజా ఆదేశాలు జారీ చేసింది.

గతేడాది ఫిబ్రవరి 23న ఇష్యూ ధర రూ. 45తో పోలిస్తే రూ. 47.15 వద్ద లిస్టయిన కేటీఎల్ షేరు ప్రస్తుతం రూ. 20 స్థాయిలో ఉంది.

బాటా ఇండియా పనితీరు స్థిరం

క్యూ3లో రూ.59 కోట్ల లాభం



న్యూఢిల్లీ: ప్రముఖ పాదరక్షల సంస్థ 'బాటా' డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నిలకడైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు ఒక శాతానికి పైగా పెరిగి రూ.59 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం ఒక శాతానికి పైగా వృద్ధితో రూ.919 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.58 కోట్లుగా ఉంది. అధిక అమ్మకాల పరంగా వృద్ధిని చూసినట్టు, ఎబిట్డా మార్జిన్ 141 బేసిస్ పాయింట్లు బలపడినట్టు బాటా ఇండియా తెలిపింది. డిసెంబర్ క్వార్టర్‌లో ఒక ఫ్యాక్టరీలో సిబ్బందికి స్వచ్ఛంద పదవీ విరమణ కోసం రూ.10.8 కోట్ల అసాధారణ ఏకీకృత వ్యయాలు ఎదుర్కోవాల్సి వచ్చినట్టు తెలిపింది. డిమాండ్‌లో స్తబ్దత నెలకొన్నప్పటికీ తాము అమ్మకాలు పెంచుకోగలిగినట్టు బాటా ఇండియా ఎండీ, సీఈవో గుంజన్ షా తెలిపారు. ''హష్ పప్పీస్ బ్రాండ్‌పై ప్రీమియం ఉత్పత్తుల అమ్మకాల పరంగా డబులు డిజిట్ వృద్ధిని చూశాం. దీంతో మార్జిన్లను స్థిరంగా కాపాడుకోగలిగాం. ఈ కామర్స్ ఛానల్ అమ్మకాల పరంగా మంచి వృద్ధిని చూశాం''అని వివరించారు. డిమాండ్ కోలుకోవడం పట్ల ఆశావహంగా ఉన్నట్టు చెప్పారు. బీఎస్ఈలో బాటా ఇండియా షేరు అర శాతం లాభపడి రూ.1,340 వద్ద స్థిరపడింది.

గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌కు నష్టాలు

చైనా చౌక దిగుమతులతో ప్రతికూల ప్రభావం



న్యూఢిల్లీ: చైనా నుంచి చౌకగా వచ్చి పడుతున్న దిగుమతులతో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో (క్యూ3) రూ.169 కోట్ల స్టాండలోన్ నష్టాన్ని మూటగట్టుకుంది. సెల్యులోజిక్ ఫైబర్స్, కెమికల్స్ పరంగా ప్రతికూలతల పరిస్థితులు ప్రభావం చూపించాయి. అలాగే, బిర్లా ఓపస్ బ్రాండ్‌పై పెయింట్స్ వ్యాపారం కోసం కంపెనీ రూ.10వేల కోట్ల మూలధన వ్యయాలు చేస్తోంది. ఈ ప్రభావంతో మొత్తం వ్యయాలు పెరిగిపోయాయి. స్టాండలోన్ ఆదాయం అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 27 శాతం వృద్ధితో రూ.8,120 కోట్లుగా నమోదైంది. ఎబిట్డా 42 శాతం క్షీణించి రూ.372 కోట్లకు పరిమితమైంది. కన్సాలిడేటెడ్‌గా (అనుబంధ సంస్థలు కలిసి) చూస్తే డిసెంబర్ త్రైమాసికానికి రూ.899 కోట్ల లాభాన్ని గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 41 శాతం తగ్గింది. కన్సాలిడేటెడ్ ఆదాయం మాత్రం 9 శాతం వృద్ధితో రూ.34,793 కోట్లకు చేరింది. అల్ట్రాటెక్ సిమెంట్ ఫలితాలు కూడా ఇందులో కలిసి ఉన్నాయి. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్ షేరు అర శాతం నష్టపోయి రూ.2473 వద్ద ముగిసింది.

● క్యూ3 ఫలితాలు

అపోలో హాస్పిటల్స్ లాభం రూ. 372 కోట్లు

52 శాతం అప్ ● రూ. 9 డివిడెండ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ రూ. 372 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది గత క్యూ3తో పోలిస్తే సుమారు 52 శాతం అధికం. ఇక సమీక్షాకాలంలో ఆదాయం రూ. 4,851 కోట్ల నుంచి రూ. 5,521 కోట్లకు పెరిగింది. 2025 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఒక్కో షేరుకు రూ. 9 చొప్పున డివిడెండు ప్రకటించింది. దీనికి ఫిబ్రవరి 15 రికార్డు తేదీగా ఉంటుంది. 2026 ఆర్థిక సంవత్సరంతో ప్రారంభించి 3-4 ఏళ్ల వ్యవధిలో, 11 ప్రాంతాల్లో 3,512 పడకలను కొత్తగా జత చేసుకునే పనులు వేగంగా జరుగుతున్నాయని సంస్థ తెలిపింది. దేశవ్యాప్తంగా కోట్ల మందికి నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు తాము చేస్తున్న కృషికి, ఆర్థిక ఫలితాలు నిదర్శనమని సంస్థ చైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి తెలిపారు. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యంతో, ఏఐ-ఆధారిత వైద్యసేవల్లో సమూల మార్పులు తెచ్చే ప్రక్రియ వేగవంతం అవుతోందని రెడ్డి చెప్పారు. లీసెస్టర్ యూనివర్సిటీతో జత కట్టడం వల్ల తదుపరి తరం వైద్య నిపుణులు అసాధారణమైన నైపుణ్యాల్లో శిక్షణ పొందేందుకు అవకాశం లభిస్తోందని వివరించారు.

సోమవారం బీఎస్ఈలో కంపెనీ షేరు స్వల్పంగా క్షీణించి రూ. 6,766 వద్ద క్లోజయ్యింది.

ఐషర్ లాభం అప్

ఆదాయం రూ. 4,973 కోట్లు



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం ఐషర్ మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 18 శాతం ఎగసి రూ. 1,171 కోట్లకు చేరింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 996 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,179 కోట్ల నుంచి రూ. 4,973 కోట్లకు బలపడింది. కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ 2,69,039 వాహనాలను విక్రయించింది. గతేడాది క్యూ3లో నమోదైన 2,29,214 యూనిట్లతో పోలిస్తే 17 శాతం వృద్ధి. వాణిజ్య వాహన విభాగం మందగమనంలో ఉన్నప్పటికీ వీఈసీవీ ఆదాయం రూ. 5,483 కోట్ల నుంచి రూ. 5,801 కోట్లకు ఎగసినట్లు కంపెనీ వెల్లడించింది. కాగా.. ఫ్లయింగ్ ఫ్లీ బ్రాండుతో ఎలక్ట్రిక్ మొబిలిటీ విభాగంలోకి ప్రవేశించినట్లు కంపెనీ ఎండీ సిద్ధార్థ లాల్ పేర్కొన్నారు. మరోవైపు చైర్మన్ ఎస్.శాండిల్య పదవీ విరమణ నేపథ్యంలో బోర్డు సిద్ధార్థ లాల్‌ను ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు కంపెనీ పేర్కొంది. అంతేకాకుండా వినోద్ అగర్వాల్‌ను వైస్‌చైర్మన్(నాన్‌ఎగ్జిక్యూటివ్)గా, బి.గోవిందరాజన్ కొత్త ఎండీగా బోర్డు నియమించింది. దీంతో అగర్వాల్ వీఈసీవీ ఎండీ, సీఈవోగా సైతం కొనసాగనున్నారు. ఈ బాటలో గోవిందరాజన్ రాయల్ ఎన్‌ఫీల్డ్ సీఈవో బాధ్యతలనూ నిర్వహించనున్నట్లు కంపెనీ తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో ఐషర్ షేరు బీఎస్ఈలో 1.2 శాతం నీరసించి రూ. 5,311 వద్ద ముగిసింది.

నాల్కో లాభం దూకుడు

రూ. 4 మధ్యంతర డివిడెండ్



కోల్‌కతా: పీఎస్‌యూ దిగ్గజం నేషనల్ అల్యూమినియం కంపెనీ(నాల్కో) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 3రెట్లు ఎగసి రూ. 1,566 కోట్లను అధిగమించింది. ఇతర ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 471 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 4 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈ నెల 14 రికార్డ్ డేట్. కాగా.. మొత్తం ఆదాయం సైతం 40 శాతం జంప్‌చేసి రూ. 4,761 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 3,398 కోట్ల టర్నోవర్ నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో నాల్కో షేరు బీఎస్ఈలో 5 శాతం పతనమై రూ. 191 వద్ద ముగిసింది.

వరుణ్ బెవరేజెస్ లాభం జూమ్

క్యూ4లో రూ. 196 కోట్లు



న్యూఢిల్లీ: గ్లోబల్ దిగ్గజం పెప్సీకో ఫ్రాంచైజీ బాట్లర్.. వరుణ్ బెవరేజెస్ గత ఆర్థిక సంవత్సరం(2024) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 196 కోట్లకు చేరింది. అమ్మకాల పరిమాణం పుంజుకోవడం, మెరుగైన మార్జిన్లు ఇందుకు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2023) ఇదే కాలంలో రూ. 144 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,731 కోట్ల నుంచి రూ. 3,818 కోట్లకు ఎగసింది. నిర్వహణ లాభం(ఇబిటా) 39 శాతం జంప్‌చేసి రూ. 580 కోట్లను తాకింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 3,862 కోట్ల నుంచి రూ. 3,607 కోట్లకు క్షీణించాయి. కంపెనీ క్యాలండర్ ఏడాదిని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. కాగా.. పూర్తి ఏడాది(2024)కి కన్సాలిడేటెడ్ నికర లాభం 25 శాతం ఎగసి రూ. 2,634 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం రూ. 16,321 కోట్ల నుంచి రూ. 20,481 కోట్లకు జంప్‌చేసింది.

ఫలితాల నేపథ్యంలో వరుణ్ బెవరేజెస్ షేరు బీఎస్ఈలో 1 శాతం క్షీణించి రూ. 549 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 561-533 మధ్య ఊగిసలాడింది.

యురేకా ఫోర్బ్స్ లాభం హైజంప్

క్యూ3లో రూ. 35 కోట్లు



న్యూఢిల్లీ: హైజీన్ ప్రొడక్టుల కంపెనీ యురేకా ఫోర్బ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 53 శాతం జంప్‌చేసి రూ. 35 కోట్లను అధిగమించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 23 కోట్లు మాత్రమే ఆర్జించింది. పీఈ దిగ్గజం యాడ్వెంట్ ఇంటర్నేషనల్ గ్రూప్ కంపెనీ మొత్తం ఆదాయం సైతం 11 శాతం ఎగసి రూ.598 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 539 కోట్ల టర్నోవర్ నమోదైంది. మొత్తం వ్యయాలు 8 శాతంపైగా పెరిగి రూ. 555 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో యురేకా ఫోర్బ్స్ షేరు బీఎస్ఈలో 1.4 శాతం లాభంతో రూ. 554 వద్ద ముగిసింది.

జిల్లెట్ డివిడెండ్ రూ. 65

క్యూ2 లాభం రూ. 126 కోట్లు



న్యూఢిల్లీ: షేవింగ్ ప్రొడక్టుల దిగ్గజం జిల్లెట్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. అక్టోబర్-డిసెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 21 శాతం జంప్‌చేసి రూ. 126 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 104 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 65 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కంపెనీ జులై-జూన్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే విషయం విదితమే. కాగా.. మొత్తం ఆదాయం రూ. 639 కోట్ల నుంచి రూ. 689 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 4 శాతం పెరిగి రూ. 528 కోట్లకు చేరాయి. కాగా.. మొత్తం టర్నోవర్ 7 శాతం వృద్ధితో రూ. 695 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో జిల్లెట్ షేరు బీఎస్ఈలో 0.75 శాతం క్షీణించి రూ. 8,853 వద్ద ముగిసింది.

శ్రీవల్లి రష్మిక ర్యాంక్‌లో పురోగతి



న్యూఢిల్లీ: మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ అమ్మాయి, భారత ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక తన ర్యాంక్‌ను మెరుగు పర్చుకుంది. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో రష్మిక 13 స్థానాలు ఎగబాకి 312వ ర్యాంక్‌లో నిలిచి భారత మూడో ర్యాంకర్‌గా కొనసాగుతోంది. గత వారం జరిగిన ముంబై ఓపెన్–125 టోర్నీలో రష్మిక క్వార్టర్ ఫైనల్ చేరుకోవడం ఆమె ర్యాంక్‌పై ప్రభావం చూపింది. మరోవైపు గతవారం భారత నంబర్‌వన్‌గా నిలిచిన తెలంగాణకే చెందిన మరో ప్లేయర్ సహజ యామలపల్లి 11 స్థానాలు పడిపోయి 302వ ర్యాంక్‌లో నిలిచింది. ముంబై ఓపెన్ టోర్నీలో సహజ తొలి రౌండ్‌లోనే ఓడిపోవడంతో ఆమె ర్యాంక్‌ను ప్రభావితం చేసింది. గుజరాత్‌కు చెందిన అంకిత రైనా మళ్లీ భారత నంబర్‌వన్ ర్యాంకర్‌గా నిలిచింది. అంకిత మూడు స్థానాలు మెరుగు పర్చుకొని 294వ ర్యాంక్‌లో నిలిచింది. ముంబై ఓపెన్‌లో సహజ ఓటమి కూడా అంకిత నంబర్‌వన్ కావడానికి దోహదపడింది.

దివ్యాంగ క్రికెటర్లను ప్రోత్సహిస్తాం

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు హామీ

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగుల ఇంటర్ జోనల్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌ను భారత జట్టు సభ్యుడు తిలక్ వర్మతో కలిసి హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ప్రారంభించారు. సోమవారం ఉప్పల్ స్టేడియంలో ప్రారంభమైన ఈ టోర్నీలో మొత్తం ఐదు జట్లు పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ... హెచ్‌సీఏ తరఫున దివ్యాంగ క్రికెటర్లను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. తాము మిగిలిన వారిలానే క్రికెట్ ఆడగలమని నిరూపించడానికి ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్క దివ్యాంగ క్రికెటర్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. దివ్యాంగ క్రికెటర్ల కోసం కూడా ఐపీఎల్ తరహాలో ఒక లీగ్‌ను నిర్వహించే ఆలోచనను చేయాలని డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఏసీహెచ్ అధ్యక్షుడు సురేందర్ అగర్వాల్, హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి జాన్ మనోజ్, మాజీ ఉపాధ్యక్షుడు మొయిజ్ పాల్గొన్నారు.


టోర్నీ ప్రారంభోత్సవంలో జాన్ మనోజ్, తిలక్ వర్మ, జగన్‌మోహన్ రావు

భారీ ఆధిక్యం దిశగా ముంబై


శార్దుల్


రహానే

- మెరిసిన సూర్య
- నడిపించిన రహానే
- రెండో ఇన్నింగ్స్‌లో 278/4
- శార్దుల్ సూపర్ స్పెల్
- హరియాణాతో రంజీ క్వార్టర్స్ పోరు

కోల్‌కతా: రంజీ ట్రోఫీలో సెమీఫైనల్ బెర్త్ లక్ష్యంగా ముంబై రెండో ఇన్నింగ్స్ సాగుతోంది. హరియాణాతో జరుగుతున్న రెండో క్వార్టర్ ఫైనల్లో ముంబై స్టార్లు అజింక్య రహానే (142 బంతుల్లో 88 బ్యాటింగ్; 10 ఫోర్లు), సూర్యకుమార్ యాదవ్ (86 బంతుల్లో 70; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివమ్ దూబే (41 బంతుల్లో 30 బ్యాటింగ్; 5 ఫోర్లు) రాణించారు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 67 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 278 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 14 పరుగులు కలుపుకొని ప్రస్తుతం 292 పరుగుల ఆధిక్యంలో ఉంది. కెప్టెన్ రహానే, హిట్టర్ దూబే క్రీజులో పాతుకొని పోవడంతో మంగళవారం నాలుగో రోజు తొలి సెషన్‌లో వేగంగా పరుగులు సాధించే అవకాశముంది. వీరిద్దరి తర్వాత షమ్స్ ములానీ, శార్దుల్ ఠాకూర్‌ల రూపంలో ముంబై జట్టులో బ్యాటింగ్ చేయగల ఆటగాళ్లున్నారు. దీంతో హరియాణా ముందు భారీ లక్ష్యం నిర్దేశించడం దాదాపు ఖాయం. సరిగ్గా 100 పరుగుల స్కోరు వద్ద సిద్ధేశ్ లాడ్ (43; 4 ఫోర్లు, 1 సిక్స్) నిష్క్రమించగా... సూర్యకుమార్ క్రీజులో వచ్చి వన్డేను తలపించే ఇన్నింగ్స్ ఆడాడు. రహానే, సూర్య జోడీ నాలుగో వికెట్‌కు 129 పరుగులు జోడించింది. ప్రత్యర్థి బౌలర్లలో అనూజ్ 2, సుమిత్, జయంత్ చెరో వికెట్ తీశారు.

శార్దుల్‌కు ఆరు వికెట్లు

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 263/5తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హరియాణాపై ముంబై సీమర్ శార్దుల్ ఠాకూర్ (6/58) నిప్పులు చెరిగాడు. క్రితం రోజు స్కోరుపైనే రోహిత్ (22; 2 ఫోర్లు), కాసేపటికి ఒకే ఓవర్లో జయంత్ యాదవ్ (13), అనూజ్ ఠక్రాల్ (12)లను అవుట్ చేసిన శార్దుల్ జట్టు స్కోరు 300 దాటాకా మళ్లీ టెయిలెండర్లు అన్షుల్ (6), అజిత్ చహల్ (0)లను వరుస బంతుల్లో ఎల్బీగా పంపి హరియాణా ఇన్నింగ్స్‌కు 301 పరుగుల వద్ద తెరదించాడు. శార్దుల్ అనూహ్య విజృంభణకు హరియాణా జట్టు కేవలం 38 పరుగుల వ్యవధిలోనే 5 వికెట్లను కోల్పోయింది. దీంతో హరియాణా... ముంబై తొలిఇన్నింగ్స్ స్కోరుకు 14 పరుగుల ముందే కుప్పకూలడంతో ఆధిక్యం సాధించలేకపోయింది.

పారస్ డోగ్రా అర్ధ సెంచరీ


పారస్

పుణే: తొలి క్వార్టర్ ఫైనల్లో కేరళపై జమ్మూకశ్మీర్‌కు మంచి ఆధిక్యం లభిస్తుందనుకుంటే సల్మాన్ నిజర్ (172 బంతుల్లో 112 నాటౌట్; 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీ కేరళను నిలబెట్టింది. ఓవర్‌నైట్ స్కోరు 200/9తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కేరళకు ఆలౌటే మిగిలింది. కానీ 49 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఆటను ఆరంభించిన సల్మాన్... చేతిలో ఉన్న ఒకే ఒక్క ఆఖరి వికెట్ బాసిల్ థంపి (35 బంతుల్లో 15; 2 ఫోర్లు)తో కలిసి పెద్ద పోరాటమే చేశాడు. కశ్మీర్ జట్టు ఆనందాన్ని ఆవిరి చేస్తూ అద్భుత సెంచరీ సాధించాడు. ఆఖరి వికెట్‌కు సల్మాన్, థంపి 81 పరుగులు జతచేయడంతో కేరళ 281 పరుగుల వద్ద ఆలౌటైంది. సల్మాన్ అజేయంగా నిలువగా, కేరళకు ఒక పరుగు ఆధిక్యం లభించింది. జమ్మూ తొలి ఇన్నింగ్స్‌లో 280 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కశ్మీర్ జట్టు ఆట నిలిచే సమయానికి 57 ఓవర్లలో 3 వికెట్లకు 180 పరుగులు సాధించింది. 78 పరుగులకు 3 టాపార్డర్ వికెట్లన్నీ కోల్పోయిన జమ్మూను కెప్టెన్ పారస్ డోగ్రా (148 బంతుల్లో 73 బ్యాటింగ్; 7 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధసెంచరీతో ఆదుకున్నాడు. కనయ్యా వధావన్ (80 బంతుల్లో 42 బ్యాటింగ్; 3 ఫోర్లు)తో కలిసి అభేద్యమైన నాలుగో వికెట్‌కు 102 పరుగులు జోడించాడు.

ఆదిత్యకు 5 వికెట్లు...


ఆదిత్య

నాగ్‌పూర్: తమిళనాడుతో జరుగుతున్న రెండో క్వార్టర్‌ఫైనల్లో విదర్భకు తొలి ఇన్నింగ్స్‌లో 128 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట నిలిచే సమయానికి 169/5 స్కోరు చేయడంతో విదర్భ ప్రస్తుతం 297 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ముందుగా... 159/6 ఓవర్‌నైట్ స్కోరుతో తొలిఇన్నింగ్స్ కొనసాగించిన తమిళనాడు 64.3 ఓవర్లలో 225 పరుగుల వద్ద ఆలౌటైంది. ప్రదోశ్ రంజన్ (73 బంతుల్లో 48; 4 ఫోర్లు) రాణించాడు. ఆదిత్య ఠాకరేకు 5 వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన విదర్భ జట్టు 61 పరుగులకే 3 వికెట్లను కోల్పోయింది. ఈ దశలో కరుణ్ నాయర్ (29; 2 ఫోర్లు, 1 సిక్స్), యశ్ రాథోడ్ (119 బంతుల్లో 55 బ్యాటింగ్; 5 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను కుదుటపరిచారు. కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (8) విఫలమవగా, హర్ష్ దూబే (29 బ్యాటింగ్; 1 ఫోర్, 2 సిక్స్‌లు), యశ్ అజేయమైన ఆరో వికెట్‌కు 55 పరుగులు జోడించారు. సాయి కిషోర్ 2 వికెట్లు తీశాడు.

జైమీత్, ఉర్విల్ సెంచరీలు


ఉర్విల్

రాజ్‌కోట్: జైమీత్ పటేల్ (171 బంతుల్లో 103; 11 ఫోర్లు), ఉర్విల్ పటేల్ (197 బంతుల్లో 140; 17 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీలతో కదం తొక్కడంతో గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగుల భారీస్కోరు చేసి ఆలౌటైంది. సౌరాష్ట్రతో జరుగుతున్న నాలుగో క్వార్టర్ ఫైనల్లో గుజరాత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 295 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 260/4తో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన గుజరాత్ జట్టులో జైమీత్ సెంచరీ చేసిన కాసేపటికే అవుటైనా... చింతన్ గాజా (39; 6 ఫోర్లు) అండతో ఉర్విల్ జట్టును నడిపించాడు. చింతన్‌తో ఆరో వికెట్‌కు 98 పరుగులు జోడించాడు. తర్వాత రవి బిష్ణోయ్ (50 బంతుల్లో 45; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో గుజరాత్ 500 మార్క్ దాటింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆడిన సౌరాష్ట్ర వికెట్ నష్టపోకుండా 33 పరుగులు చేసింది. హార్విక్ (18 బ్యాటింగ్), చిరాగ్ (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

ఐర్లాండ్ 'హ్యాట్రిక్' విజయం

జింబాబ్వేతో ఏకైక టెస్టులో 63 పరుగులతో గెలుపు



బులవాయో: ఎనిమిదేళ్ల క్రితం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నుంచి టెస్టు హోదా పొందిన ఐర్లాండ్ జట్టు ఆడిన తొలి ఏడు టెస్టుల్లో ఓడిపోయింది. గత ఏడాది మార్చిలో అఫ్గానిస్తాన్‌తో జరిగిన ఎనిమిదో టెస్టులో గెలిచి ఈ ఫార్మాట్‌లో తొలి విజయం నమోదు చేసుకుంది. అనంతరం జింబాబ్వేతో గత ఏడాది జూలైలో జరిగిన తొమ్మిదో టెస్టులో నెగ్గి వరుసగా రెండో గెలుపు రుచి చూసింది. తాజాగా జింబాబ్వేతోనే జరిగిన టెస్టులో ఐర్లాండ్ 63 పరుగుల తేడాతో నెగ్గి ఈ ఫార్మాట్‌లో 'హ్యాట్రిక్' సాధించింది. ఐర్లాండ్ నిర్దేశించిన 292 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన జింబాబ్వే రెండో ఇన్నింగ్స్‌లో 86.3 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. వెస్లీ మదెవెరె (195 బంతుల్లో 84; 8 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. బ్రియాన్ బెనెట్ (72 బంతుల్లో 45; 3 ఫోర్లు), జొనాథన్ క్యాంప్‌బెల్ (62 బంతుల్లో 33; 3 ఫోర్లు) రాణించినా ఫలితం లేకపోయింది. ఐర్లాండ్ బౌలర్లలో మాథ్యూ హాంఫ్రెస్ 57 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టి జింబాబ్వేను దెబ్బ తీశాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఐర్లాండ్ ప్లేయర్ ఆండీ మెక్‌బ్రైన్ (90 పరుగులు; 4 వికెట్లు)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

సంక్షిప్త స్కోర్లు

ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్: 260; జింబాబ్వే తొలి ఇన్నింగ్స్: 267; ఐర్లాండ్ రెండో ఇన్నింగ్స్: 298; జింబాబ్వే రెండో ఇన్నింగ్స్: 228 ఆలౌట్ (86.3 ఓవర్లలో).

నేటి నుంచి ఆసియా మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ టోర్నీ

క్వింగ్దావో (చైనా): ఆంధ్రప్రదేశ్ స్టార్ షట్లర్ పీవీ సింధు లేని భారత జట్టు ఆసియా మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోరాటానికి సిద్ధమైంది. నేటి నుంచి ఈ టోర్నీ ప్రారంభం అవుతున్నప్పటికీ... గ్రూప్ 'డి'లో ఉన్న భారత్ తమ తొలి మ్యాచ్‌ను బుధవారం ఆడనుంది. మకావుతో శుభారంభమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రెండేళ్ల క్రితం దుబాయ్‌లో జరిగిన ఈ మిక్స్‌డ్ చాంపియన్‌షిప్‌లో టీమిండియా కాంస్యం గెలిచింది. ఈ పతక సాధనలో సింధు కీలకపాత్ర పోషించింది. ఈసారి మరింత మెరుగైన ప్రదర్శనతో పతకం రంగు మార్చాలనుకున్న భారత బృందానికి సింధు వైదొలగడం అశనిపాతమైంది. దీంతో ఆమె స్థానంలో ప్రపంచ 29వ ర్యాంకర్ మాళవిక మహిళల సింగిల్స్‌లో ఆడనుంది. మకావుతో గట్టెక్కినా గురువారం గట్టి ప్రత్యర్థి దక్షిణ కొరియా ఎదురవుతుంది. ఈ నేపథ్యంలో ఈ గ్రూపు నుంచి భారత్ నాకౌట్‌కు చేరడం కాస్త క్లిష్టంగా మారింది.

'రాకెట్' పిలిచింది...

రిటైర్మెంట్ వీడి మళ్లీ బరిలోకి దిగిన భారత స్క్వాష్ స్టార్



న్యూఢిల్లీ: దాదాపు ఏడాది క్రితం...భారత స్క్వాష్ స్టార్ సౌరవ్ ఘోషాల్ ఆటకు గుడ్‌బై చెప్పాడు. ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) టూర్‌లో భాగంగా చికాగోలో జరిగిన విండీ సిటీ ఓపెన్‌లో ఆడిన తర్వాత అతను రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే 38 ఏళ్ల ఘోషాల్ ఇప్పుడు మళ్లీ ఆటగాడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాడు. రిటైర్మెంట్ వదిలి మైదానంలో పోటీ పడాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో గత నెలలో పీఎస్‌ఏలో సభ్యుడిగా తన పేరు నమోదు చేసుకున్న ఘోషాల్ చాలెంజర్ ఈవెంట్ ఆక్టేన్ సిడ్నీ క్లాసిక్‌లో బరిలోకి దిగుతున్నాడు. 'టోర్నీల కోసం చేసే ప్రయాణాలు, ఆ పోటీని నేను మళ్లీ ఆస్వాదించాలనుకుంటున్నా. గత 20 ఏళ్లలో ఆటగాడిగా ఉన్నప్పుడు గడిపిన సమయంతో పోలిస్తే ఈ సారి 10 నెలల్లోనే అంతకంటే ఎక్కువ సమయంలో ఇంట్లో ఉన్నాను. ఈ సమయంలో భార్యాపిల్లలతో సంతోషంగా గడిపా. కనీసం మరో మూడేళ్లు ఆడగల సత్తా నాలో ఉందని భావిస్తున్నా. విరామ సమయంలో నా కెరీర్‌ను విశ్లేషించేందుకు ప్రయత్నించా. కాబట్టే ఇంకా ఆడాలనిపించింది. ఈ రెండో భాగం మొదటిదానికంటే బాగుంటుందని ఆశిస్తున్నా' అని ఘోషాల్ చెప్పాడు.

భారత్ తరఫున ఆడాలని...

ఈ సారి పీఎస్‌ఏ టోర్నీలకంటే అంతర్జాతీయ ఈవెంట్లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమే తన మొదటి ప్రాధాన్యతగా అతను పెట్టుకున్నాడు. పురుషుల విభాగంలో భారత అత్యుత్తమ స్క్వాష్ ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న ఘోషాల్... సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో కలిపి కామన్వెల్త్ క్రీడల్లో 1 రజతం, 2 కాంస్యాలు, ఆసియా క్రీడల్లో 2 స్వర్ణాలు, 2 రజతాలు, 5 కాంస్యాలు గెలుచుకున్నాడు. భారత్ తరఫున దాదాపు అన్ని ఘనతలు అతని పేరిటే ఉన్నాయి. 'పీఎస్‌ఏ నుంచి రిటైర్ అయిన తర్వాత కూడా భారత్ తరఫున మాత్రం ఆడుతూ ఉండాలని భావించా. అయితే పీఎస్‌ఏలో కొనసాగితేనే జాతీయ జట్టు తరఫున ఎంపికయ్యే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని అర్థమైంది. భారత్ తరఫున ఇంకా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తాననే నమ్మకం ఉంది. కొన్ని నెలల క్రితమే నా శిక్షణను మళ్లీ ప్రారంభించా. ఆరంభంలో ఫిట్‌నెస్‌పై మాత్రమే దృష్టి పెట్టి ఆపై సాధన కొనసాగించా. దాదాపు ఆరు నెలల మైదానానికి దూరమై మళ్లీ ఆడటం అంత సులువు కాదు' అని ఘోషాల్ పేర్కొన్నాడు.

ఒలింపిక్స్ ఆశలు...

2026 కామన్వెల్త్ క్రీడల నుంచి స్క్వాష్‌ను తప్పించినా... 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో స్క్వాష్‌ను చేర్చడం కూడా ఘోషాల్ భవిష్యత్తుపై ఆశలు పెంచింది. 'కామన్వెల్త్ క్రీడల్లో మేం స్వర్ణం సాధించలేదు. ఈ సారి గెలవవచ్చని ఆశించా. అయితే ఇప్పుడు ఆ అవకాశం లేదు కాబట్టి ఏమీ చేయలేం. ఆసియా క్రీడల్లో మాత్రం రాణించే అవకాశం ఉంది. ఒలింపిక్స్‌లో పతకం అనేది నిజంగానే పెద్ద లక్ష్యం. నేను మన దేశం తరఫున ఆడిన పతకం గెలవగలిగితే అంతకన్నా గొప్ప విషయం ఉండదు. కానీ దానికి దాదాపు మూడేళ్లకు పైగా సమయం ఉంది. ఇప్పటికిప్పుడైతే అంత దూరం ఆలోచించడం లేదు' అని ఘోషాల్ అభిప్రాయపడ్డాడు. ఆక్టేన్ సిడ్నీ క్లాసిక్ టోర్నీలో తాను విజయం సాధిస్తానని అతను విశ్వాసం వ్యక్తం చేశాడు.



ఐఎల్‌టి20 విజేత దుబాయ్ క్యాపిటల్స్

ఫైనల్లో వైపర్స్‌పై విజయం ● జీఎంఆర్ గ్రూప్ ఖాతాలో తొలి టైటిల్

దుబాయ్: ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం అయిన జీఎంఆర్ గ్రూప్ ఎట్టకేలకు మరో క్రికెట్ లీగ్‌లో టైటిల్ బోణీ చేసింది. ఇంటర్నేషనల్ లీగ్ టి20 (ఐఎల్‌టి20) మూడో సీజన్‌లో ఆ గ్రూప్‌నకు చెందిన దుబాయ్ క్యాపిటల్స్ జట్టు విజేతగా నిలిచింది. గత సీజన్‌లో ఫైనల్లో ఓడిన జట్టు ఈసారి చివరి అడ్డంకిని అధిగమించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో క్యాపిటల్స్ 4 వికెట్ల తేడాతో డిజర్ట్ వైపర్స్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వైపర్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. మ్యాక్స్ హోల్డెన్ (51 బంతుల్లో 76; 12 ఫోర్లు), కెప్టెన్ స్యామ్ కరన్ (33 బంతుల్లో 62 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. అనంతరం ఢిల్లీ 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 191 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రావ్‌మన్ పావెల్ (38 బంతుల్లో 63; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), షై హోప్ (39 బంతుల్లో 43; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడగా, చివర్లో సికందర్ రజా (12 బంతుల్లో 34 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగిపోయాడు. 19 బంతుల్లో 38 పరుగులు చేయాల్సిన స్థితిలో క్రీజ్‌లోకి వచ్చిన రజా ఒక్కడే 34 పరుగులు బాదడం విశేషం. టోర్నీలో 387 పరుగులు చేసి 7 వికెట్లు తీసిన స్యామ్ కరన్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచాడు. ఐఎల్‌టి20 తొలి సీజన్ 2023లో గల్ఫ్ జెయింట్స్, 2024లో ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్ విజేతలుగా నిలిచాయి.

రోహిత్, కోహ్లిలు ఎదురుదాడికి దిగితే...

'చాంపియన్స్' భారత్‌దే: మురళీధరన్

ముంబై: భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి రాణిస్తే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ భారత్ వశమవుతుందని శ్రీలంక దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ అన్నాడు. రిలయన్స్ శీతల పానియాల ప్రచార కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన అతను మీడియాతో ముచ్చటించాడు. 'ఇద్దరు అసాధారణ ఆటగాళ్లు. ప్రపంచ శ్రేణి బ్యాటర్లు. ఎప్పుడైనా సరే క్లాస్ శాశ్వతం. ఫామ్ లేకపోవడం తాత్కాలికం. తప్పకుండా రోహిత్‌లాగే కోహ్లి కూడా ఫామ్‌లోకి వస్తాడు. ఇద్దరు ప్రత్యర్థి బౌలింగ్‌పై ఎదురుదాడికి దిగితే టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ గెలుచుకుంటుంది' అని మురళీ వివరించాడు. రోహిత్ బృందం ఆల్‌రౌండ్ వనరులతో పటిష్టంగా కనబడుతోందన్నాడు. భారత్ సహా పాక్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లలో నాణ్యమైన స్పిన్ బౌలర్లు ఉన్నారని, పాకిస్తాన్‌లోని పిచ్‌లు స్పిన్నర్లకు బాగా అనుకూలిస్తాయని చెప్పాడు.

అసమానతల అంతు చూస్తారా?

ద్రవాలు, వాయువుల్లో అసమతుల్యత వంటి హఠాత్పరిణామాలపై మరింత లోతైన అధ్యయనం

తొలిసారిగా క్వాంటమ్ కంప్యూటింగ్ విధానంతో టర్బులెన్స్ గుట్టు విప్పే సాహసం చేస్తున్న శాస్త్రవేత్తలు



విశ్వంలో ఇప్పటికీ ఎన్నో రహస్యాలు. శతాబ్దాల కాలంలో భిన్న దేశాల విభిన్న రంగాల దిగ్గజ శాస్త్రవేత్తలు ఇప్పటికి ఎన్నో సిద్ధాంతాలను రూపొందించారు. న్యూటన్ సిద్ధాంతాలు, ఐన్‌స్టీన్ సిద్ధాంతాలు ఇలా భౌతిక, రసాయన శాస్త్రాలు, గతిశక్తి, స్థితిశక్తి ఇలా ఎన్నో రకాల అంశాలకు సంబంధించి ఎన్నో పరిశోధనలు నేటి ఆధునిక ప్రపంచ అవసరాలను తీరుస్తున్నాయి. అయితే ఇప్పటికీ భౌతిక, రసాయన, ఇంజనీరింగ్ శాస్త్రవేత్తలకు కొరుకుడు పడని టర్బులెన్స్ దృగ్విషయం అన్ని రంగాలకు పెద్ద సమస్యగా మారింది. ద్రవ ప్రవాహాల్లో హఠాత్తుగా సంభవించే అసాధారణ హెచ్చుతగ్గులు, సముద్ర జలాల కదలికల్లో అనూహ్య మార్పులు, రసాయనాల్లో ఊహించని ప్రతిచర్యలు, రక్తప్రవాహాల్లో హెచ్చుతగ్గులు వంటివి ఎందుకు సంభవిస్తాయో ఇప్పటికీ ఎవరికీ తెలీదు. టర్బులెన్స్ సమస్య చాలా రంగాలకు పెద్ద గుదిబండగా తయారైంది. గాల్లో ఎగిరే విమానాలు ఒక్కసారిగా టర్బులెన్స్‌కు గురై హఠాత్తుగా కిందకు పడిపోవడమో ఒక్కసారిగా బ్యాలెన్స్ తప్పడమో జరుగుతున్నాయి. వెదర్ శాటిలైట్లతో ఖచ్చితత్వంతో వాతావరణ పరిస్థితులపై ప్రభుత్వాలను వాతావరణ కేంద్రాలు హెచ్చరిస్తున్నా ఇప్పటికీ కొన్ని చోట్ల ఊహించని తుపాన్లు అప్పటికప్పుడు ఏర్పడి భారీ ఆస్తి, ప్రాణ నష్టానికి కారణమవుతున్నాయి. సువిశాల విశ్వంలో నక్షత్రాల్లోని అయనీకరణ చెందిన అత్యంత వేడి వాయువుల్లో హఠాత్తుగా ఎందుకు మార్పులు జరుగుతున్నాయో ఖగోళ శాస్త్రవేత్తలు కూడా చెప్పలేకపోతున్నారు. మానవ కణంలో అణువుల మధ్య బంధంలోనూ హఠాత్తుగా మార్పులను చూస్తున్నాం. చివరకు కృత్రిమ గుండె పనితీరును రక్తప్రవాహంలోని టర్బులెన్స్ ప్రభావితం చేస్తూ అత్యంత సమర్థవంతమైన ఆర్టిఫీషియల్ హార్ట్ ఆవిష్కరణ అవసరమని గుర్తుచేస్తోంది. ఇలాంటి దృగ్విషయాలకు ఏకైక కారణమైన టర్బులెన్స్‌పై మరింత అవగాహనే లక్ష్యంగా శాస్త్రవేత్తలు నడుం బిగించారు. ఈ టర్బులెన్స్‌పై స్పష్టమైన అవగాహన ఉంటే సైన్స్, ఇంజనీరింగ్ పరిశ్రమల్లో మరింత మెరుగైన డిజైన్‌తో విమానాలు, కార్లు, ప్రొపెల్లర్లు, కృత్రిమ గుండెలు తయారుచేయడానికి, అత్యంత ఖచ్చితత్వంతో వర్షాలు, వాతావరణం, పర్యావరణ సంబంధ హెచ్చరికలు చేయడానికి వీలు చిక్కుతుంది.

వేగంగా చర్యలు జరిపి..

ప్రపంచంలో ఎక్కడ ఏ ద్రవాల్లో ఈ టర్బులెన్స్ తలెత్తుతుందో తెల్సుకోవాలంటే ఆ ద్రవాల పనితీరు, కదలికలపై నిరంతర నిఘా అవసరం. వాటి చర్యను వేగవంతం చేస్తేనే టర్బులెన్స్ ఎప్పుడెప్పుడు వస్తుందో గుర్తించగలం. అందుకోసం ద్రవాల్లో రెండు సార్లు టర్బులెన్స్ సంభవిస్తే ఈ రెండు టర్బులెన్స్ మధ్య కాలంలో జరిగే మార్పులను అత్యంత ఖచ్చితత్వంతో రికార్డ్ చేయాల్సి ఉంటుంది. ఇంతకాలం సంప్రదాయక పద్ధతిలో మాత్రమే డేటాను రికార్డ్‌చేసేవాళ్లు. ఇకపై తొలిసారిగా అత్యంత అధునాతన క్వాంటమ్ కంప్యూటర్స్ విధానంలో అత్యంత శక్తివంతమైన సూపర్ కంప్యూటర్లలో ఈ డేటాను నమోదుచేసి విశ్లేషించనున్నారు. దీంతో సెకన్ కంటే కొన్ని కోట్ల రెట్లు తక్కువ కాలంలోనూ జరిగే మార్పులను నమోదు చేసి విశ్లేషించడం సాధ్యమవుతుంది. సంబంధిత పరిశోధన వివరాలు జనవరి 29వ తేదీన ప్రఖ్యాత సైన్స్ అడ్వాన్సెస్ జర్నల్, ఫిజికల్ రివ్యూ రీసెర్చ్ జర్నల్‌లలో ప్రచురితమయ్యాయి. ''సంప్రదాయక విధానాల్లో ప్రయోగాలు చేస్తే ఎప్పుడూ ఒక్కటే ఫలితం వస్తోంది. ఈసారి సంభావ్యత సిద్ధాంతాన్ని ఈ క్వాంటమ్ కంప్యూటింగ్ అల్గారిథమ్‌ను వాడి మరింత మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. రెండు విభిన్న రసాయన మిశ్రమాలను సిమ్యులేట్ చేసి వాటిల్లో సంభవించే టర్బులెన్స్‌లను నమోదుచేయదలిచాం. సాధారణ కంప్యూటర్స్‌లో 0, 1 అనే బిట్స్ మాత్రమే వాడతారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో క్వాంటమ్ బిట్(క్యాబిట్స్) వాడతాం. దీంతో ఒకేసారి ఒకేసమయంలో వేర్వేరు చోట్ల జరిగే మార్పులను క్యాబిట్స్ నమోదుచేస్తాయి''అని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రవేత్త నిక్ గోరియనోవ్ చెప్పారు. కొత్త విధానంతో కంప్యూటేషన్ అత్యంత వేగవంతంగా జరుగుతుంది. ఇది మా పరిశోధనకు ఎంతో దోహదపడుతుంది''అని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో పోస్ట్ డాక్టోరల్ పరిశోధకుడు జేమ్స్ బీటెల్ చెప్పారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

రాష్ట్రపతి భవన్‌కు పెళ్లి కళ

- 12న రాష్ట్రపతి ముర్ము పీఎస్‌వో పూనమ్ గుప్తా వివాహం
- తొలిసారి వివాహానికి అనుమతి ఇచ్చిన రాష్ట్రపతి ముర్ము
- ముస్తాబైన భవన సముదాయం, భారీగా భద్రతా ఏర్పాట్లు



సాక్షి, న్యూఢిల్లీ: చరిత్రలోనే మొట్టమొదటి సారిగా రాష్ట్రపతి భవన్‌లో పెళ్లి వేడుక జరగనుంది. ఈ నెల 12న జరిగే ఈ వేడుక కోసం యంత్రాంగం రాష్ట్రపతి భవన్‌ను ముస్తాబు చేసింది. భారీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఇంతకీ పెళ్లెవరిది? అని కదా మీ సందేహం! రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కుటుంబసభ్యులదీ, సంబంధీకులదీ మాత్రం కాదు! రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వ్యక్తిగత భద్రతా అధికారి(పీఎస్‌వో) పూనమ్ గుప్తా పెళ్లి. పూనమ్ వినతి మేరకు ఈ వేడుకకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అనుమతి నిచ్చారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అవ్‌నీశ్ కుమార్, పూనమ్ గుప్తా ఓ ఇంటి వారు కానున్నారు. రాష్ట్రపతి ముర్ము సారథ్యంలో అంగరంగ వైభవంగా జరిగే ఈ కార్యక్రమానికి హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు.

జీవితాంతం గుర్తుండిపోయే కానుక

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన పూనమ్ గుప్తా 2018 యూపీఎస్సీ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఆర్‌ఎఫ్) విభాగంలో 81వ ర్యాంకు సాధించారు. సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా బిహార్‌లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో పని చేశారు. ఆ తర్వాత ఆమె రాష్ట్రపతి పీఎస్‌ఓగా నియమితులయ్యారు. జమ్మూకశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా ఉన్న అవ్‌నీశ్ కుమార్‌తో ఈమె వివాహం నిశ్చయమైంది. కుటుంబ సభ్యులు మధ్యప్రదేశ్ లేదా కశ్మీర్‌లో వివాహం చేయాలని యోచిస్తుండగా కాబోయే వధువు పూనమ్ మాత్రం సరికొత్తగా ఆలోచించారు. 'మీకు పీఎస్‌ఓగా పనిచేయడం నాకెంతో ఆనందంగా ఉంది. దీనిని నేను ఒక బాధ్యతగా స్వీకరిస్తున్నాను. నాకు వివాహం నిశ్చయమైంది. రాష్ట్రపతి భవన్‌లో పెళ్లి చేసుకోవాలనేది నా చిరకాల కోరిక. నా కోరికను మీరు తీరుస్తారని ప్రార్థిస్తున్నాను'అంటూ రెండు నెలల క్రితం రాష్ట్రపతికి లేఖ రాశారు. ఈ లేఖపై రాష్ట్రపతి ముర్ము సానుకూలంగా స్పందించారు. 'డియర్, పూనమ్ గుప్తా(పీఎస్‌వో) మీకు వివాహ శుభాకాంక్షలు. విధుల్లో మీరు కనబరుస్తున్న శ్రద్ధ, బాధ్యత నాకెంతో నచ్చాయి. మీ వివాహ వేడుకను రాష్ట్రపతి భవన్‌లో జరిపేందుకు అనుమతి ఇస్తున్నాను'అంటూ బదులిచ్చారు. దీంతో పూనమ్‌గుప్తాకు రాష్ట్రపతి జీవితాంతం గుర్తుండిపోయే కానుకను ఇచ్చారంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

ముస్తాబవుతున్న రాష్ట్రపతి కార్యాలయం

పూనమ్ అవ్‌నీశ్‌ల పెళ్లి వేడుకకు రాష్ట్రపతి కార్యాలయంలోని మదర్ థెరిస్సా క్రౌన్‌కాంప్లెక్స్ సిద్ధమైంది. భారతీయ, సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా వేదికను అలంకరించారు. వేడుక అతి కొద్ది మంది సమక్షంలో జరగనుంది. వధూవరుల కుటుంబ సభ్యులు వంద మంది, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, సీఆర్‌పీఎఫ్ డీజీ, ఢిల్లీ పోలీస్ ఉన్నత అధికారులు హాజరు కానున్నట్లు తెలిసింది.

చారిత్రక కట్టడం

రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న రాష్ట్రపతి భవన్ చరిత్రల సమ్మేళనంతో కూడిన ఓ కళాఖండమే. మొత్తం నాలుగు అంతస్తుల్లో 340 గదులు ఉంటాయి. గదులు, కారిడార్లు, కోర్టులు, గ్యాలరీలు, సెలూన్లు, వంటశాలలు, ప్రింటింగ్ ప్రెస్, థియేటర్‌లు... ఇలా వీటన్నింటినీ కాలినడకన తిరుగుతూ చూడాలంటే కనీసం మూడు గంటల సమయం పడుతుంది. ఇటలీలోని క్విరినల్ ప్యాలస్ తర్వాత ప్రపంచంలో రెండో అతి పెద్ద దేశాధినేత భవనంగా రాష్ట్రపతి భవనం నిలుస్తుంది. ప్రఖ్యాత అమృత ఉద్యాన్, ఒక మ్యూజియం, గణతంత్ర, అశోక మండపాలు, రాగి ముఖం గల గోపురాలు ఉన్నాయి. ఈ భవన్‌లో మొట్టమొదటిగా 1948లో స్వతంత్ర భారతదేశపు మొదటి గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి నివసించారు. రాష్ట్రపతి భవన్‌లో నివసించిన మొదటి భారతీయుడిగా చరిత్రలో నిలిచారు.

టెక్నాలజీ ఊబిలో భారతీయులు

- 3 శాతం మంది మాత్రమే టెక్నాలజీని అదుపాజ్ఞల్లో పెట్టుకున్నారు
- దీంతో మానసిక సమస్యల వలయంలో చిక్కుకుంటున్న వైనం
- సర్వేలో వెల్లడైన విస్మయకర విషయాలు



భారతీయులు ఉదయం లేచించి మొదలు రాత్రి పడుకునేదాకా ఎలక్ట్రానిక్ డివైజ్‌లతో గడుపుతున్నారు. డెస్కటాప్‌తో మమేకమవుతారు. డెస్కటాప్ నుంచి తల పక్కకు తిప్పితే నేరుగా ల్యాప్‌టాప్‌లో తలదూర్చేస్తారు. ఒకవేళ ల్యాప్‌టాప్ పక్కన బెడితే స్మార్ట్‌ఫోన్ లేదంటే ట్యాబ్ లేదంటే ఇంకో డివైజ్‌కు దాసోహం అవుతున్నారు. దీంతో ఎన్నో సమస్యలు. తక్కువ నిజాలు, ఎక్కువ అబద్ధాలతో కూడిన సమాచారాన్ని మాత్రమే నమ్మడం, సోషల్‌మీడియాలో ప్రతికూల వార్తలనే ఎక్కువగా ఫాలో అవడం, ఫోన్ రింగ్ కాకపోయినా వచ్చినట్లు, మెసేజ్ రాకపోయినా వచ్చినట్లు భావించడం, అతి డివైజ్‌ల వాడకంతో సాధారణ విషయగ్రహణ సామర్థ్యం సన్నగిల్లడం, ఒంటరిగా ఉంటేనే బాగుందని అనిపించడం, వెంటనే స్పందించే గుణం కోల్పోవడం, అతి ఉద్రేకం లేదంటే నిస్సత్తువ ఆవహించడం, ఏకాగ్రత లోపం.. ఇలా ఎన్నో సమస్యలకు ఎలక్ట్రానిక్ డివైజ్‌లు హేతువులుగా మారాయి. వాటి అదుపాజ్ఞల్లోకి వెళ్లకుండా వాటినే తమ అదుపాజ్ఞల్లో పెట్టుకున్న భారతీయులు కేవలం మూడు శాతమేనని తాజా సర్వే కుండబద్దలు కొట్టింది. దాదాపు 83,000 కౌన్సిలింగ్ సెషన్లు, 12,000 స్క్రీనింగ్‌లు, 42,0000 అంచనాలను పరిశీలించి చేసిన సర్వేలో ఇలాంటి ఎన్నో విస్మయకర అంశాలు వెలుగుచూశాయి. డిజిటల్ డివైజ్‌లతో సహవాసం చేస్తూ భారతీయులు ఏపాటి మానసిక ఆరోగ్యంతో ఉన్నారనే అంశాలతో వన్‌టూవన్‌హెల్ప్ అనే సంస్థ 'ది స్టేట్ ఆఫ్ ఎమోషనల్ వెల్‌బీయింగ్,2024'అనే సర్వే చేసి సంబంధిత నివేదికను వెల్లడించింది.

సగం మంది డివైజ్‌లను వదల్లేక పోతున్నారు

సర్వేలో పాల్గొన్న వారిలో సగం మంది తమ ఎలక్ట్రానిక్ డివైజ్‌లను వదిలి ఉండలేకపోతున్నారు. మరో పది శాతం మందికి డిజిటల్ జీవితాన్ని ఎలా సమన్వయం చేసుకోవాలో తెలీక సతమతమవుతున్నారు. మానసిక ఆరోగ్యానికి సంబంధించి కౌన్సిలింగ్ తీసుకుంటున్న వారి సంఖ్య 15 శాతం పెరిగింది. ఆదుర్దా, కుంగుబాటు, పనిచేసే చోట ఒత్తిడి వంటి ప్రధాన కారణాలతో ప్రజలు మానసిక ఆరోగ్యం బాగు కోసం నిపుణులను సంప్రతించడం పెరిగింది. వృత్తిసంబంధ అంశాల్లో సమస్యలను ఎదుర్కొంటున్న వారిలో 23 శాతం మంది తాము పనిచేసేచోట ప్రతికూల వాతావరణంలో పనిచేస్తున్నట్లు తేలింది. ఇది ఆరోగ్యవంతమైన పని వాతావరణం ఆవశ్యకతను గుర్తుచేస్తోంది.

కౌన్సిలింగ్ కోసం పురుషుల్లో పెరిగిన ఆసక్తి

గతంలో ఏదైనా థెరపీ చేయించుకోవాలన్నా, మానసికంగా ఒక సాంత్వన కావాలంటే ఒకరి తోడు అవసరమని మహిళలు భావిస్తుంటారు. మగాడై ఉండి థెరపీ చేయించుకోవడమేంటనే ఆలోచనాధోరణి ఇన్నాళ్లూ పురుషుల్లో ఉండేది. ఇప్పుడు ఆ ధోరణిలో కాస్తంత మార్పు వచ్చింది. గతంతో పోలిస్తే 7 శాతం మంది ఎక్కువగా పురుషులు థెరపీలు సిద్ధపడుతున్నారు. ఆర్థికసంబంధ కన్సల్టేషన్లు పొందిన వారిలో 70 శాతం మంది పురుషులే ఉన్నాయి. ఇక మానవీయ సంబంధాలకు సంబంధించిన కౌన్సిలింగ్ సెషన్లలో 60 శాతం దాకా మహిళలే కనిపించారు.

యువతలో పెరిగిన మానసిక సమస్యలు

ఉత్సాహంతో ఉరకలెత్తాల్సిన యువతలో నైరాశ్యం పెరుగుతోంది. 30 ఏళ్లలోపు వయసు యువతలో అత్యధికంగా ఆదుర్దా, కుంగుబాటు సమస్యలు ఎక్కువయ్యాయి. ఉద్యోగం మారాల్సి రావడం, జీవితభాగస్వామితో సత్సంబంధం కొనసాగించడం వంటి అంశాలకొచ్చేసరికి యువత ఆత్రుత, కుంగుబాటుకు గురవుతోంది. పాతికేళ్లలోపు యువతలో 92 శాతం మందిలో ఆత్రుత, 91% మందిలో కుంగుబాటు కనిపిస్తున్నాయి.

ఆత్మహత్య భయాలూ ఎక్కువే

ఆత్మహత్య చేసుకోవాలని భావిస్తున్న వారి సంఖ్య గతంతో పోలిస్తే 22 శాతం పెరిగింది. తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని చెప్పిన వాళ్ల సంఖ్య 2023తో పోలిస్తే 17 శాతం పెరగడం ఆందోళనకరం. తమకు కౌన్సిలింగ్ అవసరమని భావిస్తున్న వారిలో సగం మంది ఇప్పటికే తీవ్రమైన భావోద్వేగ సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీంతో ఎక్కువ మందికి తక్షణం మానసిక సంబంధ తోడ్పాటు అవసరమని తెలుస్తోంది. మొత్తంగా చూస్తే భారతీయుల్లో మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన బాగా పెరిగింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఎలాన్ మస్క్ డోజ్ బృందంలో నిఖిల్ రాజ్‌పాల్

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వంలో ఎలాన్‌మస్క్ సారథ్యంలో ఏర్పాటైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్)బృందంలో మరో భారత సంతతి నిపుణుడికి తాజాగా స్థానం లభించింది. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ చదివిన భారత సంతతికి చెందిన నిఖిల్ రాజ్‌పాల్(30)తో డోజ్‌ను విస్తరించనున్నట్లు మస్క్ ప్రకటించారు. డోజ్‌లోని నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫెరిక్ అడ్మినిస్ట్రేషన్(ఎన్‌వోఏఏ) టాస్క్‌ఫోర్స్ సభ్యుడిగా ఉంటారు. గతంలో ఈయన మస్క్ యాజమాన్యంలోని ట్విట్టర్‌తోపాటు, టెస్లాలో పనిచేశారు. కాగా, ఆరుగురితో ఏర్పాటైన డోజ్ బృందంలో భారత సంతతికి చెందిన ఆకాశ్ బొబ్బ ఉన్న విషయం తెలిసిందే.

గ్వాటెమాలాలో ఘోర ప్రమాదం.. 51 మంది దుర్మరణం

గ్వాటెమాలా సిటీ: గ్వాటెమాలా రాజధాని గ్వాటెమాలా సిటీలో సోమవారం సాయంత్రం జరిగిన ఘోర ప్రమాదంలో 51 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రోగ్రెసో నుంచి ప్రయాణికులతో వస్తున్న బస్సు రద్దీగా ఉండే ప్రాంతంలో పుయెంటె బెలిస్ వంతెన పైనుంచి 35 మీటర్ల దిగువనున్న లోయలోకి పడిపోయింది. మురుగు నీటిలో బస్సు సగం వరకు మునిగి ఉండగా మృతదేహాలు తేలియాడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష మయ్యాయి. మృతుల్లో 15 మంది మహిళలు కాగా, 36 మంది పురుషులు. వీరిలో కొందరు చిన్నారులు కూడా ఉన్నట్లు చెబుతున్నారు. వంతెనపై పలు వాహనాలు ఢీకొన్నాయని, అందులో చిక్కుకున్న బస్సు అదుపుతప్పి దిగువకు పడిపోయిందని స్థానిక మీడియా పేర్కొంది. ఘటన నేపథ్యంలో ప్రభుత్వం మూడు రోజులు జాతీయ సంతాప దినాలుగా ప్రకటించింది.

మరో రెండు రోజులు ప్రయాగ్‌రాజ్ వైపు రాకండి

వాహనదారులకు మధ్యప్రదేశ్ సీఎం విజ్ఞప్తి

భోపాల్/న్యూఢిల్లీ: ప్రయాగ్‌రాజ్ వైపు మరో రెండు రోజులపాటు రావొద్దని వాహనదారులకు మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. మహాకుంభ్ యాత్రికుల వాహనాల రద్దీ కారణంగా మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ సమస్య తలెత్తడంపై ఆయన ఈ మేరకు సూచించారు. మహాకుంభ్‌లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల వాహనాలతో మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్, సియోని, కట్ని, మైహర్, సత్నా, రేవా జిల్లాల్లోని రోడ్లు కిక్కిరిశాయి. ప్రయాగ్‌రాజ్‌ను ఆనుకుని ఉన్న రేవాంచల్ ప్రాంతంలో ఈ సమస్య తీవ్రంగా ఉందన్నారు. తీవ్ర రూపం దాల్చిన రద్దీతో మహాకుంభ్‌లోనూ యూపీ యంత్రాంగం ఏర్పాట్లు చేయలేక సతమతమవుతోందని చెప్పారు. ట్రాఫిక్ రద్దీ గురించి గూగుల్‌లో చెక్ చేసుకుని ప్రయాణం పెట్టుకోవాలని సూచించారు.

జనగణన త్వరగా చేపట్టండి

కొత్త జాబితా లేకపోవడంతో 14కోట్ల మంది ఆహారభద్రతకు దూరమయ్యారు

రాజ్యసభలో ప్రసంగించిన సోనియా గాంధీ



న్యూఢిల్లీ: ఎన్‌డీఏ సర్కార్ వీలైనంత త్వరగా జనాభా లెక్కల ప్రక్రియను మొదలుపెట్టాలని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ డిమాండ్‌చేశారు. సోమవారం రాజ్యసభలో జీరో అవర్‌లో ఆమె మాట్లాడారు. ''స్వతంత్ర భారతావనిలో తొలిసారిగా జనగణన షెడ్యూల్ కంటే ఏకంగా నాలుగేళ్ల ఆలస్యమైంది. నాలుగేళ్ల ఆలస్యం తర్వాత కూడా ఇప్పటికీ జనగణనను కేంద్రం మొదలుపెట్టలేదు. తాజా బడ్జెట్‌లో కేటాయింపులను గమనిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలోనూ జనగణన ప్రారంభంకాబోదని అవగతమవుతోంది. జనభా లెక్కింపు ఎప్పుడు మొదలుపెడతారన్నదీ స్పష్టత లేదు. ఇకనైనా వీలైనంత త్వరగా జనాభాలెక్కల ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టాలి. ఇంకా ఆలస్యమైతే జాతీయ ఆహార భద్రత చట్టం కింద కొత్తగా నమోదుకావాల్సిన 14 కోట్ల మంది పేదలు తలో ఐదు కేజీల ఉచిత ఆహారధాన్యాలు పొందే ప్రయోజనాలను కోల్పోతారు''అని సోనియా ఆందోళన వ్యక్తంచేశారు.

ఆహార భద్రతలో కీలక ముందడుగు

''140 కోట్ల మంది ప్రజల ఆహార, పోషకాహార భద్రతే లక్ష్యంగా 2013 సెప్టెంబర్‌లో నాటి మా యూపీఏ ప్రభుత్వమే ఈ జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని తీసుకొచ్చింది. ఆహార భద్రతలో ఈ పథకం కీలక ముందడుగు. ముఖ్యంగా కోవిడ్ సంక్షోభం వంటి సందర్భాల్లో కోట్లాది మంది నిరుపేదలు ఆకలితో అలమటించకుండా ఈ పథకం కాపాడింది. జాతీయ ఆహార భద్రతా చట్టం,2013 కింద ఇప్పటిదాకా గ్రామీణ ప్రాంతాల జనాభాలో 75 శాతం, పట్టణ జనాభాలో దాదాపు 50 శాతం మంది లక్షిత ప్రజా పంపిణీ వ్యవస్థ(టీపీడీఎస్) ద్వారా ఆహార ధాన్యాలను పొందుతున్నారు. 2011 జనాభాలెక్కల ప్రకారం ఈ పథ కం ద్వారా 81.35 కోట్ల మంది లబ్ధి పొందారు. ఇంతటి ప్రయోజనకర పథకం కొత్త లబ్ధిదారులకు అందేలా ప్రభుత్వం జనగణనను త్వర గా చేపట్టాలి. ఆహార భద్రత అనేది ప్రత్యేక హక్కు కాదు. అది ప్రాథమిక హక్కులో అంతర్భాగం''అని సోనియా అన్నారు.

'కోతి' చేష్టతో దేశమంతా కరెంట్ కట్

కొలంబో: ఓ కోతి దెబ్బకు శ్రీలంక అంతా చీకట్లు కమ్ముకున్నాయి! ఆదివారం రాత్రి దక్షిణ కొలంబోలోని విద్యుత్కేంద్రంలోకి చొరబడిన కోతి ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకింది. దాంతో దేశవ్యాప్తంగా పవర్‌గ్రిడ్ కుప్పకూలిపోయింది. రాత్రి 11 నుంచి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తిరిగి రావడానికి కొన్ని గంటల సమయం పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. కోతి వల్ల విద్యుత్ వ్యవస్థ కుదేలైందని ఇంధన మంత్రి కుమార జయకోడి మీడియాకు తెలిపారు. విద్యుత్ పోవడంతో చాలా మంది జనరేటర్లపై ఆధారపడవలసి వచ్చింది. ఈ ఘటనపై ప్రజలు సోషల్ మీడియాలో అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు. 'ఒక కోతి=మొత్తం గందరగోళం'అంటూ ఓ ఎక్స్ యూజర్ పోస్ట్ చేశారు. హనుమంతుడు లంకను తగలబెట్టిన ఘటనను గుర్తుకు తెస్తూ మరో ఎక్స్ యూజర్ హనుమంతుడి ఫొటో పోస్ట్ చేశారు. కోతుల వల్ల జరిగే నష్టాన్ని లంక గతంలోనే రుచి చూసిందంటూ కామెంట్ కూడా చేశాడు. కేవలం కోతుల వల్ల దేశమంతటా చీకట్లు కమ్ముకోవడం ఒక్క శ్రీలంకలోనే సాధ్యమంటూ స్థానిక మీడియా విమర్శించింది. నేషనల్ పవర్‌గ్రిడ్ చాలా బలహీనంగా ఉందని ఇంజనీర్లు తెలిపారు. కనుక తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడవచ్చని హెచ్చరించారు. పవర్‌గ్రిడ్‌ను అప్‌గ్రేడ్ చేయకుంటే తరచూ ఇలాంటి బ్లాకౌట్లు తప్పవని కొన్నేళ్లుగా చెబుతూనే ఉన్నారు. 2022 ఆర్థిక సంక్షోభం సమయంలో లంక విస్తృతంగా బ్లాకౌట్లు ఎదుర్కోవడం తెలిసిందే.

డ్యాన్స్ చేస్తూ కుప్పకూలింది

మధ్యప్రదేశ్‌లో గుండెపోటుతో యువతి మృతి



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని విదిశా జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఓ రిసార్టులో వివాహ వేడుకలో డ్యాన్స్ చేస్తూ 23 ఏళ్ల యువతి గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందింది. ఇండోర్‌కు చెందిన పరిణీతా జైన్ తన కజిన్ వివాహ వేడుక కోసం విదిశాకు వచ్చింది. శనివారం రాత్రి హల్దీ వేడుకలో వేదికపై డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిపోయింది. వైద్యులు, కుటుంబ సభ్యులు సీపీఆర్ చేసినా స్పందించలేదు. వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. ఎంబీఏ గ్రాడ్యుయేట్ అయిన పరిణీత తమ్ముడు కూడా 12 ఏళ్ల వయసులోనే గుండెపోటుతోనే మరణించాడు. మధ్యప్రదేశ్‌లో గత అక్టోబర్‌లో ఓ 15 ఏళ్ల బాలుడు క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో మరణించాడు. కరోనా తర్వాత ఇలాంటివి తరచుగా జరుగుతున్నందున ఈ ఉదంతాలకు కరోనా వ్యాక్సిన్లతో ఏమైనా సంబంధముందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వైద్యులు మాత్రం వాటిని తోసిపుచ్చుతున్నారు. కుటుంబ చరిత్ర, జీవనశైలి తదితరాలు గుండె ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు.

బడ్జెట్‌పై వాడీవేడీ చర్చ

- పన్ను మినహాయింపు ఒక చక్కెర పూత: విపక్షాల ఎద్దేవా
- అది ఎకానమీకి బూస్టర్ డోస్: అధికార పక్షం సమర్థన

న్యూఢిల్లీ: విత్తమంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌పై అధికార, విపక్షాల మధ్య సోమవారం వాడీవేడీ చర్చ జరిగింది. దీర్ఘకాల ప్రయోజనాలు కల్పించకుండా కేవలం పన్ను మినహాయింపునిచ్చి కేంద్రం ప్రజలకు చక్కెరపూత పూసిందని విపక్షాలు ఆరోపించాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, ఆదాయ అసమానతలకు బడ్జెట్ ఎలాంటి పరిష్కారాలు చూపలేకపోయిందని ధ్వజమెత్తాయి. పేదలు, గ్రామీణుల సంక్షేమం గురించి బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన లేదని ఆరోపించాయి. అయితే రూ.12 లక్షల వార్షికాదాయంపై పన్ను మినహాయింపు అనేది దేశార్థికాన్ని బూస్టర్ డోస్ అని అధికార పక్షాలు తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నాయి. ''రాష్ట్రాల్లో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హడావిడిగా వార్షికాదాయంపై పన్ను మినహాయింపు ప్రకటించారు. ఇందులో దీర్ఘకాల ప్రయోజనాలను పట్టించుకోలేదు. రూ.12 లక్షల వార్షికాదాయంపై ట్యాక్స్ రద్దు అనేది దేశవ్యాప్తంగా కేవలం 3 కోట్ల లోపు జనాలకే ప్రయోజనకరం. మిగతా వాళ్ల పరిస్థితేంటి?. ఆరోగ్యం, విద్యసహా కీలక రంగాలకు కేటాయింపుల్లో అన్యాయం జరిగింది. రూపాయి విలువ పతనమైన ప్రతిసారీ మంత్రి నిర్మల వింత వాదన లేవనెత్తుతారు. రూపాయి బలహీనపడట్లేదని, డాలర్ బలపడుతోందని చెప్పడం విడ్డూరం'' అని డీఎంకే సభ్యుడు దయానిధి మారన్ లోక్‌సభలో వ్యాఖ్యానించారు. ''బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని పెంచడం చట్టవిరుద్ధం. పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అసమానతలకు తక్షణం పరిష్కారం చూపేలా బడ్జెట్‌ను రూపొందించలేదు''అని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కళ్యాణ్ బెనర్జీ అన్నారు. మహాకుంభమేళాలో తొక్కిసలాట, అగ్నిప్రమాదాల ఘటనలపై దర్యాప్తు, విచారణ కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రైతులు, యువత, పేదల అవసరాలను బడ్జెట్ పట్టించుకోలేదని సమాజ్‌వాదీ పార్టీ సభ్యురాలు ఇక్రా చౌదరి అన్నారు. ''వికసిత్ భారత్‌కు ఈ బడ్జెట్ పథనిర్దేశం చేస్తుందని మోదీ అన్నదాంట్లో నిజంలేదు. బడ్జెట్‌ను చూస్తుంటే భవిష్యత్ మార్గం కనిపించట్లేదు. అంతా ఎండమావే''అని రాజ్యసభలో డీఎంకే సభ్యుడు తిరుచ్చి శివ అన్నారు. తమిళనాడు రాష్ట్రానికి కేటాయింపులు తగ్గాయని అన్నాడీఎంకే నేత ఎం.థంబిదురై అన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణఉపాధి హామీ పథకానికి కేటాయింపుల్లో కోత పెట్టారని ఎస్పీ నేత రాంజీ లాల్ సుమన్ ఆగ్రహంవ్యక్తంచేశారు. బడ్జెట్‌లో కేరళను పూర్తిగా విస్మరించారని కేసీ(ఎం) సభ్యుడు జోస్ కె.మణి అన్నారు.

ప్రయాగ్‌రాజ్ స్టేషన్ మూసివేత అబద్ధం

రైల్వే మంత్రి వైష్ణవ్ వెల్లడి

న్యూఢిల్లీ: ప్రయాగ్‌రాజ్ జంక్షన్ రైల్వే స్టేషన్‌ను మూసివేశారంటూ వస్తున్నవన్నీ కేవలం ఊహాగానాలేనని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఆ ప్రాంతంలోని మొత్తం ఎనిమిది రైల్వే స్టేషన్‌లలో సమర్థ నిర్వహణతో రైళ్ల రాకపోకలు సజావుగా సాగుతున్నాయని స్పష్టం చేశారు. రైల్వే స్టేషన్‌ను మూసివేశారంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని ఆయన భక్తులను కోరారు. ఆదివారం ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్ ప్రాంత స్టేషన్ నుంచి మొత్తం 12.5 లక్షల మంది భక్తులతో 330 రైళ్లు దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాయన్నారు.

మూతబడింది సంగమ్ స్టేషన్

ప్రయాగ్‌రాజ్ డివిజన్‌లో దాదాపు ఒకే పేరుతో ప్రయాగ్‌రాజ్ జంక్షన్, ప్రయాగ్‌రాజ్ సంగమ్ అనే రెండు స్టేషన్లున్నాయని నార్త్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాగ్‌రాజ్ జంక్షన్ అన్ని రైళ్లు నడిచే ప్రధాన స్టేషన్ కాగా, ప్రయాగ్‌రాజ్ సంగమ్ కుంభ్‌మేళాకు సమీపంలో ఉన్న చిన్న రైల్వే స్టేషన్ అని అధికారులు వివరించారు. ఈ స్టేషన్ నుంచి రోజులో రెండు, మూడు రైళ్లు మాత్రమే నడుస్తాయన్నారు. తీవ్రమైన రద్దీ కారణంగా ఆదివారం ఈ స్టేషన్‌ను మూసివేశామన్నారు.

మాంసం ఉచితంగా ఇవ్వలేదని..

అన్నానగర్(చెన్నై): మాంసం ఉచితంగా ఇవ్వలేదని ఆగ్రహించిన ఓ వ్యక్తి శ్మశాన వాటికలో మృతదేహాన్ని తవ్వి తెచ్చి దుకాణం ముందు పడేశాడు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. పళనిశెట్టి పట్టికి చెందిన కుమార్ (42) స్థానిక ప్రభుత్వ శ్మశాన వాటికలో సమాధులకు గుంతలు తవ్వే పని చేస్తుంటాడు. ఆదివారం అతడు అక్కడే ఉన్న మాంసం విక్రయించే దుకాణానికి వెళ్లాడు. తనకు ఉచితంగా మాంసం ఇవ్వాలని కోరాడు. దుకాణదారు నిరాకరించడంతో అతడితో వాదులాటకు దిగాడు. అతడు ససేమిరా అనడంతో కుమార్ శ్మశాన వాటికకు వెళ్లి 2 నెలల క్రితం పూడ్చిపెట్టిన గుర్తుతెలియని వ్యక్తి తవ్వి తీశాడు. మృతదేహాన్ని చీరలో చుట్టి తలపై మోసుకొచ్చి మాంసం దుకాణం ఎదుట పడేశాడు. ఇది చూసి జనం భయంతో పరుగులు తీశారు. పోలీసులు వచ్చి అక్కడే ఉన్న కుమార్‌ను అదుపులోకి తీసుకుని, అతడిపై కేసు నమోదు చేశారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

నూతన పంచాయతీరాజ్ చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

స్థానిక ప్రభుత్వాలు

జి.వి.కె.రావు కమిటీ

- గ్రామీణాభివృద్ధి సాధనకు ఉండాల్సిన సంస్థాగత ఏర్పాట్ల అధ్యయనం కోసం ప్రణాళిక సంఘం 1985లో జి.వి.కె. రావు అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది.

కమిటీ సూచనలు

- విధాన రూపకల్పన అమలుకు జిల్లా ప్రధాన యూనిట్‌గా ఉండాలి.
- నిర్ణీత గడువులోగా పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి.
- పంచాయతీరాజ్ సంస్థలకు ఎక్కువ వనరులను అందుబాటులో ఉంచాలి.
- పేదరిక నిర్మూలన కోసం చేపట్టే పథకాల అమల్లో పంచాయతీరాజ్ సంస్థలు చురుకైన పాత్ర పోషించాలి.
- ప్రజాస్వామ్య వికేంద్రీకరణలో జిల్లా పరిషత్ ప్రముఖ పాత్ర వహించాలి.
- రాష్ట్రస్థాయిలో కొన్ని ప్రణాళిక బాధ్యతలను జిల్లా ప్రణాళిక బోర్డులకు అప్పగించాలి.
- జిల్లా అభివృద్ధి అధికారి పేరుతో ఒక పదవిని సృష్టించాలి. ఇతనికి జిల్లా పరిషత్‌కు చెందిన ముఖ్య కార్యనిర్వాహక బాధ్యతలు అప్పగించాలి.
- అభివృద్ధి కార్యక్రమాల్లో కలెక్టర్ పాత్రను తగ్గించాలని ఈ కమిటీ సిఫార్సు చేసింది.

ఎల్.ఎం.సింఘ్వీ కమిటీ

- రాజీవ్ గాంధీ కాలంలో 1986లో పంచాయతీరాజ్ సంస్కరణల కోసం ఎల్.ఎం. సింఘ్వీ కమిటీని నియమించారు.

కమిటీ సిఫారసులు

- పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించాలి.
- రాజ్యాంగ సవరణలు చేసి వీటిని రాజ్యాంగ బద్ధం చేయాలి.
- కొన్ని గ్రామాలను కలిపి న్యాయ పంచాయతీలను ఏర్పాటు చేయాలి.
- గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులు కల్పించాలి.
- పంచాయతీరాజ్ సంస్థలు, ఎన్నికలు, రద్దు మొదలైన అంశాలు పరిశీలించడం కోసం 'జ్యాడిషియల్' ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి.
- రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 64వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ సంస్థలకు, 65వ రాజ్యాంగ సవరణ ద్వారా నగర పాలక సంస్థలకు రాజ్యాంగ బద్ధత కల్పించాలని భావించింది. కానీ ఆ సవరణలు ఆమోదం పొందలేదు.

పీవీ నరసింహారావు హయాంలో.. పంచాయతీరాజ్ చట్టం కోసం 1991లో రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లును 1992 డిసెంబర్ 22న లోక్‌సభ, డిసెంబర్ 23న రాజ్యసభ ఆమోదించాయి. దేశంలోని 17 రాష్ట్రాలు ఈ బిల్లును ఆమోదించాయి. 1993 ఏప్రిల్ 20న రాష్ట్రపతి ఈ బిల్లుపై సంతకం చేశారు.

పి.కె. తుంగన్ కమిటీ

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పి.కె. తుంగన్ నాయకత్వంలో 1987లో ప్రధాని రాజీవ్ గాంధీ.. మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థకు స్వయం సమృద్ధి కల్పించి, దేశం అంతటా వర్తించే పంచాయతీరాజ్ వ్యవస్థను రూపొందించాలనే లక్ష్యంతో ఈ సంఘాన్ని ఏర్పాటు చేశారు.

73వ రాజ్యాంగ సవరణ

- పంచాయతీరాజ్ చట్టం కోసం లోక్‌సభలో 1991లో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఆ సమయంలో పి.వి.నరసింహారావు ప్రధానిగా ఉన్నారు.



- పంచాయతీరాజ్ వ్యవస్థపై ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లును 1992 డిసెంబర్ 22న లోక్‌సభ, డిసెంబర్ 23న రాజ్యసభ ఆమోదించాయి.
- 17 రాష్ట్రాలు ఈ బిల్లును ఆమోదించాయి. 1993 ఏప్రిల్ 20న రాష్ట్రపతి ఈ బిల్లుపై సంతకం చేశారు.
- 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1993లో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని రాజ్యాంగ బద్ధం చేశారు. రాజ్యాంగంలోని 9వ భాగంలో.. 11వ షెడ్యూల్లో ఆర్టికల్ 242(ఎ) నుంచి ఆర్టికల్ 243 ఎ(ఓ) వరకు వీటిని పొందుపర్చారు
- నూతన పంచాయతీరాజ్ చట్టం 1993 ఏప్రిల్ 24న అమల్లోకి వచ్చింది.
- ఆర్టికల్ 243 పంచాయతీల గురించి వివరిస్తుంది.
- ఆర్టికల్ 243(ఎ) ప్రకారం గ్రామసభ, ఆర్టికల్ 243(బి) ప్రకారం ప్రతి రాష్ట్రంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఉంటుంది.
- ఆర్టికల్ 243(సి) పంచాయతీ నిర్మాణం, ఎన్నికల గురించి తెలుపుతుంది.
- ఆర్టికల్ 243(డి) ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలి. మహిళలకు 1/3వ వంతు స్థానాలు కేటాయించాలి.
- మహిళలకు 243(ఇ) ప్రకారం పంచాయతీల కాలపరిమితి ఐదేళ్లు.
- ఆర్టికల్ 243(హెచ్) ప్రకారం రాష్ట్రపతి, శాసనసభ చేసిన చట్టం ఆధారంగా పన్నులను వసూలు చేసే అధికారం పంచాయతీలకు ఉంటుంది.
- ఆర్టికల్ 243(ఐ) ప్రకారం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని, ఆర్టికల్ 243(కె) ప్రకారం రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని.. గవర్నర్ ఏర్పాటు చేస్తారు.
- గ్రామంలోని ఓటర్లతో గ్రామసభ ఏర్పాటు చేయాలి.
- అన్ని రాష్ట్రాలు కచ్చితంగా మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- గ్రామాల్లో గ్రామ పంచాయతీ, మధ్యస్థాయిలో పంచాయతీ సమితిలు, జిల్లాస్థాయిలో జిల్లా పరిషత్ ఏర్పాటు చేయాలి.
- పంచాయతీరాజ్ సంస్థలకు పోటీ చేయడానికి కావాల్సిన కనిష్ఠ వయస్సు 21 ఏళ్లు.
- ఏదైనా ఒక రాష్ట్రంలో 20 లక్షల కంటే తక్కువ జనాభా ఉంటే రెండో అంచె పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు.
- 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లో లేని రాష్ట్రాలు...
జమ్మూ కశ్మీర్, నాగాలాండ్, మేఘాలయ, మిజోరాం; మణిపూర్‌లోని కొండ ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, గుర్కా హిల్ కౌన్సిల్ ప్రాంతం.
- 2000లో 83వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 243(ఎం)ను చేర్చి అరుణాచల్ ప్రదేశ్‌లో ఎస్సీలకు రిజర్వేషన్లు తొలగించారు.
- ఆంధ్రప్రదేశ్‌లో నూతన పంచాయతీరాజ్ చట్టం 1994 మే 30న అమల్లోకి వచ్చింది.
- 1994 నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పంచాయతీరాజ్, మున్సిపాలిటీలలో ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 8 శాతం, బీసీలకు 33 శాతం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారు.
- పంచాయతీరాజ్ సంస్థలకు 11వ షెడ్యూల్లో 29 అధికారాలు కల్పించారు. వీటిపై పంచాయతీరాజ్ సంస్థల అధికార పరిధి ఉంటుంది.

11వ షెడ్యూల్లోని ముఖ్యాంశాలు

- వ్యవసాయం, భూ సంస్కరణలు, చిన్న తరహా సాగునీటి పథకాలు- చేపల పెంపకం, సామాజిక అడవులు, తాగునీటి వసతి, రోడ్లు, బీపీఎల్ పథకాలు, వైద్యం, గ్రంథాలయాలు, ప్రజాపంపిణీ వ్యవస్థ, కుటుంబ పరిరక్షణ, సామాజిక ఆస్తుల పర్యవేక్షణ, పారిశ్రామిక శిక్షణ- స్త్రీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. స్థానిక సంస్థల్లో ఓటింగ్ వయసు?
ఎ) పదహారేళ్లు బి) పద్దెనిమిదేళ్లు
సి) 21 ఏళ్లు డి) 25 ఏళ్లు
2. ఏ రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లో లేదు?
ఎ) నాగాలాండ్ బి) కేరళ
సి) త్రిపుర డి) అసోం

సమాధానాలు: 1) సి; 2) బి.

మాదిరి ప్రశ్నలు

1. 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని ఏ ప్రధాన మంత్రి హయాంలో రూపొందించారు?
ఎ) రాజీవ్‌గాంధీ
బి) చంద్రశేఖర్
సి) వి.పి.సింగ్
డి) పి.వి.నరసింహారావు
2. 73వ రాజ్యాంగ సవరణ చట్టం భారత రాజ్యాంగంలోని ఏ విభాగానికి సంబంధించింది?
ఎ) Part-VII బి) Part-VIII
సి) Part-IX డి) Part-X
3. భారత రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ జిల్లా ప్రణాళికా మండలి గురించి వివరిస్తుంది?
ఎ) 243-ZE బి) 243-ZD
సి) 243-ZB డి) 243-ZC
4. స్థానిక ప్రభుత్వ సంస్థలకు సంబంధించి మొదటి తీర్మానంగా దేన్ని అభివర్ణిస్తారు?
ఎ) లార్డ్ రిప్పన్ తీర్మానం
బి) లార్డ్ మెయో తీర్మానం
సి) బ్రిటిష్ రాణి తీర్మానం
డి) వికేంద్రీకరణ
5. స్థానిక స్వపరిపాలనపై ఏ జాతీయ నాయకుడికి ఎక్కువ గౌరవం, విశ్వాసం ఉండేవి?
ఎ) జవహర్ లాల్ నెహ్రూ
బి) మహాత్మాగాంధీ
సి) లాల్ బహదూర్ శాస్త్రి
డి) సుభాష్ చంద్రబోస్
6. ముంబై, కోల్‌కతా నగరాల్లో మున్సిపల్ కార్పొరేషన్లను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1726 బి) 1687
సి) 1787 డి) 1870
7. లార్డ్ మెయో స్థానిక ప్రభుత్వాలకు సంబంధించి ఆర్థిక వికేంద్రీకరణ తీర్మానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
ఎ) 1770 బి) 1860
సి) 1857 డి) 1870
8. స్థానిక స్వపరిపాలన పితామహుడు?
ఎ) లార్డ్ కర్జన్ బి) లార్డ్ మింటో
సి) లార్డ్ రిప్పన్ డి) లార్డ్ మౌంటేంగ్
9. జి.వి.కె. రావు కమిటీని నియమించిన సంవత్సరం?
ఎ) 1984 బి) 1985
సి) 1986 డి) 1972
10. జిల్లా ప్రణాళికా వికేంద్రీకరణలో జిల్లా కలెక్టర్ ముఖ్యపాత్ర పోషించాలని సిఫారసు చేసిన కమిటీ?
ఎ) సి.హెచ్.హనుమంతరావు కమిటీ – 1984
బి) దంత్‌వాలా కమిటీ – 1978
సి) ఎల్.ఎం.సింఘ్వీ కమిటీ – 1986
డి) పి.కె.తుంగన్ కమిటీ – 1987
11. 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని ఎన్ని రాష్ట్రాలు ఆమోదించాయి?
ఎ) 16 బి) 17 సి) 18 డి) 19
12. నూతన పంచాయతీరాజ్ చట్టం - 1993 ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
ఎ) 1993 ఏప్రిల్ 24
బి) 1992 ఏప్రిల్ 25
సి) 1993 ఏప్రిల్ 28
డి) 1993 ఏప్రిల్ 26
13. పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించాలని ఏ కమిటీ సిఫారసు చేసింది?
ఎ) జి.వి.కె.రావు కమిటీ
బి) ఎల్.ఎం.సింఘ్వీ కమిటీ
సి) పి.కె.తుంగన్ కమిటీ
డి) దంత్‌వాలా కమిటీ
14. బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ ఎన్ని అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది?
ఎ) రెండంచెలు బి) మూడంచెలు
సి) నాలుగంచెలు డి) ఒక అంచె
15. ఏ రాష్ట్రంలో నాలుగంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లో ఉంది?
ఎ) పశ్చిమ బెంగాల్
బి) బిహార్ సి) ఉత్తరప్రదేశ్
డి) హర్యానా
16. ఏయే రాష్ట్రాల్లో పంచాయతీరాజ్ వ్యవస్థకు తగిన ప్రాధాన్యం లేదు?
ఎ) ఒడిశా, హర్యానా
బి) బిహార్, ఉత్తరప్రదేశ్
సి) మహారాష్ట్ర, కర్ణాటక
డి) గుజరాత్, పశ్చిమ బెంగాల్
17. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ఏయే రాష్ట్రాలకు వర్తించదు?
ఎ) జమ్మూ-కశ్మీర్
బి) నాగాలాండ్
సి) మేఘాలయ, మిజోరాం
డి) పైవన్నీ
18. దంత్‌వాలా కమిటీ నివేదిక దేనికి సంబంధించింది?
ఎ) పట్టణ ప్రణాళిక బి) రాష్ట్ర ప్రణాళిక
సి) జిల్లా ప్రణాళిక
డి) బ్లాక్ లెవల్ ప్రణాళిక

సమాధానాలు

1) డి; 2) సి; 3) బి; 4) ఎ;
5) బి; 6) ఎ; 7) డి; 8) సి;
9) బి; 10) బి; 11) బి; 12) ఎ;
13) బి; 14) బి; 15) ఎ; 16) బి;
17) డి; 18) డి.

సగటు మనిషి ఊపిరితిత్తుల్లో ఎన్ని లీటర్ల గాలి ఉంటుంది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ


శ్వాసవ్యవస్థ

శ్వాసక్రియ అన్ని సజీవకణాల్లో జరిగే జీవక్రియ. ఇందులో ఆహారపదార్థాలు (గ్లూకోజ్) ఆక్సీకరణం చెంది కార్బన్ డై ఆక్సైడ్, నీరు, శక్తి విడుదలవుతాయి. శ్వాసక్రియను కింది విధంగా సూచిస్తారు.

$C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$ ® $6CO_2$
$+ 12H_2O$ + 686 కి.కేలరీల శక్తి

లక్షణాలు:

- శ్వాసక్రియ ఒక ఆక్సీకరణ క్రియ. దీన్ని దహన క్రియతో పోల్చవచ్చు. శ్వాసక్రియలో శక్తి దశల వారీగా విడుదలైతే, దహన క్రియలో ఒకేసారి విడుదలవుతుంది.
- శ్వాసక్రియ ఒక శక్తి మోచక చర్య. దీనివల్ల జీవుల్లో శక్తి ఏర్పడుతుంది.
- శ్వాసక్రియ ఒక విచ్ఛిన్నక్రియ.
- శ్వాసక్రియలో కార్బన్ డై ఆక్సైడ్ విడుదలవుతుంది. ఈ క్రియలో ఆక్సిజన్‌ను గ్రహించవచ్చు లేదా గ్రహించకపోవచ్చు.
- వైరస్‌లు శ్వాసక్రియ జరపలేవు.
- అభివృద్ధి చెందిన మొక్కలు, జంతువుల్లో వాయుసహిత శ్వాసక్రియ జరుగుతుంది.
- అభివృద్ధి చెందని జీవులైన బ్యాక్టీరియా, నీలి ఆకుపచ్చ శైవలాలు, ఈస్టు శిలీంధ్రంలో అవాయు శ్వాసక్రియ జరుగుతుంది.
- మెదడుకు 5 – 7 సెకన్లపాటు ఆక్సిజన్ సరఫరా జరగకపోతే ఆ వ్యక్తి మరణిస్తాడు. ఉరితీసినపుడు మెదడుకు రక్తం ద్వారా ఆక్సిజన్ అందదు. మెడలోని హయాయిడ్ ఎముక విరుగుతుంది. ఈ కారణాల వల్లే మనిషి చనిపోతాడు.
- మెదడుకు ఆక్సిజన్ సరఫరా తగ్గినపుడు ఆవలింతలు వస్తాయి.
- శరీరం మొత్తం బరువులో మెదడు బరువు రెండు శాతం మాత్రమే. కానీ అది శరీరం తీసుకొనే మొత్తం ఆక్సిజన్‌లో 20 శాతాన్ని వినియోగించుకుంటుంది
- సాధారణ మానవుడు నిమిషానికి 1.5 లీటర్ల ఆక్సిజన్‌ను తీసుకుంటాడు. చిన్న పిల్లలకు నిమిషానికి 3 లీటర్ల ఆక్సిజన్ అవసరం. క్రీడాకారులు నిమిషానికి 4 లీటర్ల ఆక్సిజన్ తీసుకుంటారు.
- నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ పరిమాణం 4 మి.గ్రా./లీ. కంటే తక్కువ ఉండకూడదు.
- కృత్రిమ శ్వాసను అందించేందుకు వాడే ఆక్సిజన్ సిలిండర్‌లో నైట్రోజన్, ఆక్సిజన్ మిశ్రమం ఉంటుంది. లేదా 10 శాతం కార్బన్ డై ఆక్సైడ్, 90 శాతం ఆక్సిజన్ (కార్బొజైన్ మిశ్రమం) ఉంటుంది.



- శ్వాసక్రియలో ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్ వాయువుల మార్పిడి జరుగుతుంది.
- మానవ శరీరంలో అత్యధికంగా లభించే వాయువు ఆక్సిజన్.

శ్వాసక్రియ- దశలు

శ్వాసక్రియ మూడు దశల్లో జరుగుతుంది. అవి

బాహ్య శ్వాసక్రియ: శ్వాసాంగాల ద్వారా గ్రహించిన ఆక్సిజన్‌ను రక్తంలోకి, రక్తంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను బయటకు పంపడాన్ని బాహ్య శ్వాసక్రియ అంటారు. దీన్నే వెంటిలేషన్ (వాయు ప్రసరణం) అని కూడా అంటారు. ఇది శ్వాసక్రియలో మొదటి దశ.

ప్రసరణ దశ: ఈ దశలో రక్తంలోని హిమోగ్లోబిన్ ద్వారా ఆక్సిజన్ శరీరంలోని వివిధ కణాలకు రవాణా అవుతుంది. కార్బన్ డై ఆక్సైడ్ వ్యతిరేక దిశలో రవాణా అవుతుంది. ఇది రెండో దశ.

అంతర శ్వాసక్రియ/ఆక్సీకరణ క్రియ: కణాలు ఆక్సిజన్‌ను గ్రహించి కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేసే క్రియను అంతర శ్వాసక్రియ/కణ శ్వాసక్రియ/శక్తి విడుదల అంటారు. ఇది రక్తం, కణజాలాల మధ్య జరిగే వాయువుల మార్పిడి.

- శ్వాసక్రియను నిర్వర్తించే కణాంగం మైటోకాండ్రియా. ఇందులో శక్తి నిల్వ ఉంటుంది. కాబట్టి మైటోకాండ్రియాలను కణశక్తి భాండాగారాలు అంటారు.
- ATP అనేది అధిక శక్తి బంధాలున్న అణువు. శక్తి ATPల రూపంలో నిల్వ ఉంటుంది. ATPని ఎనర్జీ కరెన్సీ అంటారు.
- మైటోకాండ్రియాలో శక్తి ఉత్పత్తి అయ్యే ప్రక్రియ ఆక్సీకరణ ఫాస్ఫారిలేషన్.

గమనిక: ఒక గ్లూకోజ్ అణువు వాయుసహిత శ్వాసక్రియలో పూర్తిగా ఆక్సీకరణం చెందినపుడు 36 లేదా 38 ATP అణువులు ఏర్పడతాయని భావించేవారు. కానీ 30 లేదా 32 ATP అణువులు మాత్రమే ఏర్పడతాయని ఇటీవలి పరిశోధనల ద్వారా తేలింది.

శ్వాసక్రియ రకాలు

శ్వాసక్రియ రెండు రకాలు. అవి..

వాయు శ్వాసక్రియ: వాతావరణంలోని ఆక్సిజన్ సహాయంతో గ్లూకోజ్ సంపూర్ణంగా విచ్ఛిన్నం చెందటం.

$C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$ ® $CO_2 +$
$12H_2O$ + 686 కి.కేలరీల శక్తి

ఈ ప్రక్రియ ఉన్నత శ్రేణి మొక్కలు, జంతు కణాల్లో జరుగుతుంది.

అవాయు శ్వాసక్రియ: ఆక్సిజన్ లేకుండా గ్లూకోజ్ పాక్షికంగా విచ్ఛిన్నం చెందుతుంది. ఉదా. బ్యాక్టీరియాలు (బాసిల్లస్, క్లాస్ట్రీడియం), నీలిఆకుపచ్చ శైవలాలు (అనబీనా, నాస్టాక్).

- ఈస్ట్ అనే శిలీంధ్రం, మొలకెత్తే విత్తనాలు, కండరాల్లో జరిగే శ్వాసక్రియ.
$C_6H_{12}O_6 \rightarrow 2CO_2 + 2\ C_2H_5OH$ (ఇథనాల్) + 2ATP/56కి.కేలరీ (ఈస్ట్‌లో)
$C_6H_{12}O_6 \rightarrow 2C_3H_6O_3$ + (లాక్టికామ్లం) + 2ATP/56 కి.కేలరీ (వేగంగా సంకోచించే కండరంలో)

గమనిక: వేగంగా సంకోచించే కండరాల్లో లాక్టికామ్లం ఏర్పడటం వల్ల కండరాలు త్వరగా అలసిపోవడాన్ని 'కండర గ్లాని' అంటారు.

- అవాయు శ్వాసక్రియనే కిణ్వనం అని అంటారు. కిణ్వన ప్రక్రియను ఉపయోగించి చక్కెర పదార్థాలను సూక్ష్మజీవుల సమక్షంలో పులియబెట్టి ఆల్కహాల్ తయారు చేస్తారు.
- ఈస్ట్ శిలీంధ్రాల నుంచి వేరుచేసిన ఎంజైమ్ జైమేజ్. ఈస్ట్ పారిశ్రామికంగా అతి ముఖ్యమైంది. దీని లాభాలు..
1. ద్రాక్ష, చక్కెర పదార్థాల నుంచి ఆల్కహాల్ తయారీ.
2. ఇడ్లీ, దోశ పిండి పులియ బెట్టడం.
3. బ్రెడ్, కేక్స్ లాంటి బేకరీ పరిశ్రమల్లో ఈస్ట్‌ను ఉపయోగిస్తారు. బ్రెడ్‌పై రంధ్రాలు ఏర్పడటానికి, బ్రెడ్ మెత్తగా ఉండటానికి అవాయు శ్వాసక్రియలో కార్బన్ డై ఆక్సైడ్ బయటకు రావడమే కారణం. రొట్టెలను బేకింగ్(వేడి) చేయటం వల్ల ఆల్కహాల్ ఆవిరవుతుంది.

శ్వాసక్రియ విధానం

ఊపిరితిత్తులలో జరిగే శ్వాసక్రియనే పుపుస శ్వాసక్రియ అంటారు. ఇది రెండు దశల్లో జరుగుతుంది.

1. ఉచ్ఛ్వాసం: వాతావరణం నుంచి గాలిని ఊపిరితిత్తుల్లోకి పీల్చుకోవడాన్నే ఉచ్ఛ్వాసం అంటారు. పీల్చే గాలిలో ఆక్సిజన్ 21 శాతం, కార్బన్ డై ఆక్సైడ్ 0.03 శాతం ఉంటాయి.
2. నిచ్ఛ్వాసం: ఊపిరితిత్తుల నుంచి గాలిని బయటకు పంపడాన్నే నిచ్ఛ్వాసం అంటారు. బయటకు వదిలే గాలిలో ఆక్సిజన్ 16 శాతం, కార్బన్ డై ఆక్సైడ్ 4.4 శాతం ఉంటాయి. పీల్చే, వదిలే గాలిలో నైట్రోజన్ 78.048 శాతం ఉంటుంది. నైట్రోజన్‌కు రంగు, రుచి, వాసన ఉండదు.

- సముద్ర అంతర్భాగంలో శ్వాసక్రియ కోసం ఆక్సిజన్, నైట్రోజన్ మిశ్రమాన్ని ఉపయోగిస్తారు.
- మానవునిలో శ్వాసక్రియ ఒక అసంకల్పిత, అనియంత్రిత చర్య.
- శ్వాసక్రియను మజ్జాముఖం(మెడుల్లా అబ్లాంగేటా) నియంత్రిస్తుంది.
- శ్వాసక్రియకు పురుషుల్లో డయాఫ్రం (విభాజక పటలం), స్త్రీలలో పక్కటెముకలు సహాయపడతాయి.
- ఎత్తుకు వెళ్లే కొద్దీ శ్వాసక్రియ వేగం పెరుగుతుంది. అందుకే ఎత్తయిన ప్రాంతాల్లోని జీవుల్లో ఎర్రరక్త కణాలు అధికంగా ఉంటాయి.

మానవుని శ్వాసక్రియ నిర్మాణం:

మానవుని శ్వాసక్రియలో ఏడు భాగాలు ఉంటాయి. అవి ముక్కు (నాసిక), గ్రసని, స్వరపేటిక, వాయునాళం, శ్వాసనాళం, శ్వాసనాళికలు- వాయుగోణులు, ఊపిరితిత్తులు.

1. ముక్కు (నాసిక): ఇది శ్వాసవ్యవస్థలో మొదటి భాగం. ముక్కు ద్వారా గాలి లోపలికి ప్రవేశిస్తుంది. నాసికలో రెండు నాసికా కుహరాలు ఉంటాయి. నాసికా కుహరాన్ని, అస్యకుహరాన్ని వేరు చేసే మృదులాస్థి నిర్మాణమే అంగిలి. అంగిలి ఉండటం క్షీరదాల ముఖ్యలక్షణం. పాములోని ఘ్రాణ గ్రాహకాన్ని జాకబ్‌సన్ అవయవం అంటారు. ఘ్రాణ గ్రాహకాలు పాములు, ఎలుకలు, కుక్కల్లో ఎక్కువగా అభివృద్ధి చెందాయి. కుక్కల ఘ్రాణ గ్రాహకం మనిషి కంటే 40 రెట్లు ఎక్కువ. అందుకే నేరస్తులను పట్టుకోవడానికి వీటిని ఉపయోగిస్తారు.
2. గ్రసని: ఇది వాయు, ఆహారమార్గాల కూడలి. గ్రసని కంఠబిలం ద్వారా స్వరపేటికలోకి తెరచుకుంటుంది. కంఠబిలం మీద మృదులాస్థితో ఏర్పడిన ఉపజిహ్వక మూతలా ఉంటుంది. ఆహారం స్వరపేటికలోకి పోకుండా ఇది అడ్డుకుంటుంది.
3. ధ్వనిపేటిక /స్వరపేటిక: ఇది వాయునాళం మొదటిభాగం. స్వరపేటిక లో ఒక జత స్వరతంత్రులు ఉంటాయి. ఇవి శబ్దాన్ని ఉత్పత్తి చేస్తాయి. పురుషుల స్వరపేటిక స్త్రీల స్వరపేటిక కంటే పొడవుగా, మందంగా ఉంటుంది. కాబట్టి పురుషుల స్వరం గంభీరంగా ఉంటుంది. స్వరకోశాల పౌనఃపున్యం తక్కువ ఉండి, కంపనపరిమితి ఎక్కువగా ఉండటం వల్ల మగవారి స్వరం, సింహం గర్జన గంభీరంగా ఉంటాయి.

- స్వరకోశాల పౌనఃపున్యం ఎక్కువ, కంపన పరిమితి తక్కువగా ఉండటం వల్ల చిన్నపిల్లలు, స్త్రీల గొంతు కీచుగా ఉంటుంది. ధ్వని పౌనఃపున్యం పెరిగితే కీచుమనే శబ్దం వస్తుంది. ఉదా: దోమ, ఈగ.
- పక్షుల్లో 'శబ్దని' వల్ల శబ్దం ఉత్పత్తి అవుతుంది.

4. వాయునాళం: ఇది గాలి గొట్టం. దీనిలో 'C' ఆకారపు మృదులాస్థి ఉంగరాలు ఉంటాయి. కప్పలో మెడ లేకపోవడం వల్ల వాయునాళం లేదు. పెంగ్విన్ పక్షుల్లో రెండు వాయునాళాలు ఉంటాయి. బొద్దింకలో వాయునాళం శ్వాసక్రియ జరుపుతుంది.
5. శ్వాసనాళం: వాయునాళం ఛాతిలోకి ప్రయాణించి రెండు శ్వాసనాళాలుగా విడిపోతుంది.
6. శ్వాసనాళికలు: ప్రతి శ్వాసనాళం ఊపిరితిత్తిలో ప్రవేశించి తిరిగి విభజన చెంది అనేక శ్వాసనాళికలను ఏర్పరుస్తుంది. శ్వాసనాళం, శ్వాసనాళికలు, వాయుకోశ గోణులు కలిసి తలకిందులుగా ఉండే శ్వాసవృక్షాన్ని ఏర్పరుస్తాయి.
7. ఊపిరితిత్తులు: ఊపిరితిత్తుల అధ్యయాన్ని ప్లూరాలజీ/ పల్మనాలజీ అంటారు. ఇవి 950 గ్రాముల బరువు ఉంటాయి. మానవ శరీరంలో రేడియోధార్మిక ప్రభావానికి మొదట గురయ్యే అవయవం ఊపిరితిత్తులు. ఉరఃకుహరంలో స్పాంజి మాదిరి స్థితిస్థాపక శక్తి ఉన్న రెండు ఊపిరితిత్తులు ఉంటాయి. కుడి ఊపిరితిత్తి పెద్దదిగా ఉంటుంది. రెండు ఊపిరితిత్తుల్లో కలిపి సుమారు 60 కోట్ల వాయుగోణులు ఉంటాయి. వాయుగోణులు ఊపిరితిత్తుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణాలు. వాయుగోణుల్లో వాయు మార్పిడి జరుగుతుంది. ఊపిరితిత్తుల్లో శుభ్రపడిన రక్తం, పుపుస సిర ద్వారా ఎడమ కర్ణిక, ఎడమ జఠరికలను చేరి మహాధమని ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు సరఫరా అవుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆక్సిజన్ ట్యూబ్‌లో కృత్రిమ శ్వాసక్రియకు ఆక్సిజన్‌తోపాటు ఏ వాయువును వాడతారు?
1) నత్రజని 2) హీలియం
3) ఆర్గాన్
4) బొగ్గుపులుసు వాయువు
2. వర్ధువల్ వాటర్ అంటే?
1) సముద్రం నుంచి లభించే తాగునీరు
2) బోరుబావి నుంచి లభించే నీరు
3) ఒక ఉత్పత్తి తాను ఉత్పత్తిగా మారే ప్రక్రియలో వినియోగించుకునే నీరు
4) మనిషి లేదా జంతువు శరీరంలో ఉండే నీటి పరిమాణం
3. శాస్త్రీయంగా పులియబెట్టడమంటే?
1) ఆక్సిజన్‌లో చక్కెరను అసంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
2) ఆక్సిజన్ లేకుండా చక్కెరను సంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
3) ఆక్సిజన్ లేకుండా చక్కెరను అసంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
4) ఆక్సిజన్‌లో చక్కెరను సంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
4. సిరా రక్తాన్ని ఆక్సిజన్ కోసం ఊపిరితిత్తులకు చేరవేసేది ఏది?
1) పుపుస సిరలు
2) పుపుస ధమనులు
3) కుడి జఠరిక
4) మహాసిర
5. గాలిలో 78 శాతం ఉండేది?
1) ఆక్సిజన్
2) కార్బన్ డై ఆక్సైడ్
3) కార్బన్ మోనాక్సైడ్
4) నైట్రోజన్
6. సగటు మనిషి ఊపిరితిత్తుల్లో ఎన్ని లీటర్ల గాలి ఉంటుంది?
1) 2 లీటర్లు 2) 3 లీటర్లు
3) 4 లీటర్లు 5) 1 లీటరు

సమాధానాలు

1) 1 2) 3 3) 3 4) 2
5) 4 6) 1.

రైతాంగ పోరాటం ఫలితంగానే భూసంస్కరణలు!!

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఎకానమీ

వ్యవసాయం, సంబంధిత రంగాల్లో విప్లవాత్మక మార్పులు భూ సంస్కరణల ద్వారానే సాధ్యమవుతాయని కాంగ్రెస్ పార్టీ భావించింది. దీనికి అనుగుణంగా 1919 నుంచి అనేక తీర్మానాలు చేసింది. అందువల్ల స్వాతంత్ర్యం వచ్చాక అధికారంలోకి రాగానే భూ సంస్కరణలు ప్రవేశపెట్టి వ్యవసాయ రంగంలో మార్పులు తెచ్చింది. ఆ రంగ అభివృద్ధికి సహాయపడింది.



భూసంస్కరణలు

ఎం.ఎస్. భరుచా కమిటీ

హైదరాబాద్ స్టేట్‌లో కౌలు రైతుల, వ్యవసాయ రంగ పరిస్థితులను తెలుసుకోవడానికి రెవెన్యూ శాఖ 1937లో ఎం.ఎస్.భరుచా అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కౌలుదారుల స్థితిగతులను పరిశీలించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని సూచించింది. లేని పక్షంలో వ్యవసాయ రంగానికి, దేశానికి ఇబ్బందికరమని హెచ్చరించింది. అవసరమైన మార్పులను సూచిస్తూ కౌలుదారీ చట్టం నమూనాను సూచించింది. ఈ కమిటీ సూచనలకు అనుగుణంగా 1944లో 'హైదరాబాద్ ఆసామీ షిక్మి చట్టం' అమల్లోకి వచ్చింది.

ఆసామీ షిక్మి చట్టంలోని ముఖ్యాంశాలు

ఈ చట్టం ప్రకారం.. వరుసగా ఆరేళ్ల పాటు భూమిని కౌలుకు తీసుకొని సేద్యం చేసినవారు ఆసామీ షిక్మి (రక్షిత కౌలుదార్లు) అవుతారు. చట్ట వ్యతిరేక లెవీ పద్ధతి, సెస్‌లు, పన్నులు, వెట్టి చాకిరిని ఈ చట్టం ద్వారా నిషేధించారు. ఈ చట్టం ద్వారా తీవ్ర దుష్ఫలితాలు తలెత్తాయి. భరుచా కమిటీ (1939) పరిశీలన ప్రారంభించిన కాలం నుంచే భూస్వాములు కౌలుదార్లను వెళ్లగొట్టారు. తమకున్న అధికార బలంతో అధిక కౌలురేట్లను పొందగలిగారు. ఓ విధంగా ఈ చట్టం నిరుపయోగమైందని చెప్పొచ్చు. 1901-21 మధ్యకాలంలో కౌలుదార్ల సంఖ్య 40 వేల నుంచి 7.62 లక్షలకు పెరగ్గా.. 1931లో వీరి సంఖ్య 4.41 లక్షలకు తగ్గింది. చట్టపరమైన హక్కులను పొందాలనుకున్న జాగీర్దారులు, పెద్ద భూస్వాముల ఆర్థిక, సాంఘిక బలం వల్ల ఈ చట్టం అమల్లోకి రాలేకపోయింది.

కౌలు చెల్లింపులు - కౌలు రేట్లు

హైదరాబాద్ ప్రాంతంలో కౌలు చెల్లింపుల విధానం మూడు రకాలుగా ఉండేది.

1. **బెతాయి లేదా పంటలో భాగం (క్రాప్ షేరింగ్):** పంటలో కొంత భాగం ధాన్యాన్ని కౌలుగా చెల్లించేవారు. ఇది పంటలో 20 శాతం నుంచి 40 శాతం వరకు ఉండేది.

2. **గల్లామక్తా:** ఉత్పత్తితో సంబంధం లేకుండా, పండించిన పంటలో స్థిరమైన భాగం చెల్లించే పద్ధతి లేదా ఉత్పత్తితో సంబంధం లేకుండా ఒక ఎకరానికి కనీస మొత్తంగా ధాన్యరూపంలో చెల్లించే స్థిరమైన కౌలు. కొన్ని సందర్భాల్లో ఈ కౌలు పరిమాణం 2/3 వంతు ఉండేది.

3. **ద్రవ్య రూప కౌలు/ నగదు రూప కౌలు:** ఒక ఎకరానికి నగదు రూపంలో చెల్లించే స్థిరమైన కౌలు. ఈ కౌలు రేట్లు నికర ఉత్పత్తిలో 2/3 వంతు కంటే ఎక్కువగా ఉండేవని, నగదు రూప కౌలు భూమి అసెస్‌మెంట్ కంటే 5 నుంచి 12 రెట్లు అధికంగా ఉండేదని భరుచా కమిటీ నివేదిక తెలిపింది. ఇదిగాక భూమిని కౌలుకు తీసుకునే ముందు రెన్యువల్ కోసం అనేక నజరానాలు చెల్లించాల్సి వచ్చేది.

భూ యాజమాన్య కేంద్రీకరణ

స్వాతంత్ర్యానికి పూర్వం తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో భూకేంద్రీకరణ చాలా అధికంగా ఉండేది. జమీందారీ, జాగీర్దారీ, ఇనాందారీ విధానాలే కాకుండా వడ్డీ వ్యాపారం వల్ల భూ యాజమాన్యం వ్యవసాయదారుల నుంచి వ్యవసాయం చేయని, చేయలేని వర్గాల చేతుల్లోకి పోయింది. దీనివల్ల పెద్ద కమతాల వ్యవసాయం ఎక్కువగా కౌలుదార్లు చేసేవారు. వారికి సరైన ప్రోత్సాహం లేకపోవడం వల్ల ఉత్పత్తి పెరగలేదు.

తెలంగాణలోని నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో 500 ఎకరాలకు పైగా భూమి ఉన్న పట్టాదారుల(భూస్వాములు) సంఖ్య 550. వీరి యాజమాన్యంలో.. మొత్తం సాగుబడిలో ఉన్న భూమిలో 60 నుంచి 70 శాతం వరకు ఉండేదని 1950-51లోని పరిపాలనా నివేదిక ద్వారా తెలుస్తోంది. మేజర్ ఇనాం భూములు కూడా కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉండేవి. భూ కేంద్రీకరణ వల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించడానికి భూ గరిష్ఠ పరిమితి చట్టం ఆవశ్యకత ఏర్పడింది. ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు డి.ఆర్.గాడ్గిల్ భూకమతాల గరిష్ఠ పరిమితిని సమర్థించారు.

రైతాంగ ఉద్యమాలు

హైదరాబాద్ రాష్ట్రంలో, ప్రత్యేకించి తెలంగాణ రైతాంగం ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేసింది. ఈ ప్రాంతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలను నిషేధించారు. అందువల్ల ఈ పార్టీలు రైతు లేదా వ్యవసాయ కార్మిక సంఘాలను ప్రారంభించ లేకపోయాయి. కానీ రైతాంగం ఫ్యూడల్ భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించింది. 1920లో విస్నూరు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా షేక్ బందగీ అనే ముస్లిం రైతు పోరాటం చేశాడు.

1921లో తెలుగు భాషాభిమానులు భాషాభివృద్ధి కోసం, గ్రంథాలయ స్థాపన కోసం 'ఆంధ్ర జనసంఘం' ప్రారంభించారు. 1928లో ఇది ఆంధ్ర మహాసభగా మారింది. పరిపాలనా యంత్రాంగంలో కొన్ని సంస్కరణలు చేపట్టాలని, పౌర హక్కులు కల్పించాలని, జాగీర్ రైతుల సమస్యలను పరిష్కరించాలని, పన్నులను తగ్గించాలని, వెట్టిచాకిరి రద్దు చేయాలని ఆంధ్ర మహాసభ తీర్మానాలు చేసింది. వెట్టిచాకిరి, వ్యాపారస్థుల సంఘం అనే రెండు కరపత్రాలు ప్రచురితమయ్యాయి. క్రమంగా 1940 నుంచి వామపక్ష వాదుల సంఖ్య పెరిగింది. 1945లో ఖమ్మంలో జరిగిన మహాసభలో జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటం చేయాలని తీర్మానించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కొనసాగిన సాయుధ పోరాటంలో రజాకార్లు, నిజాం పోలీసుల సాయుధ దాడులను తిప్పికొట్టడానికి పదివేల మందితో గ్రామదళాన్ని, రెండు వేల మంది గెరిల్లా సభ్యులతో శక్తిమంతమైన సాయుధ బలగాన్ని కమ్యూనిస్టులు నిర్మించుకోగలిగారు.

సుమారు 3000 గ్రామాల్లో 16,000 చదరపు మైళ్ల వైశాల్యంలో గ్రామసభలను ఏర్పాటు చేసి నిజాంకు విశ్వాసపాత్రులైన జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌లను గ్రామాల నుంచి వెళ్లగొట్టారు. గ్రామ కమిటీల ద్వారా 10 లక్షల ఎకరాల భూమిని పునఃపంపిణీ చేశారు. వెట్టిచాకిరీ, వడ్డీ వ్యాపారం(నాగులపద్ధతి), ఇతర నిర్బంధ వసూళ్లు, నిర్బంధ లెవీ మొదలైన వాటిని రద్దు చేయటంతోపాటు బంజర భూములను పునఃపంపిణీ చేశారు. వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచారు. ఈ ప్రాంతంలో సుమారు 12 నుంచి 18 నెలల వరకు గ్రామపాలన మొత్తం రైతు కమిటీల ఆధ్వర్యంలో సాగింది. ఈ పోరాటంలో నాలుగు వేల మంది కమ్యూనిస్టులు హత్యకు గురయ్యారు. పదివేల మంది బందీలయ్యారు. 1945 నుంచి భారత సైన్యం ఈ సంస్థానంలోకి ప్రవేశించే వరకు నిజాం, రజాకార్లు, దేశ్‌ముఖ్‌లపై ఉన్న ద్వేషంతో గ్రామీణ ప్రజలు సాయుధ పోరాటానికి మద్దతు పలికారు. పోలీసు చర్య తర్వాత సాయుధ పోరాటం అవసరం లేదని కాంగ్రెస్ భావించింది. కమ్యూనిస్టుల ప్రభావాన్ని తగ్గించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. భూ సంస్కరణల చట్టాలను ప్రవేశపెట్టి రైతాంగ పోరాటాలను అణగదొక్కింది. తెలంగాణ ప్రాంతంలోని రైతాంగ పోరాటాల ఫలితంగా అతి స్వల్పకాలంలోనే హైదరాబాద్ రాష్ట్రంలో విప్లవాత్మక భూ సంస్కరణ చట్టాలు అమలయ్యాయి. తెలంగాణ ప్రాంతంలో భూ సంస్కరణల చట్టాలను తీసుకొని రావడానికి రైతాంగ పోరాటాలే కారణం. నిజాంకు వ్యతిరేకంగా ఆదిలాబాద్‌కోలామ్ - గోండు ఆదివాసీ గిరిజనులు కొమురం భీమ్ నాయకత్వంలో పోరాటం చేశారు. 1941లో వీరి ఆధ్వర్యంలోనే 'భాభిజరీ (జోడేఘాట్) పోరాటం' జరిగింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 339 ప్రకారం రాష్ట్రపతి గిరిజనుల సంక్షేమాన్ని పరిశీలిస్తారు. ఇందుకోసం ఐదేళ్లకు ఒకసారి తగిన చర్యలు తీసుకుంటారు. ఆర్టికల్ 342 ప్రకారం గిరిజనులను షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ)గా పేర్కొని వీరికి కొన్ని ప్రత్యేక అవకాశాలు కల్పించారు.

రాజకీయ అంశాలు

స్వాతంత్ర్యానంతరం దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మొదటి దఫా (1947-1970) భూసంస్కరణలు ప్రవేశపెట్టారు. దీనికి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విధానాలు, తీర్మానాలే ముఖ్య కారణం. 1885లో ఆవిర్భవించిన కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రాంతాల్లోని విద్యావేత్తలతో ప్రారంభమైంది. అప్పుడు పెట్టుబడిదారులు, వ్యాపారులు, మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారం కోసం, సివిల్ సర్వీస్ పరీక్షల నిర్వహణ, కార్పొరేషన్ అధికారాలు, శాసనసభల్లో ప్రాతినిధ్యం తదితర అంశాలపై పోరాడేవారు. 1885-1915 మధ్యకాలంలో దేశంలో పారిశ్రామికీకరణ జరపాలని, స్వదేశీ పరిశ్రమలకు రక్షణ కల్పించాలని, విదేశీ వస్తువులను బహిష్కరించాలని, స్వదేశీ వస్తువుల్నే ఉపయోగించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాలు జరిగాయి.

గాంధీజీ రాజకీయ జీవితం 1915 తర్వాత రైతాంగం పోరాటంతో ప్రారంభమైంది. 1917-18లో బిహార్‌లోని చంపారన్ రైతుపోరాటం, ఖేడా జిల్లా రైతు విముక్తి పోరాటాలు, గ్రామీణ ప్రాంతాల్లోని బీద వర్గాల్లో చైతన్యం తీసుకొచ్చాయి. ఫలితంగా వీరంతా స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములయ్యారు. భారతదేశ సమస్యలకు పరిష్కారం న్యాయవాదులు, డాక్టర్లు, ధనిక భూస్వాముల నుంచి రాదని.. ఇది రైతాంగం నుంచే వస్తుందని గాంధీజీ అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య సముపార్జనలో గ్రామీణ రైతాంగమే ముఖ్యమైన శక్తిగా ఉండాలని, ఉంటుందని గాంధీజీ భావించారు.

సహాయ నిరాకరణ, పన్నుల నిరాకరణ, శాసనోల్లంఘన మొదలైన ఉద్యమాలు పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాయి. ఈ కార్యక్రమాల్లో రైతాంగం చురుగ్గా పాల్గొంది. వ్యవసాయదారుల సమస్యలను జాతీయ సమస్యలుగా అఖిల భారత జాతీయ కాంగ్రెస్ గుర్తించింది. గాంధీజీ అభిప్రాయం ప్రకారం.. స్వాతంత్ర్యం అంటే దేశాన్ని విదేశీ పాలన నుంచి విముక్తి చేయడమే కాదు. భారత పెట్టుబడిదారులు, భూస్వాముల దోపిడీ నుంచి రైతాంగాన్ని విముక్తి చేయటమే. 1919లో అమృత్‌సర్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో దున్నేవారికే భూమి యాజమాన్యం కల్పించాలని, రైతులపై భాటకానికి బదులు పన్ను విధించాలని, జమీందారీ ప్రాంతాల్లోని కౌలుదార్లకు యాజమాన్య హక్కులు ఇవ్వాలని తీర్మానం చేశారు.

భూస్వాముల తొలగింపు కాంగ్రెస్ కార్యక్రమంలో ప్రధాన పాత్ర వహించాలని జవహర్‌లాల్ నెహ్రూ కోరుకున్నారు. భారతదేశ భవిష్యత్తు రైతాంగం మీదే ఆధారపడి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 1929 మే నెలలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం జరిగింది. దేశ ప్రజల దారిద్ర్యాన్ని తొలగించడానికి, దేశ ఆర్థిక, సామాజిక నిర్మాణంలోని అసమానతలను రూపుమాపడానికి విప్లవాత్మక మార్పులు అవసరమని ఈ సమావేశంలో తీర్మానించారు. ఇందుకు అనుగుణంగా 1931లో కరాచీలో జరిగిన కాంగ్రెస్ సభ జమీందారీ వ్యవస్థ రద్దు చేయాలని తీర్మానించింది. 1931లో లక్నో, ఫైజాపూర్‌లో ఈ అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ వ్యవసాయ పథకాన్ని రూపొందించింది.

1936 ఎన్నికల మ్యానిఫెస్టోలో భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చారు. ఎన్నికల తర్వాత వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ ఏర్పాటు చేసిన ప్రభుత్వాలు.. బిహార్‌లో కౌలు భాటకాన్ని తగ్గించడం, ఉత్తరప్రదేశ్‌లో కౌలు భాటకాలు, పాత బాకీలపై, రుణాలపై మారిటోరియం విధించడం, మధ్యప్రదేశ్‌లో కౌలుదారులకు రక్షణ కల్పించడం వరకే పరిమితమయ్యాయి. 1946 ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా మధ్యవర్తులను తొలగిస్తామని తెలిపారు. మధ్యవర్తుల హక్కులను తొలగిస్తున్నందువల్ల వారికి సరైన పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. స్వాతంత్ర్యం తర్వాత జైపూర్ కాంగ్రెస్ మహాసభలో జె.సి.కుమారప్ప అధ్యక్షతన వ్యవసాయ సంస్కరణల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సూచనల ఆధారంగా వివిధ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు వివిధ రకాల భూ సంస్కరణల చట్టాలు తీసుకొచ్చాయి.

హైదరాబాద్ ప్రాంతంలో స్వాతంత్ర్యానికి పూర్వం ప్రజలకు ఎటువంటి పౌరహక్కులు ఉండేవికావు. నిజాం ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని గుర్తించపోవడమే గాక, 1946 వరకు నిషేధించింది. అందువల్ల ఈ ప్రాంతంలోని కాంగ్రెస్ వాదులంతా సంఘటితం కాలేకపోయారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఆర్యసమాజ్, ఆంధ్ర జనసంఘం మొదలైన సంఘాలు తెలంగాణ ప్రజల్లో చైతన్యం తీసుకుని రావడానికి ప్రయత్నించాయి. తెలంగాణ ప్రాంతంలో 1948కు ముందు కాంగ్రెస్ ప్రభావం తక్కువగా ఉన్నప్పటికీ అధికారంలో వచ్చాక భూ సంస్కరణ చట్టాల రూపకల్పన, అమలు చేయడంలో ఆ పార్టీ ప్రధానపాత్ర పోషించింది. వ్యవసాయం, సంబంధిత రంగాల్లో విప్లవాత్మక మార్పులు భూ సంస్కరణల ద్వారానే సాధ్యమవుతాయని 1919 నుంచి కాంగ్రెస్ అనేక తీర్మానాలు చేసింది. అందువల్ల స్వాతంత్ర్యం వచ్చాక అధికారంలోకి రాగానే భూ సంస్కరణలు ప్రవేశపెట్టి వ్యవసాయ రంగంలో మార్పులు తెచ్చి, ఆ రంగ అభివృద్ధికి సహాయపడింది.

Router is used in which layer?

BANK EXAMS

COMPUTER AWARENESS



ISO/OSI MODEL IN COMMUNICATION NETWORKS

In the late 1970s, two projects began independently, with the same goal: to define a unifying standard for the architecture of networking systems. One was administered by the International Organization for Standardization (ISO), while the other was undertaken by the International Telegraph and Telephone Consultative Committee (CCITT). These two international standards bodies each developed a document that defined similar networking models. In 1983, these two documents were merged to form a standard called The Basic Reference Model for Open Systems Interconnection. The concept of a seven-layer model was provided by the work of Charles Bachman at Honeywell Information Services

The ISO-OSI model consists of seven layer architecture. It defines seven layers or levels in a complete communication system.

Layer 7	Application
Layer 6	Presentation
Layer 5	Session
Layer 4	Transport
Layer 3	Network
Layer 2	Data Link
Layer 1	Physical

Layer 1: The Physical Layer

The bottom most layer of the OSI model is the physical layer. It addresses the physical characteristics of the network i.e., it activates, maintain and deactivate the physical connection. Voltages and data rates needed for transmission. In this layer data will be in the form of electronic signals called bit stream (0 and 1). Devices used in this layer are Repeater and Hub.

Layer 2: Data Link Layer

Data Link Layer is the second layer in the OSI model. In data link layer data is transformed in the form of frames. In this layer devices like Switch and Bridge are used.

IEEE 802 divides the data link layer into two sub layers:

1) Media Access Control (MAC) layer: It contains the address of each device on a network which is assigned to the device during its manufacturing.
2) Logical Link Control (LLC) layer: In this layer the redundant data and error data can be detected using cyclic redundancy check.

Layer 3: The Network Layer

This layer provides the functional & procedural means of transferring variable length data sequences (called datagram's) from one node to another connected to the same network. In this layer router is used to connect devices of different networks. It routes the signal through different channels to the other end. It acts as a network controller. It decides by which route data should take. It divides the outgoing messages into packets and to assemble incoming packets into messages for higher levels.

Layer 4: Transport Layer

The main purpose of transport layer is to ensure that packets are moved over the network without errors and data loss. It decides if data transmission should be on parallel path or single path. Functions such as multiplexing, segmenting or splitting on the data done by layer four that is transport layer. Transport layer breaks the message (data) into small units so that they are handled more efficiently by the network layer.

Layer 5: The Session Layer

Session layer manages and synchronize the conversation between two different applications. Transfer of data from one destination to another session layer streams of data are marked and are resynchronized properly, so that the ends of the messages are not cut prematurely and data loss is avoided. In session layer during large file transfers it maintains check points.

Layer 6: The presentation Layer

Presentation layer takes concern that the data is sent in such a way that the receiver will recognize the information (data) and will be able to use the data. Data encryption, decryption, compression and decompression is done in the presentation layer.

Layer 7: Application Layer

It is the top layer. Manipulation of data (information) in various ways is done in this layer. Transferring of files disturbing the results to the user is also done in this layer. Mail services, directory services, network resource etc are services provided by application layer.

PREVIOUS QUESTIONS ON ISO/OSI MODEL

1. In which layer data will be in the form of bit stream
   a) Physical layer b) Data link layer
   c) Application layer
   d) Network layer e) Session layer
2. Data encryption and decryption is done in which layer
   a) Network layer b) Physical layer
   c) Transport layer
   d) Presentation layer
   e) None of these
3. OSI Stands for
   a) Open Source Interconnect
   b) Open System Interconnect
   c) Open Systems Interconnection
   d) Open Sources Interconnected
   e) None of these
4. ISO stands for
   a) International Standardization Organization
   b) International Standard Organization
   c) International Standard for Organization
   d) International Organization for Standardization
   e) None of These
5. MAC layer is a sub layer of ________ layer
   a) Physical layer b) Data link layer
   c) Application layer
   d) Network layer e) Session layer
6. Repeater is used in which layer
   a) Network layer b) Physical layer
   c) Transport layer
   d) Presentation layer
   e) None of these
7. Router is used in which layer
   a) Physical layer b) Data link layer
   c) Application layer
   d) Network layer e) None of these
8. Cyclic Redundancy Check is done in which layer
   a) Network layer b) Physical layer
   c) Transport layer
   d) Presentation layer
   e) LLC Layer
9. Check points are maintained ___ layer
   a) Physical layer b) Data link layer
   c) Application layer
   d) Network layer e) Session layer
10. IPX stands for ___________
    a) Internet Packet Exchange
    b) Internet Protocol Exchange
    c) Internetwork Packet Exchange
    d) Intranet Protocol Exchange
    e) None of these
11. Which protocol is considered as connectionless protocol?
    a) SMTP b) FTP c) TCP
    d) UDP e) IP
12. IP protocol is used in which layer
    a) Physical layer b) Data link layer
    c) Application layer
    d) Network layer
    e) None of these
13. Bridge is used in which layer
    a) Session layer
    b) Physical layer
    c) Application layer
    d) Network layer
    e) Data link layer
14. The concept of OSI seven layers was proposed by_________
    a) Charles Babbage
    b) Von Neumann c) Lovelace
    d) Hopper e) Charles Bachman
15. LLC stands for
    a) Logic Layer Control
    b) Logical Control Layer
    c) Logic Link Control Layer
    d) Logic Links Centre Layer
    e) None of These

Answers:

1) a; 2) d; 3) c; 4) d; 5) b; 6) b; 7) d; 8) e; 9) e; 10) c; 11) d; 12) d; 13) e; 14) e; 15) c.

Model Questions on Computer Networks

1. The Internet began with the development of
   a) USENET b) ARPANET
   c) Ethernet d) Intranet
   e) None of these
2. A global network made up of thousands of privately owned computers and networks is called the:
   a) World Wide Web
   b) Internet
   c) Specialized search engine
   d) Internet2 e) None of these
3. A peer-to-peer LAN is an appropriate network architecture for__
   a) The Internet
   b) Home network
   c) Network requiring a server with shared resources
   d) wide area network
   e) None of these
4. What is a serial port that adds a direct connection to a network?
   a) FireWire b) NIC
   c) USB d) Server
   e) None of these
5. The________ runs the front-end applications software in a network.
   a) Client b) Database
   c) Server d) USB
   e) None of these
6. This device is used to connect your computer with a telephone line, so that can access information from other servers and ordinary users too, said device is called __________
   a) Modem b) Set Top Box
   c) LAN Card
   d) UPS e) None of these
7. Device on one network can communicate with devices on another network via_______
   a) File Server b) Utility Server
   c) Printer Server
   d) Gateway e) None of these
8. Which of the following will connect you to the Internet?
   a) An commercial online service
   b) An internet service provider
   c) A network connection
   d) All of the above
   e) None of these
9. The word FTP stands for______
   a) File Translate Protocol
   b) File Transits Protocol
   c) File Typing Protocol
   d) File Transfer Protocol
   e) None of these
10. _____ is a set of rules computers utilize to talk to each other.
    a) Protocol b) Syntax
    c) DOS command
    d) HTML
    e) None of these
11. Which type of transmission media is acknowledged as regular telephone wire?
    a) Wi-Fi b) Twisted-pair wire
    c) Fiber optic cable
    d) Coaxial cable e) None of these
12. What is the idea of a firewall on a computer?
    a) To protect a computer from unauthorized access
    b) To protect a computer in case of fire
    c) To protect a computer from spam
    d) All of the above
    e) None of these

Answers:

1) b; 2) b; 3) b; 4) b; 5) a; 6) a; 7) d; 8) b; 9) d; 10) a; 11) b; 12) a.